ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
17-4-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 76 పేజీలు: 16 వెల: 6.50

## సంస్కరణలతో రైల్వేలో కొత్త ప్రమాణాలు: ప్రధాని మోడీ

5లో

## పశ్చిమాసియా, ఉక్రయిన్‌లో సుస్థిరశాంతి నెలకొనాలి..

### బిల్లుల్లో ఏం ఉందంటే..

**డీలిమిటేషన్ బిల్లు:**
- లోక్‌సభలో సభ్యుల సంఖ్య 543 నుంచి 845కి పెంపు
- 815 సీట్లు రాష్ట్రాలకు, 35 సీట్లు కేంద్రపాలిత ప్రాంతాలకు

**నారీశక్తి వందన బిల్లు:**
- మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు
- లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళల భాగస్వామ్యం పెంచడమే లక్ష్యం

**131వ రాజ్యాంగ సవరణ బిల్లు:**
- లోక్‌సభ, అసెంబ్లీల్లో ప్రస్తుత జనాభా లెక్కల ద్వారా పునర్విభజన ప్రక్రియ
- ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దుల పునర్వర్గీకరణ




# దేశానికి కొత్త దిశ

## మూడు కీలక బిల్లులు సభలోకి

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు గురువారం ప్రారంభమయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించినట్లుగానే లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులతోపాటు 131వ రాజ్యాంగ సవరణ బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘవాల్ ప్రవేశపెట్టారు. ఇక కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా యుటి చట్టాల సవరణ బిల్లును ప్రవేశపెట్టారు. లోక్‌సభలో డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై కనీసం 12 గంటల పాటు చర్చ చేపట్టనున్నారు. ఒకవేళ సభ్యులు అంగీకరిస్తే సమయాన్ని పొడిగిస్తామని కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు తెలిపారు. తొలుత ఈ బిల్లులను మూజువాణీ ఓటు ద్వారా పాస్ చేశారు. కానీ విపక్షాల అభ్యంతరం నేపథ్యంలో మళ్లీ విభజన చేసి ఓటింగ్ నిర్వహించారు. 251 మంది అనుకూలంగా ఓటు వేయడంతో.. మహిళా రిజర్వేషన్, డీలిమిటేషన్ ప్రక్రియకు చెందిన రాజ్యాంగ సవరణ బిల్లును సభలో ప్రవేశపెట్టారు. డీలిమిటేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులను కలిపి సభలో ప్రవేశపెట్టడాన్ని కాంగ్రెస్ నేత వేణుగోపాల్ వ్యతిరేకించారు. రెండు బిల్లులను కలపడం మంచి విధానం కాదు అని, దీని వల్ల పరిణామాలు ఉంటాయని, ఒకవేళ రాజ్యాంగ సవరణ బిల్లు ఓటమి >>2

- మహిళలకు 33% రిజర్వేషన్, డీలిమిటేషన్, 131 రాజ్యాంగ సవరణ బిల్లులపై విస్తృత చర్చ
- హడావుడిగా బిల్లులెందుకన్న విపక్షాలు
- డీలిమిటేషన్‌తో దక్షిణాది రాష్ట్రాలకు నష్టమంటూ విపక్షాలు ధ్వజం
- ఒబిసి, ఇతర వర్గాలకు ఏవీ రిజర్వేషన్లని ప్రశ్న
- విపక్షాల అభ్యంతరాలను తోసిపుచ్చిన అమిత్‌షా
- నేడు ప్రధాని మోడీ సమాధానం, తర్వాత ఓటింగ్

### మహిళాబిల్లు నాదికాదు..
# దేశప్రజలదే
## రాజ్యాంగ సవరణ బిల్లు అపూర్వం

డీలిమిటేషన్‌లో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదు... నాదీ హామీ

రాజకీయాలకు అతీతంగా మద్దతు ఇవ్వండి: లోక్‌సభలో ప్రధాని మోడీ



గురువారం లోక్‌సభలో ప్రసంగిస్తున్న ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** లోక్‌సభలో గురువారం ప్రవేశపెట్టిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లుపై ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగిస్తూ, దేశ చరిత్రలో ఇదో కీలక ఘట్టమని అన్నారు. కాలానుగుణంగా మనం కూడా మారాలన్నారు. వాస్తవానికి ఈబిల్లును30ఏళ్ల క్రితమే ఆమోదించాల్సిందని >>2



## తిరుమలలో మే 1 నుంచి విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

### వేసవి సెలవుల్లో సామాన్యులకే ప్రాధాన్యత

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** సాధారణ రోజుల కంటే రానున్న వేసవి సెలవుల్లో అనూహ్యంగా భక్తుల సంఖ్య పెరిగే సూచనలు కనిపిస్తుండటంతో అందుకు తగ్గట్లు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు సామాన్యభక్తుల దర్శనాలకు అధిక ప్రాధాన్యతనివ్వాలని నిర్ణయించారు. వేసవిసెలవుల్లో గత మూడేళ్ళలో మే, జూన్, జులై నెలల్లో తిరుమలకు చేరుకున్న రోజువారీ భక్తుల రద్దీని, నెలవారీగా భక్తుల సంఖ్యను పరిగణనలోనికి తీసుకుని దానికి అనుగుణంగా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఈనెల 25వతేదీ తిరుమలలో టిటిడి బోర్డు సమావేశంకానుంది. ఈ సమావేశంలో వేసవిరద్దీని తట్టుకుని సామాన్యభక్తులకు సత్వర దర్శనం చేయించేందుకే టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, >>2

# జనగణన ఆరంభం

## వివరాల నమోదులో పాల్గొనండి: సిఎం చంద్రబాబు పిలుపు

### వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసిన ముఖ్యమంత్రి

**విజయవాడ, ఏప్రిల్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇవాల్టి నుంచి ప్రారంభమైన స్వీయ జనగణన కార్యక్రమంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా నమోదు చేసుకున్నారు. హౌస్ లిస్టింగ్ హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో భాగంగా ఆన్ లైన్ ద్వారా వివరాల నమోదు ప్రక్రియ ఇవాళ ప్రారంభమైంది. సంబంధిత వెబ్‌సైట్ ద్వారా ముఖ్యమంత్రి వివరాలను నమోదు చేశారు. మొత్తం 33 ప్రశ్నలతో కూడిన ఈ సెల్ఫ్ ఎన్యుమరేషన్ ప్రక్రియను ఏపీ జనగణన డైరెక్టర్ జె.నివాస్ ముఖ్యమంత్రికి వివరించారు. ఈ నెల 30 తేదీ వరకూ ప్రజలు స్వయంగా ఆన్ లైన్‌లో తమ ఇళ్లకు సంబంధించిన వివరాలు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించామని ముఖ్యమంత్రికి తెలిపారు. మే 1 తేదీ నుంచి 30 తేదీ వరకూ ఎన్యుమరేటర్ అధికారులు ఇంటింటికీ వెళ్లి భౌతికంగా ఇళ్ల గణన ప్రక్రియను చేపడతారని తెలియచేశారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో పౌరులందరికీ సమానంగా సంక్షేమం అభివృద్ధి ఫలాలు అందించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని అన్నారు. దీని కోసం కుటుంబాన్ని యూనిట్ గా తీసుకుని అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించటం అవసరమని ఈ లక్ష్య సాధనలో జనగణన కార్యక్రమం అత్యంత కీలకమని స్పష్టం చేశారు. రాష్ట్ర విభజన తర్వాత తొలిసారిగా ఏపీలో జనగణన కార్యక్రమం జరుగుతోందని ఇది కేవలం సమాచార సేకరణ మాత్రమే కాకుండా అభివృద్ధికి బలమైన పునాది వేస్తుందని ముఖ్యమంత్రి అభిప్రాయం వ్యక్తం చేశారు. జనాభా లెక్కల కార్యక్రమం రెండు దశల్లో జరుగనుందని మొదటి >>2



గురువారం స్వీయ జనగణనలో వివరాలను నమోదు చేసుకుంటున్న సిఎం చంద్రబాబు

## ఇజ్రాయెల్- లెబనాన్ మధ్య కాల్పుల విరమణ

### ఒప్పందం కుదిరిందన్న ట్రంప్

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** ఇజ్రాయెల్- లెబనాన్ మధ్య 10 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. ఈ నిర్ణయం యుద్ధ మేఘాలు కమ్ముకున్న ఈ ప్రాంతంలో శాంతి స్థాపనకు ఒక ఆశాకిరణంగా కనిపిస్తోంది. ఈ పది రోజుల వ్యవధిలో రెండు దేశాల మధ్య శాశ్వత శాంతి కోసం దౌత్యపరమైన చర్చలు జరుగుతాయని స్పష్టం చేశారు. ఈ శాంతి చర్చల కోసం ఇజ్రాయెల్, లెబనాన్‌లతో కలిసి పనిచేసే బాధ్యతను అమెరికా >>2

गृह मंत्रालय भारत सरकार
CENSUS OF INDIA 2027
మన జనాభా లెక్కలు మన అభివృద్ధి
(జనాభా గణన 2027 మొదటి దశ)
స్వీయ గణన (SE) పై సాధారణ ప్రశ్నలు మరియు వాటి సమాధానాలు (భాగం-1)
స్వీయ గణన అంటే ఏమిటి?
స్వీయ గణన అనేది ఒక ఆన్‌లైన్ ప్రక్రియ. దీనిలో మీరు గణన అధికారి కోసం వేచి ఉండకుండా, SE పోర్టల్ (se.census.gov.in)లో మీ కుటుంబ వివరాలను మీరే స్వయంగా పూరించి సమర్పించాలి.
స్వీయ గణన తప్పనిసరా?
లేదు, ఇది ఒక అదనపు సౌకర్యం. మీరు దీన్ని చేయకపోతే, క్షేత్ర పర్యటన సమయంలో ఒక గణన అధికారి డేటాను సేకరిస్తారు.
నేను ఏ భాషలోనైనా స్వీయ గణన చేయగలనా?
ఈ సౌకర్యం హిందీ, ఇంగ్లీష్ మరియు 14 భారతీయ భాషలలో అందుబాటులో ఉంది.
స్వీయ గణన కోసం ఇంటర్నెట్ అవసరమా?
అవును, పోర్టల్‌ను యాక్సెస్ చేయడానికి ఇంటర్నెట్ అవసరం.
నా సమాచారం సురక్షితమేనా?
అవును, డేటా అంతా సురక్షితంగా, ఎన్‌క్రిప్ట్ చేయబడి ప్రభుత్వ సర్వర్‌లలో నిల్వ చేయబడుతుంది.
SE ID అంటే ఏమిటి మరియు దాని ఉపయోగం ఏమిటి?
సమాచారాన్ని సమర్పించిన తర్వాత, మీకు ఒక ప్రత్యేకమైన 11 అంకెల SE ID (SMS/ఇమెయిల్ ద్వారా కూడా) లభిస్తుంది, దీనిని మీ ఇంటికి వచ్చే ఆమె/అతని గణన అధికారికి తప్పనిసరిగా చూపించాలి.
SE IDని మర్చిపోతే ఏమవుతుంది?
పోర్టల్‌లో నమోదు చేసుకున్న మొబైల్ నంబర్‌ను ఉపయోగించి దీనిని పొందవచ్చు.
స్వీయ గణన తర్వాత గణన అధికారి వస్తారా?
అవును, గణన అధికారి మీ ఇంటికి వచ్చి SE IDని ఉపయోగించి మీ వివరాలను ధృవీకరిస్తారు.
నేను ఏవైనా డాక్యుమెంట్లను అప్‌లోడ్ చేయాలా?
ఏ డాక్యుమెంట్లనూ అప్‌లోడ్ చేయవలసిన అవసరం లేదు
పోర్టల్‌లో సహాయం అందుబాటులో ఉందా?
పోర్టల్‌లో యూజర్ గైడ్, ఫ్లోచార్ట్‌లు, ట్యుటోరియల్ వీడియోలు, FAQs మరియు టూల్‌టిప్‌లు ఉన్నాయి.
టోల్ ఫ్రీ - 1855
మన బాధ్యతను నెరవేరుద్దాం, జనాభా గణనలో పాల్గొందాం CensusIndia2027
CBC 19108/13/0018/2627



## దైవదర్శనానికి వెళ్తూ పరలోకాలకు..



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన వాహనం

### మంత్రాలయం వద్ద ఘోర ప్రమాదం
# బొలెరోను ఢీకొన్న సిమెంటు లారీ
### 8మంది మృతి, పలువురికి తీవ్రగాయాలు
### రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

**మంత్రాలయం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామం దాటిన తర్వాత మలుపు వద్ద గురువారం తెల్లవారుజామున 3;30 గంటల సమయంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 8 మంది మృతి చెందగా, 9మంది తీవ్రంగా గాయపడిన ఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కర్ణాటక రాష్ట్రం చిక్కమంగళూరు పట్టణ సమీపంలోని ఊదేవ గ్రామం, కణాయకనహళ్లి గ్రామానికి చెందిన 21 మంది భక్తులు మంత్రాలయం రాఘవేంద్రస్వామి దర్శనార్థమై కేఏ46 9745నంబర్ గల బొలెరో గూడ్స్ వాహనంలో బయలుదేరారు. గురువారం తెల్లవారుజామున 3;30గంటల సమయంలో మంత్రాలయం మండలం చిలకలడోన గ్రామం దాటిన తర్వాత మలుపు వద్ద బొలెరో వాహనం డ్రైవర్ నిద్రమత్తులో ఎదురుగా మంత్రాలయం వైపు నుంచి వస్తున్న సిమెంట్ లోడ్ ట్యాంకర్ (కేఏ32 ఏసీ1117)ను వేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న 5 మంది మంది ఘటనా స్థలంలోనే చనిపోయారు. విషయం తెలుసుకున్న మంత్రాలయం సీఐ దస్తగిరి సంఘటనా స్థలానికి పోలీసు సిబ్బందితో చేరుకుని క్షతగాత్రులను 108 వాహనం ద్వారా ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 8 మంది మృతిచెందారు. వారిలో ఇద్దరు పురుషులు, ఆరు మంది మహిళలు ఉన్నారు. 9 మందిని కర్నూలుకు రెఫర్ చేశారు. అందులో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మరో నలుగురిని ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి రెఫర్ చేశారు. మృతి చెందిన వారిలో కుమార్(50) (కనకాయనహళ్లి గ్రామం, కర్ణాటక రాష్ట్రం), దీపిక వీణ(42)(కనకాయనహళ్లి గ్రామం, కర్ణాటక రాష్ట్రం), సునీల్(40) (చిత్తహళ్లి గ్రామం), యశోద అలియాస్ తాయమ్మ (60) >>2

17-4pg2exHMNWJQE.qxd:17-4pg2exHMNWJQE.qxd 1/1/02 6:58 AM Page 1



# దేశానికి కొత్త దిశ

>> పాలైతే, అప్పుడు దీంట్లో అర్థం ఏం ఉంటుందని వేణుగోపాల్ అన్నారు. రాజ్యాంగ సవరణకు, ఓ చట్టం సవరణకు జరిగే ఓటింగ్‌లో తేడా ఉంటుందని అమిత్ షా అన్నారు. ఒకటిపై ఒకటి ఆధారపడి ఉండడం వల్ల బిల్లులను కలిపి ప్రవేశపెట్టినట్లు మంత్రి చెప్పారు.131వ రాజ్యాంగ సవరణ బిల్లు, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల సవరణ బిల్లు, డీలిమిటేషన్ బిల్లులపై శుక్రవారం సాయంత్రం 4 గంటలకు ఓటింగ్ ప్రక్రియ ఉంటుందని స్పీకర్ ఓం బిర్లా అన్నారు. 15 నుంచి 18 గంటలు లేదా మీకు వీలైనంత సమయం చర్చించవచ్చు అని స్పీకర్ తెలిపారు. దీంతో మహిళా రిజర్వేషన్, రాజ్యాంగ సవరణ బిల్లులపై వాడీ వేడి చర్చ సాగింది. ఈ ప్రక్రియను జనగణనతో ప్రారంభించాలని అఖిలేశ్ యాదవ్ తొలుత సూచించారు. కులగణనను కేంద్రం పట్టించుకోవట్లేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్‌పై కేంద్రం దూడుకులో అర్థం ఏమిటని ప్రశ్నించారు. 'మహిళా రిజర్వేషన్ల అమలుపై కేంద్రం ఎందుకు అంత తొందర ప్రదర్శిస్తోంది. మొదటగా జనగణనతో ఈ ప్రక్రియను స్టార్ట్ చేయాల్తి అని ఆయన అన్నారు. మహిళా రిజర్వేషన్‌కు తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. కానీ డీలిమిటేషన్ ద్వారా రిజర్వేషన్ అమలును వ్యతిరేకిస్తున్నామని అన్నారు.ఈ వాదనపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఘాటుగా స్పందించారు. 'దేశంలో ప్రస్తుతం జనగణన ప్రారంభమైంది. ఆ తరువాత కుల ఆధారిత సెన్సెస్ కూడా ఉంటుంది. ప్రస్తుతం గృహ గణన జరుగుతోంది. ఇళ్లు కులాల వారీగా ఉండవు. కుదిరితే ఇళ్లకు కూడా సమాజ్‌వాదీ పార్టీ కులాన్ని జోడిస్తుంది. కులగణనతో పాటు జనగణన జరుగుతుందని నేను సభకు హామీ ఇస్తున్నా' అని హోం మంత్రి అమిత్ షా అన్నారు. కానీ, కేంద్రం ఈ బిల్లులో వెనుకబడిన వర్గాల మహిళలకు, ముస్లిం మహిళలకు ప్రత్యేక కోటా అమలు చేయాలని అఖిలేష్ యాదవ్ డిమాండ్ చేశారు. కేంద్రం చేపట్టనున్న డీలిమిటేషన్ ప్రక్రియ రాజ్యాంగా వ్యతిరేకం అని అఖిలేష్ యాదవ్ విమర్శించారు. ఈ సందర్భంగా హోం మంత్రి అమిత్ షా స్పందించారు. అఖిలేష్ మాటలకు కౌంటర్ ఇచ్చారు. మతం ఆధారంగా సీట్లుకేటాయించడం, చట్టసభలో రిజర్వేషన్లు కల్పించడం రాజ్యాంగా వ్యతిరేకం అన్నారు. మతపరమైన రిజర్వేషన్లను రాజ్యాంగం అంగీకరించబోదన్నారు. అంతగా కావాలనుకుంటే సమాజ్‌వాదీ పార్టీ తన సీట్లన్నీ ముస్లింలకే కేటాయించాలి అంటూ షా వ్యాఖ్యానించారు. దీనిపై మరో ఎస్పీ నేత ధర్మేంద్ర యాదవ్ స్పందిస్తూ షా వ్యాఖ్యలు ప్రజాస్వామ్యానికి విరుద్ధం అన్నారు. అఖిలేష్ స్పందిస్తూ.. ముస్లిం మహిళలు మన సగంజనాభాలో భాగం కాదా అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర మంత్రిగా ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా అమిత్ షా మాట్లాడటం సరికాదన్నారు. అమిత్ షా, ఎస్పీ నేతల మధ్య వాదన సాగుతుండటంతో స్పీకర్ ఓం బిర్లా జోక్యం చేసుకుని, ఇరువురిని శాంతింపజేశారు.

**ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య: ఒవైసీ:** మహిళా రిజర్వేషన్ బిల్లుపై హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ వ్యతిరేకించారు. మహిళా బిల్లుకు నిరసనగా సాహిర్ లుధియాన్వి రాసిన ఓ కవితను లోక్‌సభా ముఖంగా చదివి వ్యతిరేకించారు.ఈ బిల్లు సమాఖ్య వాద ఉల్లంఘన కిందకు వస్తుందని అసదుద్దీన్ ఒవైసీ పేర్కొంటూ.. దీనిని సభలో ప్రవేశపెట్టడాన్ని తాను పూర్తిగా వ్యతిరేకిస్తున్నానని అన్నారు. ఈ చర్య మహిళా రిజర్వేషన్‌కు సంబంధించినది కాదని, ఇది ముస్లిం ప్రాతినిధ్యాన్ని తుడిచివేసే చర్య అని ఆయన అభిప్రాయపడ్డారు. జనాభా ఎక్కువగా ఉన్న రాష్ట్రాలకు ఈ బిల్లు మరింత అధికారాన్ని ఇస్తుందని, పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని అరికడుతుందని ఒవైసీ వాదించారు.

**దక్షిణాది రాష్ట్రాలకు నష్టం రాదు: అమిత్ షా:** దక్షిణాది రాష్ట్రాలకు నష్టం జరుగుతుందనే ప్రచారం తప్పని, డీలిమిటేషన్ వల్ల ఆ రాష్ట్రాలకు తగిన రీతిలో సీట్లు పెరుగుతాయని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వివరించారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, దక్షిణాది రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయమూ జరగదని అమిత్ షా స్పష్టం చేశారు.డీలిమిటేషన్ తర్వాత ఏపీలో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి పెరుగుతాయని అమిత్ షా వెల్లడించారు. అలాగే తెలంగాణలో లోక్‌సభ సీట్లు 17 నుంచి 26కి పెరుగుతాయన్నారు. ఇక, తమిళనాడులో 39 నుంచి 59కి, కర్ణాటకలో 28 నుంచి 42కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయన్నారు. మొత్తంగా 50 శాతం సీట్లు పెరుగుతాయన్నారు. దక్షిణాది జనాభా శాతం కంటే సీట్లు ఎక్కువగా పెరుగుతాయని అమిత్ షా చెప్పారు. విపక్షాలు అబద్ధాలు చెబుతూ ప్రజలను అనవసరంగా ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. అన్ని ప్రాంతాలకూ సమాన న్యాయం జరుగుతుందని తేల్చి చెప్పారు.

**మోదీ ప్రసంగంలో నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం: ప్రియాంక:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా ప్రసగించారు. అంతకముందు ప్రధాని నరేంద్ర మోదీ చేసిన ప్రసంగాన్ని తప్పుపట్టిన ఆమె.. అందులో జవహర్‌లాల్ నెహ్రూ పేరు వినిపించకపోవడం గమనార్హం అని అన్నారు. మహిళల హక్కుల పట్ల బిజెపి నేతలే ఛాంపియన్లుగా భావిస్తున్నారని ఆమె విమర్శించారు."ఇవాళ ప్రధానంగా రిజర్వేషన్ల కోటాపై చర్చ కాదు.. లోక్‌సభ సీట్లను 850కి పెంచడంపైనే. మోడీ ప్రభుత్వం లోక్‌సభ సీట్ల పెంపుపైనే ఆసక్తి కనబరుస్తోంది.

# మహిళాబిల్లు నాదికాదు..దేశానిది

>> అన్నారు. 'దేశానికి సరికొత్త దిశను సూచించే ప్రయత్నం చేస్తున్నాం. దేశంలోని సగం జనాభాకు అధికారం ఇవ్వడం అద్భుత ఘట్టం. వికసిత్ భారత్ అంటే మౌలిక వసతుల కల్పనే కాదు.. మహిళలకు అధికారం ఇవ్వడం కూడా. వికసిత్ భారత్‌లో మహిళల భాగస్వామ్యమే లక్ష్యం. మహిళలకు అధికారమిస్తే దేశానికి సరికొత్త మార్గం చూపిస్తారు. మహిళలకు నిర్ణయాధికారం ఇవ్వడమే మా లక్ష్యం. ఇందులో ఎలాంటి రాజకీయ ప్రయోజనాలు లేవు. ఈ విషయంలో విపక్షాలను మహిళలు ఎప్పటికీ క్షమించరు' అని ప్రధాని పేర్కొన్నారు. 'పంచాయతీల్లో రిజర్వేషన్లకు అందరూ అంగీకరించారు. లోక్‌సభలో మాత్రం బిల్లును అడ్డుకుంటున్నారు. ఈ బిల్లుకు మద్దతిచ్చే రాజకీయ పార్టీలకే మనుగడ ఉంటుంది. 30ఏళ్లలో ఇదే అంశం రుజువైంది. మహిళల్లో రాజకీయ చైతన్యం పెరిగింది. అత్యున్నత చట్టసభల్లోనూ భాగస్వామ్యం కోరుతున్నారు. చీపురుపనికాదు.. పార్లమెంట్‌లో సీట్లు అడుగుతున్నారు. ఇప్పుడు బిల్లును వ్యతిరేకించిన వారిని మహిళలే శిక్షిస్తారు' అని మోడీ ప్రతిపక్షాలను హెచ్చరించారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అంశంలో క్రెడిట్ ఎవరిదన్న దానిపై ఆలోచించరాదు అన్నారు. కావాలంటే మీరు క్రెడిట్ తీసుకోవచ్చు అని ఆయన ప్రతిపక్షాలకు చెప్పారు. ఒకవేళ బిల్లు పాసైన తర్వాత.. ఎవరైనా కావాలంటే వారి పేరు, ఫోటో మీద ఫుల్ పేజీ యాడ్ ఇవ్వనున్నట్లు చెప్పారు. కానీ ఒకవేళ మూడు దశాబ్దాల తర్వాత కూడా ఈ సంస్కరణ చేపట్టకపోతే, అప్పుడు ఆ లబ్ధి ఏ పార్టీకి దక్కదని అన్నారు. "అన్ని పార్టీలు మద్దతివ్వండి.. ప్రస్తుతానికి 33 శాతం రిజర్వేషన్లు అమలుచేయనివ్వండని.. ఆ తర్వాత ఓబిసి, ఇతర వర్గాల కోటాపై ఆలోచిద్దాం" అని పార్లమెంట్ వేదికగా విపక్షాలకు ప్రధాని మోడీ విజ్ఞప్తి చేశారు. ఈ బిల్లు రాజకీయ పార్టీల కోసం కాదు.. మహిళల కోసమే. వారు తమ హక్కుల కోసం 30 ఏళ్లుగా పోరాడుతున్నారు. తమ శక్తి నిరూపించేందుకు సిద్ధంగా ఉన్నారు.ఈ బిల్లు వెనుక ఎలాంటి రాజకీయ దురుద్దేశం లేదు. ఈ విషయంలో రాజకీయం చేయొద్దు. రిజర్వేషన్లు మహిళల హక్కు. 2029లో రిజర్వేషన్లు అమలు చేయకపోతే మహిళలకు అన్యాయం జరిగినట్టవుతుంది. వికసిత్ భారత్ సాధనలో మహిళలదే కీలక పాత్ర. ఇప్పటికైనా మహిళా రిజర్వేషన్ ఆలస్యం కాకూడదు. దీనికి అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలి" అని ప్రధాని పిలుపునిచ్చారు.

**తప్పుడు ప్రచారం వద్దు:** 'దేశమంతా ఒక్కటే.. ప్రాంతీయ భేదాలు ఉండకూడదు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు అన్ని ప్రాంతాలూ సమానమే. ఉత్తర భారతం, దక్షిణ భారతం అనే తేడా మాకు లేదు. చిన్న రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదు. దేశాన్ని ముక్కలు చేసే అధికారం మనకు లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లుపై నాకు ఎలాంటి క్రెడిట్ అవసరం లేదు. మహిళా రిజర్వేషన్ బిల్లు ఏ పార్టీకి అనుకూలం కాదు. దానికి రాజకీయ రంగు పూయవద్దు. ఎవరు బాధ్యులైనా, ఇప్పటికే మహిళా రిజర్వేషన్ బిల్లును ఆలస్యం చేశాం. ఈ బిల్లులను తీసుకువచ్చిన సక్సెస్ ట్రెజరీ బెంచ్‌లకు కానీ, మోడీకి కానీ దక్కదు. ఇది భారత ప్రజాస్వామ్యానికి దక్కుతుంది. అన్ని పార్టీలకు ధన్యవాదాలు తెలుపుతూ రేపు(శుక్రవారం) ప్రకటన చేస్తా. నా స్వార్థం కోసం బిల్లు అంటూ తప్పుడు ప్రచారం చేయవద్దు' అని మోడీ విపక్షాలకు విజ్ఞప్తి చేశారు.

# మూడు బిల్లుల్లో ఏం ఉందంటే..

1. డీలిమిటేషన్ బిల్లు: లోక్‌సభ సభ్యుల సంఖ్యను 543 నుండి 850కి పెంచాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ 850 స్థానాలలో, 815 స్థానాలను రాష్ట్రాలకు, 35 స్థానాలను కేంద్ర పాలిత ప్రాంతాలకు కేటాయించింది. ఈ మార్పులు 2029 లోక్‌సభ ఎన్నికల నుండి అమల్లోకి వస్తాయి.
2. నారీ శక్తి వందన అధినియమ్ బిల్లు: పార్లమెంటు చరిత్రలో మరో కీలక ఘట్టంగా, లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలలో మహిళలకు 33 శాతం కోటాను అమలు చేసేందుకు రాజ్యాంగాన్ని సవరించాలని కోరుతూ బిల్లును ప్రవేశపెట్టింది. 'నారీ శక్తి వందన అధినియమ్'గా ప్రసిద్ధి చెందిన రాజ్యాంగ (నూట ఆరవ సవరణ) చట్టం, 2023, లోక్‌సభ, శాసనసభలలో మహిళలకు (షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా) దాదాపు మూడింట ఒక వంతు సీట్ల రిజర్వేషన్ కల్పించేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ 239ఎఏను సవరించి, ఆర్టికల్స్ 330ఎ, 332ఎ, 334ఎలను చేర్చింది. ఈ బిల్లు లక్ష్యాన్ని ప్రస్తావిస్తూ, "లోక్‌సభ, రాష్ట్ర శాసనసభ, జాతీయ రాజధాని ప్రాంతమైన ఢిల్లీ శాసనసభలో మహిళల భాగస్వామ్యాన్ని మరింతగా పెంచడమే" దీని ఉద్దేశ్యమని కేంద్రం పేర్కొంది. 'సదరు సవరణ చట్టం అమల్లోకి వచ్చిన తర్వాత నిర్వహించే సంబంధిత జనాభా లెక్కల ఆధారంగా మొదటి నియోజకవర్గాల పునర్విభజన చేపట్టిన తర్వాతే అటువంటి రిజర్వేషన్ అమలులోకి వస్తుందని సదరు నిబంధనలు తెలియజేస్తున్నాయి," అని బిల్లులో పేర్కొంది.
3. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు: చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించడం వెనుక ఉన్న ఆవశ్యకతను వివరిస్తూ, 131వ సవరణ బిల్లు ఇలా పేర్కొంది, 'తదుపరి జనాభా లెక్కలు, ఆ తర్వాత జరిగే పునర్విభజన ప్రక్రియకు గణనీయమైన సమయం పడుతుంది, తద్వారా మన ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళల సమర్థవంతమైన, అంకితభావంతో కూడిన భాగస్వామ్యం ఆలస్యం అవుతుంది. అందువల్ల, ఇటీవల ప్రచురించిన జనాభా లెక్కల గణాంకాల ఆధారంగా చేపట్టే పునర్విభజన ప్రక్రియ ద్వారా, లోక్‌సభలో, రాష్ట్రాల శాసనసభలలో, ఢిల్లీ జాతీయ రాజధాని ప్రాంతం, కేంద్రపాలిత ప్రాంతాలలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన మహిళలతో సహా మహిళలకు మూడింట ఒక వంతు రిజర్వేషన్‌ను అమలులోకి తీసుకురావడమే ఈ ప్రతిపాదిత బిల్లు లక్ష్యం" లోక్‌సభలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటుతో మహిళలకు సీట్ల రిజర్వేషన్ ఎలా ముడిపడి ఉందో నొక్కిచెబుతూ, ఈ బిల్లు ఇలా పేర్కొంటుంది,

మహిళలకు సీట్ల రిజర్వేషన్ అమలు అనేది, లోక్‌సభ, శాసనసభలలో సీట్ల కేటాయింపులో జరిగే పునఃసర్దుబాటు అనే రాజ్యాంగ పథకంతో, డీలిమిటేషన్ కమిషన్ ద్వారా ప్రాదేశిక నియోజకవర్గాల సరిహద్దులను తిరిగి గీయడంతో ముడిపడి ఉంది.

# బొలెరోను ఢీకొన్న సిమెంటు లారీ

>> (చిత్తహళ్లి గ్రామం), పుట్టమ్మ(55), (ఊదేవ గ్రామం, కర్ణాటక రాష్ట్రం), లోలాక్షి (చిట్టిహళ్లి గ్రామం,), మీనాక్షి (ఊదేవ గ్రామం), బెల్లి (05), (కనకాయనహళ్లి గ్రామం, కర్ణాటక రాష్ట్రం).

**13 మంది కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు:** చిలకలడోన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన అమృత, శోభ, ధన్యశ్రీ, దీపక్, దీక్షిత, ప్రతాప్, తేజశ్విని, వర్షిత, నవీన, జయమ్మ, సంజన, భారతమ్మ, సునీతలను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్య చికిత్సల నిమిత్తం తరలించారు.

**ఘటనా స్థలానికి చేరుకున్న డీఎస్పీ:** ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి ఎమ్మిగనూరు డీఎస్పీ భార్గవి, మంత్రాలయం సీఐ దస్తగిరి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన రెండు వాహనాలను ప్రొక్లైన్ సాయంతో పక్కకు తీయించి, ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

**సంఘటన స్థలానికి చేరుకున్న కర్నూలు జిల్లా ఎస్పీ**

ప్రమాదం జరిగిన విషయాన్ని తెలుసుకున్న కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ గురువారం ప్రమాద స్థలాన్ని సందర్శించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రమాదానికి గల రెండు వాహనాలను పరిశీలించారు.

**కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో క్షతగాత్రులను పరిశీలించిన జిల్లా కలెక్టర్**

మంత్రాలయం మండలం చిలకలడోన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్య సేవలు అందేలా చూడాలని వైద్యాధికారులను ఆదేశించారు. ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు.

**మృతుల కుటుంబానికి ఎమ్మెల్యే సంతాపం:** చిలకల డోన గ్రామ సమీపంలో బొలెరో వాహనం రోడ్డు ప్రమా దంలో మృతిచెందిన విషయం బాధాకరమని మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి వాపో యారు. బాధితా కుటుంబాలకు ప్రగాఢ సంతాపం తెలియజేశారు. గాయపడిన వారు త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. ఇలాంటి ప్రమాదాలు జరగకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకోవాలని కోరారు.



కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శిస్తున్న కలెక్టర్ ఎ.సిరి

**రోడ్డు ప్రమాదం ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన రాష్ట్రపతి, ప్రధాని,** కర్నూలు జిల్లా మంత్రాలయం- చిలకలడోన వద్ద ప్రయాణికులు ప్రయాణిస్తున్న బొలెరో గూడ్స్ వాహనం రోడ్డు ప్రమాదానికి గురైన ఘటనలో 8 మంది మృతిచెందారు. ప్రమాదంపై భారతదేశ ప్రధానమంత్రి నరేంద్రమోదీ, భారతదేశ రాష్ట్రపతి ద్రౌపదిముర్ము తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మరణించిన వారి కుటుంబాలకు రూ.2 లక్షలు, గాయపడిన వారికి రూ.50 వేలు పరిహారం ప్రకటించారు. త్వరగా కోలు కోవాలని ఆకాంక్షించారు. బాధితా కుటుంబాలకు అండగా ఉంటామని భరోసానిచ్చారు.

## నేడు కూటమి ఎంఎల్‌ఎలతో చంద్రబాబు సమావేశం

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** సీఎం చంద్రబాబు కూటమి ఎమ్మెల్యే లతో అత్యవసరంగా కీలక సమావేశం శుక్రవారం నిర్వహిస్తున్నారు. ఈ సమావేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చించనున్నట్లు సమాచారం.సీఎం పార్లమెంట్‌లో మహిళా బిల్లు ఆమోదం పొందితే చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించనున్న చంద్రబాబు సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, బిజెపినేత మాధవ్‌లు హాజరు కానున్నారు.



## విధేయతకు పట్టాభిషేకం

### టిడిపి రాష్ట్ర సారథిగా మళ్లీ పల్లా శ్రీనివాస్

**గాజువాక,ఏప్రిల్ 16,ప్రభాతవార్త:** తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును కొనసాగిస్తూ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నిర్ణయం తీసుకున్నారు. 2024 జూన్ 14న బాధ్యతలు స్వీకరించిన నాటి నుండి పార్టీ యంత్రాంగాన్ని పటిష్టం చేయడంలో ఆయన చూపిన చొరవ, కార్యకర్తలతో ఉన్న అనుబంధం పల్లాకు మరోసారి ఈ కీలక బాధ్యత దక్కేలా చేశాయి. తిరుగులేని మెజారిటీ, తిరుగులేని గుర్తింపు, గత అసెంబ్లీ ఎన్నికల్లో పల్లా శ్రీనివాసరావు సృష్టించిన ప్రభంజనం పార్టీలో ఆయన స్థాయిని అమాంతం పెంచేసింది. గాజువాక నియోజకవర్గం నుంచి రాష్ట్రంలోనే అత్యధికంగా 95,235 ఓట్ల రికార్డు మెజారిటీతో విజయం సాధించి, ముఖ్యమంత్రి సహా హేమాహేమీలందరినీ వెనక్కి నెట్టారు. ఈ అఖండ విజయం ఆయనపై అధిష్ఠానానికి ఉన్న నమ్మకాన్ని రెట్టింపు చేసింది.పల్లా ఎంపిక వెనుక కీలక కారణాలివే పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం, పార్టీ మధ్య వారధిగా వ్యవహరించడంలో పల్లా సఫలీకృతులయ్యారు. ముఖ్యంగా ఉత్తరాంధ్రలో పార్టీ పట్టు సడలకుండా చూడటంలో ఆయన వ్యూహాలు ఫలించాయి. క్షేత్రస్థాయిలో కేడర్‌కు అందు బాటులో ఉండటం, వారి సమస్యల పరిష్కా రానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా పార్టీ శ్రేణుల్లో ఆయన గట్టి నమ్మకాన్ని సంపాదిం చుకున్నారు. మరోసారి రాష్ట్ర పగ్గాలు పల్లాకు అప్పగించడం పట్ల విశాఖ జిల్లా వ్యాప్తంగా పార్టీ శ్రేణులు సంబరాలు జరుపుకుంటున్నాయి. వివాదరహితుడిగా, మితభాషిగా ఉంటూనే తన పని తాను చేసుకుపోయే నిరాడంబర శైలి చంద్ర బాబును ఆకట్టుకుంది. **ముందున్న సవాళ్లు** రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా ముందు ఇప్పుడు కీలక బాధ్య తలు ఉన్నాయి. 1.త్వరలో ప్రారంభం కానున్న పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతం చేయడం. 2. ముంచు కొస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని సమాయత్తం చేసి, మెజారిటీ స్థానాలను కైవసం చేసుకోవడం. 3.ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, 'సూపర్ సిక్స్' హామీల అమలును ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లడం.

## కాల్పుల విరమణ

>> ఉపాధ్యక్షుడు జెడి వాన్స్, విదేశాంగ మంత్రి మార్కో రూబియోలకు అప్పగించినట్లు తెలిపారు. తాజా ఒప్పందంతో ఇజ్రాయెల్, హెజ్బొల్లా దళాల మధ్య జరుగుతున్న దాడులు నిలిచిపోనున్నాయి. రక్తపాతాన్ని ఆపి, అమాయకుల ప్రాణాలు కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. అయితే, ఇజ్రాయెల్, లెబనాన్ దేశాల ప్రతినిధులు 34ఏళ్ల తర్వాత వాషింగ్టన్‌లో తొలిసారి భేటీ అయ్యారని ట్రంప్ తెలిపారు. ఈ క్రమంలో లెబనాన్ అధ్యక్షుడు జోసెఫ్ ఔన్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహుతో మాట్లాడానని ట్రూత్ పోస్ట్‌లో వెల్లడించారు. 1983 తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన అర్థవంతమైన చర్చలు ఇవేనని ట్రంప్ తెలిపారు.

# విఐపి బ్రేక్ దర్శనాలు రద్దు

>> ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలోచనకు వచ్చేశారు.మే నెల 1నుండి జులై 15వరకు పూర్తిగా విఐపి బ్రేక్ దర్శనాలు రద్దుచేయాలని దాదాపు నిర్ణయం తీసుకున్నారు. కేవలం ప్రోటోకాల్ విఐపిలు స్వయంగా వస్తేనే వారికి బ్రేక్ దర్శనాలు కల్పించనున్నారు. అంతేగాక ఆఫ్‌లైన్‌లో జారీచేస్తున్న ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయడం వల్ల కొండపై రద్దీ ఒత్తిడి తగ్గించవచ్చనే ఆలోచన చేస్తున్నారు. అయితే ఇదీ పూర్తిగా గ్రామీణ ప్రాంత ప్రజలకు, సామాన్యభక్తులకు ఇబ్బందిగా మారుతుందని భావిస్తున్నారు. దీంతో విఐపి బ్రేక్‌దర్శనాలు రద్దుచేసి ఆ స్థానంలో టైమ్‌స్లాట్ టోకెన్లు జారీచేయడంపై కసరత్తు మొదలుపెట్టారు. ఇప్పటికే గత రెండేళ్ళ గణాంకాలు పరిశీలించి అదనపు ఇఒ వెంకయ్యచౌదరి రెండేళ్ళ అనుభవంతో తిరుమలలో పూర్తిస్థాయిలో ప్రక్షాళనలో సఫలీకృతులయ్యారు. అన్నప్రసాదాల నాణ్యతను మరింత పెంచారు. భక్తులు సంతోషంగా,తృప్తిగా అన్నప్రసాదాలు స్వీకరించేలా నాణ్యతతో ఉన్న అన్నప్రసాదాలు అందేలా ఆయన తొలి అడుగు విజయవంతం కావడంతో ఇప్పుడు వేసవి సెలవుల రద్దీతో స్వామివారి దర్శనాలు సామాన్యభక్తులకు మరింత సులభంగా, సంతోషంగా చేసుకునేలా చూడాలని ఆయన యాక్షన్‌ప్లాన్ రూపొందించారు. ఇందుకు బోర్డుతో బాటు ఆలయ అధికారులు, ఎంతో అనుభవం ఉన్న సిపిఆర్ఒ డాక్టర్ తలారి రవి, పిఆర్ఒ నీలిమ, సీనియర్ అధికారులు సహకరిస్తున్నారు. ఇప్పటికే లక్షమందికిపైగా భక్తులు తిరుమలకు వస్తున్నా రోజుకు సరాసరి 75వేలమంది వరకు భక్తులకు మాత్రమే దర్శనం చేయించగలుగుతున్నారు. సెలవుల్లో రద్దీకి తగ్గట్లు ఈ సంఖ్యను పెంచేందుకు వీలుగా వారాంతంలో ఉచిత సర్వదర్శన టైమ్‌స్లాట్ టోకెన్లు జారీని పెంచే ఆలోచనతో ఉన్నారు.బోర్డు సమావేశంలో కీలకనిర్ణయం తీసుకునేలా సిద్ధమయ్యారు.

## వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా సిఎం చంద్రబాబు ఘన నివాళులు

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు ఘన నివాళులర్పించారు. సంఘ సంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగుజాతికి నవయుగ వైతాళికుడు, స్త్రీ విద్య కోసం ఉద్యమించిన మహనీయుడు, బాల్య వివాహాలను ఖండించి వితంతు వివాహాలను ప్రోత్సహించిన ధీశాలి అని కొనియాడారు. ఆయన తెలుగు జాతికి గర్వకారణమన్నారు.



## రోడ్డు ప్రమాదంపై సిఎం దిగ్భ్రాంతి

**విజయవాడ, ఏప్రిల్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లా చిలకలడోన వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బొలెరోలారీ ఢీకొన్న ప్రమాదంలో 8 మంది మృత్యువాత పడటంపై విచారం వ్యక్తం చేశారు. ప్రమాదంపై సీఎం ఆరా తీశారు. కర్ణాటకకు చెందిన భక్తుల వాహనం మంత్రాలయం దర్శనానికి వస్తుండగా తెల్లవారుజామున 3.30 గంటలకు ప్రమాదం జరిగిందని, ఘటనా స్థలంలోనే 8 మంది మృతి చెందారని వివరించారు. గాయపడిన 10 మందికి ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని, తీవ్రంగా గాయపడిన వారిని కర్నూలు జీజీహెచ్‌కు తరలించి వైద్యం అందిస్తున్నట్లు వివరించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సీఎం తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



గురువారం కుప్పంలో మీడియాతో మాట్లాడుతున్న శ్రీహరి, పొన్నవోలు, భరత్ తదితరులు

## మాజీ సిఎం జగన్ సిపిఆర్వో శ్రీహరికి బెయిల్

### 25వేల సొంత పూచీకత్తుపై విడుదల

**కుప్పం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** సిఎం చంద్రబాబునాయుడుపై సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారని నమోదైన కేసులో మాజీ సిఎం వైఎస్ జగన్ మాజీ సిపిఆర్వో పూడి శ్రీహరిని కుప్పం కోర్టులో గురువారం సాయంత్రం పోలీసులు హాజరు పరిచారు. వాదనలు విన్న అనంతరం న్యాయమూర్తి 25వేల సొంత పూచీకత్తులో శ్రీహరికి బెయిల్ మంజూరు చేశారు. దీంతో పోలీసులు విడుదల చేశారు. కాగా గురువారం రెండుసార్లు శ్రీహరికి కుప్పం పోలీసులు వైద్య పరీక్షలు నిర్వహించాక సాయంత్రం కోర్టులో హాజరుపరచారు. కోర్టు వద్దకు అప్పటికే మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీ భరత్, మాజీ ఎంపి రెడ్డెప్ప తదితరులు చేరుకున్నారు. అనంతరం ప్యానెల్ న్యాయవాదులతో చర్చించారు. బుధవారం రాత్రి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆయన తనయుడు సైతం కుప్పం వచ్చి గురువారం మధ్యాహ్నం దాకా కుప్పంలో ఉన్నారు. శ్రీహరికి కోర్టు బెయిల్ మంజూరుచేసిన అనంతరం ఎమ్మెల్సీ భరత్ నివాస ంలో మీడియా సమావేశం నిర్వహించారు. శ్రీహరి మాట్లాడుతూ తాను సోషియల్ మీడియాలో ఎలాంటి పోస్టులు పెట్టలేదని పోలీసులకు స్పష్టత ఇచ్చానన్నారు. తనపై గతంలో కూడా ఎలాంటి కేసులు లేవన్నారు. చట్టాలపై తనకు గౌరవం ఉందన్నారు. మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ పోలీసులు 111బిఎన్ఎస్ కింద కేసులు నమోదుచేయడం తగదన్నారు. పోలీసులు చట్టపరిధి దాటరాదని తప్పుచేస్తే చట్టం ముందు నిలబెడతామన్నారు. ఎమ్మెల్సీ భరత్ మాట్లాడుతూ శ్రీహరి కేసులో న్యాయం గెలిచిందన్నారు. వైఎస్సార్సీ గొంతు నొక్కాలని చూడడం తగదని ఎప్పటికైనా చట్టం గెలుస్తుందన్నారు.

## సింగపూర్‌లో పర్యటించనున్న మంత్రుల బృందం

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** మంత్రుల బృందం ఈ నెల 21న సింగపూర్ వెళ్లనునుంది. ఈ నెల 21 నుంచి 27 వరకు సింగపూర్‌లో 9 మంది మంత్రులు ఒక బృందంగా పర్యటించనున్నారు. పరిపాలన, లా అండ్ ఆర్డర్, రోడ్లు, పర్యాటకాన్ని పరిశీలించనున్నారు. సింగపూర్ వెళ్లే మంత్రులతో సీఎం చంద్రబాబు ప్రత్యేకంగా సమావేశమయ్యారు. నారాయణ, పయ్యావుల, అనగాని, సత్యకుమార్, జనార్దన్‌రెడ్డికి దిశానిర్దేశం చేశారు. సింగపూర్ పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేయాలని సూచించారు. సింగపూర్ విధానాలు ఇక్కడెలా అమలు చేయవచ్చో అధ్యయనం చేయాలని రాష్ట్రంలో అమలు చేయగలిగే ఉత్తమ విధానాలు అధ్యయనం చేయాలని చెప్పారు. తెలుసుకున్నవి అందరికీ చెప్పి ఉత్తమ విధానాల అమలుకు కృషి చేయాలని సీఎం సూచించారు.

# జనగణన ఆరంభం

>> దశలో ఇవాళ్టి నుంచే ఇండ్ల గణన ప్రారంభమైందన్నారు. వచ్చే ఏడాది నుంచి ప్రారంభమయ్యే రెండో దశలో జనాభా లెక్కల సేకరణ మొదలవుతుందన్నారు. ప్రస్తుతం ప్రారంభమైన ఇండ్ల గణన( హౌస్ లిస్టింగ్ హౌస్ సెన్సెస్ కార్యక్రమంలో ప్రజలు స్వయంగా ఆన్ లైన్ ద్వారా నమోదు చేసుకునే అవకాశం ఉందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని సీఎం విజ్ఞప్తి చేశారు. సరైన వివరాలను నమోదు చేయటం ద్వారా రాష్ట్ర అభివృద్ధికి సహకారం అందిం చాలని ప్రజలను కోరారు. మొత్తం ఈ జనగణన కార్యక్రమాన్ని విజయ వంతం చేయడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్య మంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు.

**మొదటి దశ మొదలు: జె.నివాస్**

ప్రపంచంలోనే అతిపెద్ద గణాంక కార్యక్రమమైన భారత జనగణన2027కు ఏపీలో గురువారం ప్రారంభమైంది. తొలిసారిగా పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహిస్తున్న ఈ బృహత్తర కార్యక్రమంలో మొదటి దశ ఇవాళ్టి నుంచి ప్రారంభించినట్లు రాష్ట్ర జనగణన డైరెక్టర్ జె. నివాస్ తెలిపారు.తొలి విడతలో భాగంగా ఇళ్ల జాబితా, గృహ గణన (హౌస్ లిస్టింగ్, హౌసింగ్ సెన్సస్) చేపడుతున్నట్లు ఆయన మీడియాకు వివరించారు. ఈసారి జనగణన ప్రక్రియలో ప్రజలే స్వయంగా తమ వివరాలు నమోదు చేసుకునేందుకు స్వీయ గణన (సెల్ఫ్ ఎన్యూమరేషన్) సదుపాయాన్ని కల్పించినట్లు నివాస్ వెల్లడించారు. రాష్ట్రంలో 30వ తేదీ వరకు ఈ అవకాశం ఉంటుందన్నారు. తప్పుడు సమాచారం అందించినా క్రిమినల్ చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేటర్లుగా 80 శాతం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులనే నియమించినట్లు స్పష్టం చేశారు.

## వారం - వర్జ్యం

17-04-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్విని కార్తె
● అమావాస్య సా.5.18
రేవతి ఉ.11.59
వర్జ్యం : లేదు
దు.ఉ.8.21-ఉ.9.11,
2) మ.12.31-మ.1.21
రాహుకాలం - ఉ.10.30-12.00

## వార్తాఫలం

**మేషం:**దూరప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. నూతన కార్యక్రమాలు చేపడతారు. వస్త్రలాభం.

**వృషభం:**ఒక పనిని సన్నిహితుల సహాయంతో పూర్తిచేస్తారు. పెండింగ్ వ్యవహారాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మిథునం:** ఆరోగ్యపరమైన, కోర్టుపరమైన సమస్యల నుండి బయటపడతారు. విలువైన వస్తువులు సేకరిస్తారు.బంధువుల కలయిక.

**కర్కాటకం:**శుభకార్య నిర్వహణ, విద్యా సంబంధితమైన ఖర్చులు విషయమై ఋణాలు చేస్తారు. వాహనాలు కొనుగోలు.

**సింహం:**దుష్ప్రచారము ఇబ్బందిని కలిగించవచ్చు, తగు జాగ్రత్తలు పాటించండి. దైవము మీద భారము వేయండి.

**కన్య :**ముఖ్యమైన కార్యక్రమాలు, అమలు చేయు పనులు చర్చలు ఒకింత పురోభివృద్ధిలో ఉంటాయి.నూతన విద్యా అవకాశాలు.

**తుల :**మీరు ఆశించిన పదోన్నతి, సీటు మార్పిడి మొదలైన విషయాలు మీ దగ్గరకు వచ్చి దూరముగా జరిగిపోవచ్చును.

**వృశ్చికం:**తాత్కాలికముగా వెనుకబడినా ధర్మమే గెలుస్తుందన్న సత్యాన్ని గ్రహించండి. ధనాన్ని పొదుపుగా ఉపయోగిస్తారు.

**ధనుస్సు:** సోదర, సోదరీ వర్గమువారి నుండి కొన్ని ఆటంకములు ఎదురవుతాయి. దూరప్రాంతాల నుండి శుభవార్తలు.

**మకరం:** మీరనుకున్న చిన్నచిన్న పనులే పదేపదే త్రిప్పుట, శ్రమకు గురిచేయుట జరుగుతుంది.ఆరోగ్య విషయం జాగ్రత్త.

**కుంభం:**ఎక్కువ రోజులు ఇంటికి దూరముగా గడవలసిన పరిస్థితులు ఏర్పడతాయి. వివాహయత్నాలు ఫలిస్తాయి.

**మీనం:** భవిష్యత్తులో సుఖపడాలంటే కష్టించక తప్పదని భావిస్తారు. స్నేహితులను కలుసుకొని సహాయం అర్థిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

## డిప్యూటీ సీఎం పవన్‌కు మంత్రి లోకేష్ ధన్యవాదాలు

**విజయవాడ.ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు మానవ వనరుల శాఖా మంత్రి నారా లోకేష్ "ఎక్స్" వేదికగా ధన్యవాదాలు తెలిపారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా ఎంపికైన నన్ను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేసిన ఉప ముఖ్యమంత్రి పవనన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు అంటూ లోకేష్ ట్వీట్ చేసారు. మీ ఆశీస్సులతో, మీ ఆకాంక్ష మేరకు కూటమి స్ఫూర్తి మరింత స్నేహ పూర్వ కంగా.. సమన్వయంతో, రాష్ట్ర ప్రగతిప్రజా సంక్షేమం లక్ష్యంగా కొనసాగుతుంది. తమ్ము డిగా నాపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టు కుంటాను. సోదరుడిగా మీరు చూపిస్తున్న అభిమానానికి హృదయపూర్వక కృతజ్ఞతలు అని లోకేష్ పేర్కొన్నారు. తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా లోకేష్ ఎంపికైన సందర్భంగా డీసీఎం పవన్ కల్యాణ్ ఆయనను అభినందించారు. కొత్త బాధ్యతల్లో లోకేశ్ సఫలీకృతులు కావాలని ఆకాంక్షిస్తున్నానన్నారు. కూటమి స్ఫూర్తిని సమర్థంగా కొనసాగిస్తారని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా మరోసారి ఎన్నికైన శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలిపారు.

## కర్నూలు రోడ్డు ప్రమాదం బాధాకరం

**- బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివి ఎన్ మాధవ్..**

**విజయవాడ ఏప్రిల్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లా చిలకలడోన వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టెంపో వాహనం–లారీ ఢీకొన్న ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. కర్ణాటకకు చెందిన భక్తులు మంత్రాలయం దర్శనానికి వస్తుండగా తెల్లవారుజామున చోటుచేసుకున్న ఈ ఘటన హృదయ విదారకమని అన్నారు.

గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షి ంచారు. క్షతగాత్రులకు అత్యుత్తమ వైద్యసేవలు అందిం చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు పీవీఎన్ మాధవ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

బాధిత కుటుంబాలకు అండగా ఉండాలని, అవసర మైన సహాయ సహకారాలు అందించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.



ఆరోగ్య విశ్వవిద్యాలయంలో పీఎం రాహత్ పై జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న మంత్రి వై. సత్య కుమార్ యాదవ్

## రోడ్డు ప్రమాద బాధితులకు పిఎం రాహత్ పథకం వరం

**- రూ. 1.50 లక్షల వరకు నగదు రహిత తక్షణ వైద్య సహాయం - ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించడమే ప్రధాన లక్ష్యం: మంత్రి వై. సత్య కుమార్ యాదవ్**

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే ఆలస్యం చేయకుండా సమయానికి చికిత్స అందిస్తే గాయపడిన వారి ప్రాణాలను రక్షి ంచడం సాధ్యమవుతుందని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రమాద బాధితులకు అత్యవసర వైద్య సేవలు త్వరితగతిన అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకం ఎంతో కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు విజయవాడలోని డాక్టర్ ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఆడిటోరియంలో హాల్‌లో పీఎం రాహత్ (ప్రధాన మంత్రి రోడ్ యాక్సిడెంట్ హాస్పిటలైజేషన్ అండ్ అష్యూర్డ్ ట్రీట్మెంట్ స్కీమ్) పై రాష్ట్ర స్థాయి భాగస్వాముల సంప్రదింపుల సమావేశానికి గురువారం రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి వై. సత్య కుమార్ యాదవ్ మాట్లా డుతూ... రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన బాధితులకు సమయానికి, నాణ్యమైన వైద్య సేవలు అందించడం ప్రభుత్వ ప్రధాన లక్ష ్యమని ఇందుకు పీఎం రాహత్ పథకం క్యాష్ లెస్ సేవలు 1 లక్ష 50 వేల వరకు అందిస్తుందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేసేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఆసుపత్రులు, అంబులెన్స్ సేవలు, పోలీసులు మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సహకారంతో పనిచేస్తేనే బాధితులకు తక్షణ సహాయం అందుతుందని అన్నారు. రోడ్డు ప్రమాద బాధితులకు ఆర్థిక భారం లేకుండా చికిత్స అందించడం ఈ పథకం ప్రధాన ఉద్దేశమని, ప్రతి ఆసుపత్రి దీనిపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని మంత్రి సూచించారు. ప్రజల్లో కూడా ఈ పథకం పై విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల పరిస్థితిపై మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదాల్లో కుటుంబానికి ఆదారమైన వ్యక్తి ప్రాణాలు కోల్పోతే ఆ కుటుంబం ఆర్థికంగా దెబ్బతినడమే కాకుండా పిల్లల భవిష్యత్తు కూడా ప్రభావితమవుతుందని తెలిపారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా అతివేగం, అజాగ్రత్త డ్రైవింగ్, మద్యం సేవించి వాహనం నడపడం, రోడ్లపై ఉన్న బ్లాక్ స్పాట్స్, డివైడర్ల మధ్య అకస్మాత్తుగా వాహనాలు రావడం వంటి అంశాలను గుర్తించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాల వల్ల జరిగే ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు గోల్డెన్ అవర్ విధానాన్ని 108 అంబులెన్స్ సేవల ద్వారా సమర్థవంతంగా రాష్ట్రంలో అమలు చేస్తున్నామని మంత్రి వెల్లడించారు. ప్రమాదం జరిగిన మొదటి గంటలో వైద్య సేవలు అందించడం ద్వారా ప్రాణాలను కాపాడే అవకాశాలు గణనీయంగా పెరుగుతున్నాయని తెలిపారు. ఈ విధానం విజయశాతం గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగిందని పేర్కొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ వసతి గృహాల విద్యార్థుల ప్రతిభ

**- సీనియర్ ఇంటర్‌లో 950కు పైగా మార్కులు సాధించిన 43 మంది విద్యార్థులు**

**- విద్యార్థులకు మంత్రి డా.డోలా బాల వీరాంజనేయస్వామి అభినందనలు**



**విజయవాడ, ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఇంటర్మీడియట్ ఫలితాల్లో సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. సీనియర్ ఇంటర్ , జూనియర్ ఇంటర్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. సీనియర్ ఇంటర్ లో 43 మంది విద్యార్థులు 950 కు పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి విద్యార్థులను అభినందించారు. 989 మార్కులు సాధించిన చిత్తూరు జిల్లా పలమనేరు ఎస్సి హాస్టల్ సెకండ్ ఇయర్ విద్యార్థిని కే. వైష్ణవిని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. గురువారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ...ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. విద్యార్థులు, సిబ్బందికి అభినందనలు. కూటమి ప్రభుత్వం వచ్చాక సంక్షేమ వసతి గృహాలు, అంబేద్కర్ గురుకులాల విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించడంతో పాటు మెరుగైన సౌకర్యాలు కల్పిస్తున్నాం. రూ. 143 కోట్లతో గురుకులాలు, సంక్షేమ వసతి గృహాలకు మరమ్మతులు చేసాం. ఆర్వో ప్లాంట్ల ద్వారా విద్యార్థులకు సురక్షి తమైన నీరు అందిస్తున్నాం. విద్యార్థుల రక్షణ, భద్రత కోసం అన్ని హాస్టల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం.

## టిడిపి పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబర్‌గా ఎంపి లావు శ్రీ కృష్ణ దేవరాయలు

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన తాజా పార్టీ పదవుల్లో టీడీపీ ఫ్లోర్ లీడర్, నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీ కృష్ణ దేవరాయలు గారికి సముచిత స్థానం లభించింది. టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబెర్ గా లావు శ్రీ కృష్ణ దేవరాయలుని పార్టీ అధిష్టానం నియమించింది. టీడీపీ పొలిట్ బ్యూరో ఎక్స్ అఫిషియో మెంబెర్లుగా ముగ్గురు ఉండగా.. అందులో నారా లోకేష్ గారు, పల్లా శ్రీనివాసరావు గారు, లావు శ్రీ కృష్ణ దేవరాయలు ఉన్నారు. ఈ పదవి ద్వారా పార్టీ వ్యవహారాల్లో శ్రీ కృష్ణ దేవరాయలు కీలకంగా వ్యవహరించనున్నారు.

## కర్నూలు జిల్లా రోడ్డు ప్రమాదంపై జగన్ సంతాపం

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** కర్నూలు జిల్లా మంత్రాలయం మండలం చిలకల దోనా వద్ద జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడం పట్ల మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత శ్రీ వైయస్ జగన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దైవదర్శనానికి వెళ్తున్న భక్తులు ఈ ప్రమాదంలో మృతి చెందడం అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనలో 13 మంది గాయపడటం, వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో వారికి ధైర్యం కలగాలని ఆకాంక్షి ంచారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ప్రార్థించారు. ప్రమాదానికి గల కారణాలను సమగ్రంగా పరిశీలించి, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా రహదారి భద్రతా చర్యలను మరింత కట్టుదిట్టం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు.

## యువగళం పాదయాత్రతో లోకేష్ ముందడుగు :మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** తెలుగుదేశం పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ధైర్యంగా ముందడుగు వేసిన నాయకుడు లోకేశ్ అని మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. యువగళం పాదయాత్రలో ఎన్ని ఇబ్బందులు ఎదురైనా రాష్ట్రం బాగు కోసం ఎక్కడా వెనుకడుగు వేయలేదని తెలిపారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఒంగోలు మహానాడు నిర్వహణ సహా పార్టీ కార్యక్రమాలు విజయవంతం అయ్యేలా చూడటం లోకేశ్ కోఆర్డినేషన్ వల్లే సాధ్యమైందన్నారు.ఓ ప్రాంతీయ పార్టీని గొప్పగా నడుపుతూ లోకేశ్ అన్ని విధాలా టీడీపీని ముందుకు నడిపిస్తున్నారని మంత్రి కొనియాడారు. కార్యకర్తల సంక్షేమ నిధితో పాటు ఎన్నో కీలక సంస్కరణలకు యువనేత శ్రీకారం చుట్టారని తెలిపారు. ఇన్సూరెన్స్ పాలసీ కార్యకర్తలకు అందుబాటులోకి తీసుకురావడంతో పాటు కోటి మంది సభ్యులతో పార్టీని బలోపేతం చేయటం లోకేశ్ క్రెడిట్ అని మంత్రి అన్నారు. కష్టపడే వారికి తగిన గుర్తింపు ఇస్తూ అహర్నిశలు ప్రజల బాగు కోసం పరితపిస్తున్నారని చెప్పారు. మంత్రిగానూ నిరుద్యోగ సమస్య పరిష్కారానికి పెట్టుబడుల స్థాపనకు ఎంతో కృషి చేస్తున్నారని తెలిపారు. విద్యా విధానంలో లోకేశ్ ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చారని మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.

## అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గ్యాస్ గోదాములు, అపార్ట్‌మెంట్లలో విస్తృత అవగాహన

- రెసిడెన్షియల్ అపార్ట్‌మెంట్లలో మాక్ డ్రిల్



**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాత వార్తప్రతి నిధి:** రాష్ట్ర వ్యాప్తంగా అగ్నిమాపక శాఖ నిర్వహిస్తున్న వారోత్స వాల్లో భాగంగా గురువారం మూడవ రోజు కీలకమైన అవగాహన కార్యక్రమాలు కొనసాగించారుజ. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు, అగ్నిమాపక సిబ్బంది జనవాసాలు, ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి. ఆ ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. జిల్లాలోని ప్రధాన ఎల్పీజీ గ్యాస్ గోదాములను సందర్శించి, అక్కడ భద్రతా ప్రమాణాలను పరిశీలించడమైనది. గ్యాస్ లీకేజీ జరిగినప్పుడు అనుసరించాల్సిన అత్యవసర పద్ధతులను సిబ్బందికి , యాజమాన్యానికి వివరించారు. బహుళ అంతస్తుల భవనాలలో నివసించే ప్రజలకు అగ్ని ప్రమాదాల పట్ల అవగాహన కల్పించారు. అపార్ట్‌మెంట్లలోని ఫైర్ హైడ్రెంట్ సిస్టమ్స్, ఫైర్ ఎక్స్‌టింగ్యూషర్లను ఎలా వినియోగించాలో ప్రత్యక్షంగా చేసి చూపించారు. జాగ్రత్తల వివరణ: ముఖ్యంగా వంటగదిలో గ్యాస్ స్టౌలు, రెగ్యులేటర్ల విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షార్ట్ సర్క్యూట్‌లను నివారించే మార్గాలను వివరించారు. ప్రమాదాల నివారణకు సంబంధించిన సూచనలు, అత్యవసర నంబర్లు (101) కలిగిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. "అగ్ని ప్రమాదాల నివారణ అనేది కేవలం ఒక శాఖ బాధ్యత మాత్రమే కాదు, ప్రతి పౌరుడి బాధ్యత. ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే ఆస్తి, ప్రాణ నష్టాలను అరికట్టగలం" అని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.

## ఎపి ఇంటర్ ఫలితాల్లో సరికొత్త రికార్డులు ఆవిష్కరించిన నారాయణ విద్యాసంస్థలు

**జూనియర్ ఎంపిసిలో 468 మార్కులు సాధించిన నారాయణ విద్యార్థి**

**జూనియర్ బైపిసిలో స్టేట్ మార్క్ 152/455తో విజయ ఢంకా**




**హైదరాబాద్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** ఎపి ఇంటర్ ఫలితాల్లో నారాయణ రికార్డుల మోత మోగించింది. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అన్ని గ్రూపుల్లో స్టేట్ టాప్ మార్కులతో అదరగొట్టింది. జూనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 470 మార్కులకుగాను 468 మార్కులను విద్యార్థిని మానస సాధించగా, 467 మార్కుల పైన 28 మంది, 466 మార్కుల పైన 198 మంది సాధించారు. 465 మార్కుల పైన 657 మంది, 460 మార్కులపైన 3859 మంది విద్యార్థులు సాధించారు. అదేవిధంగా జూనియర్ బైపిసి విభాగంలో 455 మార్కులకుగాను ఇద్దరు విద్యార్థులు ఫెయిత్ హియాల్, మసీహా 452 మార్కులు సాధించి రికార్డు సృష్టించారు. మరో 20 మంది విద్యార్థులు 461 ఆపైన మార్కులు, 60 మంది 450 ఆపైన మార్కులు సాధించారు. అదేవిధంగా సీనియర్ ఇంటర్ ఎంపిసి విభాగంలో 1000 మార్కులకుగాను నాగ తేజశ్రీ 993 మార్కులు సాధించగా అయిదుగురు విద్యార్థులు 992 ఆపైన మార్కులు, 24 మంది 991 ఆపైన మార్కులు, 77 మంది విద్యార్థులు 990 ఆపైన మార్కులు సాధించారు. సినియర్ ఇంటర్ బైపిసి విభాగంలో 1000 మార్కులకుగాను టి.సతీష్‌రెడ్డి 991 మార్కులు సాధించగా 990 మార్కులను నలుగురు విద్యార్థులు సాధించారు. అన్ని విభాగాల్లో అత్యధిక మార్కుల్లో 22శాతం ఫలితాలు తమ విద్యార్థులే సాధించారని నారాయణ విద్యాసంస్థల డైరెక్టర్లు డా.పి. సింధూర నారాయణ, పి.శరణి నారాయణ పేర్కొన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుండి ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రాంను పటిష్టమైన మైక్రోషెడ్యూల్స్‌గా రూపొందించి విద్యాబోధన చేయటంతోనే తమ విద్యార్థులు అద్భుత ఫలితాలను సాధించారని తెలిపారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

## చక్రాయపాలెం వద్ద ఘోర రోడ్డు ప్రమాదం

**న- రెండు ద్విచక్రవాహనాలను ఢీ కొన్న కారు - ఇరువురి మృతి - ఒకరికి తీవ్ర గాయాలు**



**అద్దంకి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ప్రకాశం జిల్లా, అద్దంకి మండలం, చక్రాయపాలెం గ్రామ సమీపంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇరువురు మృతిచెందారు, ఒకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. అందిన సమాచారం మేరకు మేదరమెట్ల - నార్కెట్‌పల్లి రాష్ట్ర రహదారిపై గురువారం మధ్యాహ్నం సంతమాగులూరు అద్దరోడ్డు వైపు నుండి అద్దంకి వస్తున్న ఒక స్కూటర్, ఒక బైక్‌ను వెనుక వైపు నుండి వస్తున్న కారు ఢీకొట్టింది. ఈ సంఘటనలో అద్దంకి పట్టణం,ఇందిరానగర్‌కు చెందిన కొటికలపూడి శ్రీను (35)లు గుంటూరుకు చెందిన షేక్ సాంబయ్య(37), సంఘటనా స్థలంలోనేమృతిచెందారు. గుంటూరుకు చెందిన షేక్ రాజు (42), తీవ్రగాయాలు అవ్వగా, 108 సిబ్బంది, అద్దంకి వైద్యశాలకు తరలించారు. అయితే మెరుగైన వైద్య సేవల నిమిత్తం షేక్ రాజును ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. అయితే మృతులు కొటికలపూడి శ్రీను, షేక్ సాంబయ్య, ఇరువురుతోపాటు షేక్ రాజు, కొమ్మాలపాడులో జరిగిన ఉరుసు కార్యక్రమంలో పాల్గొన్ని, కొటికలపూడి శ్రీను స్కూటర్‌పై, షేక్ సాంబయ్య, షేక్ రాజులు మోటర్ బైక్‌పై అద్దంకి వస్తున్న సమయంలో చక్రాయపాలెం మలుపు వద్ద, వెనుక వైపు నుంచి వేగంగా వస్తున్న కారు ఈ రెండు వాహనాలను ఏక కాలంలో ఢీకొట్టింది. ఈ సంఘటనలో కొటికలపూడి శ్రీను, షేక్ సాంబయ్యలు అక్కడిక్కడే మృతిచెందారు. గాయపడిన రాజుని అద్దంకి వైద్యశాలకు తరలించగా, మెరుగైన వైద్య కొరకు ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

## ఆర్టీసిలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, కండక్టర్ల పోస్టుల భర్తీ : మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీలో ఖాళీగా ఉన్న డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్స్ తదితర పోస్టులకు ప్రాధాన్యతతో భర్తీ చేసేందుకు తగిన చర్యలు తీసుకోవాలని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. వివిధ విభాగాల్లో 7,673 పోస్టుల భర్తీకి ప్రభుత్వ అనుమతి కోరాలని మంత్రి, సూచించారు.రాగానే ప్రాధాన్యత క్రమంలో పోస్టులు భర్తీ చేయాలని ఆదేశించారు. 2020లో ఆర్టీసీలో 51,488 మంది ఉద్యోగులు ఉండగా ప్రస్తుతం 44,131 మంది మాత్రమే ఉన్నారని తెలిపారు. రానున్న 3 ఏళ్లలో పెద్ద సంఖ్యలో ఉద్యోగులు రిటైర్ కానున్నందున ఉద్యోగుల భర్తీపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. అదేవిధంగా ఉద్యోగుల ప్రమోషన్లు, బకాయిల చెల్లింపులు, నియామకాలు, వైద్య కారణాలతో రిటైర్ అయిన ఉద్యోగుల సమస్యలు, కారుణ్య నియామకాలు, సీనియారిటీ జాబితాలు, కోర్టు కేసుల స్థితిగతులపై అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. వైద్య కారణాలతో రిటైర్ అయిన ఉద్యోగుల గురించి చర్చించారు. 2020 జనవరి నుంచి వైద్య కారణాలతో 682 మంది ఉద్యోగులు రిటైర్ అయినట్లు అధికారులు తెలిపారు. వీరిలో 36 మందికి ప్రత్యామ్నాయ ఉద్యోగం, మిగిలిన 646 మంది ఉద్యోగులకు ఆర్థిక పరిహారం చెల్లించాల్సి ఉందని వివరించారు. ఒక్కో ఉద్యోగికి రూ.15 లక్షలు : ఇలా ఒక్కో ఉద్యోగికి రూ.15 లక్షల చొప్పున మొత్తం ఆర్థిక భారం 96.90 కోట్ల రూపాయులు చెల్లించాల్సి ఉందని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ అధికారులకు వివరించారు. అలాగే సీనియారిటీ జాబితాల ఆధారంగా డీపీసీలు నిర్వహించేందుకు ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపినట్లు తెలిపారు. కోర్టు కేసుల స్థితిగతులపై అధికారుల నుంచి నివేదిక తీసుకున్న మంత్రి రాంప్రసాద్ రెడ్డి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి త్వరిత చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# తిరుమల సమాచారం

## పాలకడలిలా సప్తగిరులు



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** ఓ వైపు ఉదయం ఆరేడుగంటలకే మండుతున్న ఎండలు మరోవైపు సముద్రపు అలల్లా పాలకడలిలాల శేషాచలంకొండలు వేకువజామున అద్భుతంగా కనువిందుచేస్తున్నాయి. తిరుపతి నుండి తిరుమలకు వచ్చే రెండోఘాట్‌లో లింకురోడ్డుదాటిన తరువాత సప్తగిరుల శేషాచలం కొండలు భక్తులను ఆకట్టుకుంటు న్నాయి. ఇదీ నిజంగా ఎక్కడో సముద్రంలా ప్రవహిస్తున్నట్లు, నదీ కాలువల్లో నీరు ఉరకలేస్తున్నట్లుగా మారిపోయాయి.

## అందరికీ శుభాలు కలగాలి

**- బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు**



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఆనందంగా ఉందని, స్వామివారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పివి సింధు వేడుకున్నారు. తిరుమలలో భక్తులకు దర్శన ఏర్పాట్లు బావున్నాయని, భక్తులు సంతోషంగా స్వామివారిని దర్శనం చేసుకో గలుగుతున్నారన్నారు. గురువారం ఉదయం ఆమె కుటుంబసభ్యులతో కలసి విఐపి బ్రేక్ దర్శనంలో ఆలయంలోనికి చేరుకున్నారు. కుటుంబంతో కలసి శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. టిటిడి ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంతో మనసు ఉల్లాసం

- కలియుగదేవుని ఆశీస్సులతో అంతా శుభాలు కలగాలి :చాగంటి కోటేశ్వరరావు



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి కలియుగ ప్రత్యక్షదైవమని, ఆయనను గోవిందా అని భక్తులు మనస్ఫూర్తిగా పిలిస్తే వారి కష్టాలు తీరిపోతాయని ఆధ్యాత్మిక ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు తెలిపారు.అంతటి మహిమాన్వితమైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగుప్రజలందరికీ శుభాలు కలగాలని ఆకాంక్షించారు. కుటుంబంతో కలసి గురువారం ఉదయం చాగంటి శ్రీవారిని దర్శించు కున్నారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.ఆయనతోబాటు మాజీ టిటిడి ఇఒ,మాజీ సిఎస్ ఎల్వీసుబ్రమణ్యం, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డి ఉన్నారు.

## జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవి పార్టీకి కొత్త ఉత్సాహాన్ని నింపింది

**- లోకేష్ నాయకత్వంలో పార్టీ బలోపేతం కానుంది: టిడిపి నేతలు**



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాత వార్తప్రతి నిధి:** తెలుగు దేశం పార్టీ యువ నేత, రాష్ట్ర ఐటీ, హెచ్‌ఆర్‌డీ శాఖ మంత్రి నారా లోకేష్ నాయక త్వంలో టిడిపి దేశవ్యాప్తంగా మరింత బలోపేతంకానుందని పలువురు పార్టీ నేతలు పేర్కొ న్నారు. జాతీయ వర్కింగ్ ప్రెసి డెంట్‌గా ఆయన నియామకం పార్టీకి కొత్త ఉత్సాహాన్ని తీసుకువస్తుందని, పార్టీ బలోపేతానికి ఇది కీలక మలుపు అవుతుందని నేతలు అన్నారు. యువతకు ఆదర్శంగా నిలుస్తున్న లోకేష్ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షి ంచారు.టిడిపి జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమితులైన సందర్భంగా తిరుపతిలో తెలుగుయువత రాష్ట్ర అధికార ప్రతినిధి రజినీకాంత్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు ఘనంగా సంబరాలు జరుపుకుని అలిపిరి పాదాల మండపం వద్ద మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం,టిడిపి రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, రాష్ట్ర బిసిసెల్ ప్రధాన కార్యదర్శి బీజీ కృష్ణ యాదవ్, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్ పెరుమాళ్ మధు, సింగిల్ విండో చైర్మన్ నరేష్ రెడ్డి, వేశాలమ్మ దేవస్థానం చైర్మన్ జగదీష్ రెడ్డి,ఆనంద్ గౌడ్, విశ్వనాథం తదితరులు పాల్గొని పాదాల మండపం వద్ద గోవింద నామాలతో 101కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఎల్లప్పుడూ పార్టీ కార్యకర్తలకు అండగా నిలిచే నాయకుడని కొనియాడారు. కష్టకాలంలోనూ, విజయకాలంలోనూ కార్యకర్తలతో కలిసిమెలిసి నడిచే నాయకత్వ లక్షణాలు లోకేష్‌లో ఉన్నాయని తెలిపారు. భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు ఎదిగి రాష్ట్ర ప్రజలకు సేవ చేయాలని ఆకాంక్షి ంచారు.

## 25 నుండి తిరుమలలో పద్మావతి పరిణయోత్సవాలు

- ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలు రద్దు

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** వైకుంఠం వదలి భూలోకం చేరిన సమయంలో శ్రీవేంకటేశ్వరస్వామి నారాయ;ణపురంలో పద్మావతిదేవిని వివాహమాడిన ఘట్టాన్ని తలపించేలా తిరుమలలో ఈనెల 25నుండి 27వరకు మూడురోజులు పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు జరిపించనున్నారు. టిటిడి అధికారులు, ఆలయ అర్చకులు ఈ ఘట్టాన్ని ప్రతి ఏడాది శుభముహూర్తంలో జరిపిస్తుండటం పరిపాటి. పద్మావతి శ్రీనివాసుల పరిణయోత్సవాలు ఈనెల 25 నుండి 27 తేదీ వరకు మూడురోజులు తిరుమలలో జరుగనున్నాయి. నారాయణగిరి ఉద్యానవనాల్లోని పరిణయోత్సవ మండపంలో ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మూడు రోజుల పాటు జరుగనున్న ఈ వేడుకల్లో తొలిరోజు మలయప్పస్వామి గజవాహనం, రెండవరోజు అశ్వవాహనం, చివరిరోజు గరుడవాహనంపై నారాయణ ఉద్యానవనానికి వేంచేపు చేస్తారు. మరోపక్క ఉభయ నాంచారులు ప్రత్యేక పల్లకీలలో పరిణయోత్సవ మండపానికి చేరుతారు. ఆ తరువాత కల్యాణమహోత్సవం ఘట్టం కన్నుల పండుగగా నిర్వహిస్తారు. -ఆర్జిత సేవలు రద్దు : పద్మావతి పరిణయోత్సవాలు సందర్భంగా 25 నుండి 27వ తేదీ వరకు ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవలను టిటిడి రద్దు చేసింది. పురాణాల ప్రకారం సుమారు ఐదు వేల ఏళ్ల కిందట, కలియుగం తొలినాళ్లలో సాక్షాత్తు వైకుంఠం నుండి శ్రీమహావిష్ణువు శ్రీ వేంకటేశ్వరునిగా భూలోకానికి తరలివచ్చారు. ఆ సమయంలో నారాయణవనాన్ని పరిపాలిస్తున్న ఆకాశరాజు తన కుమార్తె అయిన పద్మావతిని శ్రీవేంకటేశ్వరునికిచ్చి వివాహం చేశారు.

## నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై ప్రధాని భరోసా హర్షణీయం : మంత్రి నారా లోకేష్

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియలో ఏ రాష్ట్రానికీ అన్యాయం జరగదని, పార్లమెంట్‌లో రాష్ట్రాల సీట్ల నిష్పత్తిలో మార్పు ఉండబోదని ప్రధానమంత్రి మోదీ ఇచ్చిన హామీపై ఏపీ మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని చేసిన ఈ ప్రకటన దక్షి ణాది రాష్ట్రాలకు పెద్ద ఊరటనిస్తుందని ఆయన పేర్కొన్నారు.

EASTERN POWER DISTRIBUTION COMPANY OF A.P. LTD
Corporate Office, P&T Colony, Seethammadhara, Visakhapatnam-530 013.
e-Tender Notice
The APEPDCL invites e-Tender for the work of Construction of Guest House building of APEPDCL at 33/11 KV SS, Lalacheruvu premises in Rajamahendravaram Division of East Godavari Circle from the registered GST Contractors. Further details can be viewed in www.apeprocurement.gov.in
Contact Phone No: 0891-2582107.
Advt-12
Chief General Manager/OCS & Civil

వార్త

దుఃఖం అనేది శిక్ష కాదు. సంతోషం అనేది వరమూ కాదు. రెండూ ఫలితాలే. అవి మన చర్యలననుసరించి మాత్రమే.

న- ఆర్. జి. ఇంగర్సాల్

# పతనం అంచున ప్రజారోగ్యం!

జనారోగ్యమే జాతి మహాభాగ్యమనే లక్ష్యంతో దేశ ప్రజలను సంపూర్ణ ఆరోగ్యవంతులుగా చేసేందుకు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి లక్షలాది కోట్ల రూపాయలు ఖర్చు చేశారు, చేస్తూనే ఉన్నారు. అటు కేంద్ర ప్రభుత్వంకానీ, ఇటు ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు లెక్కలేనన్ని పథకాలు ప్రవేశపెట్టాయి. మన రాజ్యాంగ నిర్మాతలు ప్రజారోగ్యం విషయంలో పాలకులు తీసుకోవాల్సిన చర్యల గూర్చి రాజ్యాంగంలో పొందుపరిచారు. ఇన్నేళ్లు గడిచిపోయినా అందరికి కనీస ఆరోగ్య వసతులు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారనే చెప్పొచ్చు. ప్రజారోగ్యంపై దాడుల పరంపర కొనసాగుతూనే ఉంది. కొన్ని వ్యాధులను నియంత్రించడం డాక్టర్లకు కూడా సాధ్యం కావడం లేదు. కొత్త మందులు,చికిత్సలు, అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని సమకూర్చుకుంటున్నా అంతకు రెట్టింపు స్థాయిలో కొత్తకొత్త వ్యాధులు వస్తున్నాయి. కోట్లాది మంది రోగపీడితులు అవుతున్నారు. లక్షలాది మంది ప్రాణాలు వదులుతున్నారు. నిన్న మొన్నటి వరకు ప్రపంచాన్ని చిగురుటాకుల వణికించిన కరోనా రక్కసి శాంతించినా అప్పుడు దాని నుంచి బయటపడిన మందుల ప్రభావం నుండి ఇప్పటికీ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది కోలుకోలేకపోతున్నారు. కిడ్నీ సమస్యలు పెరిగిపోయాయి. గుండెజబ్బులు విస్తరిస్తున్నాయి. డయాలసిస్ కేంద్రాలు ఎన్నిపెట్టినా సరిపోవడంలేదు. వయసుతో సంబంధం లేకుండా నెలల పిల్లల నుండి డెబ్బైయేళ్ల వృద్ధుల వరకు గుండెజబ్బులు ఎప్పుడు, ఏ రూపంలో వచ్చి బలితీసుకుంటాయో తెలియడం లేదు. ఇక దోమల ద్వారా వస్తున్న వ్యాధులు అన్నీఇన్నీ కావు.వీటిని నియంత్రించేందుకు అధికార వర్గాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలించక దోమలు వీరవిహారం చేస్తున్నాయి. దోమను జయించడం సాధ్యం కాదేమోననిపిస్తున్నది. వీటితోపాటు గతంలో వచ్చిన స్వైన్‌ఫ్లూ, ఎబోలా, డెంగ్యూ, చికెన్ గున్యా, ఒక్కటేమిటి రకరకాల విషజ్వరాలు విస్తరిస్తూనే ఉన్నాయి. అయితే ఈ వ్యాధుల నుండి రోగనిరోధక శక్తి ఉన్నవారు బయటపడే అవకాశాలున్నట్లు వైద్యనిపుణులు చెబుతున్నారు. ఒక్కో అల్లోపతి డాక్టర్లే కాదు ఆయుర్వేదం, హోమియో, తదితర అన్ని విభాగాల డాక్టర్లు శరీరంలో ఇమ్యూనిటీని పెంచుకోవాల్సిందిగా సూచనలు ఇస్తున్నారు. ఇప్పుడు ఈవిషయం కొత్తగా చెప్పడంలేదు. ఏనాటి నుంచో చెప్తున్నారు. ఈ వాస్తవాలు ప్రజలకు కూడా తెలియంది కాదు. అయినా రోగనిరోధక శక్తి ఎందుకు పెంచుకోలేకపోతున్నారు. కారణాలు ఏమిటి? కారకులు ఎవరు? పరిశీలించాల్సిన సమమయం ఇది. రోగనిరోధక శక్తి ఒక్కరోజులో పెరిగేది కాదు. బాల్యం నుంచి సమతుల్యమైన మంచి పోషకవిలువలు కలిగిన పౌష్టికాహారాన్ని అందించాలి. ఏ మేరకు అందిస్తున్నామో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. పౌష్టికాహార లోపంతో అల్లాడిపోతున్న వారిలో అధిక శాతం నిరుపేదలే. పౌష్టికాహారం సంగతి దేవుడెరుగు. అర్థాకలితో అలమటించే వారు భారత్‌లో కోట్లసంఖ్యలో ఉన్నారు. వారిలో రోగ నిరోధక శక్తి ఎలా వస్తుంది? ఎక్కడి నుంచి వస్తుంది? మరొకపక్క కాలుష్యం ప్రజారోగ్యాన్ని కాటు వేస్తున్నది. వాయు, నీటి కాలుష్యాలు అదుపు తప్పిపోతున్నాయని చెప్పొచ్చు. దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం అదుపు తప్పడంతో పాఠశాలలకు సెలవులు ఇవ్వడమే కాదు ఉద్యోగులను వర్క్‌ఫ్రం హోమ్‌కుపరిమితం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఢిల్లీలోచలికాలంలోవాయు కాలుష్యం చుట్టుముట్టడం ఆ పౌరులను ఉక్కిరి బిక్కిరి చేయడం ప్రతియేడాది జరుగుతున్నదే. ఢిల్లీ ఒక్కటేకాదు భారతదేశంలోని అనేక నగరాలు, పట్టణాలువాయుకాలుష్యంతో అతలాకుతలం అవుతున్నాయి. దీన్ని తగ్గించేందుకు పాలకులు చేస్తున్న ప్రయత్నాలు సఫలీకృతం కావడం లేదు. మరొకపక్క వాహన కాలుష్యం దీనికి తోడవుతున్నది. కాలం చెల్లిన కోట్లాది వాహనాలు నిర్ణీత స్థాయి కంటే మించి పొగను వెదజల్లుతూ రోడ్లమీద తిరుగుతున్నాయి. అన్నిటి కంటే మించి కేన్సర్ వ్యాధి మానవాళిపై పంజా విసరడం ఆందోళన కలిగిస్తున్నది.దీని బారిన పడి లక్షలాది మంది ఆర్థికంగా చితికిపోతుంటే మరికొందరు సకాలంలో సరైన వైద్యం అందకప్రాణాలు పోగొట్టుకుంటున్నారు. యాభైయేళ్ల వయసు రాకముందే మహిళలు, పురుషులు, రకరకాల కేన్సర్ల బారినపడుతుండడానికి వారి జీవన శైలి, సంబంధిత అలవాట్లు ప్రధాన కారణమని వైద్యనిపుణులు విశ్లేషిస్తున్నారు. అలవాట్లను, జీవనశైలిని మార్చుకోవడం ద్వారా కేన్సర్ మహమ్మారి బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చునని నిపుణులు చెబుతున్నారు. మరొకపక్క పెరుగుతున్న ధూమపానం కూడా ఈ కేన్సర్‌ను పెంచేందుకు దోహదపడుతున్నది. పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండటం వల్ల నోరు, ఊపిరితిత్తులు, గొంతు,స్వరపేటిక కేన్సర్ల నుండి తప్పించుకోవచ్చని డాక్టర్లు సూచిస్తున్నారు. అయితే దీనిపై ప్రజలకు అవగాహన పెంచేందుకు చేస్తున్నప్రయత్నాలు క్షేత్ర స్థాయిలో అందాల్సిన వారికి అందడంలేదు.మద్యపానం కూడా ప్రజారోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తున్న విషయం పెద్దలకు తెలియందికాదు. ప్రజా సంక్షేమమే లక్ష్యమని చెప్పుకునే పాలక పెద్దలు ప్రజారోగ్యాన్ని పణంగా పెట్టి ధనార్జన చేయడం ఎంతవరకు సమంజసమో ఆలోచించాలి. ఇవే కాదు కల్తీ కూడా ప్రజారోగ్యంపై ప్రభావం చూపుతున్నది. ఇలాంటివి ఎన్నో ప్రజారోగ్యాన్ని పతనం అంచుకు తీసుకుపోతున్నాయి. పాలకులు ఇప్పటికైనా మనసు పెట్టాలి. ఈ జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన పెంచి ప్రజా అవసరాలకు అనుగుణంగా ఆస్పత్రులు, సిబ్బందిని పెంచి కనీస వైద్య సదుపాయాలు అందించాల్సిన అవసరం ఉంది.

జ్ఞానం వంశపారంపర్య హక్కు కాదు, ఎవరికి వారు కష్టపడి ఆర్జించుకోవాల్సిందే.



హెన్రీఫోర్డ్

గొప్ప త్యాగాలు చేయగలిగినప్పుడే గొప్ప పనులు చేయగలం.



స్వామి వివేకానంద

# బిసి మహిళలకూ రిజర్వేషన్లు అవసరం

**చట్టసభలలో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్ కల్పించే బిల్లు ఆమోదానికి అన్ని వర్గాలు సహకరించాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. కాగా ఈ బిల్లుల ఆమోదం కోసం ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలతో ప్రభుత్వ వర్గాలు చర్చలు జరిపాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల ఎన్నికలు ముగిసేంతవరకు ఈ బిల్లుపై చర్చ వద్దని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకెళ్లడం గమనర్హం. దీన్ని బట్టి చూస్తే ప్రతిపక్షాల్లో చీలిక తీసుకొచ్చి అయినా సరే ఈ బిల్లులను ఆమోదింప చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.**



డా. కావలి చెన్నయ్య

భారత రాజ్యాంగం ప్రకారం రిజర్వేషన్లు అనేవి సామాజిక సమానత్వాన్ని ప్రోత్సహించడానికి, సమాజానికి దూరంగా, చారిత్రాత్మకంగా అణచివేయబడ్డ వెనుకబడిన వెట్టి వర్గాల ప్రజలకు విద్యా, ఉపాధి,రాజకీయ ప్రాతినిధ్యాలలో సమానత్వం సాధించడానికి రాజ్యాంగపరంగా చేసిన ఏర్పాటు. అలాంటి రిజర్వేషన్లు సామాజికంగా నెట్టివేయబడ్డ అన్ని వర్గాల వారికి కల్పిస్తేనే సమ సమాజ ప్రజాస్వామ్యం ఏర్పడుతుంది. పెరియార్ రామస్వామి నాయకర్ అభిప్రాయం ప్రకారం 'విద్యా,ప్రజాసేవలో ఒక వైదికోత్తమ కులం అసమాన ఆధిపత్యం కారణంగా న్యాయమైన ప్రాతినిధ్యం ఉండేలా రిజర్వేషన్ అవసరమైందని' అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్యంలో అన్నివర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం లేనంతవరకు అది ప్రజాస్వామ్యం అనబడదు. ఎందుకంటే తరతరాల సామాజిక అంతరాల సమాజంలో కొందరు మాత్రమే పాలకులవుతున్నారు. సామాజికంగా వెనకకు నెట్టివేయబడ్డ అధిక భాగం ప్రజలు పాలితులుగానే కాలమెల్ల దీస్తున్నారు. మనదేశంలో ఇప్పుడున్న శాసన, పార్లమెంటు నియోజకవర్గాలు 1971 లెక్కల ప్రకారం ఏర్పరిచినవి. ఈ నేపథ్యంలో ఆర్టికల్ 81, ఆర్టికల్ 55 లకు కీలక సవరణలు చేపడుతూ 2011 జనాభా లెక్కల ప్రామాణికత ఆధారంగా అసెంబ్లీ, పార్లమెంటు నియోజక వర్గాల పునర్విభజన చేపట్టి ప్రస్తుతం ఉన్న 543 ఎంపీ స్థానాలను 850కి పెంచి, రాష్ట్రాలకు 815, కేంద్ర పాలిత ప్రాంతాలకు 35 ఎంపీ స్థానాలు కేటాయించి, అసెంబ్లీ స్థానాలు 4123 నుండి 6,185 వరకు పెంచి, అన్ని అసెంబ్లీ, పార్లమెంటు స్థానాల నుండి 33 నియోజక వర్గాలను మహిళలకు కేటాయించనున్నారు. మహిళలకు 33 శాతం రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం సంతోషమే కానీ ఈ 33శాతంలో బిసి మహిళలకు కూడా కనీసం 50శాతం రిజర్వేషన్ కల్పించకపోతే 47 కోట్లకు పైగా ఉన్న మహిళా, 50 కోట్లకు పైగా ఉన్న పురుష ఓటర్ల అంటే మొత్తం 97 కోట్లకు పైగా ఉన్న ఓటర్లలో 50 కోట్లకు పైగా ఉన్న బీసీ ఓటర్ల హక్కుకు విలువ లేకుండా రాజకీయంగా మరీ వెనుకకు నెట్టబడతారు. కానీ నేడు బీసీ ఓట్లను వాడుకొని సీట్లు గెలుచుకునే రాజకీయ పార్టీలు, నాయకులు మహిళ రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉండాలని ఒక్కరు పల్లెత్తు మాట కూడా మాట్లాడకపోవడం శోచనీయం. బీసీ ప్రజాప్రతినిధులందరూ బీసీ మహిళలకు తప్పకుండా రిజర్వేషన్ కావాలని చట్టసభలలో గొంతెత్తాల్సిందే. లేని యెడల బిసి వ్యతిరేక పార్టీలు, నాయకులు బీసీలను పాలక పక్షంలోకి ఎప్పటికీ ముందుకు రానివ్వవు.నాటి సమాజ్వాది పార్టీ నాయకుడు ములాయం సింగ్ యాదవ్, రాష్ట్రీయ జనతా దళ్ నాయకుడు లాలూ ప్రసాద్ యాదవ్, జనతాదళ్ నాయకుడు శరత్ యాదవ్‌లు మాత్రమే బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు ఉండాల్సిందేనని గట్టిగా వాదించారు. వీరిలో ఒక లాలూ ప్రసాద్ యాదవ్ మాత్రమే జీవించి ఉన్నారు. వయసు రీత్యా ఆయన ఏమి చేయలేని స్థితిలో ఉన్నారు. బీసీ వర్గాల నుంచి జనాభా దామాషా ప్రకారం ప్రాతినిధ్యమే లేకపోతే వారి గొంతు పార్లమెంటు, అసెంబ్లీలో వినిపించకపోతే ప్రజాస్వామ్యానికి విలువ ఎక్కడిది? నాటి నుండి నేటి వరకు మిగతా రాజకీయ పార్టీలు బిసి మహిళలకు కూడా చట్టసభలలో రిజర్వేషన్లు కావాలని మాట వరుసకైనా మాట్లాడడం లేదు అంటే బీసీలపట్ల వారికున్న చిత్తశుద్ధి ఏపాటిదో ఇట్టే అర్థమవుతున్నది. 2019లో 103వ రాజ్యాంగ సవరణ ద్వారా విద్య, ప్రభుత్వ ఉద్యోగాలలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా పరిధిలోకి రాని ఆర్థికంగా



బలహీనమైన అగ్రవర్ణాల వారికి ఆర్టికల్ 15,16లను సవరించి 8లక్షలవరకు వార్షికాదాయం, 5ఎకరాల వరకు వ్యవసాయ భూమి, గుర్తించిన మునిసిపాలిటీలో 100/200 గజాల వరకు ఇల్లు ఉన్నటువంటి వారికి ఈడబ్ల్యూఎస్ కోటా కింద 10 శాతం రిజర్వేషన్లు కల్పించింది.2022లో సుప్రీం 5గురు న్యాయమూర్తుల ధర్మాసనం 3:2 తీర్పుతో 103వ సవరణ ద్వారా ఈడబ్ల్యూఎస్‌కు 10శాతం రిజర్వేషన్ సబబే అంటూ రిజర్వేషన్లకు ఆర్థిక కారణాలు ప్రాతిపదిక కాగలవని చెప్పి ఇది రాజ్యాంగ మౌలిక నిర్మాణాన్ని ఉల్లంఘించదని తీర్పిచింది. రిజర్వేషన్లు 50శాతం దాటకూడదన్న ఇదే కోర్టు నిబంధన ఎటుపోయిందో అర్థం కావడం లేదు. ఈడబ్ల్యూస్ వర్తించడానికి గల ప్రమాణాలు ఏవైతే ఉన్నాయో అవి ఉన్న బీసీలకు క్రిమిలేయర్ వర్తించడం చూస్తే చట్టం ఉన్నవాడి చుట్టం అయిందని అర్థమవుతుంది. ఇక్కడ గమనించాల్సిన విషయం మొత్తంగా 10 శాతం జనాభా ఉన్న అగ్రవర్ణాలలో నుండి పేదలకు అంటే వారు 10 శాతం కంటే తక్కువ ఉంటారు అయినప్పటికీ వారికి 10 శాతం రిజర్వేషన్. నాటి మొరార్జీ దేశాయి ప్రభుత్వం 1979లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడ్డ బీసీలకు రిజర్వేషన్లు కల్పించేందుకు బిందేశ్వర్ ప్రసాద్ మండల్ ఆధ్వర్యంలో ఏర్పాటైన కమిషన్ బీసీలు 52శాతం పైనే అని తేల్చి 27 శాతం రిజర్వేషన్ కల్పించాలని సిఫారసు చేసింది. ఆ సిఫారసుల మేరకు 1990లో నాటి ప్రధాని విశ్వనాథ ప్రతాప్ సింగ్ 27శాతం రిజర్వేషన్లను అమలు చేయ నిర్ణయించినప్పుడు దేశవ్యాప్తంగా నిరసన చేశారు. అగ్రవర్ణాల వారు, బీసీ వ్యతిరేక నేటి బిజెపి పార్టీ నాటి సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు కూడా ఉపసంహరించుకుని ప్రభుత్వాన్ని పడగొట్టింది. మండల కమిషన్ అమలుకు వ్యతిరేకంగా ఆనాడు దేశవ్యాప్త ఆందోళన చేసిన వర్గాలు లేవనెత్తిన అంశం 'ఉన్నత విద్యా, ప్రభుత్వ సేవా రంగాలలో రిజర్వేషన్లు ప్రతిభా సామర్థ్యానికి భంగం కలిగిస్తాయని, కుల ఆధారితమైన రిజర్వేషన్లు కులాన్ని ప్రోత్సహించేవిగా, సమాజంలో విభజనకు దారి తీసేవిగా మారాయని, కొన్ని సార్లు ఎక్కువ యోగ్యత ఉన్నప్పటికీ తక్కువ యోగ్యత ఉన్నటువంటి వారికే ఎంపికకు దారితీసి, సామర్థ్యం నాణ్యతను దెబ్బతీయవచ్చు' అని అన్నవారు దేశ భవిష్యత్తును నిర్ణయించి చట్టాలు చేసే చట్టసభలలో ఆ వర్గాలకు మహిళల పేరిట వారికి లభిస్తున్న రిజర్వేషన్లు మాకు వద్దు అని ఎందుకు అనడం లేదు. చట్టసభలలో మహిళ రిజర్వేషన్ల పేరిట అదే అగ్రవర్ణాలవారి భార్యలను లేదా సోదరీమణులను చట్టసభలకు పంపి ఎప్పటిలాగే వారి ఆధిపత్యాన్ని పరిపుష్టం చేసుకుని దేశాన్ని ఏలుతుంటారు అనడంలో సందేహం లేదు. నిజంగా వీరికి చిత్తశుద్ధి గనుక ఉంటే మహిళా రిజర్వేషన్లలో బీసీ మహిళలకు కూడా రిజర్వేషన్లు కల్పించాల్సిందే. ఎందుకంటే ఈ దేశ జనాభాలో సగానికి పైగా బీసీలున్నారు ఆ బీసీలలో సగానికంటే ఎక్కువ మహిళలే. దేశంలో సగభాగం బీసీ జనాభాకు దామాషా ప్రకారం ప్రాతినిధ్యం లేని చట్టసభలు సమన్యాయాన్ని పాటించినట్లు ఎట్లయితవి. చట్టసభలలో మహిళలకు మూడవ వంతు రిజర్వేషన్ కల్పించే బిల్లు ఆమోదానికి అన్ని వర్గాలు సహకరించాల్సిందిగా ప్రధాని నరేంద్ర మోడీ పిలుపునిచ్చారు. కాగా ఈ బిల్లుల ఆమోదం కోసం ఇప్పటికే అన్ని రాజకీయ పార్టీలతో ప్రభుత్వ వర్గాలు చర్చలు జరిపాయి. పుదుచ్చేరితోపాటు నాలుగు రాష్ట్రాల ఎన్నికలు ముగిసేంతవరకు ఈ బిల్లుపై చర్చ వద్దని కాంగ్రెస్ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా ముందుకెళ్లడం గమనర్హం.దీన్ని బట్టి చూస్తే ప్రతిపక్షాల్లో చీలిక తీసుకొచ్చి అయినా సరే ఈ బిల్లులను ఆమోదింప చేసుకోవాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.డీలిమిటేషన్ బిల్లులో భాగంగా 2021జనాభా లెక్కల ప్రకారంనియోజకవర్గాల సరిహద్దులను పునర్విభజించే కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు డీలిమిటేషన్ కమిషన్ ఏర్పాటు చేస్తారు. ప్రతిపాదిత మార్పుల ప్రకారం సభ సీట్లు 543 నుంచి 816/850కు పెరుగుతాయి. దాంట్లో మూడోవంతు సీట్లు 273+ మహిళలకు రిజర్వు అవుతాయి. మొత్తంగా ఎస్సీ,ఎస్టీ,సీట్లుకూడా పెరుగుతాయి. ఈ బిల్లులు 2029 మార్చి 31నుంచి అమలులోకి వస్తాయని,ఆ ఏడాది జరిగే లోక్‌సభ అసెంబ్లీ ఎన్నికల నుంచి సీట్ల పెంపు, మహిళా రిజర్వేషన్ వర్తిస్తుం దని అధికార వర్గాలు తెలిపాయి.మహిళా సంవాద్ పేరుతోబిజెపి కూడా పెద్దఎత్తున మహిళా సదస్సులు జరపాలని నిర్ణయించింది. ఇప్పటికైనా అన్ని రాజకీయపార్టీలు బీసీ మహిళలకు కూడా చట్టసభలలో రిజర్వేషన్లు కావాలని పట్టుబట్టాలి.

# సాంకేతికతతోనే బంగారు భవిష్యత్తు!

డి. అశోక్

సాంకేతిక విప్లవాలు మానవ చరిత్రను పదేపదే కొత్త దిశల్లోకి నడిపించిన సందర్భాలు ఎన్నోఉన్నాయి. ఆవిరి యంత్రం పరిశ్రమల యుగానికి శ్రీకారం చుట్టింది. విద్యుత్ ప్రపంచాన్ని వేగవంతం చేసింది. కంప్యూటర్లు ఇంటర్నెట్ సమాచారాన్ని ప్రజాస్వామ్యవంతం చేశాయి. ఇప్పుడు అదే స్థాయిలో, బహుశా అంతకంటే వేగంగా ప్రభావం చూపిస్తున్న శక్తి కృత్రిమ మేధస్సు(ఏఐ). ఈ నేపథ్యంలో పరీక్షలు ముగించి ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు,వారి భవిష్యత్తుపై ఆందోళన చెందుతున్న తల్లిదండ్రులు ఒక కీలకమైన ప్రశ్నను ఎదుర్కొంటున్నారు. ఏ కోర్సు చదివితే భవిష్యత్తు భద్రంగాఉంటుంది? గతంలో ఒకకాలంలో ఇంజినీరింగ్ అంటే ఉద్యోగం, తర్వాత కంప్యూటర్ సైన్స్ అంటే భవిష్యత్తు, ఆ తర్వాతఎంబీఏ అంటే ఎదుగుదల అనే అభిప్రాయాలు బలంగా ఉండేవి. కానీ నేటి పరిస్థితి పూర్తిగా మారిపోయింది. డిజిటల్ ప్రపంచం వేగంగా మారుతున్న ఈ కాలంలో ఒకే కోర్సు జీవితాంతం భద్రతను కల్పించలేని పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే ఉద్యోగాల స్వభావమే మారుతోంది. ఈ మార్పుకు భయపడాల్సిన అవసరం లేదు. అర్థం చేసుకుని ఉపయోగించుకోవాల్సిన అవసరం ఉంది. ఏఐ రాకతో ఉద్యోగాలు పూర్తిగా అంతరించిపోతాయనే భయం సమాజంలో విస్తృతంగా కనిపిస్తోంది. కానీ చరిత్ర చెబుతున్నది ఒకటే ప్రతి సాంకేతిక విప్లవం కొన్ని పాత ఉద్యోగాలను తగ్గించినా, అంతకంటే ఎక్కువ కొత్త అవకాశాలను సృష్టించింది. ఇదే పరిస్థితి ఇప్పుడు కూడా కనిపిస్తోంది. రొటీన్ పనులు తగ్గినా, విశ్లేషణ, సృజనాత్మకత, నిర్ణయ సామర్థ్యం అవసరమైన కొత్త రంగాలు విస్తృతంగా పెరుగుతున్నాయి.ఈ కొత్త ప్రపంచంలో డేటా కీలకమైన వనరుగా మారింది. డేటాను సేకరించి, శుభ్రపరచి, ఉపయోగపడేలా మార్చే డేటా ఇంజినీర్లు భవిష్యత్తులో అత్యంత అవసరమైన నిపుణులుగా నిలుస్తున్నారు. అదే డేటాలో దాగి ఉన్న నమూనాలను గుర్తించి భవిష్యత్తు అంచనాలు చేసే డేటా సైంటిస్టులు సంస్థల నిర్ణయాలకు దిశానిర్దేశం చేస్తున్నారు. ఈ విశ్లేషణలను నిజ జీవితంలో పనిచేసే సిస్టమ్లుగా రూపొందించే మెషిన్ లెర్నింగ్ ఇంజినీర్లు కూడా కీలకపాత్ర పోషిస్తున్నారు. అంతేకాకుండా, పెద్దస్థాయి సాంకేతిక వ్యవస్థలను ముందుచూపుతో రూపకల్పన చేసే ఏఐఆర్కిటెక్ట్‌లు, వినియోగదారుల అవసరాలను అర్థం చేసుకుని టెక్నాలజీని ఉపయోగకరమైన ఉత్పత్తులుగా మార్చే ప్రొడక్ట్ మేనేజర్లు, సాంకేతిక బృందం, వ్యాపార బృందం మధ్య వారధిగా పనిచేసే ఏఐ ట్రాన్స్‌లేటర్లు వంటి కొత్త వృత్తులు వేగంగా ఎదుగుతున్నాయి. ఇవి కేవలం కంప్యూటర్ సైన్స్ చదివిన వారికి మాత్రమే కాకుండా భాషా శాస్త్రం, మేనేజ్‌మెంట్, సైకాలజీ వంటి రంగాల వారికి కూడా అవకాశాలను తెరుస్తున్నాయి. ఇటీవల జనరేటివ్ ఏఐ వ్యవస్థలు విస్తృతంగా వినియోగంలోకి రావడంతో ప్రాంప్ట్ ఇంజినీరింగ్ వంటి కొత్త నైపుణ్యాలు వెలుగులోకి వచ్చాయి. సరైన ప్రశ్న అడగడం కూడా ఒక శాస్త్రంగా మారింది. ఇదే సమయంలో ఏఐ తీసుకునే నిర్ణయాలు సమాజానికి హానికరం కాకుండా ఉండేలా పర్యవేక్షించే ఎథిక్స్ నిపుణులు, డేటా భద్రతను కాపాడే గవర్నెన్స్ స్పెషలిస్టులు కూడా అత్యంత అవసర మైన వృత్తులుగా మారుతున్నారు. ఈ పరిణామాలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి.భవిష్యత్తు కేవలం డిగ్రీ లపై ఆధారపడదు, నైపుణ్యాలపై ఆధారపడుతుంది. సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం, విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, నిరంతర అభ్యాసం వంటి లక్షణాలు రేపటి విజయానికి అసలు పునాదులు. పాతకాలపు బట్టీ విధానం ఇప్పుడు సరిపోదు. విద్యార్థులు కొత్త విషయాలను నేర్చుకోవడంలో ఆసక్తి చూపాలి, టెక్నాలజీ ఎలా పనిచేస్తుందో తెలుసుకోవాలి. ఇక్కడ తల్లిదండ్రుల పాత్ర కూడా అత్యంత కీలకం. పిల్లలను కేవలం మార్కుల కోసం పరుగులు పెట్టించే పోటీ యంత్రాలుగా కాకుండా, సమస్యలను పరిష్కరించే ఆలోచనాపరులుగా తీర్చిదిద్దాలి. సమాజానికి ఉపయోగపడే సృజనాత్మకతను ప్రోత్సహించాలి. ఎందుకంటే భవిష్యత్తులో నిలబడేది గుర్తుంచుకునే విద్య కాదు, ఆలోచించే విద్య. ప్రపంచంలోని ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఏఐ ఆధారిత నిర్ణయ వ్యవస్థల వైపు వేగంగా అడుగులు వేస్తున్నాయి. ఈ మార్పును ముందుగానే అర్థం చేసుకుని సిద్ధమయ్యే విద్యార్థులకే రేపటి ప్రపంచం చెందుతుంది. మార్పుకు భయపడేవారు వెనుకబడిపోతారు. మార్పును స్వీకరించేవారు ముందంజ వేస్తారు.అందుకే ఈ సాంకేతిక సంధికాలాన్ని ఒక ప్రమాదంగా కాకుండా ఒక అపూర్వ అవకాశంగా చూడాలి. నేటి విద్యార్థులు కేవలం ఉద్యోగాల కోసం కాకుండా జ్ఞానం కోసం నేర్చుకుంటే, రేపటి ప్రపంచాన్ని నిర్మించే నాయకులుగా ఎదగగలరు.

# శాంతియుత పరిష్కారమే ఉత్తమమైన మార్గం

దాడిశెట్టి శ్యామ్ కుమార్

ఇరాన్ సైనిక వ్యవస్థలతో పాటు అణు స్థావరాలను లక్ష్యంగా ఇజ్రాయిల్ అమెరికా సంయుక్తంగా ఇరాన్‌పై దాడులను ముమ్మరం చేస్తున్నాయి. దీనితో దేశాల మధ్య యుద్ధ వాతావరణం మరింత ఉద్రిక్తతలను కలుగచేస్తుంది. ప్రతి చర్యగా ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికాకు చెందిన ముఖ్యమైన స్థావరాలతోపాటు ఇజ్రాయిల్‌ను లక్ష్యంగా చేసు కొని సృష్టిస్తున్న యుద్ధ వాతావరణంతో దేశాల మధ్య ఘర్షణ మరింతగా పెరుగుతుంది. అయితే క్షేత్రస్థాయిలో సామాన్య జనాల కష్టాలు ఎక్కువగా ఉంటున్నాయి. ఎప్పు డు ఎటువైపు నుండి ఎలాంటి మారణాయుధాలు ముకు మ్మడిగా వచ్చి పడుతాయేమో అనే సందిగ్ధంలో యుద్ధాలు జరుగుతున్న ప్రాంతాల్లోని ప్రజలు ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని రాత్రిపగలు గడుపుతున్న పరిస్థితులు గోచరిస్తూనే ఉన్నాయి. యుద్ధంలో దేశాల్లోని వాణిజ్యపరమైన ముఖ్య సైనిక స్థావరాలను లక్ష్యంగాచేసుకొని సంధిస్తున్న అత్యాధు నిక డ్రోన్లు, క్షిపణులు లాంటి మారణాయుధాలు తరచుగా జనావాసాల మీదికి వస్తూ అభంశుభం తెలియని ఎంతో మందిని బలి తీసుకుంటున్నాయి. ఈ క్రమంలో దేశాల మధ్య ఉన్న విభేదాలు ఇరు దేశాల్లో ఉన్న సామాన్య జనా లకు శాపంగా మారుతున్నాయి. యుద్ధాలు ఆయా దేశాల్లో ఆర్థిక వ్యవస్థ భౌగోళిక వనరులపై ప్రభావితం చూపిస్తూనే ఉన్నాయి. ఆర్థిక,ప్రాణ నష్టంతో పాటు ఆయుధాల విస్ఫోటనంతో వెలువడే విషపూరిత రసాయనాలు గాలిలో కలిసి వాతావరణం కాలుష్యం లాంటి అనేక నష్టాలను చవిచూసే అవకాశం లేకపోలేదు. నేటి ఆధునిక మానవుడు ఇంకా యుద్ధ తంత్రంలో మునిగి తేలుతున్న తరుణంలో దేశాల మధ్య ఏమైనా విభేదాలు సమస్యలున్నా పరస్పరం చర్చల ద్వారా దేశాల మధ్య ఉండే అపోహలను ఉద్రిక్తతలను నివారించే దిశగా శాంతియుత మార్గం ద్వారా పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. యుద్ధాల వలనచాలా వరకు ప్రయోజనం ఉండక పోవచ్చు కానీ యుద్ధాల వలన ప్రజలలో లేనిపోని అపోహలు గందరగోళాన్ని సృష్టించే అవకాశం లేకపోలేదు.అగ్రరాజ్యంలోని ప్రజలు అయినా ఆర్థికంగా వెనుకబడిన దేశాల ప్రజలు అయినా ఎక్కువ శాతం



మాత్రం యుద్ధ కాంక్షను ఏ మాత్రం కావాలని కోరుకోరు. పైగా శాంతి కాముకులుగా జీవించాలని అనుకుంటారు. దేశాల మధ్య శత్రుత్వాన్ని పెంచుకొని భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు ఊహాత్మక భావనలకు యుద్ధమే పరిష్కారం అనుకుంటే నేటి ఆధునిక యుగంలో యుద్ధ కాంక్ష ఎంతవరకు సమంజసం అనే ప్రశ్నలు కూడా తలెత్తుకు మానవు కారణాలేవైనా అహింసా మార్గంలో సమస్యకు పరిష్కారం అన్వేషించి సరైన విధానంలో సమస్యను పరిష్కరించుకునే రీతి నేటి ఆధునిక మేధాశక్తికి అవసరం కావచ్చు. పశ్చిమాసియాలో జరుగుతున్న యుద్ధాల వలన దేశాల నడుమ వాణిజ్య వ్యాపార సంబంధాలు పూర్తిగా దెబ్బతినడమే కాకుండా అవసరాలకు ఉపయోగపడే పెట్రోలియం ముడిసరుకు రవాణా చేసే నౌకలు యుద్ధంలో లక్ష్యం కావడం ఆయుధాలు సృష్టించే విధ్వంసం దాటికి వనరులు దెబ్బతినడం విలువైన కట్టడాలు కళ్ళముందే కుప్పకూలిపోతుండడం మనుషులు ప్రాణాలు కోల్పోతూ ఉండడం యుద్ధం చేస్తున్నది ఎవరికోసం దేనికోసం వచ్చే ఫలితం ఏముంది అని చర్చించుకునే లోపే జరగబోయే నష్టం తీవ్రంగా ఉంటుంది. దేశాల మధ్య సమస్యలు ఉంటే వాటినిశాశ్వతంగా సవరించుకునే ప్రయత్నం చేస్తేతప్ప మరో కటిలేదేమో. యుద్ధాలు ప్రపంచంలోని మానవాళిపై తీవ్ర మైన ప్రభావం చూపెడుతూ ప్రపంచ ఆర్థిక స్థితిగతులనే మార్చివేసే విధంగా యుద్ధ వ్యూహాలు కొనసాగుతూ ఉండ డం విస్మయానికి గురి చేస్తున్నాయి. అత్యంత శక్తివంతమైన ఆయుధాలు యుద్ధాల్లో విధ్వంసాలకు ఉపయోగిస్తున్న తీరు మానవ జీవన విధానాలపై తీవ్రమైన ప్రతికూల ప్రభావాన్ని కలుగ చేస్తుండడం శోచనీయం. దేశాల మధ్య ఆధిపత్య యుద్ధాల వల్ల సామాజిక అభివృద్ధి ఆర్థికవ్యవస్థలు కోలుకోలేని నష్టాల నడుమ ముందుతరాల వరకు కూడా సరిచేసుకోలేని స్థితిలో దేశాలపరిస్థితి నలిగిపోతుండటం,హింసాత్మక ఆలోచనలతో ఉన్నటువంటి దేశాలు అంతగా సాధించేది ఏమీ లేకపోగా యుద్ధాల వలన ఆర్థిక సామాజిక అభివృద్ధికి వెనుకబడిపోతున్నాయి. కారణాలేవైనా పశ్చిమ ఆసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం మరింత ఉధృతంగా మారుతూ ఆందోళన కలిగించేదిగా చేస్తుంది.యుద్ధం తీవ్రత పెరగడంతో ఇరాన్ కూడా వెనుకకు తగ్గేది లేదంటూనే వ్యూహాప్రతి వ్యూహాలతో ముందుకు పోతుండటంతో దేశాల్లో తీవ్రమైన యుద్ధ వాతావరణం నెలకొంది.సాధ్యాసాధ్యాలు ఎలా ఉన్నా అహింసా, సమైక్యవాదం దేశాల నడుమ సుస్థిరత ప్రపంచంలో యుద్ధ నియంత్రణతోపాటు సకల సమస్యలకు

## ప్రజావాక్కు

### రాతపూర్వకంగా సమాధానం ఇవ్వాలి

ప్రకాశంజిల్లాలో చెవూరి దొంగస్వామి ఆక్రమించిన ప్రభుత్వ భూములను,తిరుపతి జిల్లాలో బియెన్‌కండ్రిక మండలంలో కల్కి అనే దొంగస్వామి అక్రమించిన అంజూర్ అటవీభూములనుస్వాధీనం చేసుకోవాలనికలెక్టర్లకు, సిసిఎల్ఎకు, ప్రిన్సిపల్ సెక్రటరీలకు,చివరికి ముఖ్యమంత్రికి ఎన్నో లేఖలు వ్రాయటం జరిగింది.తమాషా ఏమిటంటే మీ ఫిర్యాదు అందినది, ఇంకొకరికి పంపాము గ్రీవెన్స్ లో చూసుకొండి అని మెసేజెస్ వస్తాయి. వ్రాతపూర్వకంగా వివరంగా ఫిర్యాదుచేస్తే,అదేవిధంగాసమాధానం రావాలి. గ్రీవెన్స్‌లో చూసుకోండి అనిచెప్పడం ఏమిటి? అలా చూసుకోవటం ఎవరికి తెలుస్తుంది? సమస్యల పరిష్కారం కొరకు ఫిర్యాదు చేసినప్పుడు, మీ ఫిర్యాదు అందినది, పలానా టైమ్‌లోపు సమస్య పరిష్కరిస్తాము అని లెటర్ వ్రాయాలి.అంతేకానీ గ్రీవెన్స్‌లోచూసుకోండి అని మెసేజ్ పెట్టడం ఫిర్యాదుదారున్ని నీరసపరచడమే అవుతుంది.

- నార్నే వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### రేవులను రహదారులతో అనుసంధానించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మౌలిక వసతుల కల్పనలో భాగంగా రహదారులు, రేవుల అనుసంధానతను మెరుగుపరుస్తూ పారిశ్రామిక విప్లవానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేయడంలో ఈ రవాణా ప్రణాళికలు కీలకపాత్ర పోషిస్తున్నాయి. ప్రభుత్వం సుమారు 1,040 కిలోమీటర్ల జాతీయ రహదారులను,3,483 కిలోమీటర్ల ఇతర రహదారిపనులను యుద్ధప్రాతిపదికనపూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. దీనివల్ల ప్రయాణ సమయం తగ్గడమేకాకుండా మారుమూలప్రాంతాలకు రవాణా సౌక ర్యాలు మెరుగుపడతాయి. సముద్ర తీర అభివృద్ధిలో భా గంగా మచిలీపట్నం రేవుకు ఆరువరుసలరహదారిని నిర్మి స్తున్నారు. రేవులను జాతీయ రహదారులతో అనుసంధా నించడంతో వాణిజ్యంలో రాష్ట్రం వాటా పెరుగుతుంది.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### బడి పిల్లలకు అల్పాహారం

వచ్చే విద్యాసంవత్సరం 2026-2027జూన్ నుండి 1వ తరగతినుండి12వ తరగతి వరకు ఆల్పాహారం పెడుతున్నట్లు ప్రకటించడం సంతోషకారం. పేద విద్యార్థులకు ఎంతో మేలుకలుగుతుంది.అందుకోసంవేసవి సెలవులలో తగినఏర్పాట్లుచేయాలి.వంటపాత్రలు,ఏజెన్సీల ఏర్పాటు, టెండర్స్, పర్యవేక్షణ అధికారుల నియామకం, బడ్జెట్ కేటాయించి తగిన ఆదేశాలు జారీ చేయాలి.

-ఈదునూరి వెంకటేశ్వర్లు, నెక్కొండ

### అనారోగ్యానికి ఆహారమే మూలం

**ఆహారం** మన జీవన విధానానికి మూలాధారం. అయితే, ఇటీవల ప్రచురితమైన నివేదికల ప్రకారం అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు దేశంలో సుమారు 56 శాతం వ్యాధులకు కారణమవుతున్నాయని వెల్లడవడం ఆందోళన కలిగించే విషయం. ఈనేపథ్యంలో భారత వైద్యపరిశోధన మండలి-జాతీయ పోషకాహార సంస్థ(ఐసిఎం ఆర్ఎన్ఐఎన్) ప్రజలను ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లవైపు మళ్లించాలని పిలుపునిచ్చింది. ఇది కేవలం ఒక సూచనమాత్రమే కాదు, సమాజం మొత్తం ఆలోచించాల్సిన అత్యవసర అంశం. నేటి ఆధునిక జీవనశైలిలో వేగం పెరిగిన కొద్దీ ఆహారపు అలవాట్లలో కూడా విపరీత మార్పులు చోటుచేసుకున్నాయి. ఫాస్ట్ ఫుడ్, ప్రాసెస్డ్ ఫుడ్,అధికచక్కెర,ఉప్పు,కొవ్వుపదార్థాల వినియోగం పెరగడం వల్ల మధుమేహం, రక్తపోటు, గుండెజబ్బులు, ఊబకాయం వంటి జీవనశైలి వ్యాధులు విస్తరిస్తున్నాయి. ఈవ్యాధులు ఒకసారి వచ్చిన తర్వాత పూర్తిగా నయం చేయడం కష్ట సాధ్యం. కాబట్టి నివారణే ఉత్తమ మార్గం.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

### తీరు మారాలి

**తాము** తిని తినక కష్టపడి సంపాదించి పిల్లలని చదివించి వారికీ పెళ్లిళ్లుచేసి ఇంకా వారి భవిష్యత్తుమీద భయంతో తమ ఆస్తిపాస్తులన్నీ వారి పేరు మీద రాసి జీవిత చరమాంకంలో తమని ఆదరిస్తారనుకున్నతల్లిదండ్రుల ఆశలను అడియాసలు చేస్తూ ఆస్తి,డబ్బు తమకు దక్కగానేవారిని ఇంటి నుండిగెంటేస్తున్నారు. ఇంకొందరేమో అనాధాశ్రమాలలో చేర్పిస్తున్నారు. కొందరు తనయులు అన్ని తమ పేరు మీద రాయించుకొని ముసలి తల్లిదండ్రులను కనీస మానవత్వం మరిచి రోడ్డుపక్కనవదిలేస్తున్నారు.వారుఇప్పటికైనాకళ్ళుతెరిచి దైవసమానులైన తల్లిదండ్రులను వారి అవసానదశలో ఆదరించి కన్న వారి రుణం తీర్చుకోవాలి.

- నిమ్మగడ్డ కృష్ణ, హైదరాబాద్

### రైల్వే టెర్మినల్ వినియోగంలోకి తేవాలి

ఉత్తర, దక్షి ణ ప్రాంతాలలోని పట్టణాలను కలుపుతూ ఫామ్ చేయబోయే రైల్వే కారిడార్లు దేశాభివృద్ధికి ఒక గ్రోత్ కనెక్టర్స్‌లాగ మారబోతున్నాయి అనడంలో సందేహం లేదు. ఈసారి బడ్జెట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకున్నది కాదు అని నిశ్చితంగా చెప్పవచ్చు. అందులో ముఖ్యంగా హైదరాబాద్ చెన్నై,హైదరాబాద్ బెంగళూరు, హైదరాబాద్ పూణే ప్రాజెక్ట్స్ తెలంగాణకు పచ్చలా హారంలాగా ఉంటాయి.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

17-4Pg5.qxd:17-4Pg5.qxd 1/1/02 6:15 AM Page 1



# సంస్కరణలతో రైల్వేలో కొత్త ప్రమాణాలు




## పెరిగిన మౌలిక మార్పులు, తగ్గిన ప్రమాదాలు: ప్రధాని మోడీ ట్వీట్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** నిరంతర సంస్కరణలు, సాంకేతికత ద్వారా భారతీయ రైల్వేలో మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయని, కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. స్పష్టమైన విధానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం ప్రవేశం, నిరంతర నిధుల కేటాయింపు ద్వారా గత దశాబ్ద కాలంలో భారతీయ రైల్వే భద్రతా వ్యవస్థ ఎలా రూపాంతరం చెందిందో వివరిస్తూ కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ రాసిన ఒక కథనంపై ప్రధాని మోడీ స్పందించారు. "భారతీయ రైల్వే వ్యవస్థలో మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయి, దాని ఫలితాలు మన కళ్ల ముందే ఉన్నాయి. నిరంతర సంస్కరణలు, సాంకేతికత ద్వారా ఈ రంగం ఎలా కొత్త ప్రమాణాలను నెలకొల్పుతోంది. ఈ ప్రయాణికులలో చాలా మందికి రైలు ప్రయాణం అనేది ఒక ఎంపిక కాదు, అవసరం. ఇంత భారీ సంఖ్యలో ప్రయాణికులను సుదూర ప్రాంతాలకు చేరవేసే వ్యవస్థలో, భద్రత అనేది కేవలం సాంకేతిక కొలమానం కాదు. అది ప్రజల నమ్మకానికి సంబంధించిన విషయం" అని ఈ మేరకు ప్రధానమంత్రి కార్యాలయంలో ఓ ప్రకటనలో పేర్కొంది.

ప్రధాని మోడీ తొలి ఐదేళ్లలో భారతీయ రైల్వే 'భద్రతే ప్రథమం' అనే స్పష్టమైన సందేశాన్ని ఇచ్చిందని రాసుకొచ్చారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా, సంస్థ తన భద్రతా వ్యవస్థను సాంకేతికత ఆధారితంగా, నిరంతర నిధులతో మార్పు దిశగా నడిపించింది. ఫలితంగా, దేశంలో రైలు ప్రమాదాల రేటు గణనీయంగా తగ్గింది. 2014-15లో భారతీయ రైల్వే 135 ప్రమాదాలను నమోదు చేయగా, 2025-26 నాటికి ఆ సంఖ్య 16కి తగ్గింది. ఇది 89 శాతం తగ్గుదల. రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ పెరిగినప్పటికీ ప్రమాదాల సంఖ్యలో ఈ తగ్గుదల చోటుచేసుకుంది. ఈ కాలంలో, రైలు ప్రయాణించే ప్రతి యూనిట్ దూరానికి జరిగే ప్రమాదాలను కొలిచే పర్యవసాన ప్రమాద సూచిక (కాన్సీక్వెన్షియల్ యాక్సిడెంట్ ఇండెక్స్) 0.11 నుండి 0.01శాతానికి తగ్గింది. ఇది ప్రయాణించే ప్రతి కిలోమీటరుకు వ్యవస్థ చాలా సురక్షితంగా ఉందని సూచిస్తుంది. అలాగే 2014-15లో జరిగిన రైలు ప్రమాదాల్లో 292 మంది ప్రాణాలు కోల్పోగా, 2025-26లో జరిగిన 16 ప్రమాదాల్లో కేవలం 16 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోయారు. ప్రజల జీవితాల్లో భారతీయ రైల్వేలు పోషిస్తున్న ప్రాముఖ్యతను వివరించారు. "ప్రతి ఉదయం భారతదేశం నిద్రలేచే సమయానికి, దాని రైల్వేలు అప్పటికే గమనంలో ఉంటాయి. ఉద్యోగులు, విద్యార్థులు, వలస కార్మికుల నుండి కుటుంబాలు, సైనికుల వరకు ప్రతిరోజూ రెండు కోట్లకు పైగా ప్రయాణికులు దేశ రైళ్లలో ప్రయాణిస్తున్నారు" అని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు.

# పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లో సుస్థిర శాంతి కొనసాగాలి



### ప్రధాని మోడీ, ఆస్ట్రియా చాన్సలర్ క్రిస్టియన్ స్టాకర్ ఆకాంక్ష

### భారత్ - ఆస్ట్రియా మధ్య కుదిరిన 15 ఒప్పందాలు

### ఉగ్రవాద నిరోధకతపై జెఎస్‌జి ఏర్పాటుకు అంగీకారం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** అంతర్జాతీయ సంస్థలు ప్రపంచశాంతికి ఎదురయ్యే సవాళ్ల పరిష్కారానికి కృషి చేయాలని ప్రధానమంత్రి నరేంద్రమోడీ, ఆస్ట్రియా చాన్సెలర్ క్రిస్టియన్ స్టాకర్ సూచించారు. పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో సుస్థిర, సుదీర్ఘ శాంతి కొనసాగాలని ఆకాంక్షించారు. ఫెడరల్ ఛాన్సలర్ క్రిస్టియన్ స్టాకర్ నాలుగు రోజుల అధికారిక పర్యటన కోసం న్యూఢిల్లీ వచ్చారు.

గురువారం ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అలాగే, పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లో నెలకొన్న పరిస్థితులపై సమాలోచనలు జరిపారు. అనంతరం సంయుక్తంగా మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీ మాట్లాడుతూ, యుద్ధ క్షేత్రాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల ప్రభావం ప్రపంచ దేశాలపై పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కొన్ని దేశాల యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్త పరిస్థితులు కనిపిస్తున్నాయని అన్నారు. ఈ యుద్ధం ప్రభావం ప్రజల జీవన విధానంపై పడుతోందని అన్నారు. ఉక్రెయిన్ లేదా పశ్చిమాసియా ఏదైనా సమస్య శాశ్వతంగా పరిష్కారమై, శాంతి, సుస్థిరత కావాలని కోరుకుంటున్నామని పేర్కొన్నారు. సవాళ్లను ఎదుర్కోవడానికి సరికొత్త సంస్కరణలు చేపట్టవలసి ఉందని పిలుపునిచ్చారు. ఉగ్రవాదులను తుదముట్టించడం కూడా అవసరమని అన్నారు.

ఆస్ట్రియా ఛాన్సెలర్ రాకతో దాదాపు నాలుగు దశాబ్దాల తర్వాత భారత్‌లో వాణిజ్య పెట్టుబడుల రంగంలో నూతనోత్సాహం మొదలైందని అన్నారు.

భారత్-ఇయు మధ్య కొత్త ఒప్పందాలతో సువర్ణాధ్యాయం ప్రారంభం కానుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. అంతకు ముందు ఇరుదేశాల నేతల ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో భాగంగా భారత్ -ఆస్ట్రియా గురువారం 15 తీర్మానాలపై సంతకాలు చేశాయి. రక్షణ, సాంకేతికత, వాణిజ్యం, ఆవిష్కరణలు, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాలతో పాటు, ఇరు దేశాల మధ్య ఉగ్రవాద నిరోధకతపై ఒక సంయుక్త కార్యవర్గాన్ని (జెఎస్‌జి) ఏర్పాటు చేయడంపై ప్రధానంగా దృష్టి సారించాయి. నాలుగు దశాబ్దాలలో ఆస్ట్రియా ఛాన్సలర్ భారత్‌లో పర్యటించడం ఇదే మొదటిసారి.



## తల్లులు, సోదరీమణులకు ఇచ్చే గౌరవం దేశానికే గౌరవం

### మహిళా సాధికారత దిశగా చరిత్రాత్మక అడుగు: ప్రధాని మోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** తల్లులకు, సోదరీమణులకు ఇచ్చే గౌరవమే దేశానికి మనం ఇచ్చే గౌరవమని ప్రధానమంత్రి నరేంద్రమోడీ అభిప్రాయపడ్డారు. చట్టసభల్లో మహిళల రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపునకు సంబంధించి కేంద్రం పార్లమెంట్‌లో మూడు కీలక బిల్లులను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ప్రధాని మోడీ నేడు ఎక్స్ వేదికగా కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళా సాధికారత దిశగా నేడు దేశం చరిత్రాత్మక ముందడుగు వేయబోతోందని అన్నారు. భారత దేశ మహిళలపై గౌరవంతో ఈ దిశగా సాగుతున్నామని అన్నారు. మహిళల గొప్పదనాన్ని చాటిచెప్పే శ్లోకాన్ని కూడా ప్రధాని షేర్ చేశారు. అలాగే, మహిళా రిజర్వేషన్ల తక్షణ అమలును నొక్కిచెబుతూ ప్రధాని మోడీ రాసిన వ్యాసాన్ని పంచుకున్నారు. శాసనసభలలో మహిళలకు మూడో వంతు రిజర్వేషన్లను అమలు చేయడం, అలాగే జనాభా లెక్కలు, నియోజకవర్గాల పునర్విభజన వంటి కీలక ప్రక్రియలను ఆలస్యం లేకుండా పూర్తి చేయడం అత్యవసరమని కేంద్ర సహాయ మంత్రి శోభా కరంద్లాజే రాసిన ఒక కథనాన్ని ప్రధాన మంత్రి రీట్వీట్ చేశారు. మహిళా రిజర్వేషన్‌ను ఒక సామూహిక జాతీయ ఘట్టంగా, ఒక సంస్థగా పార్లమెంటుకు ఒక మైలురాయిగా నిలుపుతుందని పేర్కొన్నారు. ఈ చట్టం ప్రయోజనాలు దేశవ్యాప్తంగా ఉన్న మహిళలకు వీలైనంత త్వరగా చేరేలా చూడటానికి వేగవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

## నేడు రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక

### ఎన్‌డియే అభ్యర్థిగా హరివంశ్

### ఏకాభిప్రాయ సాధన కోసం జెపి నడ్డా విపక్షాలతో చర్చలు

### ఎన్నిక బహిష్కరించాలని ఇండియా కూటమి నిర్ణయం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** రాజ్యసభ ఉపసభాపతి పదవికి ఏప్రిల్ 17 శుక్రవారం ఎన్నిక నిర్వహించనుంది. ఈ కీలక పదవికి హరివంశ్ నారాయణ సింగ్‌ను తిరిగి ఎన్నుకునేందుకు అధికార ఎన్‌డియే కూటమి గట్టి ప్రయత్నం చేసే అవకాశం ఉంది. ఏప్రిల్ 9న హరివంశ్ పదవీకాలం ముగియడంతో రాజ్యసభ ఉపసభాపతి పదవి ఖాళీ అయ్యింది. ఆ తర్వాత, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హరివంశ్‌ను రాజ్యసభకు (ఎగువ సభకు) నామినేట్ చేయగా, ఆయన ఏప్రిల్ 10న ప్రమాణస్వీకారం చేశారు. కేంద్ర మంత్రి, రాజ్యసభలో సభా నాయకుడిగా వ్యవహరిస్తున్న జె.పి. నడ్డా, హరివంశ్‌ను ఉపసభాపతిగా తిరిగి ఎన్నుకోవడంపై వివిధ పార్టీల నాయకులతో చర్చలు జరుపుతున్నారు. ఆయన పేరుపై విస్తృత ఏకాభిప్రాయాన్ని సాధించే ప్రయత్నంలో భాగంగా ఈ చర్చలు జరిగాయి. అయితే, లోక్‌సభ ఉపసభాపతి పదవి 2019 నుండి ఖాళీగా ఉన్నప్పటికీ, ఈ పదవిని భర్తీ చేయడానికి ఎన్నికలు నిర్వహించడంలో అధికార పక్షం చూపుతున్న "అత్యుత్సాహం" పట్ల కాంగ్రెస్, టిఎంసి, వామపక్ష పార్టీలు అభ్యంతరాలు వ్యక్తం చేశాయి. ఈ నేపథ్యంలోనే రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నికను బహిష్కరించాలని ఇండియా కూటమి నిర్ణయించింది. ఏడేళ్లుగా లోక్‌సభలో డిప్యూటీ స్పీకర్‌ను నియమించని మోడీ ప్రభుత్వానికి నిరసనగా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నికను ప్రతిపక్షం బహిష్కరిస్తుందని కాంగ్రెస్ నాయకుడు జైరామ్ రమేష్ గురువారం తెలిపారు. ఈ విషయంపై ప్రభుత్వం ఎలాంటి అర్థవంతమైన సంప్రదింపులు జరపలేదని కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేష్ 'ఎక్స్'లో పేర్కొన్నారు. రాష్ట్రపతిచే రాజ్యసభకు నామినేట్ చేయబడిన వ్యక్తిని, ఆ సభ ఉపసభాపతి పదవికి పరిగణించడం ఇంతకు ముందెన్నడూ జరగలేదని ఆయన అన్నారు.



## లాహోర్‌లో కాల్పులు: అమీర్ హామ్జా మృతి

**ఇస్లామాబాద్, ఏప్రిల్ 16:** పాకిస్థాన్ కేంద్రంగా కార్యకలాపాలు సాగిస్తున్న ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబా సహ వ్యవస్థాపకుడు అమీర్ హామ్జాపై గుర్తు తెలియని దుండగులు కాల్పులు జరిపారు. లాహోర్ నగరంలో జరిగిన ఈ దాడిలో హామ్జా తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. గతంలో జరిగిన ఒక ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. తాజాగా, గురువారం దుండగులు జరిపిన కాల్పుల్లో మృతి చెందినట్లు సమాచారం. లష్కరే తోయిబా అధినేత హాఫిజ్ సయీద్ తర్వాత ఆ సంస్థలో అత్యంత కీలకమైన వ్యక్తి అమీర్ హామ్జా. సంస్థ ఆవిర్భావం నుంచి హాఫిజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడిగా, సలహాదారుడిగా ఆయన వ్యవహరించారు. సరిహద్దుల గుండా ఉగ్రవాదులను చొరబెట్టడం, నిధుల సేకరణ వంటి కార్యక్రమాల్లో హామ్జా కీలక పాత్ర పోషిస్తున్నట్లు నిఘా వర్గాల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. అమీర్ హామ్జాను అమెరికా ట్రెజరీ విభాగం అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించింది. భారత్, బ్రిటన్, యూరోపియన్ యూనియన్, ఐక్యరాజ్య సమితి ఇప్పటికే ఇతనిపై నిషేధం విధించాయి.

# ఓటర్లకు 'విజయ్' వరాలు

### గృహిణులకు రూ.2,500, నిరుద్యోగులకు రూ.4వేలు

### టివికె మేనిఫెస్టో ఆవిష్కరించిన దళపతి విజయ్

**చెన్నై, ఏప్రిల్ 16:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో విజయం లక్ష్యంగా టివికె చీఫ్ విజయ్ ఓటర్లకు వరాలు కురిపించారు. భారీ సంక్షేమ పథకాలు, టెక్నాలజీ ఆధారిత పాలన హామీలతో కూడిన పార్టీ మేనిఫెస్టోను గురువారం సాయంత్రం విడుదల చేశారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా, సామాజికంగా పునర్నిర్మించేందుకు రంగాలవారీగా సంస్కరణలు చేపడతామని ప్రకటించారు. సంప్రదాయ సంక్షేమ పథకాలతో పాటు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) వంటి ఆధునిక సాంకేతికతను పాలనలో ప్రవేశపెట్టడం ద్వారా వినూత్న మార్పునకు శ్రీకారం చుడతామని విజయ్ స్పష్టం చేశారు. ప్రజాకర్షక పథకాలకు మేనిఫెస్టోలో పెద్దపీట వేశారు. గృహిణులకు నెలకు రూ.2,500 ఆర్థిక




సహాయం, డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులకు రూ. 4,000, యువతకు ఉపాధి కల్పించే లక్ష్యంతో ఐదు లక్షల మందికి రూ.18,000 చొప్పున ఉపాధి ఆధారిత మద్దతు పథకాన్ని ప్రకటించారు. మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ, రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు, పేద యువతుల వివాహానికి ఒక సవర బంగారం, పట్టు చీరతో కూడిన ఆర్థిక సహాయం అందిస్తామని వాగ్దానం చేశారు. ప్రతి ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు, ఏడాదికి ఆరు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా పంపిణీ చేస్తామని ప్రకటించారు. రైతుల రుణాల్లో 50 శాతం మాఫీ చేస్తామని హామీనిచ్చారు. రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తూ, డ్రగ్స్-ఫ్రీ తమిళనాడు కార్యక్రమాన్ని ప్రారంభిస్తామని విజయ్ ప్రకటించారు. ఆర్థికంగా 2036నాటికి తమిళనాడును 1.5 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పెట్టుకున్నామని, సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల కోసం రూ.15 వేల కోట్లతో భద్రతా నిధిని ఏర్పాటు చేస్తామని తెలిపారు.



## ఢిల్లీ ఎయిర్ పోర్టులో ఢీకొన్న రెండు విమానాలు

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో గురువారం సాయంత్రం పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. ట్యాక్సీ వేపై ఆకాశ ఎయిర్, స్పైస్‌జెట్‌కు చెందిన రెండు విమానాలు ఒకదానికొకటి స్వల్పంగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో అధికారులు, ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. విమానాశ్రయ వర్గాల సమాచారం ప్రకారం, స్పైస్ జెట్‌కు చెందిన బోయింగ్ 737 విమానం ట్యాక్సీయింగ్ చేస్తుండగా ఈ ఘటన జరిగింది. ఆసమయంలో హైదరాబాద్‌కు బయలుదేరేందుకు సిద్ధంగా ఉన్న ఆకాశ ఎయిర్ విమానం క్యూపీ 1406 నిలిపి ఉంది.

వేగంగా వస్తున్న స్పైస్‌జెట్ విమానం కుడి రెక్క (రైట్ వింగ్), నిలిపి ఉన్న ఆకాశ విమానం తోక భాగంలోని స్టెబిలైజర్‌ను తాకింది. దీంతో రెండు విమానాల భాగాలు స్వల్పంగా దెబ్బతిన్నాయి. ఈ ఘటనపై ఆకాశ ఎయిర్ వెంటనే స్పందించింది. తమ విమానం ఆగి ఉన్నప్పుడు మరో విమానం వచ్చి ఢీకొట్టినట్లు ప్రాథమికంగా తెలిసిందని సంస్థ ప్రతినిధి ఒక ప్రకటనలో తెలిపారు. "ప్రయాణికులు, సిబ్బంది అందరినీ సురక్షితంగా విమానం నుంచి దించాం. హైదరాబాద్ వెళ్లాల్సిన ప్రయాణికుల కోసం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం" అని ఆయన వివరించారు. ఈ ఘటన కారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో విమాన రాకపోకలకు పెద్దగా అంతరాయం కలగలేదు. అయితే, దెబ్బతిన్న రెండు విమానాలను అధికారులు పరిశీలన కోసం బేకు తరలించారు. ఈ ఘటనపై డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) ఉన్నతస్థాయి విచారణకు ఆదేశించింది.



# లోక్‌సభలో 272 సీట్లు మహిళలకే..

### కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** డీలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లులపై లోక్‌సభలో కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ మాట్లాడారు. 2023లో పాసైన మహిళా రిజర్వేషన్ విధానాన్ని జనాభా లెక్కలు, డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తి అయిన తర్వాత అమలు చేయనున్నట్లు చెప్పారు. లోక్‌సభలో సభ్యుల సంఖ్యను 50 శాతం పెంచనున్నట్లు చెప్పారు. 815 సీట్లకు ఆ సంఖ్య చేరుకోనున్నట్లు తెలిపారు. కోటాలో భాగంగా 272 సీట్లను మహిళలకు రిజర్వేషన్ కల్పించనున్నట్లు ఆయన చెప్పారు. దీని వల్ల ఏ రాష్ట్రం కూడా తమ ప్రాతినిధ్యాన్ని కోల్పోదు అని, ప్రస్తుతం ఉన్న ఆయా రాష్ట్రాల సామర్థ్యం అలాగే కొనసాగుతుందని ఆయన అన్నారు. పురుషులకు కానీ, రాష్ట్రాలకు కానీ తాజా బిల్లులలో ఎటువంటి నష్టం ఉండబోదన్నారు. లోక్‌సభ సామర్థ్యం 815కి పెరిగినప్పుడు దాంట్లో 33 శాతం అంటే 272 అవుతుందని మంత్రి పేర్కొన్నారు. 131వ రాజ్యాంగ సవరణ 2026 బిల్లుతో మహిళలకు సమానత్వం వస్తుందన్నారు. బిల్లులపై చర్చను ప్రారంభించిన మంత్రి తన ప్రసంగంలో అంబేద్కర్ ఆశయాలను ప్రస్తావించారు. మహిళలు ప్రగతి సాధించిన ఆధారంగానే ఆ సమాజ ప్రగతిని అంచనా వేస్తామన్న అంబేద్కర్ వ్యాఖ్యలను కూడా మంత్రి గుర్తు చేశారు. మహిళా రిజర్వేషన్ అంశాన్ని సమర్థించిన మాజీ రాష్ట్రపతి ఎపిజె అబ్దుల్ కలాం వ్యాఖ్యలను కూడా మంత్రి గుర్తుచేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ ఇచ్చే రోజులు వస్తాయని, కానీ దానికి సమయం వచ్చిందని మంత్రి అన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలో తమ ప్రభుత్వం చరిత్రాత్మక అడుగులు వేస్తున్నట్లు ఆయన చెప్పారు.

## అనిల్ అంబానీకి సుప్రీంలో చుక్కెదురు: పిటిషన్ కొట్టివేత



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** రిలయన్స్ కమ్యూనికేషన్స్ గ్రూప్ కంపెనీల రుణ ఖాతాలను మోసపూరితమైనవిగా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌కు చెందిన మోసపూరిత ఖాతాల విషయంలో చర్యలకు బాంబే హైకోర్టు అనుమతించడాన్ని ఆయన సవాల్ చేయగా, సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. ఈ మేరకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని త్రిసభ్య ధర్మాసనం తన నిర్ణయాన్ని ప్రకటించింది. అయితే బ్యాంకులిచ్చిన షోకాజ్ నోటీసులపై హైకోర్టు సింగిల్ జడ్జి బెంచ్ వద్ద తన వాదనలు వినిపించుకోవడానికి అనిల్ అంబానీకి అనుమతిచ్చింది. ఈ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని హైకోర్టుకు సూచించింది. బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకులు రిలయన్స్ ఇండస్ట్రీస్ ఖాతాలను మోసపూరితమైనవిగా ప్రకటించాయి. బ్యాంకులు చేసిన ప్రకటనపై అనిల్ అంబానీ బాంబే హైకోర్టులో సవాల్ చేశారు. విచారించిన హైకోర్టు సింగిల్ బెంచ్, వాటిపై స్టే విధించడంతో పాటు భవిష్యత్తులో చర్యలు తీసుకోకుండా ఆదేశాలు ఇచ్చింది. మోసపూరిత ఖాతాలుగా గుర్తించే విషయంలో ఆర్బీఐ మార్గదర్శకాలు పాటించలేదని పేర్కొంది. దీనితో మూడు బ్యాంకులు అప్పీలుకు వెళ్లాయి. విచారించిన హైకోర్టు డివిజన్ బెంచ్, సింగిల్ బెంచ్ ఉత్తర్వులను కొట్టివేసింది.

### 'జన నాయగన్' సినిమా పైరసీ కేసు

## ప్రధాన నిందితుడు అసిస్టెంట్ ఎడిటర్

**చెన్నై, ఏప్రిల్ 16:** తమిళ స్టార్ హీరో విజయ్ నటించిన 'జన నాయగన్' సినిమా ఇంటర్నెట్‌లో లీక్ అయిన కేసులో కీలక పురోగతి లభించింది. ఈ కేసుకు సంబంధించి ప్రధాన నిందితుడితో సహా మరో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తమిళనాడు సైబర్ క్రైమ్ వింగ్ పోలీసులు గురువారం వెల్లడించారు. దీంతో ఈ కేసులో ఇప్పటివరకు అరెస్టయిన వారి సంఖ్య తొమ్మిదికి చేరింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ప్రధాన నిందితుడు మరో సినిమాకు ఫ్రీలాన్స్ అసిస్టెంట్ ఎడిటర్‌గా పనిచేస్తున్నాడు. అయితే, ఎడిటింగ్ స్టూడియోలో ఉన్న 'జన నాయగన్' సినిమా రీల్స్‌కు అనధికారికంగా యాక్సెస్ సంపాదించి, డేటాను దొంగిలించాడు. ఆ తర్వాత ఆ డేటాను పూర్తి సినిమాగా మార్చి, సహ నిందితులతో పంచుకున్నాడు. వారి ద్వారా ఈ పైరసీ కాపీ ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అయింది. డిజిటల్ ఆధారాలను క్షుణ్ణంగా పరిశీలించి, సాంకేతిక విశ్లేషణ జరిపిన తర్వాత ఈ ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు సైబర్ క్రైమ్ విభాగం పేర్కొంది.

# మంటల్లో పశ్చిమాసియా

## మా తొలి క్షిపణి దాడికే మీ నౌకలు మునిగిపోతాయ్..

### అమెరికాకు ఇరాన్ హెచ్చరిక



**టెహ్రాన్, ఏప్రిల్ 16:** చమురు రవాణాకు ఎంతో కీలకమైన హార్ముజ్ జలసంధి విషయంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు రోజురోజుకు తీవ్రమవుతున్నాయి. ఈ క్రమంలో ఇరాన్ సుప్రీం నేత మొజ్తాబా ఖమేనీ సైనిక సలహాదారుడు మోహ్‌సేన్ రెజాయి అమెరికాకు గట్టి హెచ్చరికలు చేశారు. హార్ముజ్ జలసంధిపై ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తే.. తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ హార్ముజ్‌కు రక్షక భటుడిగా మారాలనుకుంటున్నారని, ఇది నిజంగా మీరు చేయాల్సిన పనేనా? అమెరికా వంటి శక్తిమంతమైన సైన్యం చేయాల్సిన పనేనా? అని రెజాయ్ ప్రశ్నించారు. హార్ముజ్ జలసంధిపై ఆధిపత్యం చూపాలని చూస్తే తమ తొలి క్షిపణి దాడికే అమెరికా నౌకలు మునిగిపోతాయని హెచ్చరించారు. తమ క్షిపణులు కచ్చితమైన దాడులు చేసి అమెరికా నౌకలను ధ్వంసం చేయగలవని పేర్కొన్నారు. మా దాడుల్లో జలసంధి ప్రాంతంలో ఉన్న అమెరికా బలగాలు ప్రాణాలుకూడా పోవచ్చని రెజాయ్ వ్యాఖ్యానించారు. ఇరాన్‌పై భూతల దాడులకు అమెరికా సిద్ధమైందంటూ ఇటీవల పెద్దఎత్తున వచ్చిన వార్తలపై కూడా ఆయన మాట్లాడారు. భూతల దాడులకు వచ్చిన యుఎస్ సైనికులను బందీలుగా చేసుకుంటామని హెచ్చరించారు. వారిని విడిపించుకోవాలంటే ఒక్కో బందీకి ఒక బిలియన్ డాలర్ ఇవ్వాల్సి వస్తుందన్నారు. అమెరికా-ఇరాన్ మధ్య ప్రస్తుతం అమలులో ఉన్న కాల్పుల విరమణ ఒప్పందాన్ని తాను వ్యక్తిగతంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు.

## ఇరాన్ నిఘా వలలోకి అమెరికా స్థావరాలు



**టెహ్రాన్, ఏప్రిల్ 16:** అమెరికాతో జరుగుతోన్న యుద్ధంలో ఇరాన్‌కు చైనా సహాయం చేస్తుందనే వాదనకు బలం చేకూరేలా మరో నివేదిక వెల్లడయ్యింది. పశ్చిమాసియా యుద్ధం సమయంలో గల్ఫ్ వ్యాప్తంగా ఉన్న అమెరికా సైనిక స్థావరాల గురించి సమాచారం కోసం గతేడాది రహస్యంగా పొందిన చైనా నిర్మిత ఉపగ్రహంపై ఇరాన్ ఆధారపడిందని ఫైనాన్షియల్ టైమ్స్ నివేదించింది. టిఇఇ-01బిగా పిలిచే ఈ ఉపగ్రహాన్ని చైనా సంస్థ ఎర్త్ ఐ కంపెనీ అభివృద్ధి చేసి ప్రయోగించగా.. ఆ తర్వాత దానిని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ ఏరోస్పేస్ ఫోర్స్ స్వాధీనం చేసుకుంది. ఇరాన్‌కు చైనా సైనిక సాయం చేస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంపన ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే.

'ఇన్-ఆర్బిట్ డెలివరీ' పద్ధతిలో ఎర్త్ ఐ విదేశాలకు ఉపగ్రహాలను సరఫరా చేస్తుంది. చైనాలో ప్రయోగించిన ఉపగ్రహాలను విజయవంతంగా కక్ష్యలోకి చేర్చిన తర్వాత మాత్రమే విదేశీ కొనుగోలుదారులకు బదలీ చేస్తుంది. నివేదిక ప్రకారం.. ఈ ప్రాంతంలోని కీలకమైన అమెరికా సైనిక స్థావరాలపై నిఘా ఉంచే బాధ్యతను ఇరాన్ కమాండర్లు దీనికి అప్పగించారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆసియా, లాటిన్ అమెరికా, ఇతర ప్రాంతాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న చైనా ఆధారిత ఉపగ్రహ సేవల సంస్థ ఎంపోసాట్ నడుపుతున్న వాణిజ్య గ్రౌండ్ స్టేషన్ నెట్‌వర్క్‌కు కూడా ఐఆర్‌జిసికి ప్రాపత్య కల్పించింది.

ఈ ఎస్-టైపు ఉపగ్రహం మార్చి 13, 14, 15తేదీల్లో సౌదీ అరేబియాలోని ప్రిన్స్ సుల్తాన్ వైమానిక స్థావరం ఫొటోలను తీసినట్లు సమాచారం. ఆ తర్వాతే అంటే మార్చి 14న ఆ వైమానిక స్థావరంలోని అమెరికా యుద్ధ విమానాలు దాడుల్లో ధ్వంసమైనట్లు డొనాల్డ్ ట్రంప్ అంగీకరించారు. ఇది కేవలం సౌదీనే కాకుండా.. జోర్డాన్‌లోని ముఫాకన సల్తీ, బహ్రెయిన్‌లోని మనమాలో ఉన్న అమెరికా ఫిఫ్త్ ఫ్లీట్ హెడ్ క్వార్టర్స్ సమీప ప్రాంతాలు, ఇరాక్ ఎర్బిల్ ఎయిర్‌పోర్టు వంటి చోట్ల కార్యకలాపాలను కూడా టిఇఇ-018 పర్యవేక్షించింది. ఇదే సమయంలో వాటిపై ఇరాన్ దాడులు చేసినట్లు ప్రకటించడం గమనార్హం.

### కుల, మత, ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టేలా

# వైసిపి నేతల కుట్రలు

**- జువ్వలదిన్నె ప్రాజెక్టుపై వైసిపి నీచ రాజకీయానికి పాల్పడుతోంది**

**: మంత్రులు కొల్లు రవీంద్ర, జనార్ధన్‌రెడ్డి**



మీడియా సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, బిసి జనార్ధన్

**విజయవాడ,ఏప్రిల్ 16, ప్రభాతవార్తప్రతినిధి:** పెట్టుబడులు తీసుకొచ్చి.. పరిశ్రమలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తుంటే.. కడుపు మంటతో ఓర్వలేక మాజీ సీఎం పెద్దలు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని.. రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భవనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో తీర ప్రాంతం, మత్స్యకారుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రులు స్పష్టం చేశారు.. ఆంధ్రప్రదేశ్ లో నేడు పెట్టుబడుల అనుకూల వాతావరణం ఉండటం, భారీగా పెట్టుబడులు రాష్ట్రానికి తరలి రావడాన్ని జీర్ణించుకోలేక, ప్రతిపక్షం దుష్ప్రచారం చేస్తోందని మంత్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ ను ప్రవేట్ పరం చేస్తున్నామంటూ ప్రతిపక్షం చేస్తున్న విమర్శలు పూర్తిగా వాస్తవ విరుద్ధమని కొట్టిపారేశారు.. మీడియా సమావేశంలో మంత్రులు కొల్లు రవీంద్ర, బీసీ జనార్ధన్ రెడ్డి, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ ఎం.టీ కృష్ణబాబు సంయుక్తంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. నేడు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చే పెట్టుబడిదారులను భయభ్రాంతులకు గురిచేయడం ఒక కార్యక్రమంగా పెట్టుకుని మాజీ సీఎం పనిచేస్తున్నారని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి ధ్వజమెత్తారు...నిన్న జువ్వెలదిన్నె ఫిషింగ్ హార్బర్ పర్యటలో జగన్ మోహన్ రెడ్డి చేసిన విమర్శలు వాస్తవ విరుద్ధంగా ఉన్నాయి.. నేడు కేవలం తన రాజకీయ ఉనికి చాటుకోవడానికి తప్ప, మత్స్యకారుల ప్రయోజనాల కోసం జగన్ మోహన్ రెడ్డి జువ్వలదిన్నెకు ఎంతమాత్రం రాలేదన్నారు.. జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్‌ను ప్రైవేట్ పరంగా చేస్తున్నారన్న వార్తలు పూర్తిగా అవాస్తవమని మండిపడ్డారు. మొత్తం 114 ఎకరాల జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ భూమిలో కేవలం 7 ఎకరాలు మాత్రమే సాగర్ డిఫెన్స్ ఇంజనీరింగ్ లిమిటెడ్‌కు కేటాయించామని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి తెలిపారు.. 40 సంవత్సరాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, 900 మీటర్ల మేర ఉన్న జెట్టీలో 150 మీటర్లు మాత్రమే సదరు యూనిట్ కోసం వినియోగిస్తుంటే.. వాస్తవాలను ఏమార్చి.. గత ప్రభుత్వ నేతలు మత్స్యకారుల్ని రెచ్చగొట్టేలా రాజకీయం చేస్తున్నారన్నారు.. దీనివల్ల మత్స్యకారులకు ఏవిధమైన నష్టం లేదు.. పైగా స్థానికంగా మత్స్యకారులుకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని మంత్రి తెలిపారు. రాష్ట్రంలో విధ్వంసంతో రాజకీయాలు చేయడం మొదటి నుంచి వారికి అలవాటేనని మంత్రి అన్నారు.. నేడు రాజకీయంగా తమ ఉనికిని కాపాడుకోవడానికి మాజీ సీఎం, ఆ పార్టీ నేతలు మతి చలించి మాట్లాడుతున్నారన్నారు.. అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్రం నుంచి పరిశ్రమలను వెళ్లగొట్టిన ఆ పార్టీ నేతలు... నేడు ప్రతిపక్షంలో ఉండగా రాష్ట్రానికి పరిశ్రమలు వస్తే, కూటమి ప్రభుత్వం మరింత బలపడుతోందని, పరిశ్రమలపై బెదిరింపులకు పాల్పడుతున్నారన్నారు.

# ఉత్తరాంధ్ర మణిహారంగా భోగాపురం ఎయిర్‌పోర్టు

## 9 జిల్లాల వారికి మరింత అనువుగా విమాన సౌకర్యం



**బొబ్బిలి/విజయనగరం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త :** ఇప్పటికే అనేక ప్రతిష్టాత్మక విమానాశ్రయాలను నిర్మించిన జిఎంఆర్ సంస్థ విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మిస్తున్న అల్లూరి సీతా రామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం నూతన పంథాతో ముందుకు సాగుతుంది. 9 జిల్లాల వాసులకు విమానయానం చేసేందుకు అనువైనదిగా భోగాపురాన్ని తీర్చిదిద్దుతున్నారు. విమానాశ్రయ రాకపోకలకు ఎటువంటి అంతరాయం లేకుండా కనెక్టివిటీ రోడ్లను మెరుగుపరుస్తూ భోగాపురం విమానాశ్రయాన్ని అత్యంత చేరువ చేస్తున్నారు. విశాఖ విజయనగరం శ్రీకాకుళం జిల్లాలలో అనేక సాఫ్ట్వేర్ కంపెనీలు, వివిధ పరిశ్రమలు విరివిగా ఏర్పాటు అవుతుండడంతో అంతర్జాతీయ విమానాశ్రయం ప్రాధాన్యతను సంతరించు కుంది. ఆర్థిక రాజధానిగా రూపాంతరం చెందుతున్న విశాఖ నగరంలో ప్రస్తుతం ఉన్న ఎయిర్‌పోర్ట్ స్థానంలో 2,800 ఎకరాల విస్తీర్ణంలో భోగాపురంలో నిర్మిస్తున్న ఈ విమానాశ్రయం ఒడిస్సా చత్తీస్‌ఘడ్ ప్రాంతాల వారికి కూడా అందుబాటులో ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణీకులు ఈ విమానాశ్రయం ద్వారా రాకపోకలు సాగిస్తారని అంచనా వేస్తున్నారు. ఆధునిక విధానంతో ఎయిర్‌పోర్ట్‌లో అన్ని సదుపాయాల అందించడంతోపాటు సమీపంలో నిర్మితమవుతున్న వివాంత హోటల్ ఎయిర్‌పోర్ట్ రాకపోకలు సాగించే వారికి అనువుగా ఉంటుందని భావిస్తున్నారు. భోగాపురం అంతర్జాతీయ విమా నాశ్రయ నిర్మాణ అభివృద్ధి వేగం పుంజుకోవడంతో, విశాఖపట్నం నగరం మరియు కొత్త విమాన కేంద్రం మధ్య రవాణా వేగాన్ని పెంచుతూ కనెక్టివిటీని అభివృద్ధి చేసే దిశలో రోడ్డు మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి అధికారులు ప్రయత్నాలను వేగవంతం చేస్తున్నారు. ట్రాఫిక్ ప్రవాహాన్ని మెరుగుపరచడానికి, రద్దీని తగ్గించడానికి మరియు విమానాశ్రయానికి వేగంగా చేరుకునేందుకు అధికారులు ఏడు ప్రాధాన్యత రోడ్లను గుర్తించారు. భోగాపురం అంతర్జాతీయ విమానా శ్రయానికి కనెక్టివిటీని పెంచడానికి, అధి కారులు అభివృద్ధి మరియు అప్‌గ్రేడేషన్ కోసం ఏడు కీలక కేంద్రాల్లో కనెక్టివ్ రోడ్లను (రోడ్ నంబర్లు 5, 6, 7, 10, 12, 14 మరియు 15) గుర్తించారు. ఈ రహదారులు నగర పరిమితుల్లో గుండా వెళుతున్న భారీ రద్దీగా ఉండే హైవే కారిడార్ నుండి ట్రాఫిక్‌ను మళ్లించడానికి వ్యూహాత్మకంగా రూపొందించబడ్డాయి. ముఖ్యంగా గాజువాక మరియు ఆనందపురం జంక్షన్ మధ్య పాత వీబీ స్ట్రెచ్, ఇందులో ప్రస్తుతం 12 ప్రధాన జంక్షన్‌లు ఉన్నాయి. అనకాపల్లి,

ఆనందపురం ఎన్‌హెచ్ 16 బైపాస్ మరియు బీచ్ రోడ్ కారిడార్ వైపు.

మెరుగుదల కోసం గుర్తించబడిన కీలక స్ట్రెచ్‌లలో భీమిలీ తాళ్లవలస (4 కి.మీ.), భీమిలీ దొరతోట (6.2 కి.మీ.), మంగమారి పెట బోయపాలెం (6 కి.మీ.), తిమ్మాపురం మారికవలస (6.3 కి.మీ.), సింహాచలం సొంత్యాం (8 కి.మీ.), వేపగుంట పెందుర్తి (6.15 కి.మీ.) మరియు వేపగుంట పినగడి (7.12 కి.మీ.) ఉన్నాయి. ఈ మార్గాలు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడంలో మరియు విమానాశ్రయానికి చివరి మైలేజీ కనెక్టివిటీని మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు.

# మా డబ్బులు మాకిస్తే రాజీనామా చేస్తాం

## ఆదిమూలం తనయుడు జడ్పిటిసి కోనేటి సుమన్‌కుమార్ కీలక వ్యాఖ్యలు



**తిరుపతి హెల్త్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా, సత్యవేడు నియోజకవర్గంలో తాము ఎలక్షన్‌లో ఖర్చు చేసిన డబ్బులు మాకు తిరిగి ఇస్తే రాజీనామా చేస్తామని సస్పెండ్ అయిన ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం తనయుడు కోనేటి సుమన్ కుమార్ సవాల్ విసిరారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాన్న ఆదిమూలం ఎమ్మెల్యే కాకముందు గంగాప్రసాద్ ఆదేశాల మేరకు నాన్నకి టికెట్ ఇచ్చారని చెప్పారు. నాన్నకు సుమారు 75 సంవత్సరాలు వయసు కలిగి, గుండె జబ్బుతో బాధపడుతున్నాడని, ఆ సమయంలో జనసేన పార్టీ నాయకులు పవన్ కళ్యాణ్ పరామర్శించారని చెప్పారు. సత్యవేడు నియోజకవర్గంలో కోనేటి ఆదిమూలంను చూసి ఓట్లు వేశారే కానీ, పార్టీని చూసి కాదని, ఓట్లు వేసిన నియోజకవర్గ ప్రజలకు శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత టిడిపిలోనే కొంతమంది వ్యక్తులు నాన్నకు వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. తెలుగు దేశం పార్టీ ఆకువేసి అన్నం పెట్టి, అన్నంలో విషం కలిపారని, ఇలాంటివి మంచి పద్ధతి కాదని పార్టీ అధిష్టానానికి సూచించారు. మేము అప్పులు చేసి పార్టీ కోసం ఖర్చు పెట్టి ఎమ్మెల్యేగా గెలిచామని, మాకు ఆ గౌరవం దక్కలేదని అన్నారు. ఒక చిన్న సమస్య వలన ఆదిమూలంను పార్టీ నుండి సస్పెండ్ చేశారని, ఇంకెవరూ ఏ తప్పులు చేయలేదా? అని ప్రశ్నించారు. ఎస్సీ కి చెందిన ఎమ్మెల్యే కాబట్టి చర్యలు తీసుకున్నారని, పార్టీలో తప్పులు చేసిన వారిని కొందరిని పట్టించుకోలేదని ఆరోపించారు. ఎస్సీ రిజర్వేషన్ అయిన నియోజకవర్గంలో ఇన్చార్జిగా ఎస్సీ కి సంబంధించిన వ్యక్తిని ఎందుకు పెట్టలేదని నారా చంద్రబాబు నాయుడుని, నారా లోకేష్‌ని సూటిగా ప్రశ్నిస్తున్నానన్నారు. పులిలా బతికే ఆదిమూలంను తెలుగుదేశం పార్టీలోనే కొంతమంది వెన్నుపోటు దారులు పిల్లిని చేశారని అన్నారు. ఎక్కడున్నా పులిపులే అన్నారు. సత్యవేడులో ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఉద్యోగ బాధ్యతను పక్కనపెట్టి రాజకీయాలు చేస్తున్నారని, దగ్గరుండి ఇసుకను తమిళనాడుకు రోజుకు 50 నుంచి 60 లోడ్లు పంపుతున్నాడని ఆరోపించారు.

## శ్రీకాళహస్తిలో రూ.500 రాహుకేతుదోష నివారణ పూజలు రద్దు!

### రూ.5వేల పూజలు ఇక రూ.6 వేలు

**శ్రీకాళహస్తి,ఏప్రిల్ 16 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వ రాలయంలో నిర్వహించే రాహుకేతుదోష నివారణ పూజలకు సంబందించి కీలక నిర్ణయం తీసుకున్నట్లు శాసనసభ్యుడు బొజ్జల సుధీర్‌రెడ్డి తెలిపారు. బోర్డు సమావేశం తరువాత ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సమావేశంలో 22 అంశాలకు సంబంధించి చర్చించామని అలాగే కొత్తగాబాధ్యతలుచేపట్టిన ఇఒ బికె వెంకటేశులు వివిధ అంశాలకు సంబంధించి అధ్యయనం చేసిన తరువాత పలు సూచనలు సమావేశంలో వెల్లడించారని వాటిపై చర్చించినట్లు తెలిపారు. ధర్మకర్తల మండలి సమావేశంలో అంశాలకు సంబంధించి కూలంకషంగా చర్చించామన్నారు. ఇందులో 14 అంశాలు కీలకంగా ఉన్నాయని ఎంఎల్ఏ వివరించారు. బోర్డు ఛైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో నిర్ణయాలను ఎంఎల్ఏ మీడియాకు వివరించారు ఇక శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న రాహుకేతుదోష నివారణ పూజలకు దేవస్థానం అందించే వెండి నాగపడగలకు సంబంధించి వెండి ధరలు విపరీతంగా పెరిగినందువల్ల నిర్వహణ దృష్ట్యా రూ.500ల రాహుకేతుదోష నివారణ పూజలను రద్దు చేసినట్లు ప్రకటించారు.అయితే రూ.750,1500,2500ల పూజలు యథాతథంగా నిర్వహించబడుతాయని వివరించారు.

# సత్యం, దయ, క్షమ జీవన మార్గదర్శకాలు

**- 84 లక్షల జీవరాశులలో గోవు చాలా పవిత్రం**

**- ఆధ్యాత్మికవేత్త చాగంటి కోటేశ్వరరావు**

**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** సత్యం, దయ, క్షమ జీవన మార్గదర్శకాలని, నిత్య జీవితంలో ధర్మాచరణం ప్రతి ఒక్కరి కర్తవ్యమని ఆధ్యాత్మిక ప్రవచన కర్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు హితవు చేశారు. ఇంటి నుంచే ప్రారంభమయ్యే ధర్మం సమాజానికి శాశ్వత దిక్సూచి అన్నారు. 84 లక్షల జీవరాశులలో గోవు పవిత్రమైనదని, ప్రతి బిడ్డ తల్లిని గౌరవించడం నేర్చుకోవాలని సందేశమిచ్చారు. ధర్మాన్ని కాపాడితే దేవుడు మన వెంట ఉంటాడని, శ్రీవేంకటేశ్వరుడు కరుణామయుడని కోటేశ్వరరావు పేర్కొన్నారు. టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతి మహతి కళాక్షేత్రంలో గురువారం సాయంత్రం నిర్వహించిన ధార్మికోపన్యాస కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. "నిత్య జీవితంలో ధర్మాచరణం" అనే అంశంపై ఉపన్యసించిన ఆయన, కాలానుగుణంగా ధర్మంలో మార్పులు వచ్చినా సత్యం ఎప్పటికీ నిలకడగా ఉంటుందని తెలిపారు. సత్యం, అహింస, దయ, క్షమ, సహనం వంటి గుణాలు ధర్మానికి మూలాధారాలని, ఇవే మనిషిని ఉన్నత స్థాయికి తీసుకెళ్తాయని చెప్పారు. ఎక్కడ ధర్మం ఉంటుందో అక్కడ భగవంతుని సాన్నిధ్యం తప్పక ఉంటుందని, శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా నిలిచిన మహానుభావుడని వివరించారు. ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో ధర్మాచరణకు పెద్దపీట వేయాలని, ముఖ్యంగా తల్లిదండ్రులను గౌరవించడం, గురువులను స్మరించడం, పెద్దలను ఆదరించడం, అవసరంలో ఉన్నవారికి సహాయం చేయడం మన బాధ్యత అని చెప్పారు.

## అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు వ్యవహారం.. హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు

**విజయవాడ ఏప్రిల్ 16 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంపై దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. అమరావతి ఔటర్ రింగ్ రోడ్డు పిల్‌పై విచారణ జరిపిన హైకోర్టు ఈ సందర్భంగా రహదారి నిర్మాణాన్ని నిలిపివేయాలన్న పిటిషనర్ అభ్యర్థన తిరస్కరించింది. విచారణ సందర్భంగా పలు తీవ్ర వ్యాఖ్యలు చేసింది.

ఇటీవలి కాలంలో మెజారిటీ ప్రజాహిత వ్యాజ్యాలు రాజకీయ దురుద్దేశాలతో దాఖలవుతున్నాయని పేర్కొంది. ఈ పిల్ కూడా నిజంగా సదుద్దేశంతోనే దాఖలైందా అనే అనుమానం కలుగుతోందని కోర్టు వ్యాఖ్యానించింది. ఓఆర్ఆర్ ఎక్కడ నిర్మించాలనే అంశాన్ని ఒక వ్యవసాయదారుడు ఎలా నిర్ణయిస్తారని హైకోర్టు ప్రశ్నించింది. మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల విషయంలో కోర్టు జోక్యం చేసుకోబోదని స్పష్టం చేసింది. అయితే, కేసుకు సంబంధించి మరిన్ని వివరాలు సమర్పించేందుకు సమయం ఇవ్వాలని పిటిషనర్ తరపు న్యాయవాది కోర్టును కోరారు. దీంతో తదుపరి విచారణను హైకోర్టు రెండు వారాలకు వాయిదా వేసింది.

# రాష్ట్రంలో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుపై కీలక నిర్ణయం

**- ప్రభుత్వ ప్రకటనలకు అనుగుణంగా వచ్చే దరఖాస్తులు మాత్రమే పరిగణన..**

**- స్వచ్ఛందంగా చేసే ప్రతిపాదనలు పరిశీలించబడవన్న మంత్రి సత్యకుమార్ యాదవ్..**

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాత వార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఇబ్బడిముబ్బడిగా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటు నేపథ్యంలో ప్రతి సంవత్సరం వేలాది నర్సింగ్ సీట్లు మిగిలిపోతున్నందున పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకనుంచి రాష్ట్ర అవసరాల దృష్ట్యా నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వం ఇచ్చే ప్రకటనల మేరకు వచ్చే ప్రతిపాదనల్ని మాత్రమే పరిశీలిస్తామని వైద్యారోగ్య శాఖా మంత్రిసత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. గురువారంనాడు వెలగపూడి లోని ఏపీ సచివాలయంలో నర్సింగ్ విద్యకు సంబంధించిన పలు అంశాల సమీక్షా సమావేశంలో విస్తృత చర్చ అనంతరం మంత్రి ఈ మేరకు స్పష్టమైన ప్రకటన చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే 691 నర్సింగ్ విద్యా సంస్థలు నడుస్తున్నాయని, వీటి ద్వారా ప్రతి ఏడాదీ దాదాపు 32,000 మంది నర్సులు పట్టభద్రుల వుతున్నారని, దరిమిలా గత కొన్నేళ్లుగా సుమారు 6,000 నర్సింగ్ సీట్లు భర్తీ కాకుండా మిగిలిపోతున్నాయని సమీక్షలో అధికారులు మంత్రికి వివరించారు. 2014 నుంచి నేటి వరకు 243 నర్సింగ్ కాలేజీలు, స్కూళ్ల మంజూరు చేయబడ్డాయని వారు తెలిపారు. ఇవన్నీ వివిధ సంస్థల స్వీయ ప్రతిపాదనల మేరకు (సుమోటో) వివిధ ప్రభుత్వాలు మంజూరు చేశాయి. ఇందుకు భిన్నంగా మొదటిసారిగా కూటమి ప్రభుత్వం గత ఏడాది రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో నర్సింగ్ విద్యా సంస్థల ఏర్పాటుకు ఔత్సాహిక సంస్థల నుంచి దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ ప్రకటనకు స్పందించి వచ్చిన దాదాపు 345 దరఖాస్తులు హైపవర్ కమిటీ పరిశీలనలో ఉన్నాయి. ఈ కారణాల వలన పరిస్థితిని చక్కదిద్దేందుకు మంత్రి సత్యకుమార్ యాదవ్ కీలక నూతన నిర్ణయాన్ని ప్రకటించారు. గిరిజన ప్రాంతాలకు సంబంధించి ఈ విషయంలో మినహాయింపు ఉంటుందని మంత్రి తెలిపారు. సమీక్షలో హైపవర్ కమిటీ ఛైర్మన్, న్యాయమూర్తి ఉప్పాక దుర్గాప్రసాదరావు, ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, డిఎంఇ డాక్టర్ రఘునందన్, రాష్ట్ర నర్సింగ్ కౌన్సిల్ రిజిస్ట్రార్ సుశీల పాల్గొన్నారు.

# రాష్ట్ర పండుగగా భగీరథ జయంతి

**- మంత్రి సవిత**

**విజయవాడ, ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** మహర్షి భగీరథుని జయంతిని ఈ నెల 23న రాష్ట్ర పండుగగా నిర్వహించనున్నట్లు రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. ఆరోజు రాష్ట్ర వ్యాప్తంగా భగీరథుని జయంతి అధికారికంగా నిర్వహించేలా కూటమి ప్రభుత్వం జీవో జారీచేసిందన్నారు. ఈ మేరకు గురువారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సగర కులస్తుల ఆరాధ్య దైవం మహర్షి భగీరథుడన్నారు. ఒంటికాలిపై నిల్చొని, భారీ తపస్సు చేసి, గంగను దివి నుంచి భువి తీసుకొచ్చిన మహానీయుడన్నారు. తన పట్టుదలతో, కఠోర తపస్సుతో భగీరథుడు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్నారు. భగీరథుని త్యాగం, పట్టుదల నేటి తరానికి తెలియ జేయాలన్న సంకల్పంతో ఆ మహానీయుని జయంతిని ఈ నెల 23న రాష్ట్ర పండుగగా అధికారికంగా నిర్వహించనున్నా మన్నారు. కర్నూలులో భగీరథుని రాష్ట్ర స్థాయి జయంత్యోత్సవం చేపట్టనున్నామన్నారు. గతేడాది విశాఖలోని గాజువాకలో అంగరంగ వైభవంగా భగీరథుని రాష్ట్ర స్థాయి జయంతిని నిర్వహించినట్లు మంత్రి సవిత గుర్తు చేశారు.

# ఘనంగా కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రముఖ తెలుగు నాటకరంగ పితామహుడు, సంఘ సంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులు 178 వ జయంతి వేడుకలు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చలన చిత్ర, టీవీ మరియు నాటకరంగ అభివృద్ధి సంస్థలో గురువారం ఘనంగా నిర్వహించారు. విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్ ప్రాంగణంలోని ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ 4వ అంతస్తు లోని ఎఫ్.డి.సి (నీదీది) కార్యాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి సందర్భంగా ఏపీఎస్ఎఫ్టీవీటీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ మాట్లాడుతూ.. మొట్టమొదటి తెలుగు నాటక రచయితగా గుర్తింపు పొందిన కందుకూరి జన్మదినమైన ఏప్రిల్ 16 ను ప్రతి ఏటా ఖితెలుగు నాటకరంగ దినోత్సవంఖిగా జరుపుకుంటున్నామని గుర్తుచేశారు. ఆయన రచించిన ఖివ్యవహార ధర్మబోధినిఖి తొలి తెలుగు రూపక ప్రదర్శన జరిగిన నాటకమని, వీరేశలింగం పంతులు గొప్ప రచయిత మాత్రమే కాక, నవయుగ వైతాళికుడని కొనియాడారు. ఆధునిక ఆంధ్ర సమాజ పితామహుడిగా కందుకూరి చేసిన సామాజిక విప్లవం చిరస్మరణీయమని, వారిని స్మరించుకోవడం మనందరి అదృష్టంగా భావిస్తున్నామన్నారు. నాటకాలు, ప్రహసనాలు, స్వతంత్ర రచనలతో పాటు ప్రాచీన భారతీయ, పాశ్చాత్య సాహిత్యాన్ని సైతం వారు తెలుగులోకి అనువదించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎఫ్.డి.సి జనరల్ మేనేజర్ ఎం. శ్రీనివాస్ నాయక్, మేనేజర్ చల్లా శ్రీనివాసులు, సంస్థ సిబ్బంది పాల్గొని కందుకూరి వీరేశలింగం పంతులు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

# ఆర్టీసి స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం నిధులు విడుదల

**విజయవాడ, ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీఎస్ ఆర్టీసీ ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం మరో శుభవార్త తెలిపింది. స్టాఫ్ రిటైర్మెంట్ బెనిఫిట్ స్కీం (ఎస్ఆర్‌బిఎస్) నిధులు వాపస్ చేసేందుకు నిధులు విడుదల చేసింది. ఏపీఎస్ఆర్టీసిని ఎస్ఆర్‌బీఎస్ సభ్యులై పొదుపు చేసిన ఆర్టీసీ ఉద్యోగుల డబ్బు వాపస్ చేయనుంది. 2030 మే నెల వరకు రిటైర్డ్ అయ్యే ఉద్యోగులుకు చెల్లింపులు చేయాలని నిర్ణయించింది. దీంతో 8450 మంది ఆర్టీసీ ఉద్యోగులకు రూ. 75 కోట్లను ప్రభుత్వం విడుదల చేసింది. రిటైర్మెంట్ తర్వాత పింఛన్ కోసం ఎస్ఆర్ బీఎస్ ను ఏర్పాటు చేసుకున్న ఆర్టీసీ ఉద్యోగులు నెల నెలా కొంత మొత్తాన్ని పొదుపు చేసుకునేవారు. ప్రభుత్వంలో విలీనం అనంతరం ఎస్ఆర్ బీఎస్‌ను గత ప్రభుత్వం రద్దు చేసింది. తాము పొదుపు చేసిన మొత్తం తిరిగి ఇవ్వాలని ఉద్యోగుల కోరిక మేరకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. నిధులు విడుదల చర్యలు తీసుకోవడంపై ఆర్టీసీ కార్మికపరిషత్ నేతలు కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. సీఎం చంద్రబాబు, రవాణామంత్రి రాంప్రసాదరెడ్డి, ఆర్టీసీ చైర్మన్‌కు కార్మిక పరిషత్ శేషగిరిరావు, వై శ్రీనివాస్ తదితరులు ధన్యవాదాలు తెలిపారు.

# ఇన్‌స్టా ఫ్రెండ్స్‌తో విహారయాత్ర

**- చిత్తూరులో అదృశ్యమైన ఇద్దరు మైనర్‌బాలికలు**

**- 48 గంటల్లో కేసును ఛేదించి పిల్లలను తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు**

**చిత్తూరు, ఏప్రిల్ 16 ప్రభాతవార్త:** ఇన్‌స్టాగ్రాంలో పరిచయం అయిన స్నేహితులతో విహారయాత్రకు వెళ్ళడానికి ఇంట్లో అనుమతి ఇవ్వరని నిర్ధారించుకున్న ఇద్దరు మైనర్ బాలికలు రెండు రోజుల క్రితం చిత్తూరు నుండి ఒక్కసారిగా అదృశ్యం అయ్యారు. సాయంత్రం అవుతున్నప్పటికీ మైనర్ బాలికలు ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన తల్లిదండ్రులు చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ పోతూరి మహేశ్వర్‌కు ఫిర్యాదు చేశారు. డిఎస్పీ వెంకట నారాయణ పర్యవేక్షణలో వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ పోతూరి మహేశ్వర్ ఆధ్వర్యంలో రెండు ప్రత్యేక బృందాలు ఈ కేసు దర్యాప్తును ప్రారంభించాయి. ఈ కేసు దర్యాప్తులో భాగంగా పోలీసు బృందాలు సాంకేతిక ఆధారాలు వినియోగించడంతో పాటు బాలికలు వినియోగించిన సోషల్ మీడియా అకౌంట్లను విశ్లేషించారు. అలాగే సిసి కెమెరా దృశ్యాలను పరిశీలించి చిత్తూరులో అదృశ్యం అయిన ఇద్దరు మైనర్ బాలికలు గుంటూరు, ఒంగోలు పరిసర ప్రాంతాల్లో వున్నట్లు గుర్తించారు. చిత్తూరు వన్‌టౌన్ ఇన్స్‌పెక్టర్ మహేశ్వర్ పోతూరి గుంటూరు, ఒంగోలు జిల్లాల పోలీసులను సమన్వయం చేసుకుని ఇద్దరు మైనర్ బాలికలను సురక్షితంగా గురువారం చిత్తూరు వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు రప్పించారు.

# సైబర్ నేరాల కట్టడిలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాలి

**- తిరుపతి పోలీస్‌శాఖ సమావేశంలో వక్తలు**




**తిరుపతి,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** సైబర్ నేరాలు విస్తరిస్తున్న నేపథ్యంలో బ్యాంకర్లు కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందని తిరుపతి జిల్లా పోలీస్ అధికారులు సూచించారు. ఈ సదస్సు ద్వారా సంబంధిత బ్యాంకు అధికారులతో గురువారం సాయంత్రం తిరుపతి పోలీస్ జిల్లా కార్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సైబర్ మోసాల నివారణపై బ్యాంకర్ల పాత్ర అంశంపై కీలకంగా సదస్సులో చర్చించారు. డిజిటల్ అరెస్ట్, సైబర్ మోసాలపై జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించారు. నేటి హైటెక్ మోసాలపై జాగ్రత్తలు, నివారణ చర్యలపై చర్చ సాగింది. పోలీస్, బ్యాంకింగ్ వ్యవస్థల మధ్య సమన్వయాన్ని బలోపేతం చేయాలని సూచించారు. వినియోగదారుల ఆర్థిక భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, బ్యాంకర్లు, పోలీసుల సమన్వయంతో సైబర్ నేరాలపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో బ్యాంకింగ్ రంగానికి చెందిన అధికారులతో కలిసి సైబర్ మోసాలను ఎలా గుర్తించాలి, వాటిని ఎలా అడ్డుకోవాలి, బాధితులకు త్వరితగతిన సహాయం అందించే విధానాలపై చర్చ జరిగింది ఇటీవల "డిజిటల్ అరెస్ట్" పేరుతో జరుగుతున్న మోసాలు, ఫేక్ కాల్స్, ఫిషింగ్ లింక్స్, వీగిశి మోసాలు వంటి హైటెక్ నేరాల పట్ల బ్యాంక్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

సైబర్ నేరాల విచారణలో వేగవంతమైన సమాచార మార్పిడి, ఖాతాల ఫ్రీజింగ్, బాధితులకు తక్షణ సహాయం అందించడం వంటి అంశాల్లో పరస్పర సహకారం అవసరమని స్పష్టం చేశారు. వినియోగదారుల ఆర్థిక భద్రతను కాపాడటం బ్యాంకింగ్ వ్యవస్థ యొక్క ముఖ్య బాధ్యత అని పేర్కొంటూ, ప్రజలకు సైబర్ భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా మోసాలను ముందుగానే అరికట్టవచ్చని ఎస్పీ సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు రవిమనోహరచారి,ఐ. రామకృష్ణ,ఏ. శ్రీనివాసులు, ఎస్‌బీ డీఎస్పీ గీతా కుమారి, డిఎస్పీలు శ్రీలత,శ్యామ్‌సుందర్, భక్తవత్సలం, జి. వి. రవికుమార్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# వాసవీ వనంలో వికసించిన సింధు

## ఫస్ట్ ఇయర్ ఇంటర్ సిఇసిలో స్టేట్ సెకండ్ ర్యాంక్



**ఏప్రిల్ 16, పశ్చిమగోదావరి జిల్లా బ్యూరో:** గ్రామీణ ప్రాంతమైన పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన కొవ్వూరి సింధు భవిత ఇంటర్ ప్రథమ సంవత్సరం సీఈసీ లో స్టేట్ రెండో ర్యాంక్ సాధించింది. 500 మార్కులకు గాను 491 సాధించి తెచ్చుకున్న రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు ద్వారా పశ్చిమగోదావరి జిల్లాకే మంచి పేరు తీసుకొచ్చింది. ఈ ర్యాంకు సాధించడానికి పదవ తరగతి ఉత్తీర్ణత అయినవేంటనే మొబైల్ వాడటం, టీవీ చూడడం గానీ తనకు తెలియదని చెప్పింది. ఇంత సాధించినా తాను భవిష్యత్తులో గౌరవమైన ఉపాధ్యాయ వృత్తి చేపడతానని అందుకే సోషల్ సబ్జెక్టు తీసుకున్నానని ప్రభాతవార్తకు తెలిపింది. తనకు తండ్రి కర్రి శ్రీనివాసరెడ్డి, తల్లి వెంకట శ్రీదేవి సహకారం ఎంతో ఉందని పదవ తరగతిలో ఉత్తమమైన మార్కులు సాధించినప్పటికీ ఫలానా కోర్సు తీసుకోమని ఒత్తిడి చేయలేదని సింధు తెలిపింది. పెనుగొండ శ్రీ వాసవి మహిళా కళాశాల ఉపాధ్యాయులు తనకెంతో సహకరించారని సులువైన మార్గంలో పాఠ్యాంశాలు బోధించారని తన విజయంలో కుటుంబ ప్రోత్సాహం కలశాల సహకారం ఎంతో ఉందని వివరించారు. ఈ సందర్భంగా తండ్రి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబానికి చెందిన తాను కుమార్తె ఉపాధ్యాయ వృత్తి ధ్యేయంగా సోషల్ సబ్జెక్టు తీసుకుంటానంటే సంతోషంగా ఒప్పుకున్నారన్నారు.

# విద్యుత్ సరఫరా వ్యవస్థలో భద్రతా ప్రమాణాలు అవసరం

**ఎస్పీడిసిఎల్ మాజీ సిఎండి జె.పద్మ జనార్ధన్ రెడ్డి**



**తిరుమల,ఏప్రిల్ 16ప్రభాతవార్తప్రతినిధి:** విద్యుత్ సరఫరా వ్యవస్థలో భద్రతా ప్రమాణాలు పాటించి, మెరుగైన విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని ఎస్పీడీసీఎల్ మాజీ సిఎండి జె.పద్మ జనార్ధన్ రెడ్డి సూచించారు. ఎలక్ట్రికల్ ఇన్స్టాలేషన్, నిర్వహణ, ముందస్తు జాగ్రత్త చర్యలు వంటి పలు సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించారు.భద్రతా ప్రమాణాలపై గురువారం మధ్యాహ్నం తిరుమలలోని ఎస్వీ మ్యూజియం ఆడిటోరియంలో టిటిడి సిబ్బందికి అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సిఎండి జె.పద్మజనార్ధన్ రెడ్డి అనేక అంశాలపై అవగాహన కల్పించారు. టిటిడి ఎడిఎఫ్ఒ పి.అనిల్ కుమార్ అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిటిడి డిఇ చంద్ర శేఖర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# కూటమి అరాచకాలను ఎండగట్టాలి: గాజువాక వైకాపా ఇంచార్జ్ తిప్పల దేవన్‌రెడ్డి

**గాజువాక,ఏప్రిల్ 16,ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం సాగిస్తున్న అన్యాయాలను, విస్మరించిన హామీలను ప్రజల్లో ఎండగట్టాలని గాజువాక వైఎస్ఆర్సీపీ సమన్వయకర్త తిప్పల శ్రీనివాస దేవన్‌రెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం పార్టీ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వార్డులో నాయకులు సమన్వయంతో పనిచేయాలని, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించాలని కోరారు. ముఖ్యంగా విశాఖ స్టీల్ ప్లాంట్ నిర్వాసితుల పక్షాన నిలబడాలని, ఖిరెడ్ బుక్ఖి రాజ్యాంగాన్ని ఇకపై ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల్లో గాజువాకలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు మర్దపూడి పరదేశి, పల్ల చిన్న తల్లి, ధర్మాల శ్రీనివాసరెడ్డి, ఎండి గౌస్, గొందేసి వెంకటరమణారెడ్డి, గంగులూరి రోజా రాణి, గొందేసి శ్రీనివాస్ రెడ్డి, బొడ్డ గోవింద్, మద్దాల అప్పారావు, ఎన్నేటి రమణ, చిత్రాడ వెంకటరమణ, పెదిరెడ్ల ఈశ్వరరావు, హరీష్, పల్ల పెంటారావు, జిలకర నాగేంద్ర, ధర్మపురి చక్రి, ములకలపల్లి వెంకటేష్, విరోధి గణేష్, పువ్వుల శ్రీను, టేకేటి శ్రీను పాల్గొన్నారు.





విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
26

## నారా లోకేష్ పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం హర్షణీయం

**విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



తెలుగుదేశం పార్టీ నవశకానికి వారధిగా, కోట్లాది మంది కార్యకర్తల ఆశల ఆశాకిరణంగా ఎదిగిన యువనేత నారా లోకేష్ గారు పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టడం హర్షణీయం. తన అసాధారణ పనితీరుతో, చెక్కుచెదరని సంకల్పంతో అటు పార్టీ క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని, ఇటు యువతరాన్ని ఏకతాటిపైకి తెచ్చిన లోకేష్ గారి నియామకం.. టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయం. నాయకత్వం అంటే కేవలం పదవి కాదు, అంకితభావంతో కూడిన బాధ్యత అని నిరూపించిన ఆయన, రాబోయే రోజుల్లో పార్టీని మరిన్ని విజయ తీరాలకు చేర్చడం ఖాయం. ఈ సందర్భంగా నాపై నమ్మకముంచి రెండోసారి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన గౌరవ నాయకులు, నవ్యాంధ్ర శిల్పి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను. అట్టడుగు వర్గాలకు, బీసీలకి రాజకీయంగా అండగా నిలబడటం ఒక్క తెలుగుదేశం పార్టీకే సాధ్యం. ఒక బీసీ బిడ్డగా నాకు ఈ స్థాయి గుర్తింపు లభించిందంటే అది చంద్రబాబు గారి దూరదృష్టి, బీసీల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనం. యువగళం పాదయాత్రతో ప్రజల గొంతుకగా మారిన లోకేష్ గారి నాయకత్వంలో, చంద్రబాబు గారి మార్గదర్శకత్వంలో పార్టీని మరింత సమర్థంగా ముందుకు తీసుకెళ్తాం. కార్యకర్తల సంక్షేమమే ధ్యేయంగా, సీనియర్ల అనుభవాన్ని గౌరవిస్తూనే.. యువతను ప్రోత్సహిస్తూ తెలుగుదేశం పార్టీని భవిష్యత్ తరాలకు ఒక తిరుగులేని శక్తిగా తీర్చిదిద్దుతామని ఈ సందర్భంగా సగర్వంగా తెలుపుతున్నాంకార్యకర్తల సంక్షేమ నిధి, డిజిటల్ మెంబర్‌షిప్‌లో కోటి సభ్యత్వాల విప్లవం ద్వారా లోకేష్ గారు పార్టీకి ఒక కార్పొరేట్ అండ్ ఎమోషనల్ స్ట్రక్చర్‌ని ఇచ్చారు.సామాన్య బీసీ కార్యకర్తకు కూడా రాష్ట్ర స్థాయి బాధ్యతలు ఇచ్చే ఏకైక పార్టీ టీడీపీ అని నొక్కి చెప్పడం. యువగళం స్ఫూర్తితో పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడం మా ముందున్న లక్ష్యం.

## టిబి ముక్తి భారత్ అభియాన్ 2.0 గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ

**విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



టిబి ముక్తి భారత్ అభియాన్ 2.0 (టీబిఎంబీఏ) కార్యక్రమంలో భాగంగా గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారుదగ్గు, జ్వరం , బరువు తగ్గడం ,ఆకలి మందగించడం, రాత్రి చెమటలు పట్టడం, అలసట, కఫంలో రక్తపు చారులు లక్షణాలు ఉంటే దగ్గరలో ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి, తగు పరీక్షలు చేయించాలని సూచటిబి ముక్తి భారత్ అభియాన్ 2.వీ (టీబిఎంబీఏ) కార్యక్రమంలో భాగంగా ఈరోజు విశాఖ దక్షిణ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీనివాస్ గారు శివాజీపాలెం క్యాంప్ కార్యాలయంలో గోడ పత్రికలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ గారు మాట్లాడుతూ టీబీ రహిత భారతదేశం నిర్మించాలంటే ప్రజలందరూ ఈ కార్యక్రమంలో భాగస్వామి కావాలని, ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్దినం చేసుకోవాలని అలాగే ఎవరికైనా రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం , బరువు తగ్గడం ,ఆకలి మందగించడం, రాత్రి చెమటలు పట్టడం,

మిగతా 8..లో

## ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్పీకర్ అయ్యన్న అభినందనలు

**నర్సీపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు స్పీకర్ గౌరవ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారి ఆశీస్సులునిన్న విడుదలైన ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో నర్సీపట్నంలో ఉత్తమ ర్యాంకులు సాధించిన వివిధ కళాశాలల విద్యార్థినీ విద్యార్థులు గురువారం క్యాంపు కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గౌరవ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను ఆశీర్వదించి, భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఉన్నతంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. ఇంతటి అద్భుతమైన ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ప్రగతి, మేధస్వి మరియు రిషి తదితర జూనియర్ కళాశాలల కరస్పాండెంట్లు, డైరెక్టర్లు మరియు అధ్యాపక బృందాలను గౌరవ చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు ప్రత్యేకంగా అభినందించారు. ఈ ఫలితాలలో స్థానిక కళాశాలల విద్యార్థులు టౌన్ మరియు జిల్లా స్థాయిలో అత్యధిక మార్కులు సాధించి సత్తా చాటారు. ముఖ్యంగా ద్వితీయ సంవత్సరం ఎంపీసీ విభాగంలో రిషి జూనియర్ కళాశాలకు చెందిన వి. ఈశ్వర్ 1000కి 990 మార్కులు, ప్రగతి కళాశాలకు చెందిన

మిగతా 8..లో

## పాస్ చేయండి సార్.. ఇంటర్ బోర్డుకు విద్యార్థి ఫోన్..

- *కౌన్సిలింగ్ ఇచ్చిన ఇంటర్ బోర్డు అధికారులు*
- *ఫెయిల్ అవుతాననే భయంతో బోర్డుకు ఫోన్ చేసిన విద్యార్థి*
- *పాస్ చేయాలని, జవాబు పత్రాల్లో డబ్బులు పెట్టానని వెల్లడి*
- *విద్యార్థికి ఫోన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చి ధైర్యం చెప్పిన అధికారులు*
- *ఫలితాల్లో మొత్తం ఐదు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థి*
- *తల్లిదండ్రులతో మాట్లాడి జాగ్రత్తలు చెప్పిన జిల్లా యంత్రాంగం*

**విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**

వివరాల్లోకి వెళితే, విశాఖకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఒకరు బుధవారం ఫలితాలకు ముందు బోర్డు అధికారులకు ఫోన్ చేశాడు. పరీక్షల్లో ఏమీ చదవలేదని, జవాబు పత్రంలో ప్రశ్నాపత్రాన్నే మూడుసార్లు రాశానని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, పాస్ చేయాలనే ఉద్దేశంతో జవాబు పత్రాల్లో డబ్బులు కూడా పెట్టానని అధికారులకు చెప్పాడు.అతని ఆందోళనను అర్థం చేసుకున్న అధికారులు వెంటనే స్పందించి, ఫోన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. కంగారు పడాల్సిన అవసరం లేదని, త్వరలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

మిగతా 8..లో

# భోగాపురం ఎయిర్‌పోర్టుతో.. ఉత్తరాంధ్రలో అభివృద్ధి పరుగులు!

- *ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతం*
- *క్యూ కట్టనున్న పెట్టుబడిదారులు ఐటీ, పర్యాటక రంగం అభివృద్ధితో యువతకు పెరగనున్న ఉపాధి అవకాశాలు*

**(ప్రభాతవార్త, విశాఖపట్నం)**



భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం నిర్మాణం పూర్తయితే ఉత్తరాంధ్ర జిల్లాలు, ముఖ్యంగా విశాఖ అభివృద్ధిలో కొత్త దశ ప్రారంభమవుతుందని నిపుణులు భావిస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తితో ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థకు గణనీయమైన ఊతం లభించే అవకాశం ఉంది. భోగాపురం ఎయిర్‌పోర్ట్ ప్రారంభమైతే అంతర్జాతీయ, దేశీయ విమాన సౌకర్యాలు మరింత విస్తరించడంతో పెట్టుబడులు పెరిగే అవకాశం ఉంది. పరిశ్రమలు, ఐటీ రంగం, పర్యాటక రంగం అభివృద్ధి చెందడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని అంచనా. విశాఖపట్నం ఇప్పటికే పారిశ్రామిక, వాణిజ్య కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో, భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఆ అభివృద్ధికి మరింత బలం చేకూరుస్తుంది. పోర్టు, రైల్వే, రోడ్డు మార్గాలతో కలిసిన సమగ్ర రవాణా వ్యవస్థ

మిగతా 8..లో

## సింహాద్రి అప్పన్న చందనోత్సవం వేళ సామాన్య భక్తులకు ఇబ్బందుల మోత

- *చందనోత్సవం టికెట్ కష్టాలు*
- *బ్యాంకుల్లో గంటలోపే టికెట్లు కాళీ*



**సింహాచలం, ప్రభాతవార్త**

సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్న ప్రభుత్వ, అధికార యంత్రాంగం మాటలు క్షేత్రస్థాయిలో నీటి మూటలుగానే మిగిలాయి. ఉత్సవానికి వారం రోజుల ముందే భక్తులకు టికెట్ల కష్టాలు మొదలయ్యాయి. ఈ ఏడాది 70 శాతం టికెట్లను ఆన్లైన్లో, 30 శాతం ఆఫ్ లైన్ (బ్యాంకుల) ద్వారా విక్రయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ నిర్ణయం భక్తులకు వరానికి బదులు శాపంగా మారింది. మొరాయించిన వెబ్సైట్.. కట్ అవుతున్న నగదు రూ.300, రూ.1000 దర్శన టికెట్లు ఈనెల 12వ తేదీ నుంచి ఆన్లైన్లో అందుబాటులో ఉంటాయని

మిగతా 8..లో

## వార్డుల్లో త్వరలో సేవల మేళా

- రికార్డు స్థాయిలో రూ. 620.08 కోట్లు ఆస్తి పన్ను వసూళ్లు
- 5శాతం రిబేట్‌తో పన్నులు చెల్లించండి
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్

**విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



నగర ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించేందుకు వార్డు మరియు జోనల్ స్థాయిలో త్వరలో ఖిసర్వీస్ మేళాఖి నిర్వహించనున్నట్లు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ వెల్లడించారు. గురువారం ఆయన చాంబర్లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఈ విషయాన్ని తెలిపారు. ప్రజలు నిత్యం ఎదుర్కొనే సమస్యలను ఒకేచోట పరిష్కరించే విధంగా ఈ సేవల మేళాను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తామని చెప్పారు. ఇంటి పన్ను పేరు మార్పులు, నిర్మాణ అనుమతులు, నీటి కనెక్షన్లు, చెల్లింపుల సమస్యలు వంటి సేవలు ఈ మేళా ద్వారా తక్షణమే పరిష్కారం అవుతాయని వివరించారు.రికార్డు స్థాయిలో ఆస్తి పన్ను వసూళ్ల202526 ఆర్థిక సంవత్సరంలో ఆస్తి పన్ను వసూళ్ల రికార్డుస్థాయిలో రూ.620.08 కోట్లకు చేరుకున్నా యని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే రూ.110 కోట్లు అధికంగా వసూలు చేసినట్లు పేర్కొన్నారు. కొత్తగా 7,500 భవనాలను గుర్తించి పన్ను పరిధిలోకి తీసుకొచ్చామని చెప్పారు. ఏప్రిల్ 30లోపు బకాయి పన్నులు చెల్లిస్తే 50 శాతం వడ్డీ మాఫీ లభిస్తుందని, అలాగే 2026 27 సంవత్సరానికి ముందుగానే మొత్తం పన్ను చెల్లిస్తే 5శాతం రిబేట్

మిగతా 8..లో

## విశాఖలో నాటక ప్రదర్శనలు అద్వితీయం

- *ఇండియన్ నేవీ రియర్ అడ్మిరల్ మురళీమోహన్*
- *ముగిసిన కళాభారతి కీ. శే. పైడా కౌశిక్ 2026 ఐదు రోజుల నాటకోత్సవాలు*
- *చివరి రోజు ప్రదర్శనకు కిక్కిరిసిన కళాభారతి ఆడిటోరియం*

**విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



విశాఖ వంటి మహానగరంలో నాటక ప్రదర్శనలు నిర్వహించడం అద్వితీయమని ఇండియన్ నేవీ రియర్ అడ్మిరల్ మురళీమోహన్ అన్నారు. విశాఖ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ కళాభారతి కీ, శే, పైడా కౌశిక్ నాటకోత్సవాలు 2026 గురువారంతో ఘనంగా ముగిసాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై వరుణ్ గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రభు కిషోర్, కళాభారతి అధ్యక్షులు మాన్యశ్రీ మంతెన సత్యనారాయణ రాజు, కార్యదర్శి డాక్టర్ జి ఆర్ కే ప్రసాద్ (రాంబాబు) , మహారాజ పోషకులు మాన్యశ్రీ కోశాధికారి

మిగతా 8..లో

## పల్లాకు అభినందనల నీరాజనం

- *టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు*
- *ఘనంగా సత్కరించిన గాజువాక నియోజకవర్గ శ్రేణులు*



**గాజువాక, ఏప్రిల్ 16,ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టిన స్థానిక శాసనసభ్యుడు పల్లా శ్రీనివాసరావుకు నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. గురువారం ఆయన గాజువాకలోని పార్టీ కార్యాలయానికి విచ్చేసిన సందర్భంగా నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఆయనను ఘనంగా సత్కరించారు. బాణసంచా కాల్చి, మిఠాయిలు తినిపించి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు

మిగతా 8..లో

## చెడు స్నేహాలు చెయ్యొద్దు..

- *యువతి ఆత్మహత్యకు కారణమైన ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలింపు*
- *సోషల్ మీడియాకు దూరంగా ఉండండి ద్వారక ఏసిపి అన్నెపు నరసింహమూర్తి*

**ఆరిలోవ ఏప్రిల్ 16 ప్రభాతవార్త**

యువత చెడు స్నేహాలు చెయ్యొద్దని, తల్లితండ్రులు మాటవిని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని, ముఖ్యంగా సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ద్వారక ఏసిపి అన్నెపు నరసింహమూర్తి అన్నారు. ఈ మేరకు గురువారం ఆరిలోవ పోలీస్ స్టేషన్లో విశాలాక్షి నగర్ వీ స్క్వేర్ విల్లాలో యువతి ఆత్మహత్య విషయమై విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఏసిపి మాట్లాడుతూ ఆకుమర్తి శాంతి కుమారి అనే యువతి మంగళవారం విశాలాక్షి నగర్ లో ఉన్న వి స్క్వేర్ విల్లా లాడ్జిలో రూమ్ నెంబర్ 118లో ఉరి వేసుకున్న విషయం తెలిసిందే. శాంతి కుమారి తో పాటు ఉన్న ఆరుగురు స్నేహితులు వేధింపులు కారణంగానే ఆమె ఉరి వేసుకున్నట్లు ఏసిపి అన్నారు. ముఖ్యంగా సాయికుమార్, రంప లక్ష్మీ సంజనతో గొడవ జరిగిందని అయితే ఈ గొడవలో శాంతి కు ఇష్టానుసారంగా వీరిద్దరూ కొట్టడంతో ఆమె మనస్తాపం రూమ్ కు వెళ్లి తలుపు గడియ పెట్టుకొని ఉరివేసుకున్నట్లు తెలిపారు. వీరితోపాటు గొప్పసానా వెంకట సాయి జస్వంత్, వాసుపల్లి సాయి కిరణ్, పూడిరెడ్ల మణి, నర్వా సాయికుమార్ లను అదుపులో తీసుకొని విచారణ చేపట్టి కేసు నమోదు చేశామన్నారు. అనంతరం కోర్టుకి హాజరు పరిచి రిమాండ్ కు తరలించినట్లు ఏసీపీ తెలిపారు. ఈ సమావేశంలో సిఐ హెచ్ మల్లేశ్వరరావు శాంతిభద్రతల ఎస్సైలు వరహాల నాయుడు, రాజేశ్వరి పాల్గొన్నారు.



## నర్సీపట్నంలో స్వీయగణన చేసుకున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు

**నర్సీపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త**



భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణన2027 ప్రక్రియలో భాగంగా, ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ గౌరవనీయులు చింతకాయల అయ్యన్నపాత్రుడు గారు గురువారం నాడు నర్సీపట్నంలోని తన నివాసంలో స్వయంగా స్వీయ గణన చేసుకున్నారు. దేశవ్యాప్తంగా నేటి నుండి (ఏప్రిల్ 16) ప్రారంభమైన ఇళ్ల జాబితా మరియు ఇళ్ల గణన తొలి విడత కార్యక్రమంలో భాగంగా, ఆయన అధికారిక వెబ్‌సైట్ ఓపెన్ చేసి తన కుటుంబ వివరాలను స్వయంగా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేశారు. ఈ సందర్భంగా స్పీకర్ గారు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఈ గణనలో పాల్గొని దేశాభివృద్ధికి సహకరించాలని పిలుపునిచ్చారు. ప్రజలే తమ వివరాలను స్వయంగా నమోదు చేసుకునేలా కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఈ ఖిస్వీయ గణనఖి అద్భుతమైన అవకాశమని, దీనివల్ల సమయం ఆదా అవ్వడమే కాకుండా కచ్చితమైన వివరాలు నమోదవుతాయని ఆయన పేర్కొన్నారు. ఏప్రిల్ 16 నుండి 30వ తేదీ వరకు అందుబాటులో ఉండే ఈ డిజిటల్ విధానాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని, నమోదు పూర్తి చేసిన తర్వాత వచ్చే ఐడీ (ıదీ)ని భద్రపరుచుకోవాలని సూచించారు. మే 1వ తేదీ నుండి ఎన్యుమరేటర్లు క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తారని, ఆ సమయంలో ఈ ఐడీని వారికి చూపించాల్సి ఉంటుందని తెలిపారు. తప్పుడు సమాచారం నమోదు చేయకుండా, వాస్తవ వివరాలతో ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డీవో వి.వి. రమణ, తహసీల్దార్ రామారావు తదితరులు పాల్గొని స్వీయ గణన ప్రక్రియను పర్యవేక్షించారు.

ong-8_ong-8.qxd 4/17/2026 12:18 AM Page 1



మొదటిపేజీ తరువాయిలు

## వార్డుల్లో త్వరలో సేవల మేళా

పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని నగర ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు.మురికివాడల రహిత నగరంగా విశాఖ విశాఖను మురికివాడల రహిత నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కమిషనర్ కేతన్ గార్గ్ వివరించారు. మొదటి దశలో వేలంపేట, ఇందిరానగర్ ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. నగరంలో ఉన్న 660 మురికివాడలను దశలవారీగా అభివృద్ధి చేస్తామని చెప్పారు.పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచడానికి 570 మంది సిబ్బందిని నియమించామని, త్వరలో 50 కొత్త వాహనాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. భవన నిర్మాణ వ్యర్థాలను నిర్దేశిత కేంద్రాల్లోనే వేయాలని, లేదంటే రూ.25 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు.రూ. 25 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ వేసవిలో నీటి కొరత లేకుండా రూ.25 కోట్లతో సమ్మర్ యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నామని కమిషనర్ కేతన్ గార్గ్ తెలిపారు. శివారు ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా కొనసాగుతుందని చెప్పారు. వీధి వ్యాపారుల కోసం ప్రత్యేక వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నామని, నగరాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దేందుకు కొత్త ప్రణాళికలు అమలు చేస్తున్నామని వెల్లడించారు. జనాభా లెక్కల కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు 4,300 మంది ఎన్యుమినేటర్లు, 575 మంది సూపర్వైజర్లను నియమిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా జనగణనలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. నగర వార్డుల పునర్విభజన ప్రక్రియ కొనసాగుతోందని, ఈ నెల 24న తుది జాబితా విడుదల చేస్తామని తెలిపారు.

## భోగాపురం ఎయిర్‌పోర్టుతో.. ఉత్తరాంధ్రలో అభివృద్ధి పరుగులు!

ఏర్పడి లాజిస్టిక్స్ రంగం వేగంగా ఎదగనుంది. పర్యాటక రంగంలో కూడా విప్లవాత్మక మార్పులు చోటుచేసుకునే అవకాశం ఉంది. అరకు, బొర్రా గుహలు, తీర ప్రాంతాలు వంటి పర్యాటక ప్రదేశాలకు దేశ విదేశాల నుంచి పర్యాటకులు సులభంగా చేరుకునే వీలుంటుంది. అదనంగా, భోగాపురం పరిసర



ప్రాంతాల్లో రియల్ ఎస్టేట్ రంగం వేగంగా అభివృద్ధి చెందే అవకాశం ఉంది. కొత్త నివాస ప్రాజెక్టులు, వాణిజ్య సముదాయాలు ఏర్పడి పట్టణీకరణ వేగవంతమవుతుంది. ఈ నేపథ్యంలో భోగాపురం ఎయిర్‌పోర్ట్ ఉత్తరాంధ్ర జిల్లాల సమగ్ర అభివృద్ధికి కీలక మలుపు అవుతుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## సింహాద్రి అప్పన్న చందనోత్సవం వేళ సామాన్య భక్తులకు ఇబ్బందుల మోత



అధికారులు తెలిపారు. తీరా చూస్తే తొలిరోజే వెబ్సైట్ పూర్తిగా మొరాయించింది. గంటల తరబడి కంప్యూ టర్లు, మొబైల్స్ ముందు వేచి చూసిన భక్తులకు నిరాశే ఎదురైంది. సోమవారం వెబ్సైట్ కొంతవరకు అం దుబాటులోకి వచ్చినా, సాంకేతిక లోపాలు వీడలేదు. నగదు కట్ అవుతున్నా టికెట్లు రావడం లేదని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల వద్ద క్యూలు.. గంటలోనే ఖాళీనగరంలోని నాలుగు బ్యాంకు బ్రాంచీల (సింహాచలం అక్కయ్యపాలెం యూనియన్ బ్యాంకులు, సింహా చలం, బిర్లా జంక్షన్ స్టేట్ బ్యాంకులు) ద్వారా సోమవారం నుంచి ఆఫ్లైన్ విక్రయాలు ప్రారంభమ య్యాయి. టికెట్ల కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. అయితే, విక్రయాలు మొదలైన గంట వ్యవధిలోనే టికెట్లు అయిపోయాయని సిబ్బంది అరకొర టికెట్లే కారణమా?దేవస్థానం ఈవో జె. వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. తొలిరోజు సింహాచలంలోని యూనియన్ బ్యాంకుకు 1090 (700 రూ.300 టికెట్లు, 390 రూ.1000 టికెట్లు), స్టేట్ బ్యాంకుకు 1090 టికెట్లు మాత్రమే కేటాయించారు. వీటిలోనే కొన్నిటిని ఇతర బ్రాంచీలకు పంపారు. గతంలో నగరం అంతటా దాదాపు 20 బ్యాంకుల ద్వారా టికెట్లు విక్రయించే వారు. కానీ ఈసారి బ్యాంకుల సంఖ్యను తగ్గించి, ఆన్ లైను ప్రాధాన్యత ఇవ్వడం భక్తుల పాలిట ఇబ్బం దిగా మారింది.అటు ఆన్లైన్లో సాంకేతిక సమస్యలు, ఇటు బ్యాంకుల్లో అరకొర టికెట్లతో సామాన్య భక్తులు అప్పన్న దర్శనం కోసం అల్లాడిపోతున్నారు. ఇప్పటికై నా అధికారులు స్పందించి టికెట్ల సంఖ్యను పెంచాల ని, సాంకేతిక లోపాలను సరిదిద్దాలని భక్తులు కోరుతు న్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామన్న ప్రభుత్వ, అధికార యంత్రాంగం మాటలు క్షేత్రస్థాయిలో నీటి మూటలుగానే మిగిలాయి. ఉత్స వానికి వారం రోజుల ముందే భక్తులకు టికెట్ల కష్టాలు మొదలయ్యాయి. 50 శాతం టికెట్లను ఆన్లైన్లో, 50 శాతం ఆఫ్ లైన్ (బ్యాంకుల) ద్వారా విక్రయించానా భక్తులు కి కష్టాలు తప్పలేదు.మొరాయించిన వెబ్సైట్.. కట్ అవుతున్న నగదురూ.300, రూ.1000 దర్శన టికెట్లు ఈనెల 12,వ తేదీ నుంచి ఆన్లైన్లో అందుబాటులో ఉంటాయని అధికా రులు తెలిపారు. తీరా చూస్తే తొలిరోజే వెబ్సైట్ పూర్తిగా మొరాయించింది. గంటల తరబడి కంప్యూ టర్లు, మొబైల్స్ ముందు వేచి చూసిన భక్తులకు నిరాశే ఎదురైంది. సోమవారం వెబ్సైట్ కొంతవరకు అం దుబాటులోకి వచ్చినా, సాంకేతిక లోపాలు వీడలేదు. నగదు కట్ అవుతున్నా టికెట్లు రావడం లేదని భక్తులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బ్యాంకుల వద్ద క్యూలు.. గంటలోనే ఖాళీనగరంలోని నాలుగు బ్యాంకు బ్రాంచీల (సింహాచలం అక్కయ్యపాలెం యూనియన్ బ్యాంకులు, సింహా చలం, బిర్లా జంక్షన్ స్టేట్ బ్యాంకులు) ద్వారా ఆఫ్లైన్ విక్రయాలు ప్రారంభమ య్యాయి. టికెట్ల కోసం తెల్లవారుజాము నుంచే భక్తులు క్యూ కట్టారు. అయితే, విక్రయాలు మొదలైన నిముషాలు వ్యవధిలోనే టికెట్లు అయిపోయాయని సిబ్బంది తెలిపారుఅంది అందని టికెట్లే కారణమా?దేవస్థానం ఈవో జె. వెంకటరావు తెలిపిన వివరాల ప్రకారం.. తొలిరోజు సింహాచలంలోని యూనియన్ బ్యాంకుకు 1090 (700 రూ.300 టికెట్లు, 390 రూ.1000 టికెట్లు), స్టేట్ బ్యాంకుకు 1090 టికెట్లు మాత్రమే కేటాయించారు. వీటిలోనే కొన్నిటిని ఇతర బ్రాంచీలకు పంపారు. గతంలో నగరం అంతటా దాదాపు 20 బ్యాంకుల ద్వారా టికెట్లు విక్రయించే వారు. కానీ ఈసారి బ్యాంకుల సంఖ్యను తగ్గించి, ఆన్ లైను ప్రాధాన్యత ఇవ్వడం భక్తుల పాలిట ఇబ్బం దిగా మారింది.అటు ఆన్లైన్లో సాంకేతిక సమస్యలు, ఇటు బ్యాంకుల్లో అరకొర టికెట్లతో సామాన్య భక్తులు అప్పన్న దర్శనం కోసం అల్లాడిపోతున్నారు. టికెట్ విక్రయాల్లో కూడా లోపంబ్యాంకుల్లో విక్రయించిన టికెట్లు కేవలము ఉదయం 11.30 నుండి 12.30 గంటల వరకు, 2.30 నుండి 3.30 స్లాట్లు ,సాయంత్రం స్లాట్లు మాత్రమే టికెట్ లు విక్రయించు చున్నారు. మరి ఉదయం ఉదయం స్లాట్లు ఏమైనట్లు? దేవస్థానం వారికి అనుకూలంగా నచ్చిన వారికి ఉదయం టికెట్ లు విక్రయించుతున్నట్లు భక్తులు ఆవేదన. మూడు రోజులకు విక్రయించుచున్న టికెట్లు 90 శాతము 11 గంటల తరువాత ఇచ్చినవే, ఆన్ లైన్ లో ఏ సమయం లో టికెట్స్ పెడుతున్నారు అని ఆవేదన చెందుతున్నారు. రోజు ఏదో ఒక సమయం లో టికెట్స్ ఆన్ లైన్ లో పెట్టిన యెడల భక్తులు 24 గంటలు నిరీక్షించే అవసరం ఉండదు అని భక్తులు ఆవేదన.

## పల్లాకు అభినందనల నీరాజనం

క్రమశిక్షణ గల కార్యకర్తగా పల్లా అందించిన సేవలు అమోఘమని కొనియాడారు. ఆయన నిబద్ధతను గుర్తించే పార్టీ జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ బాబులు రెండోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించారని పేర్కొన్నారు. పల్లా నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆకాంక్షించారు. ఈ అభినందన కార్యక్రమంలో జీవీఎంసీ మాజీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాసరావు, కార్పొరేటర్ లేళ్ళ కోటేశ్వరరావు,రాజాన రామారావు,72వ వార్డ్ టీడీపీ సీనియర్ నేత సాలాపు రామారావు,నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు గొల్లవిల్లు భవాని, జిల్లా టీడీపి కన్వీనర్ కొత్తపల్లి ఉషారాణి, బీసీ సెల్ నేతలు తమరి శివప్రసాద్, దొడ్డి సత్యరావు, జిల్లా ఉపాధ్యక్షులు కర్ణం సత్యారావు, నాయకులు కర్రి దశయేంద్ర, నమ్మి అప్పారావు, కనితి సన్యాసమ్మ, మాధవ్, మురళి, సమ్మిడి ఉమా, కాకి స్వరూప రాణి తదితరులు పాల్గొన్నారు.

## పాస్ చేయండి సార్.. ఇంటర్ బోర్డుకు విద్యార్థి ఫోన్..

పరీక్షలు ఉంటాయని, వాటి కోసం బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం ఈ విషయాన్ని విశాఖపట్నం ఆర్ఐఓ (రీజనల్ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్) దృష్టికి తీసుకెళ్లి, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని కోరారు.జిల్లా అధికారులు రంగంలోకి దిగి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. కాగా, వెలువడిన ఫలితాల్లో ఆ విద్యార్థి మొదటి సంవత్సరంలో రెండు, ద్వితీయ సంవత్సరంలో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. విద్యార్థి ఇంట్లోనే సురక్షితంగా ఉన్నాడని, తాము జాగ్రత్తగా చూసుకుంటామని అతని తల్లిదండ్రులు అధికారులకు హామీ ఇచ్చారు.

## విశాఖలో నాటక ప్రదర్శనలు అద్వితీయం

పైడా కృష్ణప్రసాద్, రామకృష్ణ లతో కలిసి జ్యోతి ప్రజ్వలను గావించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి మాట్లాడుతూ నాటకాలు ఇంకా కొనసాగుతున్నాయంటే ప్రేక్షకులకు నాటకాలపై ఉన్న అభిరుచే కారణమన్నారు. బొంబాయి వంటి నగరంలోని నాటకాలు తిలకించాలంటే బుక్ మై షో వంటి యాప్ ద్వారా సుమారు రూ.రెండు వేల వరకు ఖర్చు చేసి వెళ్లాల్సి ఉంటుందన్నారు. కానీ విశాఖలోని కళాభారతిలో ఉచితంగా నాటక ప్రదర్శనలు వేయడం అత్యంత అభినందనీయమన్నారు. మరో అతిథిగా హాజరైన వరుణ్ గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ ప్రభు కిషోర్ మాట్లాడుతూ చాలాకాలం తర్వాత నాటకాన్ని పూర్తిగా వీక్షించడం ఎంతో ఆనందంగా ఉన్నారు. మంచి నాటక ప్రదర్శనలు ఇస్తున్న కమిటీ సభ్యులందరిను అభినందిస్తున్నానని తెలియజేశారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాభారతి ట్రస్టీ కార్యదర్శి డాక్టర్ జి ఆర్ కే ప్రసాద్ (రాంబాబు) మాట్లాడుతూ ఐదు రోజుల పాటు విశేషంగా 9 నాటక ప్రదర్శనలు జరిగాయని అన్నారు. నేటికీ నాటకం ఆదరణ లభిస్తుంది అంటే ప్రేక్షకులతో ఆడిటోరియం నిండిన విధానమే అర్థం చేసుకోవచ్చని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే తరహాలో కార్యక్రమాలు చేపడతామని తెలియజేశారు. కళాభారతి అధ్యక్షులు మంతెన సత్యనారాయణ రాజు మాట్లాడుతూ ప్రేక్షకుల ఆదరణ ద్వారానే గడిచిన 40 ఏళ్లుగా కళా సంబంధిత కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. మహారాజ పోషకులు కోశాధికారి పైడా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ నాటకాలను నేటి తరం యువతీ, యువకులకు అందించాలని ఉద్దేశంతో కార్యక్రమాలను చేపట్టామని తెలియజేశారు. గడిచిన ఐదు రోజులుగా ప్రజలకు నాటకంలో ఉన్న గొప్పతనాన్ని వివరించేందుకు అవకాశం కలిగిందన్నారు. అనంతరం వీక్షించిన ప్రేక్షకులకు సీఎంఆర్ సంస్థ అందజేసిన ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథుల చేతులు మీదుగా ఐదు రోజులు నాటకోతవాల్లో. గెలుపొందిన విజేతలకు బహుమతి ప్రధానోత్సవం గావించారు. ఈ కార్యక్రమంలో నగరానికి చెందిన ప్రముఖులు, కళాకారులు ,కవులు ప్రజలు పాల్గొన్నారు.

## గోడ పత్రికను ఆవిష్కరించిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



అలసట, కఫంలో రక్తపు చారులకు కనబడిన ఎడల వెంటనే దగ్గరలో ఉన్నటువంటి ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి తగు పరీక్షలు చేయించుకోవాలని సూచించారు.టీబీఎంబీఏ 2.వీ కార్యక్రమంలో ధూమపానం అలవాటులో ఉన్నవారు, 60 సంవత్సరాల వయసు పైబడిన వారు, డయాబెటిక్ వ్యాధిగ్రస్తులు,పాత టీవీ వ్యాధి సోకిని వారు మరియు బిఎంఐ 18 గంట తక్కువ ఉన్నవారు టీబీ వ్యాధి నిర్ధారణ పరీక్షలు కోసం కఫం మరియు ఎక్స్రే రే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టిడిపి నివారణ అధికారి డాక్టర్ రోణంకి రమేష్ గారు వారి యొక్క సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్పీకర్ అయ్యన్న అభినందనలు



వి. భారతి 989 మార్కులు, సున్నం శ్రీ చందన 986 మార్కులు సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. బైపీసీ ద్వితీయ సంవత్సరంలో రిషి కళాశాలకు చెందిన వి. తేజస్విని 985 మార్కులు సాధించారు. అలాగే ప్రథమ సంవత్సర ఫలితాల్లో మేధస్వి జూనియర్ కళాశాలకు చెందిన భార్గవి 465 మార్కులతో మొదటి స్థానంలో నిలవగా, ప్రగతి కళాశాలకు చెందిన బి. మైథిలి 464 మార్కులు సాధించి అద్భుత ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల అద్భుత విజయాలపై శ్రీ ప్రగతి జూనియర్ కళాశాల కరస్పాండెంట్ సత్తిబాబు గారు, డైరెక్టర్ ఏ. బాబ్జి గారు, శ్రీ మేధస్వి కళాశాల యాజమాన్యం శ్రీ గోపాలకృష్ణ గారు, మూర్తి గారు తదితరులు హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులను సత్కరించారు.

## సార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు

(ఎస్ రాయవరం ప్రభాతవార్త)



మండలంలో షార్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ వారి స్రీ న్ప్ రొయ్యల సి ప్రాజెక్టు ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ క్యాన్సర్ హాస్పటల్ విశాఖపట్నం వారి యొక్క సహకారం తో కోస్టల్ కార్పొరేషన్ లిమిటెడ్ యూనిట్ సెకండ్ ఆవరణలో రొయ్యల ఫ్యాక్టరీ లో పని చేస్తున్న మహిళలకు ఉచిత క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు.ఈ శిబిరంలో 72 మంది మహిళలకు రొమ్ము మరియు గర్భాశయ ముఖ ద్వారా క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు చేయడం జరిగింది. దీని ద్వారా ముందస్తు జాగ్రత్తలు మరియు నివారణ వలన మహిళలకు తమ ఆరోగ్యానికి ఎంత ఉపయోగపడుతుందో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సార్ట్స్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ బండారు మంగమ్మ, మహాత్మా గాంధీ క్యాన్సర్ హాస్పటల్ స్టాఫ్ లలిత రాజ్, భారతి దేవి ,డాక్టర్ శ్వేత, ఫ్యాక్టరీ జి ,ఎం, హరి, హెచ్ ఆర్ ,సాయి, పారా లీగల్ వాలంటీర్ నాగేశ్వరరావు, కుమారి, ఫ్యాక్టరీ వర్కర్స్ పాల్గొన్నారు.

## సీబీఎస్ఈ 10వ తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభ

అనకాపల్లి ఏప్రిల్ 16 (ప్రభాతవార్త)



డావాన్స్ ఇంటర్నేషనల్ స్కూల్ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించిన సీబీఎస్ఈ 10వ తరగతి బోర్డు పరీక్షలలో అద్భుత ఫలితాలను సాధించింది. మొత్తం 52 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరై, శత శాతం ఉత్తీర్ణత (52/52) సాధించారు. ప్రథమ స్థానం ఎం. సందీప్ – 477/500, ద్వితీయ స్థానం: టి. రిత్విక్ రెడ్డి, డి. అయన్జిత్ – 464/500, తృతీయ స్థానం: ఎస్. నిఖిల్ – 462/500 , బి దుర్గాప్రసాద్ 459 ఎస్ పలక్ కుమారి 456, ఏ. హరిణి 456. మార్కులతో తర్వాత స్థానాలు పొందారు. పాఠశాల సగటు: 400/500. 80 శాతం ఫలితాలు సాధించారు. ఈ ఫలితాలు విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వానికి నిదర్శనమని ఆ స్కూల్ మ్యానేజింగ్ డైరెక్టర్ సుందరయ్య, డైరెక్టర్ రామనాజీ, ప్రిన్సిపాల్ మీనా మిశ్రా విద్యార్థులను అభినందించి, ఉపాధ్యాయుల కృషిని ప్రశంసించారు. ఈ ఫలితాలు క్రమశిక్షణ, కాన్సెప్ట్ స్పష్టత మంచి విద్యా వాతావరణానికి ప్రతిబింబం అని అన్నారు

## కనకమాలక్ష్మీ అమ్మవారిని దర్శించుకున్న వైకాపా నాయకులు

(నక్కపల్లి /అడ్డరోడ్డు, ప్రభాతవార్త)



గంధ అమావాస్య సందర్భంగా మండలంలోని అమలాపురం గ్రామంలో ఉన్న కనక మహాలక్ష్మి అమ్మవారిని పాయకరావుపేట నియోజకవర్గం నకు చెందిన వైకాపా నాయకులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శించుకున్న వారిలో మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ పరిశీలిస్తున్న కంబాల జోగులు, రాష్ట్ర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి, దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ వీసం రామకృష్ణ దర్శించుకున్నారు. వారితో పాటు మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగా ఈశ్వరరావు, రాష్ట్ర రైతు సంఘం కార్యదర్శి సూరకాసురు గోవిందు, మండల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, ఎంపిటిసి గంట తిరుపతిరావు , భార్గవ్, వంక కృష్ణ తదితరులు ఉన్నారు.

## 2026 27 వ వార్షిక ఆర్థిక ప్రణాళిక మండల స్థాయి సమావేశం

(ఎస్ రాయవరం ఏప్రిల్ 16 ప్రభాతవార్త)

మండల కేంద్రమైన ఎస్ రాయవరం వెలుగు కార్యాలయంలో గురువారం 2026 27 వ సంవత్సరం నకు స్వయం సహాయక సంఘాల వార్షిక రుణము మరియు జీవనోపాదులప్రణాళి కసమావేశం ఎం పి ఎమ్ శివప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వయం సహాయక సంఘాలు మహిళలు లోన్లు,శ్రీనిధి బ్యాంకు లింకేజులు,సుమారు 100 కోట్లు రూపాయల ప్రణాళికను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఈనారి, సీఆర్పీలు, వివోలు, సీసీలు పాల్గొన్నారు

## అధికారుల కృషి సహకారంతో జాతీయస్థాయిలో గుర్తింపు వచ్చింది..

- నా జీవితానికి చాలు: “రెడ్డి వరహాలు“!

(నక్కపల్లి,ప్రభాతవార్త)



మండలంలోని న్యాయంపూడి గ్రామపంచాయతీకి జాతీయ స్థాయిలో రెండు దఫాలుగా గుర్తింపు పొందడానికి గల కారణం జిల్లాస్థాయి అధికారులతో పాటు మండల స్థాయి అధికారుల కృషి గ్రామ ప్రజల తో పాటు పాలకవర్గం సభ్యులు సహకారం తో సాధించగలిగానని ఇది నా జీవితానికి చాలని మాజీ సర్పంచ్ రెడ్డి వరహాలు అన్నారు. పంచాయతీ పాలకవర్గం పదవీకాలం ముగియడంతో అప్పటి పని చేసిన గ్రామ కార్యదర్శి నరసింహరాజు సారథ్యంలో గురువారంఏర్పాటు చేసిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రెడ్డి వరహాలను గ్రామ పాలకవర్గం సభ్యులు గ్రామస్తులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రెడ్డి వరహాలు మాట్లాడుతూ ఈ సత్కారం నాది కాదని ,ఈ గ్రామానికి పేరు తెచ్చిన ప్రతి ఒక్కరికి సొంతమని అన్నారు .జాతీయ స్థాయిలో న్యాయం పూడిగ్రామానికి ఉన్నతమైన పేరు వచ్చిందని, ఎన్ని జన్మలెత్తినా నా కుటుంబం ఈ రుణం తీర్చుకోలేదని అన్నారు. అప్పట్లో ఎంపీడీవో గా బాధ్యతలు వహించిన ప్రస్తుత దెందుకూరు సీతారామరాజు మాట్లాడుతూ ఏ గ్రామమైన అభివృద్ధి చెందాలంటే పంచాయతీ పాలకవర్గంతో పాటు గ్రామ సర్పంచ్తో సహా గ్రామ స్థాయిలో పనిచేసే అధికారులతో సమన్వయంగా పనిచేసినప్పుడు వారికి గ్రామస్తులు సహకరించినప్పుడు సాధ్యమవుతుందని, అది సర్పంచ్ గా పనిచేసిన రెడ్డి వరహాలకు సాధ్యమైందని అన్నారు. ప్రధానంగా అప్పట్లో పనిచేసిన గ్రామ కార్యదర్శి నరసింహరాజు పట్టుదల కృషి ఈ గ్రామం ఎంతో ముందుకు నడిపించిందని అన్నారు. న్యాయం పూడి గ్రామానికి జాతి స్థాయిలో గుర్తింపు రావడానికి అప్పట్లో పనిచేసిన జిల్లా కలెక్టర్ తో పాటు డిపిఓ సహకారం ఎంతో ఉందని అనంతరం వచ్చిన జిల్లా కలెక్టర్ తో పాటు డిపిఓ ప్రోత్సాహంతో నడిపించారని అటువంటి జిల్లా స్థాయి అధికారులు దొరకడం అదృష్టమని అన్నారు. సర్పంచ్ రెడ్డి వరహాలు మాట్లాడుతూ డైరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ లాంటి నాయకత్వంలో పనిచేయడం వలన గ్రామాన్ని ఏ విధంగా నడిపించాలో తెలుసుకున్నానని అన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన కే. చరపతిరావు ,ఏవో దెందుకూరిసీతారామరాజు ,కార్యదర్శి నరసింహ రాజులను మాజీ సర్పంచ్ రెడ్డి వరహాలు ,మాజీఉప సర్పంచ్ ,పాలకవర్గం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

## శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు

పాయకరావుపేట/పాయకరావుపేట రూరల్, ఏప్రిల్ 16



శ్రీ ప్రకాష్ విద్యాసంస్థలకు చెందిన స్పేసెస్ డిగ్రీ కళాశాలలో గురువారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి బెంగళూరుకు చెందిన మాస్టర్ బిజినెస్ స్కూల్ కోచ్ రమేష్ బటావియ, ఆశాజైన్ ముఖ్య అతిథులుగా హాజర య్యారు. డిగ్రీ, జూనియర్ కళాశాల విద్యార్థులు ఈ సదస్సులో పాల్గొన్నారు. సదస్సులో రమేష్ బటావియ విద్యార్థులకు నాయకత్వ లక్షణాల గురించి వివరించారు. ధైర్యం, ఆత్మవిశ్వాసం, భావాలను సరిగ్గా వ్యక్తం చేయడం, ఇతరులను అర్థం చేసుకోవడం, నైపుణ్యాలు పెంచుకోవడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. మంచి నాయకుడిగా ఎదగడానికి పది ముఖ్యమైన సూత్రాలను తెలిపారు. ఇతరులను మెచ్చుకోవడం, మంచిగా స్పందించడం, ప్రశ్నించే అలవాటు పెంచుకోవడం, మర్యాదగా ప్రవర్తించడం, అందరినీ గౌరవించడం, సరైన భావ వ్యక్తీకరణ, కష్టాల్లో ఆదుకోవడం, ఇతరులను అర్థం చేసుకోవ డం, మంచి ఆరోగ్యం, క్రమశిక్షణ పాటించడం, ఎప్పుడూ కొత్త విషయాలు నేర్చుకోవడం వంటి ఈ పది సూత్రాలను ఉదాహరణలు, అభ్యాసాల ద్వారా విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల సంయుక్త కార్యదర్శి శ్రీ సిహెచ్ విజయ ప్రకాష్, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన డ్వామా పిడి నిర్మలాదేవి

కసింకోట ఏప్రిల్ 16 ప్రభాతవార్త




మండలంలోని బయ్యవరంలో జరుగుతున్న స్ట్రెకేజ్ ఫ్రెంచ పనులు 198 మంది పనిచేస్తున్నట్లుగా మాస్టర్ వెరిఫికేషన్ ద్వమపిడి నిర్మల దేవి గురువారం పరిశీలించారు. మండలంలో ప్రస్తుతం 4500 ఉపాధి కూలీలు పనిచేస్తున్నారని, ఇంకా 5000 వరకు కూలీలను పెంచాలని ఉపాధి సిబ్బందికి ఆదేశించారు. పని సమయాలలో ఉపాధి కూలీలకు ఓఆర్ఎస్, మెడికల్ కిట్లు ఉంచాలన్నారు. ఉదయం ఐదున్నర నుండి 11 గంటల వరకు తప్పనిసరిగా పని చేయాలన్నారు. ఉపాధి కూలీలకు రెండుసార్లు హాజరు తీసుకోవాలని ఆదేశించారు. అనవసరం తేగాడ, కొత్తపల్లి గ్రామాలలో ఉపాధి కూలీల ప్రదేశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సిహెచ్ చంద్రశేఖర రావు,ఏపీఓ ఎం. శ్రీనివాసరావు, ఈసీ కామేశ్వరరావు, టెక్నికల్ సిబ్బంది పాల్గొన్నారు.

## నక్కపల్లి మండలంలో 33 పంచాయతీలు.. మహిళ ఓటర్ల లే అధికం.!

(నక్కపల్లి, ప్రభాతవార్త)

రాష్ట్ర ఎన్నికల కమిషన్ గ్రామపంచాయతీకి సంబంధించిన ఓటర్లు వివరాలు ఖరారు చేస్తే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 15వ తేదీన ఈ ఉత్తర్వులను సంబంధిత మండల పరిషత్ కార్యాలయాలకు చేరాయి. ఈ మేరకు ఇప్పటివరకు నక్కపల్లి మండలంలో 32 పంచాయతీలు ఉండగా నూతనంగా చీడిక గ్రామం గ్రామపంచాయతీలు జాబితాలో చేరింది. ఈ గ్రామపంచాయతీ లో 351 ఓటర్లు ఉండగా ఆ పంచాయతీకి ఈ 2026 సంవత్సరం జరిగే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించనున్నారు. ఈ మేరకు చిన్న గ్రామపంచాయతీగా చీడిక గ్రామం ఉండగా ఆరువేల 38 ఓటర్లు తో అతి పెద్దపంచాయతీ గా రాజయ్యపేట ఉంది. ఈ మేరకు విడుదల చేసిన నూతన జాబితాలో అధికంగా మహిళలు కనిపిస్తున్నారు. 32,875 మంది పురుషులు ఉండగా 33,331 మహిళలు ఈసారి ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. త్వరలో జరగబోయే స్థానిక ఎన్నికల్లో ఈ ఓటర్లు జాబితాను వినియోగించనున్నారు. 332 వార్డులుగా నిర్ణయించారు. 33 గ్రామ పంచాయతీలకు సర్పంచులుగా 332 వార్డు సభ్యులు గా ఎన్నిక నిర్వహించ న్నున్నారు.

## ఎన్. నరసాపురం పాఠశాలలో ప్రవేశాల జోరు.!

(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)



ఆహ్లాదకర పాఠశాల వాతావరణం, నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయుల తో బోధన, అద్భుతమైన మౌలిక సదుపాయాలు వలన అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశం పొందుతున్నారు. ఈ విద్యా సంవత్సరం (202627)లో ఇప్పటివరకు 23 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. వేసవి కాలంలో ప్రత్యేక పాఠశాలలో విద్యార్థులు చేర్పించే కార్యక్రమంలో భాగంగా ప్రధానోపాధ్యారా ఆధ్వర్యంలో ఇంటింటికి అవగాహన కల్పించి అధిక సంఖ్యలో విద్యార్థులు ప్రవేశం పొందేటట్లు కృషి చేస్తున్నారు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్ ఏ ఎన్ రాజు ఎక్కువ మంది విద్యార్థులను చేర్పిస్తామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ బొడ్డపు దేముళ్ళు, అంగన్వాడీ కార్యకర్త నాగమణి , ఉపాధ్యాయులు , అప్పలరాజు,వెంకటరావు, దుర్గా ప్రసాద్ ,కిరణ్ కుమార్ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నేడు ఉద్దండ పురం గ్రామంలో గందమామస్య జాతర

(నక్కపల్లి / అడ్డరోడ్డు, ప్రభాతవార్త)

అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉద్దండ పురం గ్రామంలోని నేడు గంధమావాస్య జాతరను ఘనంగా జరుపనున్నారు. గ్రామంలోని వెలసి యున్న మరిడిమాంబ అమ్మవారి ఆలయం వద్ద ఈ జాతరను నిర్వహించనున్నారు. ప్రతి సంవత్సరం గంధ అమావాస్య రోజున భారీ ఎత్తున ఆలయం వద్ద జాతర మహోత్సవం నిర్వ హించడం పరి పాటి, వేలాదిగా భక్తులు చుట్టు పక్కల గ్రామాల నుంచి తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని ముడుపులు మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఈ మేరకు గ్రామం లోని ఆలయ కమిటీ ఉత్సవ ఏర్పాట్లు చేస్తు న్నారు. ఇప్పటికే క్యూ లైన్ లో ఏర్పాట్లు టెంట్లు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 11 గంటల నుండి ఆలయం వద్ద భారీ అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తారు.



## మనస్థాపంతో ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

ఆనందపురం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



ఆనందపురం మండలంలోని పెద్దిపాలెంలో ఉన్న ఓ ప్రయివేట్ కళాశాలకు చెందిన విద్యార్థి గురువారం ఉదయం తరగతి గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సీఐ వాసునాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా కంచిలి మండలం ప్రాంతానికి చెందిన లోకినిండి తారకరావు (18) పెద్దిపాలెం కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నాడు. ఈ నెల 15న ప్రకటించిన ఫలితాలలో 441 మార్కులు రాగా తక్కువ మార్కులు వచ్చాయని మనస్థాపానికి గురయ్యాడు. ఈ మేరకు తారకిరావు తరగతి గదిలోనే ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తండ్రి భగీరథి ఇచ్చిన ఫిర్యాది మేరకు సీఐ వాసునాయుడు విచారణ జరిపి కేసు నమోదు చేశారు. హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసుని దర్యాప్తు చేస్తున్నారు.

## పల్లాకు గజమాలతో సత్కరించిన సాలాపు రామారావు

గాజువాక, ఏప్రిల్ 16,ప్రభాతవార్త



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి నియమితులైన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావును గురువారం నియోజకవర్గ పార్టీ శ్రేణులు ఘనంగా సత్కరించాయి. గాజువాక పార్టీ కార్యాలయంలో 72వ వార్డు సీనియర్ నాయకులు సాలాపు రామారావు ఎమ్మెల్యేకు భారీ గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ పట్ల ఆయన కున్న అంకితభావాన్ని గుర్తించే అధిష్ఠానం రెండోసారి ఈ బాధ్యతను అప్పగించిందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్ర మంలో గాజువాక టీడీపీ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు నాయకులు బుల్లెట్ శీను,గొల్లవిల్లు భవాని, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

## అజీమాబాద్‌లో సీసీ రోడ్డు పనుల పరిశీలన

గాజువాక, ఏప్రిల్ 16,ప్రభాతవార్త



గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చొరవతో జీవీఎంసీ 66వ వార్డు అజీమాబాద్ లోని సున్నీ జామా మసీదు వద్ద రూ. 10 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను గురువారం వార్డు ఇంచార్జ్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ రఫీ పర్యవేక్షించారు. పనుల నాణ్యత విషయంలో రాజీ పడకూడదని అధికారులకు, కాంట్రాక్టరుకు సూచించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ డీఈ వెంకటరావు, కాంట్రాక్టర్ గణేష్‌తో పాటు కూటమి నాయకులు మోతీ, జావేద్, మిశ్రా, చిరంజీవి, ఇమ్రాన్, నన్నా, ఇషాక్, అన్సర్ వల్లి పాల్గొన్నారు.

## పల్లాకు 'తెలుగు యువత' ఘన స్వాగతం

గాజువాక, ఏప్రిల్ 16,ప్రభాతవార్త



టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా రెండోసారి బాధ్యతలు చేపట్టి తొలిసారి గాజువాక విచ్చేసిన ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు కు పార్టీ శ్రేణులు నీరాజనం పలికాయి. విమానాశ్రయం నుంచి భారీ ర్యాలీగా బయలుదేరిన ఆయనకు దారిపొడవు నా కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు కుంచుమాంబ అమ్మవారిని దర్శించు కుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గాజువాక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు గణపతి, పార్టీ నాయకులు చదరం తులసీరామ్ ఎమ్మెల్యేను పూలమాలలతో ఘనంగా సత్కరించారు. పల్లా నియామకంతో నియోజకవర్గ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం నెలకొందని వారు పేర్కొన్నారు.

## శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు

గాజువాక,ఏప్రిల్ 16,ప్రభాతవార్త



జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాం గ్రామంలో గ్రామ దేవత శ్రీశ్రీశ్రీ ముత్యాలమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు,కుంకుమ పూజలు నిర్వహించారు. గురువారం మారువారం పండగను అత్యంత ఘనంగా నిర్వహించారు. పండగ సందర్భంగా భక్తులు,గ్రామస్తులు ఉదయం నుంచే ఆలయానికి చేరుకొని పూజలు నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమంలో వార్డ్ మాజీ కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ ప్రజలను చల్లగా చూడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా డా.మంచా నాగ మల్లేశ్వరి

విశాఖపట్నం, ప్రభాతవార్త



మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు వైసిపి నాయకురాలు డా.మంచా నాగ మల్లేశ్వరిను వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమించడం పట్ల వైసీపీ కార్యకర్తల్లో మరింత ఉత్సాహం రెట్టింపు అయింది. ఈ సందర్భంగా మల్లేశ్వరి మాట్లాడుతూ సాధారణ మహిళనైనా నాకు సాధికారతను అందించి, అన్నలా ఆదరించి, మర్యాదను కల్పించి, రాష్ట్ర కార్యవర్గంలో నాకు ప్రాధాన్యత ఇచ్చి, వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా బాధ్యతలు అప్పగించిన మా వైయస్ జగనన్నకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకం ఉంచి నిరంతరం ప్రోత్సహించిన సజ్జల రామకృష్ణ రెడ్డి, విశాఖ జిల్లా అధ్యక్షులు కె.కె. రాజు, ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమన్వయకర్త కన్నబాబు, శాసనసభ మండలి సభ్యులు బొత్స సత్యనారాయణ, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్, తలసిల రఘురాం, ఆలూరి సాంబశివారెడ్డి, శ్రీహరిలకు నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతున్నమ్మన్నారు. తనకు అప్పజెప్పిన బాధ్యత తనకు త్రికరణ శుద్ధితో పనిచేసి పార్టీ బలోపేతానికి మరింత సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. అలాగే నా రాజకీయ ప్రయాణంలో తోబుట్టువులా నన్ను భావించి నిరంతరం అండగా నిలిచిన ప్రతి వైసీపీ కార్యకర్తకు, నాయకులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## భార్య, భర్త తగాదాలతో ఉరివేసుకొని భార్య ఆత్మహత్య

పద్మనాభం,ఏప్రిల్ 16, ప్రభాతవార్త



భార్య, భర్తల మధ్య నెలకొన్న తగాదాలతో మండలంలో లింగన్నపేట గ్రామంలో గురువారం భార్య ఉరివేసుకొని మృతి చెందినట్లు సిఐ సిహెచ్ శ్రీధర్ చెప్పారు. దీనిపై సిఐ అందించిన వివరాలు ప్రకారం ఇదే గ్రామానికి చెందిన మండల గోవింద్, పాపయ్యమ్మ (44), వ్యవసాయం చేసుకుంటూ జీవిస్తున్నారు. అయితే వీరి మధ్య ఇటీవల నెలకొన్న తగాదాలతో పాపయ్యమ్మ మనస్తాపం చెంది సొంత నివాసంలో ఉరివేసుకొని మృతి చెంది నట్లు సిఐ తెలిపారు. మృతిరాలు కుమార్తె పైల పావని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఆయన అన్నారు.పాపయ్యమ్మ మృత దేహంను పోస్టుమార్టం నిమిత్తం భీమిలి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## విద్యను ఆహ్లాదకర వాతావరణంలో అభ్యసించాలి

విశాఖపట్నం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త



తాజాగా విడుదలైన ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశాఖపట్నం విశాలాక్షి నగర్ బీవీకే జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచి, ఉన్నత మార్కులతో విజయ దుందుభి మోగించారు. ఈ ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులు సాధించి, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందారని గురువారం కళాశాలలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో జూనియర్ కాలేజీ కరస్పాండంట్ డాక్టర్ నందూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ఇందిరా సంయుక్త తెలిపారు. అధ్యాపకుల కృషి, విద్యార్థుల పట్టుదల, కళాశాల యాజమాన్యం అందించిన బోధనా నైపుణ్యంతో ఈ ఘన విజయం సాధ్యమైం దని తెలిపారు.రోటరీ క్లబ్ సహకారంతో ఆర్ఓ వాటర్ ప్లాంట్ ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.ఆహ్లాదకర వాతావరణంలో,విశాలమైన వాలీ బాల్ కోర్ట్,బాస్కెట్ బాల్ కోర్ట్ అందుబాటులో ఉన్నాయని,సుమారు పదివేల పుస్తకాలతో గ్రంథాలయం అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.ఎం సెట్ కూడా ప్రత్యేక శిక్షణ ఇస్తామని,పోటీ పరీక్షలు ఎస్ ఎస్ సి,గ్రూప్స్,రైల్వే పరీక్షలకు అనుభవజ్ఞులతో ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.రవాణా సౌకర్యం కూడా ఉన్నట్లు తెలిపారు.అత్యున్నత ప్రమాణాలతో,క్రమశిక్షణతో కొనసాగే తమ కళాశాల విశాలాక్షినగర్ బీవీకే జూనియర్ కాలేజీలో తమ పిల్లలను చేర్చి ఉన్నత విద్యావంతులుగా,క్రమశిక్షణ గల భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాలని తల్లి తండ్రులను కరస్పాండంట్ డాక్టర్ నందూరి రామకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం ఇందిరా సంయుక్త కోరారు.

## సీబీఎస్ఈ 'టెన్త్' ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థుల ఘన విజయం

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



సీ బీ ఎ స్ ఈ 2026 పదో తరగతి ఫలితాల్లో శ్రీచైతన్య స్కూల్ విద్యార్థులు అత్యద్భుత ప్రతిభ కనబర్చారు. ఈ పరీక్షల్లో స్కూల్ విద్యార్థులు రికార్డు స్థాయిలో మార్కులు సాధించి సంస్థకు కీర్తి తెచ్చారు. ఈ ఏడాది మొత్తం 500 మార్కులకు అత్యధికంగా 494 మార్కులు సాధించగా, తదుపరి స్థానాల్లో 493, 492, 491, 490 మార్కులు సాధించిన విద్యార్థులు నిలిచారు. 480కి పైగా మార్కులు సాధించిన వారు 34 మంది ఉండగా, 450 (90శాతం)కు పైగా మార్కులు సాధించిన వారు 187 మంది ఉన్నారు. విద్యార్థుల ఈ విజయంపై స్కూల్ యాజమాన్యం హర్షం వ్యక్తం చేస్తూ, 100 శాతం ఉత్తీర్ణత సాధించడం గర్వకారణమని తెలిపింది. ఈ సందర్భంగా అకాడమిక్ డైరెక్టర్ మాట్లాడుతూ, విద్యార్థులు భవిష్యత్తులో ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల్లో కూడా అగ్రస్థానాలు సాధించగల సామర్థ్యం కలిగి ఉన్నారని తెలిపారు.

## జనగణనకు సహకరించాలి : గంటా

భీమిలి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



జనగణన కోసం వచ్చే ఎన్యూమరేటర్లకు పూర్తి సమాచారం అందజేసి సహకరించాలని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు సూచించారు. భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో స్వీయ గణన కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం మాట్లా డుతూ ప్రజల గురించి సంపూర్ణ సమాచారముం టేనే ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడం సులభరతమవుతుందని చెప్పారు. స్వీయ గణనలో మొబైల్ ద్వారా 33 ప్రశ్నలకు సమాధానమిచ్చాక కేటాయించే 11 నెంబర్ల ఐడీని మే 1వ తేదీ నుంచి జనగణన కోసం వచ్చే ఎన్యూమరేట ర్లకు తెలియజేస్తే... యాప్‌లో సరి చూస్తారని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలు కూడా ఎన్యూమరేటర్లకు తగిన సమాచార మిచ్చి సహకారం అందించాలని..వివరాలిస్తే పథకాలు ఆగిపోతాయన్న ప్రచారాన్ని నమ్మవద్దన్నారు. రాష్ట్రంలో 1.10 లక్షల మంది ఎన్యూమరేటర్లు పాల్గొంటున్న జనగణన విజయవంతానికి.. ప్రజాప్రతినిధు లతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం శక్తి సంఘాలు దన్నుగా నిలవాలని కోరారు. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జనగణన ప్రపంచంలో అతి పెద్ద గణాంక కార్యక్రమంగా అభివర్ణించారు. అంతకుముందు రూ. 37.55 లక్షలతో భీమిలి జోన్‌లోని 4 వార్డుల్లో ప్రతిపాదించిన డ్రెయిన్ల పూడికతీత పనులకు, రూ. 8.5 లక్షలతో ఏర్పాటు చేయనున్న చలివేంద్రాలకు గంటా శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, భీమిలి ఎమ్మార్వో పి.రామారావు, కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, గాడు వెంకటప్పడు, గంటా నూకరాజు, గాడు చిన్ని కుమారి లక్ష్మి, తమ్మిన సూరిబాబు, గొలగాని నరేంద్ర, సరగడ అప్పారావు, కనకల అప్పలనాయుడు, కొప్పుల రమేష్, దండి వెంకటేష్ భువనేశ్వరి, కొప్పల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వానపల్లిని అభినందించిన ఎంపీ శ్రీ భరత్

విశాఖపట్నం, ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా నియమితులైన వానపల్లి గాయత్రి ఫణి కుమారిని విశాఖ ఎంపీ శ్రీ భారతి శాలువ కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ అధిష్టానం మీపై నమ్మకంతో ప్రతిష్టాత్మకమైన కార్యదర్శిగా నియమితులైన మీరు కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను సేవలను ప్రజలకు మరింత అందే విధంగా కృషి చేసి తద్వారా తెలుగుదేశం పార్టీని మరింత బలోపేతం చేయటానికి కృషి చేయాలని చెప్పారు. ఫణి కుమారి మాట్లాడుతూ కార్యదర్శిగా నియమించిన జాతీయ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి వర్కింగ్ అధ్యక్షులు నారా లోకేష్‌కి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావుకి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను నాపై వారికి ఉన్న నమ్మకాన్ని ఒమ్ము చేయకుండా ఒక సైనికుడి లాగా పనిచేసి వారి నమ్మకాన్ని నిజం చేస్తానని చెప్పారు.

## ఎన్ఏడి చుట్టూ పక్కల ప్రాంతాలలో నేడు పవర్ కట్

మాధవధార, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

ఏపీఈపిడిసిఎల్ ఆపరేషన్ డివిజన్ జోన్ 2లో ఎన్ఎస్టిఎల్ సెక్షన్ లో జర్నలిస్ట్ కాలనీ, కళింగ నగర్, ఎన్ ఏ డి, మాధవధార ఉడా కాలనీ, కరసా ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మలు తొలగింపు,విద్యుత్ నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆపరేషనల్ డివిజన్ జోన్ -2 ఆపరేషన్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి కె నాయుడు గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు.దీంతో మర్రిపాలెం ఉడా లే అవుట్,జర్నలిస్ట్ కాలనీ,శాంతి నగర్, రైతు బజార్,పాస్ పోర్ట్ ఆఫీస్,కళింగ నగర్,మాధవధార,ఎన్ ఏ డి,గణేష్ నగర్,గౌరి నగర్,మాధవధార ఉడా కాలనీ, ఓల్డ్ కరసా,న్యూ కరసాలో నేడు విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

## 18న దుర్గానగర్ ఫీడర్ పరిధిలో విద్యుత్ నిలిపివేత

గాజువాక, ఏప్రిల్ 16,ప్రభాతవార్త

ఏపీఇపిడిసి ఎల్ మల్కాపురం విద్యుత్ ఉప ప్రాంతీయ కార్యాలయం పరిధి పలు ప్రాంతాల్లో ఈనెల 18వ తేదీ (శనివారం) విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 11 కేవీ దుర్గానగర్ ఫీడర్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత, అత్యవసర లైన్ నిర్వహణ పనుల దృష్ట్యా ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 కార్యనిర్వాహక ఇంజినీర్ (ఈఈ) బి.కె. నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. దుర్గానగర్, ఏఎస్ఆర్ కాలనీ, జి.ఏ. కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, టీడీపీ కాలనీ, అంబేద్కర్ కాలనీ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని అధికారులు కోరారు.

## 19న విశాఖలో 'సమరసతా 3కే రన్'

గాజువాక,ఏప్రిల్ 16,ప్రభాతవార్త



డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 135వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 19న (ఆదివారం) ఉదయం 6 గంటలకు విశాఖ బీచ్ రోడ్డులో 'సమరసతా 3కే రన్' నిర్వహించనున్నట్లు బీజేపీ రాష్ట్ర మీడియా ప్యానలిస్ట్ డా.కరణంరెడ్డి నరసింగరావు తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో ఇందుకు సంబంధించిన గోడ పత్రికను ఆవిష్కరించారు. కాళీమాత గుడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు సాగే ఈ పరుగులో విజేతలకు రూ.లక్ష విలువైన బహుమతులు అందజేస్తామన్నారు. పాల్గొన్న వారికి టీ-షర్టులు, సర్టిఫికెట్లు ఇస్తామని, ప్రజలందరూ పాల్గొని సమానత్వాన్ని చాటాలని కోరారు. నేతలు ములకలపల్లి ప్రకాష్, కట్టా పద్మ పాల్గొన్నారు.

## బకాయి జీతాలు చెల్లించకుంటే 20 నుంచి సమ్మె

గాజువాక, ఏప్రిల్ 16,ప్రభాతవార్త




పారిశుధ్య కార్మికుల బకాయి జీతాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిం చారు. యూనియన్ నాయకులు గొలగాని అప్పారావు, నక్క నాగరాజు మాట్లాడుతూ క్లాప్ ఆటో లోడర్లకు మూడు నెలలు, డైలీ వేజ్ కార్మికులకు 11 నెలలు, పోర్ట్ ఏరియా కార్మికులకు ఏడాది కాలంగా జీతాలు అందలేదని మండిపడ్డారు. అప్కాస్ కార్మికుల సమస్యలను పరిష్కరించి, వారి బిడ్డలకు ఉపాధి కల్పించాలని కోరారు. ఈ నెల 18లోగా బకాయిలు చెల్లించకుంటే 20వ తేదీ నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బంగారు నాయుడు, గొల్ల రాము, అరుణ తదితరులు పాల్గొన్నారు.

## వేతన ఒప్పందాలు అమలు చేయకుంటే 'కోరమండల్' ముట్టడి

గాజువాక, ఏప్రిల్ 16,ప్రభాతవార్త




కోరమండల్ కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాలు చెల్లించి, ఒప్పందాలను తక్షణమే అమలు చేయాలని విశాఖపట్నం కాంటాక్ట్ లేబర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం పరిశ్రమ గేటు వద్ద నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వేతనాల విషయమై ఇప్పటికే 15 సార్లు చర్చించినా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచకుంటే కార్మికులతో కలిసి కంపెనీని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు సి.హెచ్. సత్యనారాయణ రెడ్డి, గుడాల రాంబాబు, శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## తిరుమల నగర్ తదితర ప్రాంతాల్లో 18న విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాఖపట్నం-ప్రభాతవార్త

పెయింటింగ్, నిర్వహణ పనుల కారణంగా 18న శనివారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 12గంటల వరకు వడ్లపూడి ఎస్ఎస్ పరిధిలో 33/11కెవి విద్యుత్ ఫీడర్‌లో అంతరాయం ఏర్పడుతుందని వడ్లపూడి ఆర్హెచ్ కాలనీ, కణితి కళింగ వీధి, తిరుమల నగర్, సిద్ధార్థనగర్, కణితి యాదవ వీధి, కనితి సెట్టిబలిజీ వీధి, గణేష్ నగర్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని బి.కె. నాయుడు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఆపరేషన్/జోన్ -2, విశాఖపట్నం తెలిపారు.

## టీడీపీ జాతీయ, రాష్ట్ర కమిటీలలో గీత కులాలకు ప్రాధాన్యత

### పార్టీ పొలిట్ బ్యూరోతో సహా వివిధ హోదాల్లో 11 మంది నియామకం -సీఎం చంద్రబాబు, లోకేష్‌లకు గీత కులాల ఐక్యవేదిక కృతజ్ఞతలు

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ జాతీయ, రాష్ట్ర కమిటీలలో గీత కులాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వడం పట్ల గీత కులాల ఐక్యవేదిక కన్వీనర్లు సంపంగి శ్రీనివాస్, అప్పారి గిరిబాబు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ పార్టీ పోలిట్ బ్యూరోలో ముగ్గురికి చోటు కల్పించడంతో పాటు వివిధ హోదాల్లో 11 మంది గీత కులాల వారిని నియమించడం శుభపరిణామమని అన్నారు. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులుగా పితాని సత్యనారాయణ, అనగాని సత్య ప్రసాద్, అరవింద్ కుమార్ గౌడ్‌లను, జాతీయ పార్టీ కోశాధికారిగా కొనకళ్ల నారాయణ, జాతీయ పార్టీ ఉపాధ్యక్షులుగా రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్య దర్శిగా గౌతు శిరీష, రాష్ట్ర పార్టీ అధికార ప్రతినిధిగా దాసరి శ్యామ్ చంద్ర శేషు రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శులుగా పిల్లి అనంతలక్ష్మి, అంగర రామ్మోహన్, రాష్ట్ర కార్యదర్శిగా పెచ్చేట్టి వెంకట నర్సింహా రావులను గీత ఉప కులాల నుంచి చోటు కల్పించడం పట్ల పార్టీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. వెనకబడిన వర్గానికి చెందిన గీత కులాల వారికి 11 మందికి స్థానం కల్పించడం చరిత్రాత్మక ఘటనగా పేర్కొన్నారు. బీసీల పట్ల తెలుగుదేశం పార్టీ చిత్తశుద్ధికి ఈ నియామకాలే నిదర్శమని తెలిపారు. గీత కులాల నాయకులు రేఖల కృష్ణ గౌడ్, గొడ్డి కన్నారావు, అంగటి రాము, కేసు బోయిన త్రినాథ్, చెల్లుబోయిన గోవిందు, కొల్లి సింహాచలం, పిల్లి రమణ, కొప్పిశెట్టి కనక శేఖర్, కేసు బోయిన రాజు, దొమ్మేటి అప్పారావు, పాలికలరాజు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, తెలుగుదేశం పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.తెలుగుదేశం పార్టీ పటిష్టానికి గీత కులాలు కృషి చేస్తాయని హామీ ఇచ్చారు.

## ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో ఎస్వికె కళాశాల విద్యార్థులు అత్యున్నత ప్రతిభ

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



ఇంటర్ మొదటి, ద్వితీయ సంవత్సరం ఫలితాల్లో ఎస్వికె కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన సంధర్భంగా ఎమ్మెల్యే, ఎస్వికె కళాశాల చైర్మన్ వంశీకృష్ణ శ్రీనివాస్ విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్వికె కళాశాలలో నాణ్యత గల భోధన, అత్యున్నత ఫలితం అందించిన కళాశాల ప్రిన్సిపాల్‌ను స్టాఫ్‌ను కొనియాడారు. ఇంటర్ ఫలితాల్లో ఎస్వికె విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించడంతోపాటు ఉత్తమ ర్యాంకులను కైవసం చేసుకున్నారనీ అన్నారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో 470కు వరలక్ష్మి 459, పద్మశ్రీ 453తో పాటు ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు నిహారిక 947, మౌలిక 946 మార్కులు సాధించిన వారికి శుభాకాంక్షలు తెలిపారు. ప్రిన్సిపాల్ కె.సత్యనారాయణ, నవీన్ సార్, మధు సార్, రామకృష్ణ, సుజాత, పద్మ, మోహిని పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేత

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు గురువారం ఎంవీపీ కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ సాయాన్ని అందించారు. ఆనందపురం ఎల్.వి. పాలేనికి చెందిన దన్నాన శ్రీనుకు రూ.3 లక్షలు, పద్మనాభం మండలం గంధవరం గ్రామానికి చెందిన పిల్లా వెంకటరమణకు రూ.1 లక్ష, కొమ్మాదికి చెందిన బండారు సుబ్బలక్ష్మికి రూ. 70 వేలు చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చిక్కాల విజయ్ బాబు, మన్యాల సోంబాబు, నాగోతి సత్యనారాయణ, లొడగల అప్పారావు, కాళ్ల సత్యనారాయణ, లొడగల వెంకట్రావు, లొడగల వెంకటరమణ, బమ్మిడి తారక్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించిన గంటా

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



భీమిలి ఆర్డీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే గంటా శ్రీనివాస రావు గురువారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిం చారు. వివిధ సమస్యలపై ప్రజలు ఆయనకు వినతి పత్రాలు అందజేశారు. 3 వ వార్డు కృష్ణా కాలనీలో బోర్ వెల్ కావాలని, ఎస్సీ కాలనీలో గ్రంథాలయం ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు. పోస్టాఫీసు సచివాలయంలోకి మార్చాలని.. గొల్లలపాలెం, కుమ్మరిపాలెంలలో రోడ్లు, డ్రెయిన్లు కావాలని విజ్ఞప్తి చేశారు. చిప్పాడలో తమకు చెందిన ఎకరం భూమిని 22 -ఎ లో పెట్టారని.. ఆ స్థలంలో దివీస్ యాజమాన్యం హైస్కూల్ నిర్మించిందని బధిరులైన సరగడ అచ్చియమ్మ, రమణమ్మ ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేశారు. సొంతిల్లు లేనందున తమకు సమీపంలోని ప్రభుత్వ భూమిలో ఇంటి స్థలం కేటాయించాలని విన్నవించారు. భీమిలి ఫుట్ బాల్ స్టేడియంలో యూజర్ ఛార్జీలు వసూలు నిలిపివేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జోనల్ కమిషనర్ ఎం. విజయ్ కుమార్, ఎమ్మార్వో పి.రామారావు అధికారులు పాల్గొన్నారు.

## మహిళా సాధికారతకు జగన్ తొలి అడుగు

### మహిళా బిల్లుకు వైఎస్సార్‌సీపీ మద్దతు-వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు వరుదు కళ్యాణి

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి మహిళా సాధికారతకు తొలి అడుగు వేసిన నాయకుడని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యనిర్వాహక అధ్యక్షురాలు వరుదు కళ్యాణి పేర్కొన్నారు. ఆయన పాలనలో స్థానిక సంస్థలు, నామినేటెడ్ పదవులు, కాంట్రాక్ట్ పనుల్లో 50 శాతం మహిళా రిజర్వేషన్లు అమలు చేసి చట్టబద్ధం చేశారని తెలిపారు. నరేంద్ర మోడీ ప్రవేశపెట్టిన మహిళా రిజర్వేషన్ బిల్లును పార్టీ స్వాగతించిందని వెల్లడించారు. మహిళల రక్షణ, ఆర్థిక సాధికారత కోసం దిశ చట్టం, సంక్షేమ పథకాలు, విస్తృత అవకాశాలు కల్పించామని చెప్పారు. విశాఖలో మీడియాతో ఆమె మాట్లాడారు. జగన్ పాలన మహిళలకు "గోల్డెన్ పీరియడ్"గా నిలిచిందని వ్యాఖ్యానించారు.

## సింహాచలం అప్పన్న చందనోత్సవం - మనమిత్ర అప్ ద్వారా టికెట్ల విక్రయం

సింహాచలం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

శ్రీ వరాహ లక్ష్మీనరసింహ స్వామి వారి వార్షిక చందనోత్సవం సందర్భంగా, టికెట్ల విక్రయానికి సంబంధించి దేవస్థానం ముఖ్య ప్రకటన విడుదల చేసింది. ఏప్రిల్ 17 (శుక్రవారం) నుండి బ్యాంకులలో టికెట్ల విక్రయం పూర్తిగా నిలిపివేయబడుతుంది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలి అని ఈ.ఓ. వెంకటరావు తీయజేశారు. 17వ తేదీ శుక్రవారం ఒక్కరోజు మాత్రమే ఆన్‌లైన్ ద్వారా"మన మిత్ర" వాట్సాప్ ద్వారా మాత్ర మే అందుబాటులో ఉంటాయి అని టికెట్ల విక్రయం ఉదయం 8:00 గంటల నుండి ప్రారంభమవుతుంది అని "మన మిత్ర" ద్వారా1000 టికెట్లు - 460,300టికెట్లు 750 ఆన్‌లైన్ ద్వారా, 1000 టికెట్లు - 2215 300టికెట్లు 3370 ఇవి కూడా ఏప్రిల్ 17 ఉదయం 8 గంటల నుండి అందు బాటులో ఉంటాయి. భక్తులు టికెట్లను క్రింది అధికారిక వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చు: https://chandanotsavam.ap.gov.,HŽ, గవర్నమెంట్ అధికారిక వాట్సాప్ నెంబర్ 9552300009 మనమిత్ర ద్వారా బుక్ చేసుకోవచ్చన్నారు.

## పారిశుద్ధ్య పనుల్లో నిర్లక్ష్యం వద్దు

### నగర పరిశుభ్రతపై జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



నగర నిత్య పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులను ఆదేశించారు. తూర్పు జోన్ 21వ వార్డులో గురువారం క్షేత్రస్థాయి పర్యటన నిర్వహించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. పారిశుద్ధ్య కార్మికులు నిర్ణీత సమయానికి విధుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, గార్బేజ్ పాయింట్లపై అవగాహన కల్పించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త, నిర్మాణ వ్యర్థాలు వేస్తే వెంటనే తొలగించి బాధ్యులపై జరిమానాలు విధించాలని తెలిపారు. డోర్ టు డోర్ చెత్త సేకరణలో క్లాప్ వాహనాలు మైక్ అనౌన్స్మెంట్ వినియోగం తప్పనిసరి చేయాలని, నిర్లక్ష్యం వహించిన సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## జీవీఎంసీ సౌత్ జోన్ జోనల్ కమిషనర్ మల్లయ్యనాయుడుకు బదిలీ

### -సౌత్ జోన్ కొత్త జోనల్ కమిషనర్‌గా ప్రసాదరావు నియామకం

విశాఖపట్నం, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ అదనపు కమిషనర్‌గా మల్లయ్యనాయుడును నియమకం చేస్తూ గురువారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జీవీఎంసీ సౌత్ జోన్ జోనల్ కమిషనర్‌గా కొనసాగుతున్నారు. ఆయన స్థానంలో జీవీఎంసీ సౌత్ జోన్ జోనల్ కమిషనర్‌గా స్పెషల్ గ్రేడ్ కమిషనర్‌గా ఉన్న పి.వి.వి.డి.ప్రసాదరావును నియామకం చేశారు.

## సాంప్రదాయాలకు విరుద్ధంగా వెళ్లొద్దు..

**పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల తేదీల మార్పుపై ఆగ్రహం వ్యక్తం చేసిన జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర**



ముంచంగిపుట్టు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

గిరిజనుల ఆరాధ్య దైవం, ఉత్తరాంధ్ర ఇలవేల్పు శ్రీ శ్రీ పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర నిర్వహణలో అనాది కాలం నుంచి పాటిస్తున్న సాంప్రదాయాలకు విరుద్ధంగా వెళ్ళొద్దని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు జల్లిపల్లి సుభద్ర సూచించారు. పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతర తేదీలను మారుస్తూ మంత్రి గుమ్మడి సంధ్యారాణి చేసిన ప్రకటనపై సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాడేరు మోదకొండమ్మ అమ్మవారి పాలకమండలి సభ్యులు, ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక శాసనసభ్యులు, వ్యాపార సంఘాలు ఆదివాసీలు అంతా కలిసి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని మే 10, 11, 12 తేదీల్లో జాతరను అత్యంత వైభవంగా నిర్వహించాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే భద్రతా కారణాలు సాకుగా చూపి ఆ తేదీలను 17, 18, 19 కి మార్చినట్లు గుమ్మడి సంధ్యారాణి చేసిన ప్రకటనపై సుభద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీల సాంప్రదాయాలు, ఆచారాలు, కట్టుబాట్లను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టా రాజ్యంగా ఎప్పుడు పడితే అప్పుడు జాతర నిర్వహించడానికి అంగీకరించబోరని సాంప్రదాయాలకు విరుద్ధంగా వెళ్లొద్దని ఆమె ప్రభుత్వానికి సూచించారు. వాస్తవానికి మే 10, 11, 12వ తేదీల్లో భద్రతా ఏర్పాట్లకు ఎటువంటి సమస్య ఉండదని గుర్తించిన తర్వాతే ఆ తేదీలను నిర్ణయించారని ఇప్పుడు మార్చాల్సిన అవసరం ఎందుకు వచ్చిందన్నారు. అమ్మవారి పుట్టిన తేదీలను మార్చేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంటుందా? అని నిలదీశారు. పుట్టిన తేదీలను మారుస్తూ ప్రభుత్వానికి నచ్చిన తేదీల్లో అమ్మవారి జాతరను చేసేందుకు ఎలా నిర్ణయం తీసుకుంటారని ప్రశ్నించారు. అనాది కాలం నుంచి అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని ఉత్సవాలు చేయడం అనేది గిరిజనుల సంప్రదాయానికి విరుద్ధంగా వేడుకలు చేయడం దేనికి సంకేతం అని పేర్కొన్నారు. అసలు ఏ ఉద్దేశంతో అమ్మవారి ఉత్సవ తేదీలు మారుస్తున్నారో చెప్పకుండా స్థానిక శాసన సభ్యులు దానికి అంగీకరించకపోయినా కనీసం ఆలయ కమిటీ చైర్మన్ మాటను గౌరవించాలని గాని ఆయన మాట వినాలని కూడా లేకుండా మంత్రి వ్యవహరించడం సరికాదన్నారు. గిరిజనుల మనోభావాలను అర్థం చేసుకోకుండా వారి సాంప్రదాయాలకు, కట్టుబాట్లకు విరుద్ధంగా వారికి నచ్చిన తేదీల్లో పండగ చేస్తామనడం ఎంతవరకు సబబో ప్రజల ఆలోచించాలన్నారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించకుండా అమ్మవారి జన్మదినం రోజున పురస్కరించుకొని ఆలయ కమిటీ ముందుగా నిర్ణయించిన మే 10,11,12 తేదీల్లోనే జాతర నిర్వహించేందుకు పునరాలోచన చేయాలని సూచించారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించి గిరిజనుల మనోభావాలను దెబ్బతీయొద్దని సూచించారు. ప్రభుత్వం తేదీలు నిర్వహించలేదని మంత్రి గట్టిగట్టిగా అరవడం వెనక, పండగ వాయిదా వేయడంలోనూ వేరే ఉద్దేశాలు ఉన్నాయని స్పష్టంగా తెలుస్తుందన్నారు. పండగను ఫలానా తేదీల్లో నిర్వహించాలని ఇప్పటివరకు ఎప్పుడూ ప్రభుత్వాలు నిర్ణయించలేదన్నారు. గిరిజనులు, ఆలయ కమిటీ చైర్మన్, పాలకమండల సభ్యులు, స్థానికులు వ్యాపార సంఘాలు అందరూ కలిసి అమ్మవారి పుట్టినరోజులు పురస్కరించుకొని జాతర తేదీలను నిర్ణయించడమే అనాదిగా వస్తున్న సాంప్రదాయమని దానికి విరుద్ధంగా వెళ్ళొద్దన్నారు. ఇప్పటివరకు ఇన్ని ఏళ్ళు గడుస్తున్నా అమ్మవారి జన్మదినాన్ని పురస్కరించుకొని జాతర చేయడమే సాంప్రదాయమని ప్రభుత్వం నిర్ణయించిన తేదీల్లో ఎప్పుడూ నిర్వహించలేదని విషయాన్ని ప్రభుత్వం గుర్తు ఎరగాలన్నారు. గుమ్మడి సంధ్యారాణి చేసిన ప్రకటనపై మరోసారి పునరాలోచన చేసి సాంప్రదాయాలకు అనుగుణంగా మే 10,11,12 తేదీల్లోనే పాడేరు మోదకొండమ్మవారి జాతర నిర్వహించాలని ఆమె సూచించారు.

## కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యం..

**తాజా మాజీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి**

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



ఓటమి ప్రభుత్వంతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని దారెల పంచాయితీ తాజా మాజీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి అన్నారు.ల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం దారెలా పంచాయతీ కేంద్రంలో జరిగిన గ్రామ సభలో పాంగి పాండురంగ స్వామి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాండురంగ స్వామి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని మారుమూల గ్రామాలలో రోడ్లు,తాగునీరు సీసీ రోడ్లు అలాగే ప్రజలకు సంక్షేమం అభివృద్ధి సమృద్ధిగా జరుగుతుందని నేరుగా ప్రజల సమస్యలను స్పందన ద్వారా తెలిపిన వెంటనే కూటమి ప్రభుత్వం సమస్యలను పరిష్కారం చూపుతుందని ఆయన అన్నారు. అభివృద్ధి సంక్షేమం టీడీపీ కూటమి ప్రభుత్వంతోనే జరుగుతుందని తాజా మాజీ సర్పంచ్ పాంగి పాండురంగ స్వామి పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పాంగి మల్లికార్జున రావు,మాజీ ఎంపీటీసీ పాంగి శాస్త్రిబాబు,పంచాయతీ స్పెషల్ ఆఫీసర్ మూర్తి, పంచాయతీ సెక్రటరీ,శోభకోట తాజా మాజీ సర్పంచ్ పలాసి శశి భూషణం నాయుడు, ముంచంగిపుట్టు పిఏసిఎస్ చైర్మన్ సామల బాబూజీ పెదబయలు పిఏసిఎస్ చైర్మన్ నరంజి ప్రసాద్,టీడీపీ నాయకులు రాము, కర్జా అచ్చిబాబు,చవిటియ గోపాలం తదితరులు పాల్గొన్నారు.

## లోకేష్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకం పట్ల ఆనందం

**టీడీపీ రాష్ట్ర పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా అవకాశం కల్పించిన నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన కిడారి శ్రావణ్ కుమార్**



పాడేరు,ఏప్రిల్16, ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేష్ నియమితులైనందుకు కిడారి శ్రావణ్ కుమార్ హర్షం వ్యక్తం చేస్తూ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. యువ నాయకుడిగా లోకేష్ పార్టీని మరింత శక్తివంతంగా ముందుకు తీసుకెళ్తారని, కార్యకర్తలకు ప్రేరణగా నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. అదేవిధంగా, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శిగా తనకు అవకాశం కల్పించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుకి, నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్‌కి, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకునేందుకు కృషి చేస్తానని, గిరిజన ప్రాంతాల అభివృద్ధి, పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, తెలుగు దేశం పార్టీ సిద్ధాంతాలను మరింత బలపరచడం తన ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పార్టీ నాయకత్వం అందించిన ఈ బాధ్యతను గౌరవంగా స్వీకరిస్తూ, ప్రతి కార్యకర్తతో కలిసి పార్టీ విజయానికి కృషి చేస్తానని కిడారి శ్రావణ్ కుమార్ స్పష్టం చేశారు.

## పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు

**తేదీలను మార్పుతో ఆలయంలో ప్రత్యేక పూజలు.. శుద్ధి కార్యక్రమం**

పాడేరు,ఏప్రిల్16, ప్రభాతవార్త



సాంస్కృతి సంప్రదాయాలకు విరుద్ధంగా గిరిజన మనోభావాలకు పట్టించుకోకుండా గత నలభై ఏళ్లుగా వస్తున్న సంప్రదాయాన్ని తూట్లు పొడుస్తూ పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు తేదీలను మార్పు చేస్తూ కూటమి ప్రభుత్వం. మంత్రి సంధ్యారాణి తీసుకున్న నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పాడేరు ఎమ్మెల్యే,, ఉత్సవ కమిటీ అధ్యక్షులు మత్స్యరాస మచ్చరాస విశ్వేశ్వర రాజు పేర్కొన్నారు. ఉత్తరాంధ్ర



ఆరాధ్య దేవత, మన్య ప్రజల ఇలవేల్పు పాడేరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఉత్సవాలు మే 10 11 12 తేదీల్లో నిర్వహించడానికి పాడేరు గ్రామ పెద్దలు, వర్తకులు, ఉద్యోగులు, ఆలయ కమిటీ అన్ని వర్గాల ప్రజలు సమక్షంలో ఉత్సవ తేదీలను ప్రకటించడం జరిగిందన్నారు. అయితే నిన్న కలెక్టర్ సమక్షంలో ఇన్చార్జ్ మంత్రి సంధ్యారాణి ముందుగా నిర్ణయించిన తేదీలను కాకుండా మే 17 18 19 తేదీల్లో పాడేరు అమ్మవారు ఉత్సవాలు తేదీలను మార్పు చేస్తూ ఉత్సవ కమిటీ ఆమోదం తెలపకుండా ఏకపక్షంగా తేదీలను ప్రకటించారని ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు ఆరోపించారు. ఈ తేదీలు మార్పుతో గురువారం పాడిరు శ్రీ మోదకొండమ్మ అమ్మవారి ఆలయాన్ని శుద్ధి చేసే కార్యక్రమాన్ని పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి ,గ్రామ పెద్దలు వర్తకులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో లతో కలిసి ఎమ్మెల్య్ విశ్వేశ్వర రాజు ముందుగా అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం పసుపు నీళ్లతో అమ్మవారి ఆలయంలో అలాగే ఆలయ ముఖ ద్వారం వద్ద పసుపు నీళ్లతో శుద్ధి కార్యక్రమం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం స్థానిక విలేకరులతో ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ గ్రామ పెద్దలు వర్తక వాణిజ్య, ఉద్యోగుల, ఆలయ కమిటీ పెద్దల సమక్షంలో మే 10 11 12 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల ఆరాధ్య దైవం మన్య ప్రజల ఇరవై వేల్పు పాడేరు కొండమ్మ అమ్మవారు ఉత్సవాలు నిర్వహించేందుకు తేదీలను ఖరారు చేసామన్నారు. అయితే గతంలో ఎన్నడూ లేని విధంగా అమ్మవారి తేదీలను మంత్రి సంధ్యారాణి, కూటమి నాయకులు తేదీలను మార్పు చేస్తూ మే 17 18 19 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించడానికి నిర్ణయించారని ఇది గిరిజన మనోభావాలు దెబ్బతీసే విధంగా వ్యవహరించడం చాలా దుర్మార్గమైన చర్య అని ఎమ్మెల్యే అన్నారు అమ్మవారు ఉత్సవాలు నిమిత్తం లైటింగ్‌కి అడ్వాన్సులు కూడా ఇవ్వడం జరిగిందన్నారు. అమ్మవారి నుంచి గుణపాఠం తీసుకోవడానికి సిద్ధంగా ఉండాలని తేదీలు మార్పు అరిష్టంగా తాము భావిస్తున్నామని అందుకే ఆలయ శుద్ధి చేపట్టినట్టు ఎమ్మెల్యే విశ్వేశ్వర్ రాజు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే కొత్తగుల్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అమ్మవారి తేదీలు మార్పు దుర్మార్గం అన్నారు. ఇది కొత్త సంప్రదాయానికి తెర తీశారన్నారు.పండగ తేదీలు ఖరారు కావడంతో దుర ప్రాంతాల్లో ఉన్న వారు రిజర్వేషన్ కూడా చేసుకున్నారన్నారు. కేవలం వైసీపీ ఎమ్మెల్యే ఉన్నారని ఇటువంటి రాజకీయం చేస్తున్నారని ప్రజలు దీనిని హర్షించారనీ మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి అన్నారు. ముందుగా ప్రకటించిన తేదీల్లోనే అమ్మవారి జాతర నిర్వహించేలా ప్రభుత్వం పునరాలోచించాలని మాజీ ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు పోటు బాబు నాయుడు, కమిటీ ప్రతినిధులు గంగన్న పడాల్, మాజీ సర్పంచ్ వర్తన పున్నయ్యదొర,కురుసా పార్వతమ్మ,సలా రామకృష్ణ, లకే రత్నాబాయి,అమర్, గిడ్డి విజయలక్ష్మి,ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామస్తులుఒ, వర్తకులు తదితరులు పాల్గొన్నారు

## ప్రజామోదంతో నిర్ణయించిన తేదీని ఎలా మారుస్తారు?

**పాడేరు మోదకొండమ్మ జాతర తేదీల మార్పులపై ఆగ్రహం వ్యక్తం చేసిన పాడేరు మాజీ ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి**



పాడేరు,ఏప్రిల్16,ప్రభాతవార్త

ప్రజలు, పాలక మండల సభ్యులు, వ్యాపార సంఘాల సభ్యులు, కలెక్టర్, ఎస్పీ అందరూ కలిసి గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీ శ్రీ పాడేరు మోదకొండమ్మ అమ్మవారి జాతరను మే 10,11,12 తేదీల్లో నిర్వహించాలని తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వం ఎలా మారుస్తుందని పాడేరు మాజీ శాసనసభ్యులు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి నిలదీసారు. పాడేరులో అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవానికి వచ్చిన గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి మోదకొండమ్మ అమ్మవారి జాతర తేదీలను మే 10, 11, 12 తేదీలకు బదులు 17, 18, 19 తేదీల్లో నిర్వహించేందుకు నిర్ణయించినట్లు వెల్లడించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాస్తవానికి ఆలయ కమిటీ చైర్మన్, స్థానిక శాసనసభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్యక్షతన ఆలయ పాలకమండ సభ్యులు, వ్యాపార సంఘాల సభ్యులు, గిరిజనులు అందరూ కలిసి మే 10, 11, 12వ తేదీల్లో అమ్మవారి జాతరను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ముహూర్తం ఖరారు చేశారని దానిలో భాగంగానే ఇటీవల రాట ప్రతిష్ఠోత్సవం కూడా జరిగిపోయిందన్నారు. అమ్మవారి జాతర ముహూర్తం ఖరారు అయిన తర్వాతే మోదకొండమ్మ అమ్మవారి పండగ రాట ప్రతిష్ఠోత్సవానికి ముహూర్తం అర్చకుల ఖరారు చేస్తారని ఒక క్రతువు పూర్తయిపోయిన తర్వాత కూడా జాతర తేదీలు మార్చ వచ్చా? అని ఆమె నిలదీశారు. శ్రీ శ్రీ పాడేరు మోదకొండమ్మ అమ్మవారి పాలకమండలి చైర్మన్, స్థానిక ఎమ్మెల్యే విశ్వేశ్వర రాజు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వ్యక్తి కాబట్టి ప్రభుత్వం మాటే చెల్లాలనే దురుద్దేశంతో ఆయన చైర్మన్‌గా ఉంటూ నిర్ణయించిన తేదీని మార్చి తీరాలనే పట్టుబట్టి మరీ మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. అమ్మవారి పండగ తేదీలు మార్చాలనే ఆలోచన విరమించుకొని యథావిధిగా మే 10, 11, 12 తేదీల్లో మోదకొండమ్మ అమ్మవారి జాతరను నిర్వహించాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరించి రాజకీ యం చెయ్యొద్దని పేర్కొన్నారు. అమ్మవారి పుట్టినరోజులు పురస్కరించుకొని ఉత్సవాలు చేయడం తాత ముత్తాతల కాలం నుంచి వస్తున్న సాంప్రదాయాన్ని యథావిధిగా కొనసాగించాలని ఆమె సూచించారు.

## చిట్ట చివరి గ్రామంలోనూ అభివృద్ధి వెలుగులు..

**సంగడ గ్రామంలో బస్ షెల్టర్ ప్రారంభోత్సవంలో ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర**

ముంచంగిపుట్టు ఏప్రిల్ 16, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం మండలానికి చిట్ట చివరనున్న గ్రామం కూడా అభివృద్ధి చెందాలని ఆ పల్లెలోనూ ప్రగతి బాటలు వేయాలన్నదే తన లక్ష్యమని ఉమ్మడి విశాఖ జిల్లా



పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం వనుగుమ్మ పంచాయతీ సంగడ గ్రామంలో ఎనిమిది లక్షల జిల్లా పరిషత్తు, 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్మించిన నూతన బస్సు షెల్టర్‌ను సుభద్ర ప్రారంభించారు. జడ్పీ చైర్‌పర్సన్ మాట్లా డుతూ మండలంలో అన్ని గ్రామాలు అన్ని పంచాయతీలు అద్భుత ప్రగతి సాధించాలన్నదే తన తపన అన్నారు. తనకు అవకాశం ఉన్నంత మేరకు ప్రతి గ్రామంలో సమాన అభివృద్ధి సాధించే దిశగా నిధులు కేటాయిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు చెప్పారు. తనకు జడ్పీ చైర్‌పర్సన్‌గా జగన్మోహన్ రెడ్డి అవకాశం ఇచ్చినప్పటి నుంచి నేటి వరకు అభివృద్ధి ధ్యేయంగా గిరిజన ప్రాంతాలలో ప్రగతి బాటలు వేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికీ



మండల కేంద్రంలోనూ బస్సు షెల్టర్ లేని పరిస్థితి ఉంటే అనేక అడ్డంకులను తొలగించి అక్కడ బస్సుల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని ఈరోజు సంగడతో పాటు మరికొన్ని చోట్ల కూడా వీటి నిర్మాణాలు, ప్రారంభోత్సవాలకు సన్నాహాలు చేస్తున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ముంచంగిపుట్టు మండల అధ్యక్షులు పాంగి పద్మారావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా జేసిఎస్ కోఆర్డినేటర్ అరబీరు జగబంధు, సుజన కోట ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి, జోలాపుట్టు ఎంపీటీసీ కమల, లక్ష్మీపురం ఎంపీటీసీ సాధు రామ్, వైసిపి నాయకులు సన్యాసిరావు, పాపారావు, తిరుపతి, మధు, వాలంటరీ సంఘ మండల అధ్యక్షులు దేవ, మాజీ సర్పంచ్ కిరసాని మిల్కి, తాజా మాజీ సర్పంచులు సిరగం నర్సింగరావు, జి.అర్జున్, ధన్య, వి.రత్న, నీలకంఠం, బాలరాజు, వైఎస్ఆర్సిపి నాయకులు రాజేంద్ర, దయ తరి, నింది, జీనబంధు, కళ్యాణం, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## హస్త కళలు వలసలు నిరోధంతో పాటు ఆర్థిక ఉపాధినిస్తాయి

**హస్త కళల పరిశ్రమ స్థాపనకు కృషి -ముసిరిగుడ లో శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన చైర్మన్ దొన్నుదొర**



అరకులోయ,ఏప్రిల్ 16, ప్రభాత వార్త

ప్రకృతి సోయగాలకు అందాలకు నిలయంగా మారిన అరకులోయ నేడు హస్తకళలకు నిలయంగా మారుతుంది. అరకు అంటే అందాలకు మాత్రమే నిలయం కాదని, హస్త కళలకు కూడా నిలయమని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనులకు సహకారాన్ని అందిస్తూ శిక్షణను అందిస్తున్నాయి. అంతేకాకుండా భవిష్యత్తులో హ్యాండీక్రాఫ్ట్ ద్వారా తయారుచేసిన వస్తువులను విక్రయించేలా అరకులోయలో ప్రత్యేకంగా ఒక మ్యూజియంను ఏర్పాటు చేసే దిశగా కూటమి ప్రభుత్వం నాయకులు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. తద్వారా గిరిజనులకు ఉపాధినిచ్చి ఆర్థికంగా ఆదుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని చెబుతున్నారు. అరకు కాఫీకి బ్రాండ్‌గా ఉన్న, ఆంధ్ర రాష్ట్రం, నేడు హస్తకళలకు కూడా బ్రాండ్‌గా ఉండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ప్రణాళికలను రూపొందించింది. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ మండలంలోని ముసురి గూడ గ్రామంలో కేంద్రానికి చెందిన డిసిహెచ్ ప్రోత్సాహంతో, రాష్ట్రానికి చెందిన ఏపీ ఇట్కో సహకారంతో స్థానిక పట్టాసి ఫౌండేషన్ చైర్మన్ పట్టాసి చలపతిరావు ఆధ్వర్యంలో 30 మంది గిరిజనులకు 50 రోజులపాటు హ్యాండీక్రాఫ్ట్‌లో ప్రత్యేక శిక్షణను అందిస్తుంది. శిక్షణలో గిరిజనులు వెదురుతో గృహానికి అవసరమైన అందమైన వస్తువులను చేతితో తయారు చేస్తున్నారు. ముసిరిగూడ గ్రామంలో జరుగుతున్న శిక్షణ కేంద్రాన్ని తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గం ఇన్చార్జి, ఏపీఎస్ ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ సియ్యారి దొన్ను దొర ప్రత్యేకంగా సందర్శించి శిక్షణ ఏర్పాటులను పర్యవేక్షించారు. అరకులోయ మండలంలో హస్త కళలు దినదినాభివృద్ధి చెందుతుండగా, ప్రస్తుతం మండలంలోని ముసిరి గూడ గ్రామంలో వెదురుతో తయారుచేసిన వస్తువుల శిక్షణ జరుగుతుండగా, చొంపి గ్రామంలో లక్క బొమ్మలు, మాడగడ గ్రామంలో మట్టి కుండలతో పాటు మట్టి వస్తువులను తయారు చేస్తున్నారు. పట్టాసి ఫౌండేషన్ చైర్మన్ పట్టాసి చలపతిరావు, టిడిపి నాయకులు వెంకట్, గంగ, చందు పాడి పాల్గొన్నారు.

## 18న అరకులోయ మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ పనులు**

అరకు రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

అరకు విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సుంకరమెట్ట ఫీడర్ నందు ఈనెల 18వ తేదీ శనివారం నాడు విద్యుత్ పనులు నిర్వహించనున్నామని. ఈ మేరకు ఉదయం 8:30 నుండి మధ్యాహ్నం 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు పాడేరు ఆపరేషన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి.వేణుగోపాల్ తెలిపారు. గురువారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ 33 బై 11 కేవీ అరకు సబ్‌స్టేషన్ పరిధిలోని సుంకరమెట్ట ఫీడర్ నందు చొంపి, సిరగం, మాడగడ, బస్కి, కొత్తబల్లుగూడ, సుంకరమెట్ట, బొండం పంచాయతీ పరిధిలోను అలాగే డుంబ్రిగూడ మండలంలో పంతల చింత, కురిడి, కిల్లో గూడ, సాగర, గసభ, సోవ్వ, కురాయి, కొల్లాపూటులో విద్యుత్తు మరమ్మత్తుల పనులతో పాటు చెట్టు కొమ్మలను తొలగించనున్నట్లు తెలిపారు. ఈ పనులు కారణంగా ఆయా గ్రామాలలో 18వ తేదీన 8:30 నుండి 2:30 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు చెప్పారు. విద్యుత్ వినియోగదారులు దీనిని గమనించి తమకు సహకరించాలని ఆయన కోరారు.

## టీడీపీ రాష్ట్ర కార్యదర్శిగా రెండవ సారి కొట్టగుల్లి సుబ్బారావును నియమించిన పార్టీ అధినేత,సిఎం చంద్రబాబు



పాడేరు,ఏప్రిల్16,ప్రభాతవార్త

తెలుగుదేశం పార్టీ అధిష్టానం రాష్ట్ర కమిటీని ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు నారాచంద్రబాబు నాయుడు ప్రకటించిన విషయం పాఠకులకు విదితమే.తెలుగు దేశం పార్టీ రాష్ట్ర కమిటీలో రెండవ సారి పాడేరు నియోజక వర్గానికి చెందిన కొట్టగుల్లి సుబ్బారావును రాష్ట్ర కార్యదర్శిగా నియమిస్తూ సాక్షాత్తు పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటిస్తూ సుబ్బారావు ను సుముచిత స్థానం కల్పించారు. అధికార పార్టీలో రెండవ సారి రాష్ట్ర కార్యదర్శిగా కొనసాగించడం హర్షించతగిన విషయం. సుబ్బారావును రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో యువతకు పార్టీ పెద్దపీట వేసినట్టుంది. సుబ్బారావు పార్టీకి అందిస్తున్న సేవలను గుర్తించి కార్యదర్శిగా టీడీపీ అధిష్టానం కొనసాగించడం పట్ల దేశం పార్టీ లో హర్షం వ్యక్తం చేస్తున్నారు.అలాగే జి సి సి చైర్మన్ గా పదవిలో ఉన్న కిడారి శ్రావణ్ కుమార్ ను టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శిగా(అరకు) నియమించడం..అలాగే టిడిపి కార్యదర్శిగా ఏంవివి ప్రసాద్ (కొయ్యూరు)ను నియమించడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.




## మాకవరం మాజీ సర్పంచ్ వంతల గంగాధర్‌ని పరామర్శించిన జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర



ముంచంగిపుట్టు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం మాకవరం పంచాయతీ మాజీ సర్పంచ్ వంతల గంగాధర్‌ని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పరామర్శించారు. ఇటీవల ఆయన అనారోగ్యానికి గురయ్యారన్న విషయం తెలుసుకొని ఆయన స్వగృహానికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. గంగాధర్ త్వరగా కోలుకొని ప్రజలకు సేవ చేసే భాగ్యాన్ని ఆ భగవంతుడు అందించాలని సందర్భంగా ఆమె ఆకాంక్షించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కీలకంగా వ్యవహరించే గంగాధర్ ఆయురారోగ్యాలతో యధావిధిగా పార్టీకి సేవలు సేవలందించేలా ఆ భగవంతుడు చల్లని దీవెనలు ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. ఆయన పరామర్శించిన వారిలో పార్టీ అధ్యక్షులు పాంగి పద్మారెడ్డి, సీనియర్ నాయకులు జెవివిఎన్ మూర్తి, వైఎస్ఆర్సిపి జెసిఎస్ జిల్లా కో ఆర్డినేటర్ శ్రీ అరబీరు జగబందు, వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, స్థానిక ఎంపీటీసీ బి.కమల, సుజన కోట ఎంపీటీసీ మజ్జి సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సమస్యను పరిష్కరిద్దాం కిలగాడ హై స్కూలుకు పూర్వ వైభవం తీసుకొద్దాం..

**ఆ పాఠశాల శత వసంతాల వేడుకల్లో జడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర**

ముంచంగిపుట్టు, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో కిలగాడ ప్రభుత్వ హైస్కూల్‌కు పూర్వ వైభవం తీసుకొచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని అన్ని సమస్యలను దశలవారీగా పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్దామని ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర పేర్కొన్నారు. ముం



చంగిపుట్టు మండలం కిలగాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల శత వసంతాల వేడుకలు మూడు రోజులు పాటు నిర్వహించనున్నారు. తొలి రోజు గురువారం సుభద్ర- మూర్తి దంపతులు ముఖ్య తిథులుగా పాల్గొన్నారు. అంగరంగ వైభవంగా చేస్తున్న ఈ వేడుకల్లో సుభద్ర- మూర్తి దంపతులకు ఘన స్వాగతం లభించింది. ముందుగా సరస్వతి మాత, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం పూర్వ విద్యార్థులతో కలిసి థింసా నృత్యం చేశారు. సుభద్ర- మూర్తి దంపతులను శతవసంతాల వేడుకల నిర్వహణ కమిటీ, పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెడ్పి చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర మాట్లాడుతూ కిలగాడ తనకు మెట్టినూరని ఈ గ్రామం అంటే తనకి ఎనలేని ప్రేమ అభిమానాలు ఉంటాయని పేర్కొన్నారు. తన మామ లిజల్లిపల్లి కుళ్లయ్యప్ప సుదీర్ఘ కాలం పాటు ఆ స్కూల్లో వార్డెన్‌గా సేవలందించిన విషయాన్ని గుర్తు చేశారు. తన కుటుంబానికి ఆ గ్రామంతో విడదీయలేని అనుబంధం తన మామయ్య ద్వారా ఏర్పడిందని చెప్పుకొచ్చారు. పాఠశాల అభివృద్ధి విషయంలో ఇకనుంచి తాను ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. పాఠశాలకు ఇదివరకు ఉన్న హాస్టల్‌ని మళ్ళీ తీసుకొచ్చే బాధ్యతను తాను తీసుకుంటానని ఈ విషయంలో ఉన్నతాధికారులతో మాట్లాడతానని పేర్కొన్నారు. నేగ్స్‌లో భాగంగా ప్రహరీ నిర్మాణానికి, ఇతర ఇతర పాఠశాలలో మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి సారిస్తానని చెప్పారు. తనను భాగస్వామ్యం చేసినందుకు పూర్వ విద్యార్థులందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## మహిళల భద్రత మన బాధ్యతపై పోలీసులు అవగాహన సదస్సు - ర్యాలీ

**హింసకు ముగింపు మన ఇంటి నుండే మొదలవుతుంది**

అరకు రూరల్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త



అరకులోయలో మహిళల భద్రతపై పోలీసు శాఖ ప్రత్యేక అవగాహన సదస్సును, భారీ ర్యాలీని నిర్వహించింది. పోలీస్ శాఖ ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు పాడేరు ఇంచార్జ్ ఏ ఎస్పి నవజ్యోతి మిశ్రా నేతృత్వంలో అరకులోయ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎల్.హిమగిరి ఆధ్వర్యంలో సబ్ ఇన్స్పెక్టర్ మల్లేశ్వర రావు స్థానిక పర్యాటక శాఖకు చెందిన పున్నమి ఇష్ట గోష్ఠి సమావేశ మందిరంలో మహిళలు, విద్యార్థినిలతో ప్రత్యేక అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గ ఇన్చార్జి, సియ్యారి దొన్నుదొర మాట్లాడుతూ మహిళల భద్రత మన బాధ్యత అని అన్నారు. ప్రతి మహిళ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. మార్పు అనేది మన కుటుంబం నుండే మొదలు కావాలని చెప్పారు. ఆడపిల్లల విషయంలో తల్లిదండ్రులు కూడా బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పాడేరు ఇన్చార్జి ఏఎస్పి నవజ్యోతి మిశ్రా మాట్లాడుతూ. మహిళా భద్రత మన బాధ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మరో ముఖ్య అతిథిగా పాల్గొన్న స్థానిక ఫిర్యాదుల కమిటీ జిల్లా అధ్యక్షురాలు కమిటీ కృష్ణకుమారి మాట్లాడుతూ మహిళల రక్షణకై తాను నిరంతరం శ్రమిస్తానని చెప్పారు. మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పట్టాసి చలపతిరావు మాట్లాడుతూ. మహిళల రక్షణపై పోలీస్ శాఖ నిర్వహిస్తున్న కార్యక్రమాలను ప్రతి మహిళా విద్యార్థినిలు అవగాహన పొంది సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన అరకు సర్కిల్ ఇన్స్పెక్టర్ హిమగిరి మాట్లాడుతూ మహిళల రక్షణ కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ అనేక చట్టాలను రూపొందించిందని వివరిస్తూ అవగాహన కల్పించారు. అరకులోయ సబ్ ఇన్స్పెక్టర్ టి.మల్లేశ్వరరావు, పెదలబుడు మేజర్ పంచాయతీ ఉప సర్పంచ్ విజయనిర్మల, ఎంపీటీసీ భీమరాజు, టిడిపి నాయకులు వెంకట్, మోహన్ దాసు పాల్గొన్నారు.

## బొండా పుట్టు తాత్కాలిక పాఠశాల భవన నిర్మాణానికి ఆర్థిక సహాయం

**ఉపాధ్యాయుడు ఉదారతకు కృతజ్ఞతలు తెలిపిన బొండా పుట్టు గ్రామస్తులు**



ముంచంగి పుట్టు ఏప్రిల్ 16, ప్రభాతవార్త

ఎన్నో ఏళ్ల నుండి అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలం ఏనుగురాయి పంచాయతీ బొండపుట్టు ఎంపీపీ స్కూల్‌లో పాఠశాల భవనం లేక విద్యార్థులు చదువుకోవడానికి ఇబ్బందిగా ఉండేది వేసవికాలంలో చెట్టుకింద, వర్షకాలంలో చిన్న పాకలో తరగతులు ఉపాధ్యాయులు నిర్వహించేవారు.. రానున్న విద్యాసంవత్సరంలో విద్యార్థులకి చదువు ఆటంకం కలగారాదని ప్రధానోపాధ్యాయులు గల్లెల. కామేశ్వరరావు చిన్న భవనం నిర్మాణానికి విరాళంగా తన వంతు 50000/-ఇచ్చి ఉదారతను చాటుకొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం ఉపాధ్యాయుడు గల్లెల కామేశ్వరరావు అందించిన ఆర్థిక సహాయానికి బొండా పుట్టు గ్రామస్థులు హృదయపూర్వక అభినందనలు, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ బొండపుట్టు గ్రామంలో విద్యాభివృద్ధి కోసం, చిన్నారుల భవిష్యత్తు కోసం మీరు అందించిన ?50,000 విలువైన సహాయం నిజంగా ప్రశంసనీయమైనదని. సమాజ అభివృద్ధి పట్ల మీకు ఉన్న నిబద్ధత, సేవాభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలుస్తుందని వారు పేర్కొన్నారు. మీ ఈ గొప్ప సహకారం వల్ల విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు అందుబాటులోకి వచ్చి, వారి విద్యాభ్యాసం మరింత అభివృద్ధి చెందుతుందని. మీ సేవా స్ఫూర్తి ఇలాగే కొనసాగాలని, ఇంకా ఎన్నో మంచి కార్యక్రమాలకు మీరు ముందుండాలని గ్రామస్థులు తెలిపారు.

## ఉపాధి హామీ పనుల్లో ముఖ హాజరు విధానం రద్దు చేయండి

డుంబ్రిగుడ ఏప్రిల్ 16, ప్రభాతవార్త



జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులో ముఖ హాజరు విధానం రద్దు చేయాలనీ గసభ పంచాయితీ మాజీ సర్పంచ్ డిమాండ్ చేశారు. ఆ పంచాయతీ గ్రామాల్లో జరిగే ఉపాధి పనులను ఆయన పరిశీలించి, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో సరైన సిగ్నల్ లేక ఉపాధి శ్రామికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోంటున్నారనీ ఆయన చెప్పారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం నూతన ఉపాధి చట్టం (జీ రాంజీ)చట్టం తీసుకొని రావడంతో ఉపాధి కూలీల కష్టాలు పెరిగిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉపాధి చట్టం మార్పు వెనకాల కుట్ర ఉందని ఆయన ఆరోపించారు. భూస్వాములు, పెట్టుబడి దారుల ప్రయోజనం కోసమే జీరాంజీ చట్టం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం తీసుకొని వచ్చిందని ఆరోపించారు. ఉపాధి కూలీల వేతనాలు సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.అలాగే పని ముట్లు అందించాలని,పని ప్రదేశంలో ఉపాధి శ్రామికులకు తగు సౌకర్యాలు కల్పించాలని ఆయన కోరారు.

17-4 pg 9.qxd:17-4 pg 9.qxd 1/1/02 6:25 AM Page 1



# గ్రూప్ స్టడీ మంచిది !

పిల్లలు ఎవరికి వారు చదువుకోవడం మామూలే. అలా కాకుండా గ్రూప్ స్టడీలో పాల్గొనడం వల్ల ప్రయోజనాలున్నాయి అంటున్నారు నిపుణులు.



పిల్లలు ఒంటరిగా చదువుతున్నప్పుడు ఏదో మొక్కుబడిగా చదువుతూ బోర్‌గా ఫీలుతుంటారు. కొన్ని సబ్జెక్టులు ఇంకెప్పుడైనా చదువుదాం అని వాయిదా వేస్తుంటారు. అదే వారి స్నేహితులతో గ్రూప్ స్టడీ చేయండి అంటే చాలు ఎంతో ఉత్సాహం చూపిస్తారు. దీనివల్ల వాయిదా విధానాన్ని మానుకుంటారు.

- కలిపి చదవడంవల్ల వారిలో బృంద స్ఫూర్తి ఏర్పడు తుంది. మీ పిల్లలు సిగ్గు పడేవారైతే స్నేహితులతో చదవడమే మంచిది. సందేహాలను పంచుకోవడం వల్ల వాళ్లల్లో కమ్యూనికేషన్ స్కిల్స్ పెరుగుతాయి. బాల్యం నుంచే వారిలో నాయకత్వ లక్షణాలు అలవడతాయి.
- ఎవరికి వారు చదువుకునేటప్పుడు తాము చదివిందే కర్రెక్ట్ అనుకుంటారు. దానివల్ల పరీక్షల్లో తప్పుడు సమాధానాలు రాస్తుంటారు. అదే గ్రూప్ స్టడీ చేయడం వల్ల తప్పొప్పులు సరిచూసుకోగలరు. అంతేకాదు, పిల్లలకు అన్ని సబ్జెక్టులూ సరిగా అర్థం కాకపోవచ్చు. అదే ఒకరికొకరు చెప్పుకోవడంవల్ల తేలికగా నేర్చుకుంటారు. ◻

# ఇల్లే ఒక వెల్‌నెస్ సెంటర్ !



ఇల్లే ఒక వెల్‌నెస్ సెంటర్ ! మనసు బాలేనప్పుడూ, శరీరం అలసిపోయినప్పుడూ... గుర్తొచ్చేవి వెల్‌నెస్ సెంటర్లు, స్పాలూ, ప్రకృతి విహారాలూ. కానీ ఇంటి వాతావరణాన్నే ఆ విధంగా మార్చుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అదెలా అంటే..

- సువాసన, స్పర్శ, దృష్టి, ధ్వని, రుచి... ఇలా పంచేంద్రియాలను ఉత్తేజపరిచే వాతావరణాన్ని ఇంట్లోనే సృష్టించవచ్చు. వీటితో ప్రశాంతత, సున్నితత్వం, సృజనాత్మకత సొంతమవుతాయి. విశ్రాంతి పొందడం, తేరుకోవడంలో సాయపడ తాయి.
- దైనందిన జీవితంలో చేసే పనులకు అనుకూలమైన వాతావరణం ఇంట్లో ఉండాలి. కృత్రిమమైన వస్తువులు కాకుండా పంచభూతాలకు సహజ పద్ధతిలో దగ్గరగా ఉండేలా పర్యావరణహితమైన వస్తువులు ఎక్కువగా ఉండాలి. బంకమట్టి వస్తువులు, నార వస్త్రాలు వంటి వాటిని తాకినప్పుడు మనసుతో మట్లాడినట్లు అనిపిస్తుంది. అందుకే ఇలాంటివాటికి ప్రాధాన్యత ఇవ్వాలి.
- ప్రకృతికి దగ్గరగా ఉండేలా ఇంటిని రూపొందించు కోవాలి. అప్పుడే ఆరోగ్యంగానూ ఉంటాం. మరో బాల్కనీలూ, వరండాలూ విశాలంగా, ఆహ్లాదకరంగా ఉండాలి. అక్కడ ఎక్కువ సమయం గడిపేలా చూసుకోవాలి.
- మానసిక ఉల్లాసాన్ని పెంచడంలో రంగులది కీలకపాత్ర ఇల్లూ, ఇంట్లోని వస్తువులకు ఆకుపచ్చ, గులాబీ, లేత నీలం... వంటి రంగులను ఎంపిక చేసుకోండి. 5. ఇంట్లో ఎక్కడ పెడుతున్నామన్నదీ దీన్లో కీలకం. అక్కడ కూర్చుంటే సహజంగానే విశ్రాంతి పొందుతున్న అనుభూతి రావాలి. ◻

# మహిళా రిజర్వేషన్ బిల్లు వెనుక ఎందరో !



**మూడు దశాబ్దాల పోరాటం.. మహిళల చిరకాల స్వప్నం.. నేటికైనా అది నెరవేరాలన్నదే అందరి ఆకాంక్ష. అయితే ఈ మహిళా రిజర్వేషన్ బిల్లు చట్టరూపం దాల్చడం వెనక కీలకపాత్ర పోషించిన వాళ్లలో మహిళా నాయకులూ కార్యకర్తలెందరో.. వాళ్లలో కొందరి గురించి తెలుసుకుందాం..**



**ప్రమీల దండావతే:** ముంబయికి చెందిన మాజీ ఎంపీ. 1980ల ప్రారంభంలో ఏడో లోక్‌సభలో ఈ బిల్లును ఓ ప్రైవేట్ సభ్యుని బిల్లుగా తొలిసారిగా ప్రవేశపెట్టారు. 1989లో వి.పి.సింగ్ ప్రభుత్వ హయాంలో పార్లమెంట్‌తో పాటు రాష్ట్రాల విధాన సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించాలని తొలిగా డిమాండ్ చేశారీమె. ఈ బిల్లుకోసంవివిధ రాజకీయ పార్టీల మహిళలతో కలిసి పనిచేశారీమె. 1970వ దశకంలోనే మహిళల హక్కులకోసం విశేషంగా కృషిచేశారు. వరకట్న నిరోధక, సతీసహగమన నివారణ చట్టాలను సవరించడానికి అవిశ్రాంతంగా శ్రమించారు. రాజకీయంగా ఎంతో చురుగ్గా ఉండే ప్రమీల... ఎమర్జెన్సీ కాలంలో 18 నెలల జైలు శిక్ష అనుభవించారు. మహిళా దక్షత సమితిని నెలకొల్పి జమీలా వర్గీస్, డాక్టర్ కుమారిలతోకలిసి 'విడోస్, అబాండ్ అండ్ డెడ్ డెడ్ విమెన్ ఇన్ ఇండియా' పుస్తకాన్ని రచించారు.

**గీతా ముఖర్జీ:** కోల్‌కతాలోని మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చారీమె. విద్యార్థి దశ నుంచీ ఉద్యమాల్లో పనిచేసేవారు. స్వాతంత్ర్యానికి పూర్వం, తరవాత అనేక ప్రజా ఉద్యమాల్లో పాల్గొని ఎన్నోసార్లు జైలుకి వెళ్లారు. సీపీఐ నాయకురాలు, సుదీర్ఘకాలం ఎంపీగా ఉన్నారు. నాలుగుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైన ముఖర్జీ, రికార్డు స్థాయిలో ఏడు సార్లు పార్లమెంటుకి ఎన్నికయ్యారు. సీపీఐకి చెందిన నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ విమెన్స్ అధ్యక్షురాలుగానూ పనిచేశారు. మహిళలకు మూడింట ఒకవంతు రిజర్వేషన్ కల్పించాలని డిమాండు ఆమె నాయకత్వం వహించారు. 1996లో సంయుక్త పార్లమెంటరీ కమిటీకి అధ్యక్షురాలుగా ఉన్న గీత...మహిళా బిల్లు రూపకర్త కూడా. బిల్లు తొలి అధికారిక ప్రతిని పరిశీలించి కీలకమైన సిఫార్సులను చేశారు. అప్పట్లో మహిళలు రక్తంతో రాసిన వినతిపత్రాలు అందినప్పుడు ఆమె కన్నీళ్లు పెట్టుకున్నారు. వాటిలో చాలా వరకు తుది బిల్లులో చేర్చారు. మహిళా బిల్లుకోసం అన్ని రాష్ట్రాల్లో ప్రచారం చేశారు గీతా ముఖర్జీ. మెజారిటీ సాధనకు ఆమె ఎంతో కృషి చేసినప్పటికీ ఏకాభిప్రాయం లేదనే సాకుతో ఇతర పార్టీలు వెనకడుగు వేసినప్పుడు ఆమె తీవ్ర నిరాశ చెందింది.



ఈ సందర్భంగా విలేకరులతో మాట్లా డుతూ నా భర్త చనిపోయినప్పుడు కూడా ధైర్యంగా ఉన్నాను. కానీ ఈ రోజు కన్నీళ్లు పెట్టు కున్నా అన్నారట. బిల్లుకోసం మంత్రి పదవినీ కాదన్న నిస్వార్థ రాజకీయకీయ నాయకురాలు గీత.

**డా. రంజనాకుమారి,:** ఉద్యమకారిణి, పండితురాలు, బిల్లు రూపాన్ని రూపొందించడంలో సాయపడ్డారు. ప్రస్తుత సెంటర్ ఫర్ సోషల్ రిసెర్చ్ ఇండియా డైరెక్టర్‌గా ఉన్నారు. ఈ బిల్లుకోసం ప్రచారం చేసిన జాతీయ మహిళాసంఘాల సమూహామైన సెవెన్ సిస్టర్స్ నాయకత్వం వహించారు. మూడు దశాబ్దాల పోరాట ఫలం ఇది. 2023లో పార్లమెంటులోనే ఆమోదం పొందింది. కానీ, పునర్విభజన, జనాభా లెక్కలకు సంబంధించిన ప్రశ్నల కారణంగా ఇప్పటి వరకు అమలు కాలేదు. మన ప్రజాస్వామ్యానికి మహిళల భాగస్వామ్యం కేంద్రంగా ఉండాలని బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆకాంక్షించారు. అది ఇంకా నెరవేరలేదు. పార్లమెంటులో సమానత్వం కోసం పోరాడిన మహిళలు, మహిళా సంఘాలు అంతా ఒక్కటై బిల్లును ఆమోదించండి. 2029 నాటికి లోక్ సభలో 33 శాతం మంది మహిళలను చూడండి అంటున్నారు రంజ.



**వీళ్లే కాదు,** 1987లో 14 మంది సభ్యుల కమిటీకి నాయకత్వం వహించిన మార్గరెట్ అల్వా మహిళలకు 33 శాతం సీట్లు కేటాయించాలని అధికారికంగా సిఫార్సు చేసిన వ్యక్తి. ఈ బిల్లుకు గట్టి మద్దతు ప్రకటించి, అన్ని పార్టీల మద్దతు కూడగట్టడంలో కీలకపాత్ర పోషించారు. సుష్మా స్వరాజ్. యూపీఏ హయాంలో ఈ బిల్లు ఆమోదం కోసం నిరంతరం కృషి చేసి 2010లో రాజ్యసభలో అది ఆమోదం పొందేలా చేశారు సోనియా గాంధీ... ఇలా మరెందరో. మహిళల్ని ప్రజాపాలనలో చూడాలని ఎంతో శ్రమించిన నాయకురాళ్లలో కొందరు నేడు లేకపోవచ్చు. కానీ వాళ్ల పోరాటం, ఉద్యమస్ఫూర్తి భావితరాలకు ఆదర్శనీయమే కదూ. ◻

# అరిషడ్వర్గాలు

నేనే కర్తను, ఈ పనిని నేనే చేశాను, సర్వసమర్థుణ్ణి లాంటి అహంకారపూరిత ఆలోచనలతో మనిషి తనకు తానుగా బందీ అవుతున్నాడు. 'మోహ మూలం అహంకారః' అన్నది ఉపనిషత్తు వాక్యం. ఆ అహంకారానికి పుట్టినవే అరిషడ్వర్గాలు. కామ క్రోధ లోభ మోహ మద మాత్సర్యాలు అంతశ్శత్రువులు. మహిషుడి నుంచి మనుషుల వరకూ వాటి చేతిలో ఓడనివారు ఉండరు. సకలశాస్త్ర కోవిదుడైనప్పటికీ కామం వల్ల రావణుడు ఎందరో స్త్రీలను చెరబట్టి కోరి వినాశనాన్ని తెచ్చు కున్నాడు. క్రోధంవల్ల విశ్వామిత్రుడు వశిష్టుని వందమంది కుమారులను వధించి తీవ్ర పశ్చాత్తాపంతో కుంగిపోయాడు. ఐదు ఊళ్లైనా ఇవ్వమని అడిగిన పాండుపుత్రుల అభ్యర్ధనను లోభంతో తిరస్కరించాడు దుర్యోధనుడు. అది కురుక్షేత్రానికి దారితీసింది. శుంభనిశుంభులు అన్యోన్య సోదరులు. స్త్రీ వ్యామోహం వారి ఎడబాటుకే కాదు చావుకు కారణమైంది. కార్తవీర్యార్జునుడనే రాజు తలకెక్కిన మదం వల్ల పరశురాముడి చేతిలో 21 సార్లు భూమండలం మీదున్న రాజవంశాలు అంతమయ్యాయి. శ్రీకృష్ణభగవానుడి వైభవాన్ని చూసి మత్సరంతో రగిలిపోయాడు శిశు పాలుడు. నూరు తప్పులు దాటాక.. శిక్ష పొం దాడు. దైవం పట్ల నిరంతర కృతజ్ఞతాభావం చూపాల్సిన మనసును కలుషితంచేసేదే ఈ అరిషడ్వర్గం. సానుకూల దృక్పథం, ప్రకృతి పట్ల ప్రేమ, ధర్మాచరణ ఈ శత్రుమూకను తరిమేసి విజయాన్ని చేకూర్చగలవు. మెరికా తనకు భిక్ష వేసిన గృహిణి పట్ల అర్థమైంది బాలశంకరుల హృదయం. నిస్వార్థ భక్తితో అమ్మవారిని స్తుతించగా.. ఆయన వాక్కు అధీనమై కనకధారలనుకురిపించింది. జగన్మాత. కంచికి చెందిన మహా భక్తుడైన మూకశంకరులు ధర్మప్రవర్తనతో తదేకదీక్షతో ఆ దేవిని ధ్యానించి, దర్శించి ధన్యమయ్యారు.

# కరివేపాకు పానీయం



పండ్లతోనే కాదు కాయగూరలతోనూ కాన్సన్ట్రేట్ డ్రింక్ తయారుచేయొచ్చు. కరివేపాకుతో చిక్కటి పానీయం చేసి నిలవుంచు కుంటే. ఎప్పు డంటే అప్పుడు తాగొచ్చు.

**కావలసినవి:** కరివేపాకు రెండు కప్పులు, నిమ్మరసం 2 స్పూన్లు, జీలకర్ర టేబుల్ స్పూన్లు, మిరియాలు స్పూన్, అల్లం తరుగు రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు రుచికి తగినంత, బెల్లంపొడి కప్పు, నెయ్యి స్పూన్, ఇంగువ చిటికెడు

**తయారీ:** కరివేపాకును కడిగి, వస్త్రం మీద ఆరబెట్టాలి. కడాయిలో జీలకర్ర, మిరియాలను వేయించాలి. చల్లారాక.. కరివేపాకు, అల్లం, కప్పు నీళ్లు జోడించి మెత్తగా గ్రైండ్ చేయాలి. దీన్ని మందమైన గిన్నెలోకి తీసి.. సన్న సెగ మీద వేడి చేయాలి. ఆరేడు నిమిషాల తర్వాత బెల్లంపొడి, ఉప్పు, ఇంగువ, నెయ్యి వేసి కలియబెడుతూ ఉడికించాలి. మిశ్రమం చిక్కగా అయ్యాక స్టవ్ ఆఫ్ చేయాలి. పూర్తిగా చల్లారిన తర్వాత నిమ్మరసం కలపాలి అంతే.. ఆరోగ్యకరమైన పానీయం సిద్ధమవుతుంది. పూర్తిగా చల్లారాక.. శుభ్రమైన సీసాలోకి తీసి.. రిఫ్రిజిరేటర్‌లో భద్రం చేసుకుంటే రెండు నెలలు నిల్వ ఉంటుంది. తాగదలచి నప్పుడు గ్లాసు చల్లని నీళ్లలో రెండు స్పూన్ల కాన్సన్ట్రేట్ కలిపితే సరిపోతుంది. మిశ్రమాన్ని ఇంకొంచెం చిక్కబడేట్లు ఉడికించాలి.ఇది మూడు నుంచి నాలుగు వారాలు నిల్వ ఉంటుంది. ఈ పానీయం జీర్ణశక్తిని పెంచు తుంది, రక్తహీనతను తగ్గిస్తుంది. కురులను సంరక్షిస్తుంది. ◻

# అన్నం.. కూర.. పప్పు ఒకేసారి!



యుద్ధం కారణంగా ఎల్పీ కొరతతో వంటకు ప్రత్యామ్నాయాలు వెతుక్కోక తప్పడం లేదు. ఇప్పటికే ఇండక్షన్ కుక్‌టాప్ వాడకం పెరిగింది. కానీ కరెంటు మాటేంటి... అసలే వచ్చేది వేసవికాలం, ఏసీల వాడకమూ పెరుగుతుంది. దాంతో విద్యుత్ బిల్లులు బారెడు వస్తాయి కదా! గ్యాస్, విద్యుత్ సరఫరానీ ఆదా చేయాలంటే మాత్రం మల్టీ పర్పస్ స్మార్ట్ రైస్ కుక్కర్ ఉండాల్సిందే. సాధారణ రైస్ కుక్కర్లో కాకుండా ఇందులో ప్రెషర్ కుక్కర్, స్టీమర్... వంటి ఎంపికలు ఉంటాయి. దాంతో అన్నం, పప్పు, కూరలను ఒకేసారి వండేసుకోవచ్చు. స్టీల్ లేదా నాన్‌స్టిక్ పాత్రలతో వస్తుంది. కుక్కర్లో దిగువ భాగంలో పప్పు, కూరలను పెట్టుకోవచ్చు. స్టీమర్ బాస్కెట్‌లో రైస్‌ను పెట్టుకునేలా దీన్ని తయారుచేశారు. కింద ప్రెషర్తో పప్పు, కూరలు ఉడుకుతుంటే... స్టీమ్ అన్నం ఉడుకుతుంది. ఈ ఆహార పదార్థాలు కలవకుండా అన్నీ ఒకేసారి సిద్ధిస్తాయి. 2030 నిమిషాల్లోనే వంట పూర్తవుతుంది. గ్యాస్ వాడకమూ తగ్గుతుంది. శుభ్రం చేయడం కూడా సులువే అయితే స్మార్ట్ కుక్కర్ కొనేటప్పుడు కుటుంబానికి సరిపోయేలా స్టెయిన్లెస్ పాత్ర లున్న రకాలను ఎంచుకుంటే, మేలు. ◻

# తెర

## 'గద్దర్ అవార్డ్" ఉత్తేజంతో రెండో చిత్రం ప్రారంభం!!

**- నిర్మాత బూసం రవీంద్రనాథ్**



"మనం చెట్లను కాపాడితే... చెట్లు మనల్ని కాపాడతాయి" అనే సిద్దాంతంతో చెట్లు నాటడానికే తన జీవితాన్ని అంకితం చేసి, "చెట్ల రామయ్య" అలియాస్ 'వనజీవి రామయ్య'గా తన జన్మను ధన్యం చేసుకుని, భారత ప్రభుత్వం నుంచి ప్రతిష్టాత్మక "పద్మశ్రీ" పురస్కారం పొందిన దరిపల్లి రామయ్య జీవితానికి "వనజీవి రామయ్య" పేరుతో దృశ్యరూపం ఇచ్చారు నూతన నిర్మాత బూసం రవీంద్రనాథ్. 'వృక్షో రక్షతి రక్షిత' అనే ట్యాగ్ లైన్ తో నంది అవార్డు గ్రహీత వేముగంటి దర్శకత్వంలో బి. ఆర్. మూవీస్ బ్యానర్ పై రవీంద్రనాథ్ నిర్మిం చిన ఈ 40 నిమిషాల నిడివి కలిగిన లఘు చిత్రం... షార్ట్ ఫిలిమ్స్ కేటగిరీలో ఫస్ట్ బెస్ట్ షార్ట్ ఫిల్మ్ గా తెలంగాణ ప్రభుత్వం నుంచి గద్దర్ అవార్డు దక్కించుకుంది. 5 లక్షల నగదు బహుమతి కూడా అందుకుని రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల దృష్టిని ఆకర్షించింది!! నిర్మాతగా తన తొలి ప్రయత్నమే ఫలప్రదం కావడంతో... త్వరలో రెండో చిత్రానికి శ్రీకారం చుడుతున్నారు . సినిమాలంటే చిన్నప్పటి నుంచి మహా ఇష్టం. ఆ ఇష్టం తోనే "వనజీవి రామయ్య" చిత్రంలో ఒక చిన్న పాత్ర సైతం పోషించారు. ప్రస్తుతం తన రెండో చిత్రం కోసం కథాచర్చలు జరుపుతున్న రవీంద్ర త్వరలో ఈ చిత్రాన్ని సెట్స్ కి తీసుకెళ్లేందుకు సన్నా హాలు చేస్తున్నారు. "వనజీవి రామయ్య"గా టైటిల్ రోల్‌తో మెప్పించిన సీనియర్ నటుడు బ్రహ్మాజీతోపాటు ఈ చిత్రం రూపకల్పనలో దర్శకనిర్మాతలకు సహకరించిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా

## 'పెద్ది' జూన్‌లో ప్రపంచ వ్యాప్తంగా రిలీజ్



మెగా పవర్ స్టార్ రామ్‌చరణ్ మోస్ట్ ఎవైటెడ్ పాన్‌ఇండియా స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది' ప్రమోషనల్ కంటెంట్‌తో మ్యాసీవ్ బజ్ క్రియేట్ చేస్తోంది. విడుదలైన రెండు పాటలు చార్ట్‌బస్టర్‌లుగా నిలిచాయి, రెండు గ్లింప్స్‌లలో రామ్ చరణ్ డిఫరెంట్ అవతార్స్ లో కనిపించి అందరినీ ఆకట్టు కున్నారు. ముఖ్యంగా, పుట్టినరోజు ప్రత్యేక గ్లింప్స్‌కు ఎక్స్ ట్రార్డినరీ రెస్పాన్స్ వచ్చింది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో, వెంకట సతీష్ కిలారు వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై నిర్మించగా, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో రూపొందిన ఈ చిత్రం విడుదల దిశగా ముందుకు సాగుతోంది. సినిమా విడుదల వాయిదా పడినట్లు చిత్ర బృందం ఇప్పుడు అధికారికంగా ధృవీకరిం చింది. మేకర్స్ నుండి వచ్చిన ఒక అధికారిక ప్రకటన ప్రకారం 'పెద్ది' జూన్‌లో థియేటర్ల లోకి రానుంది. సినిమా ఎడిటింగ్‌ను సమీక్షిం చిన తర్వాత, అవుట్‌పుట్ పై గొప్ప సంతృప్తిని వ్యక్తం చేశారు, అబ్సల్యూట్ పర్ఫెక్షన్ కోసం పోస్ట్‌ప్రొడక్షన్ కు అదనపు సమయం కేటాయించాలని నిర్ణయించు కున్నారు. ప్రేక్షకులకు అత్యుత్తమమైన, గ్రేట్ థియేట్రికల్ ఎక్స్ పీరియన్స్ అందించాలనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ చిత్రంలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా, శివ రాజ్‌కుమార్, జగపతి బాబు, దివ్యేందు, బోమన్ ఇరానీ వంటి అద్భుతమైన తారాగణం కీలక పాత్రలలో నటిస్తున్నారు.

## 'శ్రీనివాస మంగాపురం' టీజర్ లాంచ్



దర్శకుడు అజయ్ భూపతి ప్రస్తుతం ఇంటెన్స్ లవ్ స్టోరీ 'శ్రీనివాస మంగాపురం' దర్శకత్వం వహిస్తున్నారు. సూపర్ స్టార్ కృష్ణమనవడు, మహేష్‌బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని ఈ సినిమాతో హీరోగా పరిచయం అవుతున్నారు. రవీనా టాండన్ కుమార్తె రాషా తడాని ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్నారు. 'ఉయ్యి అమ్మ' పాటతో దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఆమె ఈ చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెడుతున్నారు. కలెక్షన్ కింగ్ డా.మోహన్ బాబు ఈ చిత్రంలో విలన్ పాత్రలో కనిపించనున్నారు. అశ్వినిదత్ సమర్పణలో, పి. కిరణ్ నిర్మాణంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రధాన తారాగణం ఫస్ట్‌లుక్ పోస్టర్ల విడుదలతోనే ఇప్పటికే ఆసక్తి రేకెత్తింది. ఈ రోజు, సూపర్ స్టార్ మహేష్‌బాబు ఈ టీజర్‌ను లాంచ్ చేశారు. తిరుపతి దేవాలయ పట్టణంలో సాగే ఈ కథ వాసుబాబు, మంగా అనే ఇద్దరు స్నేహితులు ప్రేమికులుగా మారి ఆనందంగా జీవించే ప్రయాణాన్ని చూపిస్తుంది. తన ఇంటెన్స్, రాజీ పడని స్టోరీ టెల్లింగ్‌కి పాపులర్ అయిన అజయ్ భూపతి, ఈ చిత్రంలో యూత్‌ఫుల్ లవ్ స్టోరీని యాక్షన్, భావోద్వేగాలతో మిళితం చేశారు. జయకృష్ణ ఘట్టమనేని తన తొలి చిత్రానికే అద్భుతమైన మెచ్యూరిటీతో నటించారు. ఎమోషన్స్, ఇంటెన్స్, యాక్షన్, స్క్రీన్ ప్రెజెన్స్ అన్నింటినీ బ్యాలన్స్‌గా చూపిస్తూ ఆకట్టుకున్నారు.

## 'రావు బహదూర్' సాంగ్ లాంచ్ ఈవెంట్



సూపర్‌స్టార్ మహేష్‌బాబు, నమ్రతా శిరోద్కర్ జిఎంబి ఎంటర్‌టైన్‌మెంట్, ప్రముఖ దర్శకుడు వెంకటేష్ మహా దర్శకత్వంలో, వెర్సటైల్ యాక్టర్ సత్యదేవ్ కథానాయకుడిగా నటిస్తున్న 'రావు బహదూర్' చిత్రాన్ని సగర్వంగా అందిస్తోంది. ఈ చిత్రాన్ని ఏ+ఎస్ మూవీస్, శ్రీచక్రాస్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. స్మరణ్ సాయి మృదువైన స్వరాలతో, ఆహ్లాదకరమైన నేపథ్యంతో ఈ గీతాన్ని అద్భుతంగా స్వరపరిచారు. విజయ్ యేసుదాస్ తన హృద్యమైన వోకల్స్‌తో ఈ పాటను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లారు. ఈ చిత్రానికి కార్తిక్ పార్మర్ సినిమాటోగ్రఫీ నిర్వహించారు. స్మరణ్ సాయి సంగీతాన్ని అందించారు. రోహన్ సింగ్ ప్రొడక్షన్ డిజైనర్. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో దర్శకుడు వెంకటేష్ మహా మాట్లాడుతూ.. ఈ ఈవెంట్ చాలా స్పెషల్. దాదాపు ఐదేళ్ళ తర్వాత నా సినిమాకి జరుగుతున్న తొలి ఈవెంట్ ఇది. హీరో సత్యదేవ్ మాట్లాడుతూ.. 'ఓ సుందరి'పాట వెనుక ఒక ఆసక్తికరమైన కథ ఉంది. నేను సినిమాలకు వచ్చిన కొత్తలో కమల్ హాసన్ లాంటి పాత్రలు ఎప్పుడైనా వస్తుందా అని అనుకునేవాడిని. ఒక రోజు వెంకటేష్‌మహా ఈ కథ చెప్పారు. సింగర్ విజయ్ యేసుదాస్ మాట్లాడుతూ.. ఇంత అద్భుతమైన ప్రాజెక్టులో భాగం కావడం ఆనందంగా ఉంది.

## 'పోచమ్మ' సక్సెస్ మీద మాకు నమ్మకం: కవిత



ఈనెల 17వ తేదీ నుంచి తెలుగు, తమిళంలో స్ట్రీమింగ్‌కు వస్తున్న 'పోచమ్మ' వెబ్ సిరీస్ ప్రముఖ తెలుగు ఓటీటీ ప్లాట్ ఫామ్ ఆహా మరో సరికొత్త వెబ్ సిరీస్ 'పోచమ్మ' ను సబ్ స్క్రైబర్స్ ముందుకు తీసుకొస్తోంది. మిస్టికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన ఈ సిరీస్ లో అంబటి అర్జున్, రమేశ్ ఇందిర, ప్రియ శతమర్షన్, స్నేహాల్ కామత్, శృతి నాయుడు, శ్రీ పూజ, కీలక పాత్రల్లో నటించారు. 'పోచమ్మ' వెబ్ సిరీస్ ఈ నెల 17వ తేదీ నుంచి ఆహాలో తెలుగు, తమిళంలో స్ట్రీమింగ్‌కు రాబోతోంది. గోల్డ్ సబ్ స్క్రైబర్స్ 24 గంటల ముందుగా యాక్సెస్ పొందవచ్చు. నటి స్నేహాల్ కామత్ మాట్లాడుతూ 'పోచమ్మ' వెబ్ సిరీస్ జెస్సీ అనే క్యారెక్టర్‌లో నటించాను. ఈ సిరీస్ షూటింగ్ మొత్తం చిక్ మంగళూరులో చేశాం. ఈ సిరీస్‌కు నన్ను సెలెక్ట్ చేసుకున్న ప్రొడ్యూసర్ శృతి నాయుడుకి థ్యాంక్స్ నటి శ్రీ పూజ మాట్లాడుతూ ఈ వెబ్ సిరీస్‌లో నటిస్తున్న మొదటి రోజే తప్పకుండా సక్సెస్ అవుతుందని నమ్మాను. ఆహా ఓటీటీ కంటెంట్ హెడ్ కవిత మాట్లాడుతూ 'పోచమ్మ' కథ విన్నప్పుడే ఈ సిరీస్ సక్సెస్ మీద మాకు నమ్మకం ఏర్పడింది.

## 'పవర్‌పేట' పవర్ ఫుల్ పోస్టర్



నిర్మాతలు విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నేతృత్వంలోని ప్రతిష్టాత్మక బ్యానర్ 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ కంటెంట్‌బేస్డ్ సినిమాలకు మద్దతు ఇవ్వడంలో పేరు సంపాదించుకుంది. ఇప్పుడు వారు మరో ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు సిద్ధమవుతున్నారు. అర్థవంతమైన, బలమైన కథలను ఎంచుకోవడంలో పేరుపొందిన హీరో సందీప్ కిషన్, చిత్ర పరిశ్రమలో 16 సంవత్సరాలు పూర్తి చేసుకుని ఒక మైలురాయిని చేరుకున్నారు. 'పవర్ పేట' అనే టైటిల్ ఆసక్తికరంగా ఉంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్ కూడా బలమైన ఇంప్రెషన్‌ను ఇస్తోంది. డార్క్, గ్రిట్టీ, సింబాలిజంతో నిండిన ఈ పోస్టర్‌లో రక్తంతో తడిసిన చెస్ బోర్డు కనిపిస్తుంది. ఇది వ్యూహం, శక్తి, త్యాగాన్ని సూచించే క్లాసిక్ ప్రతీక. చెస్ పీసులు విరిగిపోయినవి, కూలిపోయినవి, అస్థిర విజయంతో నిలబడినట్లు కనిపిస్తాయి. దర్శకుడు కృష్ణ చైతన్య విభిన్న జానర్లను కలిపి ఒక పవర్ ఫుల్ కథను రూపొందించారు. సందీప్ కిషన్ తన కెరీర్‌లోనే అత్యంత ఇంటెన్స్ పాత్రలో కనిపించనున్నారు. కథతో పాటు టెక్నికల్ గా కూడా పవర్ పేట బలంగా నిలుస్తోంది. సంగీతాన్ని మణిశర్మ అందిస్తుండగా, సినిమాటోగ్రఫీ బాధ్యతలను మధీ నిర్వహిస్తున్నారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్. రామకృష్ణ, మోనిక ప్రొడక్షన్ డిజైన్‌ను చూసుకుంటున్నారు. ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే పోస్టర్‌తో 'పవర్ పేట' ఒక పవర్ ఫుల్ కథకు వేదిక సిద్ధం చేస్తోంది. భావోద్వేగాలు, పవర్ రాజకీయాల మధ్య జరిగే పోరాటాన్ని చూపించే ఈ చిత్రం పై మంచి అంచనాలు నెలకొన్నాయి. సినిమా గురించి మరిన్ని వివరాలు మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

17-4Pg7exHMNWJQE.qxd OK:17-4Pg7exHMNWJQE.qxd 1/1/02 6:59 AM Page 1



# ఇంద్రకీలాద్రి పటిష్టతపై ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తల అధ్యయనం ముమ్మరం

**ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థాన కొండ చరియల పటిష్టతపై శాస్త్రీయ అధ్యయనం చేయడానికి వచ్చిన బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రాక్ మెకానిక్స్ (ఎన్ఐఆర్ఎం) శాస్త్రవేత్తల బృందం తమ క్షేత్రస్థాయి పరిశోధనలను ముమ్మరం చేసింది. ఈ సాంకేతిక బృందం ఈ నెల 15వ తేదీ నుండి 19వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఇక్కడ సమగ్ర సర్వే నిర్వహించనుంది. తీవ్ర ఉష్ణోగ్రతల మధ్య అకుంఠిత దీక్షతో అత్యధిక ఉష్ణోగ్రతలతో నిప్పులు చెరుగుతున్నప్పటికీ, భక్తుల భద్రతే ధ్యేయంగా ఎన్ఐఆర్ఎం శాస్త్రవేత్తలు క్షేత్రస్థాయిలో అకుంఠిత దీక్షతో పని చేస్తున్నారు. రెండవ రోజు, కొండలైట్ రాతి స్వరూపంతో కూడిన ఇంద్రకీలాద్రిపై, హెచ్చు ఉష్ణోగ్రతల వల్ల రాళ్లలో కలిగే మార్పులను మరియు వాటి పటుత్వాన్ని ఈ బృందం నిశితంగా పరిశీలిస్తోంది. జాతీయ రహదారి వెంట మరియు ఘాట్ రోడ్ల వెంబడి బయటకు కనిపిస్తున్న కొండ రాళ్ల పొరల నుండి భూగర్భ సాంకేతిక మరియు భౌగోళిక నమూనాలను బృందం సేకరిస్తోంది. నిర్ణీత షెడ్యూల్ ప్రకారం జరుగుతున్న ఈ సర్వేలో భాగంగా, అత్యాధునిక పరికరాల సహాయంతో రాళ్ల స్థితిగతులు, మట్టితో మిళితమైన ప్రాంతాలు మరియు తరచుగా రాళ్లు జారిపడే ప్రదేశాలను శాస్త్రీయంగా విశ్లేషిస్తున్నారు. రాబోయే రోజుల్లో కొండపై నిర్మించనున్న పాశుపతాలయం మరియు 2వ ఘాట్ రోడ్డు వంటి బృహత్తర ప్రణాళికలకు గల అనుకూల పరిస్థితులపై ఈ బృందం ప్రత్యేకంగా అధ్యయనం చేస్తోంది. ఈ సర్వే నివేదిక ఇంద్రకీలాద్రి భవిష్యత్ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చివేయనుంది. ఈ అధ్యయనం ఆధారంగా చేపట్టే రక్షణ చర్యల వల్ల భక్తులకు కొండ చరియల ముప్పు నుండి శాశ్వత విముక్తి లభించడమే కాకుండా, దేవస్థాన మాస్టర్ ప్లాన్‌ను పకడ్బందీగా అమలు చేయడానికి మార్గం సుగమం అవుతుంది.

అత్యాధునిక సాంకేతికత, శాస్త్రీయ దృక్పథంతో రూపొందించే ఈ కేంద్ర ప్రభుత్వ సంస్థ నివేదికతో ఇంద్రకీలాద్రి మరింత సురక్షితమైన, సుందరమైన ఆధ్యాత్మిక క్షేత్రంగా విరాజిల్లనుందని,

భవిష్యత్ కార్యాచరణకు రాష్ట్ర ప్రభుత్వం,స్థానిక ప్రజా ప్రతినిధుల చొరవతో ముందడుగు పడిందని ఆలయ ఇఒ వికె శీనానాయక్ అన్నారు.

## అమరావతికి సాయి సత్సంగం సభ్యులు రూ. 1,05,200 విరాళం



గుడివాడకు చెందిన శ్రీ సాయి సత్సంగం సభ్యులతో సీఎం చంద్రబాబు

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** రాజధాని అమరావతి నిర్మాణానికి రూ. 1,05,200 విరాళం గుడివాడకు చెందిన శ్రీ సాయి సత్సంగం సభ్యులు అందించారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శ్రీ సాయి సత్సంగం సభ్యులు కలిశారు. ఈ సందర్భంగా వారిని ముఖ్యమంత్రి అభినందించారు. వారి వితరణ మరువలేనిదన్నారు,సేవా సంస్థలు స్వచ్ఛంధంగా సహకరిస్తే రాజధాని నిర్మాణం అద్భుతంగా జరుగుతుందన్నారు. అడుసుమిల్లి మల్లికార్జున రావు నేతృత్వంలో శ్రీ సాయి సత్సంగం సభ్యులు సీఎం చంద్రబాబును కలిశారు.

## గోసంరక్షణ, ఆలయ భూముల పరిరక్షణపై కీలక వినతులు

### గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తాం : మంత్రి నారా లోకేష్



మంత్రి నారా లోకేష్‌తో విశ్వహిందూ పరిషత్ సభ్యులు

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:**గోసంరక్షణ, ఆలయ భూముల పరిరక్షణపై కీలక వినతులు గత ప్రభుత్వంలో పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేస్తామని లోకేష్ హామీ ధార్మిక కార్యక్రమాలకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామన్న వీహెచ్‌పీ హిందూ ధర్మ పరిరక్షణకు పూర్తి సహకారం అందిస్తామన్న మంత్రి రాష్ట్రంలో హిందూ ధర్మ పరిరక్షణ, ధార్మిక కార్యక్రమాల నిర్వహణకు ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ప్రకటించింది. ఈ మేరకు వీహెచ్‌పీ ముఖ్య నేతలు నేడు రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. గోసంరక్షణ, దేవాలయ భూముల పరిరక్షణ, పురాతన ఆలయాల పునరుద్ధరణ వంటి పలు కీలక అంశాలపై వారు మంత్రితో చర్చించారు. వీహెచ్‌పీ ప్రతినిధులు లేవనెత్తిన అంశాలపై సానుకూలంగా స్పందించిన మంత్రి లోకేష్, వారికి పలు హామీలు ఇచ్చారు. మంత్రి లోకేష్‌ను కలిసిన వారిలో విశ్వహిందూ పరిషత్ భాగ్యనగర్ క్షేత్ర కార్యదర్శి తనికెళ్ళ సత్య రవికుమార్, ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆర్ఎస్ఎస్ కార్యకర్త దొరస్వామి, ఏపీ వీహెచ్‌పీ కోశాధ్యక్షుడు వలిపర్తి దుర్గా ప్రసాద్ రాజు, ఏపీ గణేష్ ఉత్సవ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాకాల త్రినాథ్ ఉన్నారు. ఈ సందర్భంగా వీహెచ్‌పీ నేతలు పలు కీలక అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో డ్రగ్స్‌పై ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన చర్యల తరహాలోనే, అక్రమ గోరవాణా, గోవధపై కూడా ఉక్కుపాదం మోపాలని వారు విజ్ఞప్తి చేశారు. గోసంరక్షణ కోసం మరిన్ని గోశాలల నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకతను వివరించారు. దేవాలయాల నిర్వహణ, భూముల పరిరక్షణపై కూడా వారు పలు సూచనలు చేశారు. ఆలయాలను కేవలం పూజా స్థలాలుగానే కాకుండా, ధార్మిక ప్రచారం, సామాజిక సేవా కార్యక్రమాలకు కేంద్రంగా మార్చాలని సూచించారు. ధార్మికతకు భంగం కలగకుండా ఆలయ భూములపై ఆదాయం పెంచే మార్గాలను అన్వేషించాలని కోరారు. దీర్ఘకాలిక లీజు విధానాన్ని సవరించాలని, అన్యాక్రాంతమైన భూములను వెంటనే స్వాధీనం చేసుకుని పరిరక్షి ంచాలని విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వ హయాంలో హిందువులపై బనాయించిన అక్రమ కేసులను తక్షణమే తొలగించాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా హిందూ ధార్మిక సంస్థల ప్రతినిధులు, పీఠాధిపతులు, ధార్మిక పెద్దలతో పూర్తిస్థాయి ధార్మిక పరిషత్తును ఏర్పాటు చేయాలని సూచించారు.

## అంతరిక్ష విద్య లక్ష్యంగా రౌండ్ టేబుల్ సమావేశం

### - ఐఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ

**శ్రీకాళహస్తి ఏప్రిల్ 16 ప్రభాతవా ర్త** అంతరిక్ష విద్యలక్ష్యంగా రూపొందిస్తున్న ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తున్నట్లు డైరెక్టర్ ప్రొఫెసర్ సత్యనారాయణ గురువారం వివరించారు.నేడు సమాజంలో అంతరిక్ష విద్య కీలకంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో తర్వలో తిరుపతిలో ఓ రౌండ్‌టేబుల్ సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. తిరుపతిలో ఏర్పాటు చేసిన ఐఐటి 11 సంవత్సరాల చరిత్రలో ఎంతో ముందుకు వెళుతుందన్నారు. ఎంతో అనుభవం ఉన్న దేశ వ్యాప్తంగా ఉన్న ఐఐటిలతో పోటీ పడుతూ ప్రగతిలో పరుగులు తీస్తుందని ఆయన వివరించారు. ఈ నేపథ్యంలో మరో కీలక అడుగు ముందుకు వేస్తుందని ఆయన వివరించారు. భారతదేశంలో అంతరిక్ష విద్య యొక్క భవిష్యత్తును నిర్వచించే లక్ష్యంతో తిరుపతి ఒక ఉన్నత స్థాయి రౌండ్‌టేబుల్ చర్చను నిర్వహించడానికి సిద్ధమవుతోందని డైరెక్టర్ వివరించారు. మెహతా ఫ్యామిలీ ఫౌండేషన్ (ఎం ఎఫ్ ఎఫ్) స్పాన్సర్ చేస్తున్న ఈ కార్యక్రమంలో, భవిష్యత్ 'దిస్కూల్ ఆఫ్ స్పేస్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్' కోసం విద్యాపరమైన మరియు నిర్మాణాత్మక చట్రంపై మేథోమథనం చేయడానికి విద్యా, పారిశ్రామిక, ప్రభుత్వ ప్రయోగశాలలు మరియు స్టార్టప్ రంగాలకు చెందిన నిపుణుల బృందం ఒకచోట సమావేశ పరచటానికి తిరుపతి ఐఐటి ఒక అడుగు ముందుకు వేసిందని వివరించారు. ఈ చొరవ అంతరిక్ష రంగంలో సైద్ధాంతిక పరిశోధన మరియు పారిశ్రామిక అనువర్తనం మధ్య ఉన్న అంతరాన్ని పూడ్చే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగును సూచిస్తుంది. ప్రతిపాదిత పాఠశాల కొత్త తరం అంతరిక్ష శాస్త్రవేత్తలు మరియు ఇంజనీర్లను ప్రోత్సహించడానికి ఈ రౌండ్‌టేబుల్ ఒక కీలకమైన సంప్రదింపుల దశగా ఉపయోగపడుతుందన్నారు. ఐఐటి తిరుపతి మరియు కీలక భాగస్వాముల మధ్య జరిగిన వ్యూహాత్మక సంప్రదింపుల పరంపరలో భాగంగా ఈ కార్యక్రమం జరుగుతోంది. విద్యా లక్ష్యాలను కార్యాచరణ వాస్తవాలతో సమన్వయం చేసేందుకు,ఐఐటి తిరుపతి ప్రతినిధి బృందం ఇటీవల 25 మార్చి 2026న సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం ను సందర్శించినట్లు డైరెక్టర్ వివరించారు. దీని తర్వాత, ఇస్రో మాజీ ఛైర్మన్ డాక్టర్ ఎ.ఎస్. కిరణ్ కుమార్ తన అంతర్దృష్టులను అందించడానికి 1 ఏప్రిల్ 2026న ఐఐటి తిరుపతి క్యాంపస్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమానికి ముందుగా, రౌండ్‌టేబుల్‌లో కూడా పాల్గొంటున్న ఐఐఎస్‌టి మాజీ వ్యవస్థాపక డైరెక్టర్ మరియు ఛాన్సలర్ ప్రొఫెసర్ బి.ఎన్. సురేష్, విఫలమైన మిషన్ల నుండి నేర్చుకున్న పాఠాల ద్వారా రాకెట్ సైన్స్‌లో ప్రావీణ్యం అనే అంశంపై సంస్థ విశిష్ట ఉపన్యాసం ఇచ్చారన్నారు.కీలకమైన రౌండ్ టేబుల్ సమావేవంలోనూ ముఖ్య ముఖ్యాంశల్లో పాల్గొనేవారు.

## మహిళా రిజర్వేషన్ బిల్లుతో దేశంలో నవశకం, నిర్ణయాధికారంలో ఇక నారీశక్తిదే కీలక పాత్ర

### : కేంద్ర మంత్రి భూపతిరాజు

**విజయవాడ,ఏప్రిల్ 16,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం దేశంలో మహిళా సాధికారిత సాధించడమే లక్ష్యంగా మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిందని అందరి మద్దతుతో ఈ బిల్లు ఆమోదం పొందడం ఖాయమని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయమంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ ధీమా వ్యక్తం చేశారు. గురువారం పార్లమెంట్ ఆవరణలో మీడియాతో మాట్లాడిన ఆయన మహిళా రిజర్వేషన్ చట్ట సవరణ బిల్లు మహిళల సామాజిక, రాజకీయ భవిష్యత్తును మార్చబోయే ఒక గొప్ప ముందడుగు అని అభివర్ణించారు. 2023లోనే నారీ శక్తి వందన్ అధినియంను ఏకాభిప్రాయంతో ఆమోదించామని గుర్తుచేశారు. దాని అమలు విషయంలో ఉన్న స్తబ్దతను ప్రధాని మోడీ తొలగించారని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు. ఈ 33 రిజర్వేషన్ల కోసం 2033 వరకు వేచి చూడాల్సిన అవసరం లేకుండా, 2029 నుంచే అమలు చేసే విధంగా కేంద్ర ప్రభుత్వం చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని ఆయన వెల్లడించారు. ఈ విషయంలో అన్ని రాజకీయ పార్టీల మద్దతు కూడగట్టి బిల్లును విజయవంతంగా ఆమోదింపజేస్తామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా మహిళలు ఈ బిల్లు కోసం ఎంతో ఉత్కంఠతో ఎదురు చూస్తున్నారని మంత్రి అన్నారు. పార్లమెంట్‌లో జరుగుతున్న ఈ చారిత్రాత్మక చర్చను వీక్షించేందుకు క్షేత్రస్థాయిలో మహిళలంతా ఎంతో ఆసక్తితో టీవీల ముందు కూర్చోవడాన్ని తాను గమనించానని, ఇది వారిలో ఉన్న ఆకాంక్షకు నిదర్శనమని పేర్కొన్నారు. నిర్ణయాధికారంలో మహిళలకు సముచిత భాగస్వామ్యం కల్పించడం వల్ల దేశం మరింత అభ్యున్నతి పథంలో దూసుకుపోతుందని శ్రీనివాస వర్మ ఆకాంక్షించారు. ప్రతిపక్షాల తీరుపై ఆయన స్పందిస్తూ డీలిమిటేషన్ ప్రక్రియపై అనుమానాలు వ్యక్తం చేయడం సరికాదని అన్నారు. అసలు ఆ ప్రక్రియే ఇంకా ప్రారంభం కాలేదని ఆయన గుర్తు చేశారు. రాజ్యాంగబద్ధంగా డీలిమిటేషన్ ప్రక్రియ సక్రమంగా జరుగుతుందని, రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు బిల్లుల ఆమోదానికి సహకరించాలని కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ పిలుపునిచ్చారు.

### వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుచేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలు

#### పాఠశాల, ఇంటర్ విద్యాశాఖ అధికారులతో మంత్రి లోకేశ్ సమీక్ష

**విజయవాడ,ఏప్రిల్ 16 ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలకు సంబంధించిన పనులను స్కూలు మేనేజ్ మెంట్ కమిటీ (ఎస్ఎంసీ)లకు అప్పగించి త్వరితగతిన పూర్తిచేయాలని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అధికారులను ఆదేశించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 3స్టార్ మౌలిక సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ స్కూళ్లలో ప్రవేశాల పెంపుదలకు ఇంటింటి ప్రచారం (డోర్ టు డోర్ క్యాంపెయిన్) చేపట్టాలని దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ఇతర ప్రజాప్రతినిధులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఉన్నత విద్యా సంస్థల్లో మరింత పారదర్శకత కోసం వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలుచేయనున్న ఫేస్ రికగ్నిషన్ అటెండెన్స్ విషయంలో పకడ్బందీ చర్యలుండాలని స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యా బోధన అందించేందుకు ముఖ ఆధారిత హాజరు విధానం ఎంతగానో దోహదపడుతుందని అభిప్రాయపడ్డారు.



ఢిల్లీలో మర్యాద పూర్వకంగా తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఎపి ఎమ్మెల్యే, ఎంపిలు

## పార్లమెంట్‌లో మహిళా బిల్లుపై ఎమ్మెల్యే పరిటాల సునీత హర్షం

**అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో** పార్లమెంట్‌లో మహిళా బిల్లు ప్రవేశపెడుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎంపీలు గురువారం సంతోషంతో ఢిల్లీలో సందడి చేశారు. ఎంపీల ఇళ్లల్లో విందు చేయడంతో పాటు ముఖ్య నేతలను కలుసుకున్నారు. అందులో భాగంగా రాయలసీమ జిల్లాలకు చెందిన మహిళా ఎమ్మెల్యేలు, ఎంపీలు కూడా కలుసుకున్నారు. ఈ సందర్భంగా పార్లమెంట్‌లో మహిళా నారీ శక్తి వందన్ అధినియం బిల్లు ప్రవేశపెట్టడం.. దేశంలో యావత్ మహిళాలోకం గర్వించే రోజుగా నిలిచిపోతుందని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అభివర్ణించారు. మహిళలకు చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్ కల్పిస్తూ పార్లమెంట్ లో బిల్లు ప్రవేశ పెడుతున్న నేపథ్యంలో ఆమె సహచర మహిళా ప్రజాప్రతినిధులతో కలిసి ఢిల్లీకి వెళ్లారు. ఇందులో భాగంగానే గురువారం ఉదయం ఢిల్లీలోని ఎంపీ లావు కృష్ణదేవరాయలు నివాసంలో అల్పాహారం విందుకు హాజరయ్యారు. ఆ తర్వాత పార్లమెంట్ ఆవరణంలో ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ తో భేటీ అయ్యారు. మంత్రి సీతారామన్ అందరినీ ఎంతో ఆప్యాయంగా పలకరించారు. మహిళా బిల్లు ప్రవేశపెట్టిన నేపథ్యంలో తమ ఆనందాన్ని పంచుకున్నారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా ఎమ్మెల్యే పరిటాల సునీత సహచర ప్రజాప్రతినిధులతో కలిశారు. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మెల్యే సునీతను ఆప్యాయంగా పలకరిస్తూ కుటుంబ యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత సాయంత్రం మంత్రి పెమ్మసాని నివాసంలో జరిగిన అల్పాహార విందులో పాల్గొన్నారు. ఆ తర్వాత కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు నివాసానికి వెళ్లారు. అక్కడ ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళా బిల్లు ప్రవేశపెట్టడం తమ కళ్లారా చేసే అవకాశం రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ చారిత్రక ఘట్టానికి మేము కూడా సాక్షులు అవుతుండడం గర్వంగా ఉందన్నారు.

## పాస్ చేయండి సార్.. ఇంటర్ బోర్డుకు విద్యార్థి ఫోన్..

### కౌన్సెలింగ్ ఇచ్చిన అధికారులు

**విశాఖ, ఏప్రిల్ 16:** ఫెయిల్ అవుతాననే భయంతో బోర్డుకు ఫోన్ చేసిన విద్యార్థిపాస్ చేయాలని, జవాబు పత్రాల్లో డబ్బులు పెట్టానని వెల్లడి విద్యార్థికి ఫోన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చి ధైర్యం చెప్పిన అధికారులు ఫలితాల్లో మొత్తం ఐదు సబ్జెక్టుల్లో ఫెయిలైన విద్యార్థితల్లిదండ్రులతో మాట్లాడి జాగ్రత్తలు చెప్పిన జిల్లా యంత్రాంగంవివరాల్లోకి వెళితే, విశాఖకు చెందిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి ఒకరు బుధవారం ఫలితాలకు ముందు బోర్డు అధికారులకు ఫోన్ చేశాడు. పరీక్షల్లో ఏమీ చదవలేదని, జవాబు పత్రంలో ప్రశ్నాపత్రాన్నే మూడుసార్లు రాశానని ఆవేదన వ్యక్తం చేశాడు. అంతేకాకుండా, పాస్ చేయాలనే ఉద్దేశంతో జవాబు పత్రాల్లో డబ్బులు కూడా పెట్టానని అధికారులకు చెప్పాడు.అతని ఆందోళనను అర్థం చేసుకున్న అధికారులు వెంటనే స్పందించి, ఫోన్‌లోనే కౌన్సెలింగ్ ఇచ్చారు. కంగారు పడాల్సిన అవసరం లేదని, త్వరలో అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఉంటాయని, వాటి కోసం బాగా చదువుకోవాలని సూచించారు. అనంతరం ఈ విషయాన్ని విశాఖపట్నం ఆర్ఐఓ (రీజనల్ ఇన్స్పెక్టింగ్ ఆఫీసర్) దృష్టికి తీసుకెళ్లి, విద్యార్థి తల్లిదండ్రులకు సమాచారం ఇవ్వాలని కోరారు.జిల్లా అధికారులు రంగంలోకి దిగి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడారు. కాగా, వెలువడిన ఫలితాల్లో ఆ విద్యార్థి మొదటి సంవత్సరంలో రెండు, ద్వితీయ సంవత్సరంలో మూడు సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. విద్యార్థి ఇంట్లోనే సురక్షి తంగా ఉన్నాడని, తాము జాగ్రత్తగా చూసుకుంటామని అతని తల్లిదండ్రులు అధికారులకు హామీ ఇచ్చారు.

## వారసత్వ దినోత్సవాలను విజయవంతం చేయాలి : కలెక్టర్ లక్ష్మీశా



సమీక్షాసమావేశంలో అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశా

**విజయవాడ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** ప్రపంచవారసత్వ దినోత్సవ వేడుకలను విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎన్‌టిఆర్‌జిల్లా కలెక్టర్ లక్ష్మీశా పిలుపునిచ్చారు. ఈనెల 18వతేదీ ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా రాష్ట్రపర్యాటకశాఖ, ఎన్‌టిఆర్‌జిల్లా అధికార యంత్రాంగం, జిల్లాప్రాధికారసంస్థ సంయుక్తంగా పలు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈసందర్భంగా గురువారం కలెక్టర్ జేసి ఇలక్కియాతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షసమావేశం నిర్వహించి అధికారులకు పలు సూచనలిచ్చారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడతూ వారసత్వ దినోత్సవ కార్యక్రమాలను అధికారులు సమిష్టిగా కృషి చేసి విజయవంతం చేయాలని సూచించారు. అనంతరం కొండపల్లి బొమ్మలమేళాకు చేస్తున్న ఏర్పాట్లను పరశీలించారు. ఈనెల 18వతేదీ కొండపల్లి ఖిల్లాపైకి ట్రెక్కింగ్ ఉంటుందని, మినీ మారథాన్, సైక్లింగ్, యోగా సెషన్స్, సాంప్రదాయ క్రీడాపోటీలతోపాటు కొండపల్లి బొమ్మలమేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. విజయవాడలో హెరిటేజ్‌వాక్ నిర్వహిస్తున్నామని, రాత్రి ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం పక్కనే ఉన్న ఖాళీస్థలంలో సంగీతఝురి కార్యక్రమం జరుగుతుందన్నారు. ప్రజలు పెద్దఎత్తున ఈకార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

## రికార్డు సృష్టించిన నీలకంఠాపురంలోని ఎల్వి ప్రసాద్ ఐ హాస్పిటల్

### - తక్కువ కాలంలోనే 500 క్యాటరాక్ట్ ఆపరేషన్లు పూర్తి

**అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో** సీనియర్ నేత, సిడబ్ల్యుసి సభ్యుడు, మాజీమంత్రి రఘువీరారెడ్డి చేసిన ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. తాను పుట్టిన ఊరుకు, ఊరు ప్రజలకు, చుట్టుపక్కల ప్రాంతాలకు తన కుటుంబీకులు, బంధువులతో కలిసి ఏదో ఒకటి చేయాలని మాజీ మంత్రి రఘువీరారెడ్డి నీలకంఠాపురంలో ఐ హాస్పిటల్ ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. శ్రీ సత్యసాయి జిల్లా మడకశిర మండలం నీలకంఠాపురం గ్రామంలో నీలకంఠాపురంశాంతా జయరాం వైద్య విజ్ఞాన సంస్థ, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ అరుదైన మైలురాయిని అధిగమించింది. గత ఏడాది నవంబర్ 03 2025న ప్రారంభమైన ఈ ఆసుపత్రి, అతి తక్కువ కాలంలోనే 500 పైగా క్యాటరాక్ట్ (కంటి పొరలు) శస్త్రచికిత్సలను అత్యంత విజయవంతంగా పూర్తి చేసి సరికొత్త రికార్డు సృష్టించింది.మడకశిర నియోజకవర్గంతో పాటు సరిహద్దున ఉన్న కర్ణాటక ప్రాంత నిరుపేదలకు ఈ ఆసుపత్రి ఒక వరప్రదాయినిగా మారింది. గతంలో మెరుగైన కంటి వైద్యం కోసం బెంగళూరు/హైదరాబాద్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. కానీ, "మన ఆరోగ్యం మన నీలకంఠాపురం" అనే లక్ష్యంతో అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులతో ఇక్కడే చికిత్సలు అందుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి రఘువరన్ రెడ్డి మాట్లాడుతూ.. ఈ విజయవంతమైన ప్రస్థానాన్ని పురస్కరించుకుని ఆసుపత్రి యాజమాన్యాన్ని , వైద్య బృందాన్ని ప్రత్యేకంగా అభినందించారు.

## నెల్లూరులో తమ్ముడిని చంపిన అన్న అరెస్ట్

**నెల్లూరు క్రైమ్, ఏప్రిల్ 16, ప్రభాతవార్త:** పాత కక్షలు మరియు సౌండ్ సిస్టమ్ విషయంలో తలెత్తిన వివాదం కారణంగా తమ్ముడిని పాశవికగా హత్య చేసిన అన్నను, అతని అనుచరుడిని దర్గామిట్ట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం నెల్లూరు నగరంలోని ప్రగతి నగర్‌కు చెందిన సయ్యద్ రఫీ (27), తన అన్న షేక్ ఖలీల్‌తో పాత తగాదాలు కలిగి ఉన్నాడు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన ఖలీల్ కుమారుడి ఫంక్షన్‌లో ఏర్పాటు చేసిన సౌండ్ సిస్టమ్‌ను రఫీ తన్నడంతో గొడవ మరింత పెరిగింది. దీంతో ఆగ్రహించిన ఖలీల్, సౌండ్ సిస్టం యజమాని పెద్దిరెడ్డి రాజేష్ రెడ్డితో కలిసి రఫీ ఇంటి వద్దకు వెళ్లి గొడవకు దిగి, అతడిని బలవంతంగా రోడ్డుపైకి లాగారు. రాజేష్ రెడ్డి కర్రతో రఫీ తలపై కొట్టి గాయపరచగా, ఖలీల్ కత్తితో చాతి, కడుపు భాగాల్లో విచక్షణారహితంగా పొడవడంతో రఫీ అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి కుర్షీద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్గామిట్ట పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు, ఏఎస్పీ దీక్ష పర్యవేక్షణలో ఇన్స్పెక్టర్ బి. కళ్యాణరాజు తన బృందంతో కలిసి గురువారం నెల్లూరు రైల్వే స్టేషన్ సమీపంలో నిందితులిద్దరినీ అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## గన్నవరంలో సీడాక్ కేంద్రం ఏర్పాటుకు ప్రయత్నాలు : విప్ యార్లగడ్డ

### - పాలిటెక్నిక్‌లో వందశాతం ప్లేస్‌మెంట్‌లు

**గన్నవరం(కృష్ణా), ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** కంప్యూటర్‌రంగంలో రోజురోజుకీ మారుతున్న సాంకేతిక విప్లవాన్ని, ఆధునిక ఆవిష్కరణలను విద్యార్థుల దరికి చేర్చాలనే లక్ష్యంతో గన్నవరంలో సి–డాక్ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రాష్ట్రముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో చర్చలు జరుపుతున్నట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావ్ తెలిపారు. గన్నవరం పాలిటెక్నిక్ కళాశాల ఫైనల్ ఇయర్ విద్యార్థులు వందశాతం ప్లేస్‌మెంట్‌లు సాధించగా వారికి జాబ్‌ఆఫర్ లెటర్‌లను ఎమ్మెల్యే యార్లగడ్డ చేతుల మీదుగా అందచేసారు. గురువారం సాయంత్రం కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో యార్లగడ్డ మాట్లాడుతూ గన్నవరంలో హెచ్‌సిఎల్ ద్వారా విద్యార్థులకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ పై శిక్షణా కార్యక్రమాలు వచ్చేనెల నుండి ప్రారంభం కానున్నట్లు చెప్పారు. గన్నవరం ప్రాంత ఇంజనీరింగ్, గ్రాడ్యుయేట్ విద్యార్థులకు ఈశిక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. సిడాక్ కేంద్రంకూడా ఏర్పాటు చేయగలిగితే ఈప్రాంతంలో విద్యార్థులకు కంప్యూటర్‌లో నైపుణ్యం మెరుగవుతుందన్నారు. తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. పాలిటెక్నిక్, ఐటిఐ చదివిన విద్యార్థులకు తక్కువ వయసులోనే ఉద్యోగాలు లభిస్తాయన్న అభిప్రాయం వ్యక్తం చేసారు. గన్నవరం నియోజకవర్గంలో నిరుద్యోగసమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో కృషిచేస్తున్నట్లు యార్లగడ్డ వివరించారు. మల్లవల్లి పారిశ్రామికవాడలో శరవేగంగా పరిశ్రమల ఏర్పాటుఅవుతున్నాయని, పరిశ్రమలు అన్ని ఏర్పాటయితే దాదాపు 15వేలమందికి ఉద్యోగాలు లభిస్తాయని నిరుద్యోగులకు భరోసా ఇచ్చారు.

### మహిళా కోటాలో బిసిలకు ఉపకోటా కేటాయించాలని ఢిల్లీలో ధర్నా

#### - మద్దతు పలికిన ఎంపి అంబికా లక్ష్మినారాయణ



**అనంతపురం, ఏప్రిల్ 16 ప్రభాతవార్త బ్యూరో** న్యూ ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 33 శాతం మహిళల రిజర్వేషన్ బిల్లులో బీసీ మహిళలకు ఉపకోటా కల్పించాలని డిమాండ్ చేస్తూ గురువారం నిర్వహించిన ధర్నాలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మినారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ పార్టీ తరఫున రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావుతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొని మా మద్దతు తెలియజేశాను అని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇతర పార్టీలకు చెందిన ఎంపీలు కూడా పాల్గొని బీసీ మహిళలకు న్యాయం చేయాలనే డిమాండ్‌ను బలంగా వ్యక్తం చేసినట్లు ఎంపీ తెలిపారు.

## ట్రాఫిక్ సిబ్బందికి సమ్మర్‌కిట్లు



సమ్మర్‌కిట్లు అందచేస్తున్న సిపి రాజశేఖర్‌బాబు

**విజయవాడ, ఏప్రిల్ 16, ప్రభాతవార్త :** విజయవాడ పట్టణంలో ట్రాఫిక్ విధులు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బందికి దాతల సహకారంతో సమ్మర్‌కిట్లను అందచేసారు. గురువారం పోలీస్ కమీషనర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సిపి రాజశేఖర్‌బాబు వీటిని అందచేసారు. మండుతున్న ఎండవేడిమి నుండి ట్రాఫిక్ సిబ్బంది ఉపవమనం పొందేందుకు హ్యాట్స్, నీళ్ళసీసాలు, కూలింగ్ కళ్ళద్దాలు, నెక్‌బ్యాండ్, బ్యాగ్‌లతో కూడిన కిట్‌లను ఆస్టర్ వైద్యశాల ఛైర్మన్ మద్దిపాటి సీతారామమోహనరావు, మాఆర్ట్స్ అధినేత సిహెచ్.రవికుమార్‌లు వితరణ చేసారు. ఈసందర్భంగా దాతలను సిపి సత్కరించారు. అనంతరం సిపి మాట్లాడుతూ విజయవాడ నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు పలు చర్యలు చేపట్టి సత్ఫలితాలు సాధించినట్లు తెలిపారు. అ స్త్రం, ఏఐ టూల్స్‌వినియోగించి పోలీస్ కమీషనరేట్ పరిధిలో పలు మార్పులు చేసినట్లు చెప్పారు. గత ఏడాది కన్నా ఏసంవత్సరం ప్రమాదాల, మరణాల సంఖ్యను తగ్గించినట్లు సిపి వివరించారు. విజయవాడ పశ్చిమ బైపాస్ ప్రారంభం కావటంతో నగరంలో ట్రాఫిక్ తగ్గినా వాహనాల వేగం పెరిగిందన్నారు. ప్రమాదాల నివారణకు ప్రజల సహకారం అవసరం అన్న సిపి హెల్మెట్ వినియోగంలో ప్రజలకు అవగాహన కల్పించటంతో నేడు 85శాతం మంది హెల్మెట్‌లు వాడుతున్నట్లు తెలిపారు. 17ప్రాంతాల్లో కొత్తగా ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసామని, మరో 36 ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి ఉందని సిపి పేర్కొన్నారు. ఎండలో విధులు నిర్వహించే ట్రాఫిక్ సిబ్బంది మజ్జిగ, మంచినీళ్ళు ఎక్కువగా తాగాలని సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రయాణికులకు ఎండ నుండి ఉపశమనం కలిగించేందుకు షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేసామన్నారు. విధినిర్వహణలో ప్రతిభ కనపరచిన సిబ్బందికి సర్టిఫికెట్‌లను బహుకరించారు. దాతలను సన్మానించారు.

17-04pg10.qxd:17-04pg10.qxd 1/1/02 6:41 AM Page 1






# 25 కోట్ల హార్ట్ బ్రేక్

*25కోట్ల ట్యాగ్- ఆటలో నో ఇంఫాక్ట్... ఐపీఎల్ వేలంలో ధర చూసి షాక్-ఇపుడు ఆటచూసి భారీ షాక్... కోట్ల కుర్రాడు-క్రీజ్‌లో మాత్రం గెస్ట్ అప్పియరెన్స్. ఇవి ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ కామరూన్ గ్రీన్‌పై సోషల్‌మీడియాలో వెల్లువెత్తుతున్న కామెంట్స్. గ్రీన్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ భారీ అంచనాలు పెట్టుకుంది. తమ తలరాత మారుస్తుడనుకుని ఐపీఎల్ వేలంలో ఏకంగా 25 కోట్ల 20 లక్షలు వెచ్చించి దక్కించుకుంది. ఐపీఎల్ చరిత్రలో అత్యధిక ధర పలికిన విదేశీ ఆటగాడిగా నిలిచాడు. ఇపుడు అతని ఆట చూసి 25 కోట్లు బూడిదలో పోసిన పన్నీరైందని కేకేఆర్ అభిమానులు భగ్గుమంటున్నారు.*

(వార్త క్రీడా విభాగం)

భారీ అంచనాలతో కేకేఆర్ జట్టులోకి వచ్చిన ఆస్ట్రేలియా మేటి ఆల్‌రౌండరైన కామరూన్ గ్రీన్.. వరుస వైఫల్యాలతో నిరాశపరుస్తున్నాడు. ఇటు బ్యాట్‌తో మెరుపులు మెరిపించక, ఇటు బౌలింగ్‌లో రాణించక జట్టుకు భారంగా మారాడు. కేకేఆర్ వరుస పరాజయాలతో కారకుడవుతున్నాడు.



ఈ ఐపీఎల్ సీజన్‌లో ఆడిన 5 మ్యాచ్‌ల్లో కామరూన్ గ్రీన్ చేసిన స్కోర్లు 18, 2, 4, 32, డకౌట్. మొత్తం పరుగులు 56 మాత్రమే. తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌పై 18 పరుగులతో కామరూన్ ఫెయిల్యూర్ స్టోరీ ప్రారంభమైంది. ఇక సన్ రైజర్స్ హైదరాబాద్, పంజాబ్ కింగ్స్‌పై అయితే సింగిల్ డిజిట్‌కే అవుటయ్యాడు. అయినా కామరూన్ ఏదో సాధిస్తాడని కేకేఆర్ మేనేజ్‌మెంట్... అతన్ని తుది జట్టులో కొనసాగిస్తోంది. లక్నోపై 32 పరుగులతో అజేయంగా నిలిచి ఆశలు రేపినా... కీలకమైన చెన్నై సూపర్ కింగ్స్ మ్యాచ్‌లో డకౌట్ అయ్యాడు. పోనీ బౌలింగ్‌లోనైనా జట్టుకు ఉపయోగపడ్డాడా అంటే అదీ లేదు. మొదటి మూడు మ్యాచ్‌ల్లో బౌలింగే చేయలేదు. లక్నో, సీఎస్‌కే మ్యాచ్‌ల్లోనూ కాస్టీలీగా తేలాడు. ఒకే ఒక వికెట్ పడగొట్టాడు.

కామరూన్ వైఫల్యం కేకేఆర్ జట్టుపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది. ఈ జట్టు ఆడిన అన్ని మ్యాచ్‌ల్లోనూ పరాజయాలే. అయిదు మ్యాచ్‌లాడినా గెలుపు బోణీ కొట్టలేకపోయింది. దీంతో కామరూన్ గ్రీన్ ఆటతీరుపై సోషల్ మీడియాలో ట్రోల్స్ వర్షం కురుస్తోంది. గ్రీన్ పేలవ ప్రదర్శనపై కేకేఆర్ అభిమానులు నిప్పులు చెరుగుతున్నారు. 25 కోట్ల రూపాయలు దండగ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అసలు ఇంత భారీ ధర పెట్టి కామరూన్ గ్రీన్‌ను ఎందుకు తీసుకున్నారంటూ ఫ్రాంచైజీ మేనేజ్‌మెంట్‌ను ప్రశ్నిస్తున్నారు.

మరికొందరైతే ఏకంగా ఇతడొక ఫ్రాడ్‌అంటూ తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. జట్టులో కీలక ఆటగాడిగా మారతారనుకున్న కామరూన్ గ్రీన్, వరుసగా విఫలమవుతుండటంతో కోల్‌కతా నైట్‌రైడర్స్ ప్లేఆఫ్స్ అవకాశాలపై భారీ ప్రభావం చూపుతుందోనని క్రికెట్ విశ్లేషకులు భావిస్తున్నారు.



# కోల్..కథ మారేనా?

**ఆహ్మదాబాద్:** వరుసగా రెండు విజయాలతో జోరు మీదికొచ్చిన గుజరాత్ టైటాన్స్... సొంత గడ్డపై ఫామ్‌లో లేని కోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడనుంది. నరేంద్ర మోదీ స్టేడియంలో గెలుపుతో హ్యాట్రిక్ విన్ సాధించాలని ఉవ్విళ్లూరుతోంది. శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని గుజరాత్... ఐపీఎల్‌లో రెండు ఓటములు, రెండు విజయాలతో ఉంది. మరోవైపు అజింక్యా రహానే నేతృత్వంలోని కేకేఆర్... ఈ మ్యాచ్‌లోనైనా గెలుపు బోణీ చేయడంపై ఫోకస్ పెట్టింది. ఆడిన అయిదు మ్యాచ్‌ల్లో నాలుగింట ఓటమి ఎదురవగా, ఓ మ్యాచ్ వర్షార్పణం అయింది.

వరుస విజయాలతో గుజరాత్ గెలుపు ట్రాక్‌లో ఉంది. టాప్ ఆర్డర్ మొత్తం పరుగుల వేటలో ఉన్నారు. సాయి సుదర్శన్, గిల్‌తో పాటు జాస్ బట్లర్, వాషింగ్టన్, రాహుత్ తెవాటియా చక్కగా రాణిస్తున్నారు. ముఖ్యంగా కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వరుస అర్ధసెంచరీలతో టాప్ లేవుతున్నాడు. ఇక రబడా, అశోక్ శర్మ, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ రూపంలో పేస్ అటాక్, రషీద్ ఖాన్ రూపంలో మేటి స్పిన్నర్ కలిసి ఉంది. కోల్‌కతాకు బ్యాటింగ్ ఆందోళన పరుస్తోంది. కెప్టెన్ అజింక్యా రహానే మినహాయిస్తే ఎవరూ పెద్దగా స్కోర్లు సాధించలేకపోతున్నారు. ఫిన్ అలెన్, నరైన్, రింకూ సింగ్, కామరూన్ గ్రీన్ వైఫల్యం కేకేఆర్‌ను వెంటాడుతోంది. రఘువంశీ కొన్ని పరుగులు సాధిస్తున్నా పెద్ద స్కోర్లుగా మలచలేకపోతున్నాడు. కేకేఆర్ బ్యాటింగ్ కుదురుకుంటే ఇక తిరుగుండదు. బౌలింగ్ డిపార్ట్‌మెంట్ కూడా పెద్దగా రాణించలేకపోతోంది.

ఇరు జట్లు ఇప్పటివరకు 5 సార్లు తలపడగా గుజరాత్ టైటాన్స్ పైచేయిగా ఉంది. మూడు మ్యాచ్‌ల్లో గుజరాత్, ఒక మ్యాచ్‌లో కేకేఆర్ గెలుపొందాయి. ఒక మ్యాచ్ వర్షార్పణం అయింది. ఆహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో 414 పరుగులు పారిన మ్యాచ్‌లో రాజస్థాన్ చేతిలో గుజరాత్ పరాజయం పొందింది.

**ఐపీఎల్‌లో నేటి మ్యాచ్**

| | |
|---|---|
| కోల్‌కతా నైట్ రైడర్స్<br>V/S<br>గుజరాత్ టైటాన్స్ | రాత్రి<br>7.30<br>గం.లకు |

# క్యాండిడేట్స్ చెస్ విమెన్ ఛాంప్ వైశాలి

## ప్రపంచ ఛాంపియన్ షిప్ కోసం జూ వెన్‌జున్‌తో పోరు

**పాఫోస్(సైప్రస్):** భారత విమెన్ గ్రాండ్ మాస్టర్, తమిళనాడుకు చెందిన ఆర్.వైశాలి.. సైప్రస్‌లోని పాఫోస్‌లో జరిగిన ఫిడే క్యాండిడేట్స్ మహిళల విభాగంలో ఛాంపియన్‌గా నిలిచింది. తద్వారా ఈ ఏడాది చివర్లో జూ వెన్‌జున్‌తో ప్రపంచ ఛాంపియన్‌షిప్ కోసం పోటీపడే అవకాశాన్ని దక్కించుకుంది.

టోర్నీ ఆరంభా నికి ముందే కోనేరు హంపి వైదొలడంతో దివ్య దేశ్‌ముఖ్‌పైనే అందరి దృష్టి నిలిచింది. ప్రజ్ఞానంద సోదరి వైశాలి ఈ టోర్నీలో అండర్ డాగ్‌గా బరిలోకి దిగింది. అయితే అందరి అంచనాలను తలకిందులు చేస్తూ విజేతగా ఆవిర్భవించింది. చివరిదైన 14వ రౌండ్లో 24 ఏళ్ల వైశాలి తెల్ల పావులతో ఆట మొదలు పెట్టింది. రష్యా క్రీడాకారిణి కేథరినా లాగ్నోను అటాకింగ్ గేమ్‌తో బోల్తా కొట్టించింది. విజేతగా నిలవాలంటే తప్పక గెలవాల్సి న ఆఖరి రౌండ్‌లో వైశాలి ఒత్తిడికి లోనేకాకుండా కీలకదశలో తెలివైన ఎత్తులతో ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. పూర్తి ఆధిక్యత కనబర్చింది. 14వ రౌండ్‌కుముందు వైశాలి, బిబిసారా(కజకిస్థాన్) చెరో 7.5 పాయింట్లతో సమవుజ్జీగా ఉన్నారు. అయితే భారత్‌కే చెందిన దివ్య దేశ్‌ముఖ్.. బిబిసారాతో గేమ్‌ను డ్రా చేయడంతో వైశాలికి మార్గం సుగమమైంది. 8.5పాయింట్లతో అగ్ర స్థానంలో నిలిచింది. బిబిసారా 8పాయింట్లతో రెండో స్థానం పొందింది. ఈ టోర్నీలో వైశాలి కేవలం రెండు గేమ్‌ల్లోనే ఓడింది. భారత్ నుంచి క్యాండిడేట్స్ టోర్నీ నెగ్గిన మూడో ప్లేయర్‌గా వైశాలి నిలిచింది. ఓపెన్ విభాగంలో ఇంతకుముందు 2014లోవిశ్వనాథన్ ఆనంద్, 2024లో గుకేష్ టైటిల్ గెలుపొందారు.



# వస్తూనే సెంచరీ మోత

**ముంబై:** ఐపీఎల్ 2026 సీజన్‌లోకి వస్తూనే క్వింటాన్ డికాక్(60 బంతుల్లో 112 నాటౌట్) సెంచరీ మోత మోగించాడు. ఈ సీజన్‌లో ఆడిన తొలి మ్యాచ్‌లోనే శతక్కొట్టాడు. ముంబైలోని వాంఖడే స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ బౌలర్లపై విరుచుకుపడుతూ 53 బంతుల్లోనే 7 ఫోర్లు, మరో ఏడు సిక్స్ లతో సెంచరీ నమోదుచేశాడు. ఇది ఐపీఎల్‌లో రెండో సెంచరీ కాగా, క్విటాన్ డికాక్‌కు ఐపీఎల్‌లో మూడో సెంచరీ. గతంలో లక్నో సూపర్ జెయింట్స్‌కు ఆడుతూ ఓ సెంచరీ, ఢిల్లీ క్యాపిటల్స్ తరఫున మరో సెంచరీ చేశాడు.

రోహిత్ శర్మ స్థానంలో ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన డీకాక్... తానెదుర్కొన్న తొలి బంతికే జెన్సన్ బౌలింగ్‌లో ఓవర్ కవర్ మీదుగా సిక్స్ బాది పరుగుల ఖాతా తెరిచాడు. ఒకవైపు వెంటవెంటనే రెండు వికెట్లు రికల్టన్(2), సూర్యకుమార్(0) కోల్పోయినా నమన్ ధీర్(50)తో కలిసి పంజాబ్ బౌలర్లను చితకొట్టాడు. మూడో వికెట్‌కు 120 రన్స్ జోడించాడు. ఈ క్రమంలో చాహల్ బంతులపై సిక్స్, ఫోర్ సాధించిన డికాక్.. చాహల్ మరో ఓవర్‌లో సిక్స్, సింగిల్‌తో 28 బంతుల్లో హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. ఆ తర్వాత బార్ట్‌లెట్ ఓవర్లో ఫోర్, సిక్స్.. చాహల్ ఓవర్‌లో సిక్స్‌తో 15 రన్స్, శశాంక్ బంతులపై డబుల్ సిక్స్‌లతో 15 రన్స్, బార్ట్‌లీ బంతికి బౌండరీతో సెంచరీ పూర్తి చేశాడు. అదే జోరు కొనసాగిస్తూ 112 పరుగులతో అజేయంగా నిలిచాడు. డికాక్ ఇన్నింగ్స్‌లో 8 ఫోర్లు, ఏడు సిక్స్‌లు ఉన్నాయి. ఈ క్రమంలో హార్దిక్ పాండ్యాతో కలిసి నాలుగో వికెట్‌కు 41రన్స్ జోడించాడు. ఐపీఎల్‌లో మూడు వేర్వేరు జట్ల తరఫున సెంచరీలు బాదిన మూడో బ్యాటర్‌గా డికాక్ నిలిచాడు. డికాక్ శతక ఇన్నింగ్స్‌తో ముంబై 20 ఓవర్లలో 6 వికెట్లకు 195 రన్స్ చేసింది. ప్రభ్‌సిమ్రాన్(80), శ్రేయాస్(66) అర్ధసెంచరీలతో పంజాబ్ కింగ్స్ ఏడు వికెట్ల తేడాతో గెలుపొందింది.



## హెల్త్‌కేర్ కంపెనీలకు క్యు4లో మిశ్రమ ఫలితాలు

# సింగిల్ డిజిట్ వృద్ధి నమోదు



**ముంబై, ఏప్రిల్ 15:** దేశంలో హెల్త్‌కేర్ రంగంలోని కంపెనీలకు గత ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికం (క్యు4) మిశ్రమ ఫలితాలను అందించనుంది. ఈ త్రైమాసికంలో కంపెనీల ఆదాయంలో అధిక సింగిల్‌డిజిట్ వృద్ధి నమోదయ్యే అవకాశం ఉన్నప్పటికీ, వాటి లాభదాయకత, నికర ఆదాయం గణనీయంగా క్షీణించవచ్చని ప్రముఖ అనలిటిక్స్ సంస్థ 'సిస్టమాటిక్స్' తన నివేదికలో వెల్లడించింది.

నివేదిక అంచనాల ప్రకారం, ఫార్మా కంపెనీల ఆదాయంలో సగటున 12శాతం వృద్ధి కనిపించినా, ఎబిటా (ఇబిఐటిడిఎ)లో కేవలం3.6 శాతం పెరుగుదల మాత్రమే ఉంటుంది. ఇక నికర లాభాల్లో ఏకంగా 14 శాతం క్షీ ణత నమోదయ్యే అవకాశం ఉంది. ఇందుకు ప్రధాన కారణం క్యాన్సర్ చికిత్సలో వాడే 'జెనరిక్ రెవ్లిమిడ్' అనే ఔషధంపై పలు భారతీయ కంపెనీలు ప్రత్యేక హక్కులను కోల్పోవడమే. దీని ప్రభావం ముఖ్యంగా డాక్టర్ రెడ్డీస్, జైడస్, సిప్లా, సన్ ఫార్మా వంటి దిగ్గజ సంస్థలపై స్పష్టంగా కనిపించనుంది.

ఇదే సమయంలో, లాన్రియోటైడ్ అనే మరో ఔషధం సరఫరాలో అంతరాయాల కారణంగా సిప్లా మరిన్ని ఇబ్బందులు ఎదుర్కోవచ్చని నివేదిక పేర్కొంది. అలాగే, మిరాబెగ్రాన్ సంబంధిత రాయల్టీ చెల్లింపుల వల్ల లూపిన్, జైడస్ కంపెనీల మార్జిన్లపై ఒత్తిడి పెరగవచ్చని అంచనా వేసింది. అన్నింటికంటే ముఖ్యంగా,డాక్టర్ రెడ్డీస్ ఆదాయంలో జెనరిక్ రెవ్లిమిడ్ వాటా అధికంగా ఉన్నందున, ఆ సంస్థ లాభాల్లో అత్యంత భారీ క్షీ ణత నమోదయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించింది.

మరోవైపు, అమెరికా-ఇరాన్ మధ్య కొనసాగుతున్న ఉద్రిక్తతల ప్రభావం కూడా ఈ రంగంపై పడనుంది. రవాణా ఛార్జీలు, ముడిసరుకుల ధరలు పెరగడం ప్రతికూలంగా మారితే, డాలర్‌తో రూపాయి మారకం విలువ అనుకూలంగా ఉండటం కొంత ఉపశమనం కలిగించవచ్చు. ఈ ఉద్రిక్తతలు ఇలాగే కొనసాగితే, ముడిసరుకుల ధరల భారాన్ని ఎపిఐ (యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రిడియంట్) తయారీదారులు ఫార్ములేషన్ కంపెనీలకు బదిలీ చేసే అవకాశం ఉంది.




# జిడిపి 7.1 శాతంగా అంచనా

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (ఐఏఎన్ఎస్):** ప్రపంచ, దేశీయ కారకాల వల్ల స్వల్పకాలిక అస్థిరత కొనసాగుతున్నప్పటికీ, భారతదేశపు ప్రామాణిక 10 యేళ్ల ప్రభుత్వ బాండ్ల రాబడి జూన్ నాటికి 7శాతం మార్కు కంటే దిగువకు తగ్గవచ్చని గురువారం ఒక నివేదిక తెలిపింది. క్రిసిల్ ఇంటెలిజెన్స్ విశ్లేషణ ప్రకారం, ముడి చమురు ధరలలో భారీ పెరుగుదల, పెరిగిన భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా మార్చి నెలలో బాండ్ల రాబడులు గణనీయమైన అస్థిరతను చవిచూశాయి. ఇది ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్రామాణిక రాబడిని గరిష్ట స్థాయికి చేర్చింది. అయితే, తగ్గుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, అనుకూలమైన ద్రవ్య లభ్యత పరిస్థితులు, విధానపరమైన అంచనాలు రాబోయే నెలల్లో రాబడులను స్థిరీకరించడానికి సహాయపడతాయని ఆ నివేదిక పేర్కొంది. ఆరోగ్యకరమైన ప్రైవేట్ వినియోగం, స్థిరమైన పెట్టుబడి వృద్ధి మద్దతుతో, ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జిడిపి) వృద్ధి 7.1 శాతంగా ఉంటుందని తమ ప్రాథమిక అంచనా అని ఆ నివేదిక జోడించింది.

అమెరికా సుంకాలు తగ్గడం వల్ల ఎగుమతుల వృద్ధికి కూడా ప్రయోజనం చేకూరుతుందని అంచనా వేస్తున్నప్పటికీ, పశ్చిమ ఆసియా సంఘర్షణ కారణంగా ప్రపంచ వాణిజ్యానికి కలిగే అంతరాయాలు, ప్రపంచ వృద్ధి మందగించడం వంటివి కొంత ప్రతికూలతగా మారవచ్చు. రిటైల్ ఇంధన ధరలపై నియంత్రణ విధించడానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వినియోగానికి మద్దతు ఇవ్వగలవని కూడా ఇది పేర్కొంది.

ద్రవ్యోల్బణం విషయానికొస్తే, 2027 ఆర్థిక సంవత్సరంలో సిపిఐ ద్రవ్యోల్బణం సగటున 4.5 శాతంగా ఉంటుందని క్రిసిల్ అంచనా వేసింది. ప్రపంచ అనిశ్చితులు సెంటిమెంట్‌పై ఒత్తిడిని కొనసాగిస్తున్నప్పటికీ, దేశీయ ద్రవ్య లభ్యత సౌకర్యవంతంగా ఉందని, ఇది బాహ్య ఒడిదుడుకుల నుండి రక్షణ కవచంగా పనిచేస్తుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ముడి చమురు ధరలు, భౌగోళిక రాజకీయ పరిణామాలు, ముఖ్యంగా పశ్చిమ ఆసియాలో, బాండ్ మార్కెట్‌కు కీలకమైన ప్రమాద కారకాలుగా మిగిలి ఉన్నాయని కూడా ఈ నివేదిక ప్రముఖంగా ప్రస్తావించింది. పెరిగిన చమురు ధరలు ద్రవ్యోల్బణ ఆందోళనలను పెంచి, రాబడులలో ఏదైనా తగ్గుదల వేగాన్ని పరిమితం చేయగలవని ఇది పేర్కొంది. అదే సమయంలో, యూఎస్ ట్రెజరీ రాబడులలో కదలికలు, యూఎస్ ఫెడరల్ రిజర్వ్ విధాన గమనంతో సహా ప్రపంచ సంకేతాలు, భారత బాండ్ రాబడుల దిశను రూపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అంచనా. దేశీయంగా, అస్థిర పరిస్థితుల నడుమ కేంద్ర బ్యాంకు స్థిరీకరణ పాత్ర పోషిస్తుందని భావిస్తున్నందున, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) ద్రవ్య నిర్వహణ చర్యలు, విధాన వైఖరి కూడా ప్రభావం చూపనుందని పేర్కొంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య విధాన కమిటీ (ఎంపిసి) పాలసీ రేట్లను యథాతథంగా కొనసాగిస్తుందని తమ ప్రాథమిక అంచనా భావిస్తున్నట్లు క్రిసిల్ జోడించింది. ఈ ప్రతికూలతలు ఉన్నప్పటికీ, స్థూల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడి, అస్థిరత తగ్గుముఖం పట్టడంతో రాబడులు క్రమంగా తగ్గుతాయని అంచనా వేస్తూ, భవిష్యత్ అంచనాలు మధ్యస్థంగా సానుకూలంగానే ఉన్నాయని క్రిసిల్ పేర్కొంది.



# కనీస వేతనం భారీగా పెంపు!

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16:** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు తీపికబురు లాంటి వార్త. ఉద్యోగుల కనీస వేతనాన్ని భారీగా పెంచాలనే కీలక ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఈ మేరకు 8వ వేతన సంఘం ముందు పలు ప్రతిపాదనలు చేస్తూ ఉద్యోగ సంఘాల తరఫున ప్రభుత్వంతో చర్చలు జరిపే అత్యున్నత సంస్థ అయిన నేషనల్ కౌన్సిల్ జాయింట్ కన్సల్టేటివ్ మెషినరీ (ఎన్‌సి-జెసిఎం)ఓ మెమోరాండం అందజేసింది. ప్రస్తుతం 7వ వేతన సంఘం సిఫార్సుల ప్రకారం ఉన్న రూ.18,000 కనీస వేతనాన్ని ఏకంగా రూ.69,000కు పెంచాలని ఎన్‌సి-జెసిఎం డిమాండ్ చేసింది. ఇందుకోసం ఫిట్‌మెంట్ ఫ్యాక్టర్‌ను 3.833గా నిర్ణయించాలని సూచించింది. 7వ వేతన సంఘంలో ఈఫ్యాక్టర్ 2.57గా ఉండగా, అప్పటి కనీస వేతనం రూ.7,000 నుంచి రూ.18,000కు పెరిగింది. ఇప్పుడు ఉద్యోగ సంఘాలు అంతకంటే చాలా ఎక్కువ ఫిట్‌మెంట్‌ను ప్రతిపాదిస్తున్నాయి. కనీస వేతనంతో పాటు వార్షిక ఇంక్రిమెంట్ 6 శాతంగా ఉండాలని, ప్రమోషన్‌పై రెండు ఇంక్రిమెంట్లు(కనీసం రూ.10,000 లబ్ధి) ఇవ్వాలని, ఒక నెల వేతనాన్ని గ్రాట్యుటీగా అందించాలని కూడా ఎన్‌సి-జెసిఎం కోరింది. ఈ మార్పులు అమలైతే, దేశవ్యాప్తంగా సుమారు 50 లక్షల మంది ఉద్యోగులు, 65 లక్షల మంది పెన్షనర్లకు లబ్ధి చేకూరుతుంది. ఇదిలా ఉండగా, 58 శాతం కరువు భత్యాన్ని (డిఎ) బేసిక్ పేలో కలపాలని ఫెడరేషన్ ఆఫ్ నేషనల్ పోస్టల్ ప్రభుత్వాన్ని కోరుతోంది. 8వ పే కమిషన్ 2025 నవంబర్ నుంచి 18 నెలల్లోగా తన సిఫార్సులను ప్రభుత్వానికి అందిస్తుందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి గతంలో తెలిపారు.

# బ్యాంక్, ఆటో స్టాక్స్ పతనం

## సెన్సెక్స్122.56, నిఫ్టీ 34.55 పాయింట్లు నష్టం

**ముంబై, ఏప్రిల్ 16:** బ్యాంకింగ్, ఆటో స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి లాభాలను పరిమితం చేయడంతో, బెంచ్‌మార్క్ ఈక్విటీ సూచీలైన నిఫ్టీ, సెన్సెక్స్ గురువారం తమ ఇంట్రాడే గరిష్టాల నుంచి పడిపోయి ముగిశాయి. అయితే, అమెరికా- ఇరాన్ మధ్య జరగబోయే చర్చలపై మరింత స్పష్టత వచ్చే వరకు పెట్టుబడిదారులు అప్రమత్తంగానే ఉన్నారు. రోజులో అధిక భాగం లాభాల్లో కొనసాగినప్పటికీ,చివరి గంటల్లో అమ్మకాల ఒత్తిడి పెరగడంతో గరిష్ఠ స్థాయిల నుంచి కిందకు జారాయి. బ్యాంకింగ్,ఆటో రంగాల షేర్లలో వెల్లువెత్తిన అమ్మకాలు సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయి.ముగింపు గంట మోగే సమయానికి, సెన్సెక్స్ 122.56 పాయింట్లు లేదా 0.16శాతం తగ్గి 77,988.68వద్ద ముగిసింది.

నిఫ్టీ కూడా అదే బాటలో పయనించి, 34.55 పాయింట్లు లేదా 0.14శాతం తగ్గి 24,196.75 వద్ద ముగిసింది. నిఫ్టీ సూచీలో అత్యధికంగా నష్టపోయిన వాటిలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్, హెచ్‌డిఎఫ్‌సి లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ షేర్లు ఉన్నాయి. ప్రధాన సూచీలలో బలహీనత ఉన్నప్పటికీ, విస్తృత మార్కెట్లు నిలకడను ప్రదర్శించి, బెంచ్‌మార్క్‌లను అధిగమించాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ సూచీ 0.63 శాతం లాభంతో ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ సూచీ 0.83 శాతం లాభపడింది. రంగాల వారీగా చూస్తే, మెటల్, ఐటీ స్టాక్స్ లాభాలకు నాయకత్వం వహించాయి.వీటిలో నిఫ్టీ మెటల్, నిఫ్టీ ఐటీ సూచీలు అగ్రగామిగా నిలిచాయి.దీనికి విరుద్ధంగా, ప్రైవేట్ బ్యాంకులు, ఆర్థిక సేవల వంటి వడ్డీ రేటుకు సున్నితమైన రంగాలు అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. దీంతో నిఫ్టీ ప్రైవేట్ బ్యాంక్, నిఫ్టీ ఫైనాన్షియల్ సర్వీసెస్ సూచీలు అగ్ర నష్టాలతో ముగిశాయి. ప్రపంచ సంకేతాలు, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల చుట్టూ నెలకొన్న పరిణామాలను,ముఖ్యంగా అమెరికా- ఇరాన్ చర్చలను గమనిస్తూ, సమీప భవిష్యత్తులో మార్కెట్ భాగస్వాములు అప్రమత్తంగా ఉంటారని అంచనా. ఇవి పెట్టుబడిదారుల సెంటిమెంట్‌ను, మార్కెట్ దిశను ప్రభావితం చేయగలవని నిపుణులు అభిప్రాయపడ్డారు.



మరోవైపు, నాలుగు రోజుల బలహీనత తర్వాత భారత రూపాయి పుంజుకుంది. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు తిరిగి కొనుగోళ్లు చేపట్టడంతో రూపాయి బలపడింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 92.80 నుంచి 93.50 శ్రేణిలో కదలాడవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు.



ట్రేడ్ డీల్‌కు ముందు.. యుఎస్ వాణిజ్య ప్రతినిధితో భారత రాయబారి వినయ్ క్వాత్రా భేటీ

# 20 నుంచి మరోమారు వాణిజ్య చర్చలు

**వాషింగ్టన్, ఏప్రిల్ 16:** భారత్-అమెరికా మధ్య మరోసారి వాణిజ్య చర్చలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో అమెరికా వాణిజ్య ప్రతినిధి జేమిసనన గ్రీర్‌తో.. అగ్రరాజ్యానికి భారత రాయబారి అయిన వినయ్ మోహన్ క్వాత్రా తాజాగా భేటీ అయ్యారు. ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందానికి సంబంధించిన అంశాలపై వీరివురూ చర్చలు జరిపారు. ఈ విషయాన్ని క్వాత్రా ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'ద్వైపాక్షిక సహకారంపై ఇరు దేశాలకు ఉన్న అవకాశాలపై మేం చర్చించాం. దీంతోపాటు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న కీలక పరిణామాలపైనా మాట్లాడుకున్నాం' అని భారత రాయబారి వెల్లడించారు. ఈ భేటీలో అమెరికా మాజీ నేషనల్ సెక్యూరిటీ అడ్వైజర్ రాబర్ట్ ఓబ్రెయిన్ కూడా పాల్గొన్నారు ట్రేడ్ డీల్ కోసం భారత బృందం వచ్చేవారం వాషింగ్టన్‌కు వెళ్లనున్న వేళ వీరి భేటీ ప్రాధాన్యత సంతరించుకుంది. ఇక గత నెలలో భారత్‌పై సెక్షన్ 301 కింద అమెరికా ప్రారంభించిన దర్యాప్తును విరమించుకునే అంశంపైనా వీరు చర్చించినట్లు సమాచారం. భారత్-అమెరికా ఫిబ్రవరిలో విడుదల చేసిన సంయుక్త ప్రకటన ప్రకారం.. భారత్‌పై టారిఫ్‌ను 18 శాతానికి తగ్గించడానికి అంగీకారం కుదిరింది.అయితే ట్రంప్ విధించిన ఈ ప్రతీకార టారిఫ్‌లు చెల్లవంటూ ఆ దేశ సుప్రీంకోర్టు తీర్పునివ్వడంతో టారిఫ్ పరంగా మార్పులు చోటు చేసుకున్నాయి.ఈ మార్పు లపై చర్చలు జరిపి, తదుపరి కార్యాచరణను చేపట్టేందుకు భారత్, అమెరికా ముఖ్య సంధానకర్తలు ఈ నెల 20 నుంచి మూడు రోజుల పాటు వాషింగ్టన్‌లో చర్చలు జరపనున్నారు.

ఇదిలా ఉండగా.. భారత్‌పై ప్రకటించిన సెక్షన్ 301 దర్యాప్తును విరమించుకోవాలని యుఎస్ ట్రేడ్ రిప్రజెంటేటివ్‌కు కేంద్రం ఇప్పటికే విజ్ఞప్తి చేసింది. అమెరికా తయారీ రంగంలోపై తీవ్ర ప్రభావం చూపే 'సహేతుకం కాని విదేశీ ధోరణుల'ను అవలంబిస్తున్నాయా? అనే కోణంలో భారత్ సహా 15 దేశాలపై అగ్రరాజ్యం ఈ దర్యాప్తు చేపట్టిన సంగతి తెలిసిందే.అసమంజస వాణిజ్య విధానాలను అనుసరిస్తున్నాయని తేలితే వాటిపై టారిఫ్‌లు, జరిమానాలు విధించనున్నట్లు అమెరికా గతంలో వెల్లడించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.